ఈనాడు

విజయవాడ 30-7-2025 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 351

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్స్

గంభీర్ × క్యురేటర్

ఓవల్‌లో మాటల యుద్ధం


ఫోర్టిస్‌తో గంభీర్ వాగ్వాదం

భారత్, ఇంగ్లాండ్ మధ్య చివరి టెస్టుకు వేదికగా నిలవబోతున్న ఓవల్‌లో దుమారం రేగింది. ప్రాక్టీస్ సందర్భంగా పిచ్‌కు చేరువగా రావొద్దని మైదాన సిబ్బంది టీమ్‌ఇండియా సహాయ సిబ్బందికి చెప్పడంతో చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆగ్రహించాడు. చీఫ్ క్యురేటర్‌పై మండిపడ్డాడు. పరస్పర ఆరోపణలతో ఈ వ్యవహారం వేడెక్కింది.

లండన్

టీమ్‌ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్, ఓవల్ చీఫ్ క్యురేటర్ లీ ఫోర్టిస్‌కు మధ్య ఘర్షణ తలెత్తింది. ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. పిచ్‌కు 2.5 మీటర్ల దూరంలో ఉండాలని టీమ్‌ఇండియా సహాయ సిబ్బందికి మైదాన సిబ్బంది చెప్పడమే అందుకు కారణం. "మేమేం చేయాలో నువ్వు చెపాల్సిన అవసరం లేదు" అని క్యురేటర్ వైపు వేలు చూపెడుతూ గంభీర్ తీవ్ర స్వరంతో అనడం వినిపించింది. భారత్, ఇంగ్లాండ్ మధ్య అయిదో టెస్టుకు ఓవల్ మైదానం ఆతిథ్యమివ్వనుంది. ఈ మ్యాచ్ కోసం టీమ్‌ఇండియా మంగళవారం సాధన మొదలెట్టింది. ఒక దశ వరకు అక్కడ వాతావరణం ప్రశాంతంగానే ఉంది. అయితే పిచ్‌కు దూరంగా ఉండాలని మైదాన సిబ్బంది అనడంతో తీవ్ర అసహనానికి గురైన గంభీర్.. క్యురేటర్‌తో వాదనకు దిగాడు. "మేమేం చేయాలో నువ్వు చెప్పకూడదు. నువ్వు గ్రౌండ్స్‌మెన్‌లో ఒకడివి. అంతకు మించి ఏమీ కాదు" అని అన్నాడు. తనను దూషించడంపై మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేస్తానని ఫోర్టిస్ హెచ్చరించగా.. "నీ ఇష్టమొచ్చింది చేసుకో" అని గంభీర్ మండిపడ్డాడు. ఆ తర్వాత గంభీర్, ఫోర్టిస్ వేరు వేరు దిశల్లో వెళ్లిపోయారు. గంభీర్ తిరిగి టీమ్‌ఇండియా నెట్ సెషన్‌ను పర్యవేక్షించే పనిలో పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఫోర్టిస్‌కు భారత బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ సర్ది చెప్పడం కూడా కనిపించింది. "ఎంతో కీలకమైన మ్యాచ్ జరగబోతుంది. గంభీర్‌కు చాలా త్వరగా చిరాకు వస్తుంది" అని ఈ గొడవ తర్వాత ఫోర్టిస్ వ్యాఖ్యానించాడు. మరోవైపు భారత ఆటగాళ్లలో అందరికన్నా ముందు సాయి సుదర్శన్ ప్రాక్టీస్‌కు వచ్చాడు. గాయంతో గత టెస్టుకు అందుబాటులోని ఎడమచేతి వాటం ఫాస్ట్‌బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్ చేయడం కనిపించింది.

గొడవ ఇలా..

పిచ్‌కు 2.5 మీటర్ల దూరంలో ఉండాలని గ్రౌండ్స్‌మెన్‌లో ఒకరు అనడంతోనే గొడవ మొదలైందని బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్‌కు తెలిపాడు. అయితే తాము ఎలాంటి ఫిర్యాదు చేయబోవట్లేదని అతడు చెప్పాడు. "మైదాన సిబ్బందిలో ఒకరు వచ్చి.. పిచ్‌కు 2.5 మీటర్ల దూరంలో నిలబడాలని, తాడు బయటికి వెళ్లి చూడాలని చెప్పాడు. ఇలాంటిది నేనెప్పుడూ చూడలేదు. దీనిపై ఫిర్యాదేమీ అవసరం లేదు" అని అన్నాడు. భారత జట్టు ఆటగాళ్లు స్పైక్స్ షూస్ వేసుకోలేదని, పిచ్‌కు ఎలాంటి ముప్పు వాటిల్లే ప్రమాదం లేదని చెప్పాడు. "ఓవల్‌కు రావడానికి ముందే జట్టులో చాలా మందికి క్యురేటర్‌తో వ్యవహారం అంత తేలిక కాదని తెలుసు. పిచ్ విషయంలో జాగ్రత్త మంచిదే. కానీ మరీ ఇంత అవసరం లేదు. మేం స్పైక్స్ ఉన్న షూస్ వేసుకోలేదు" అని కోటక్ వివరించాడు. పిచ్‌కు 2.5 మీటర్ల దూరంలో ఉండాలని చెప్పడం చాలా విచిత్రంగా ఉందని అన్నాడు. గంభీర్ అనవసరంగా ఏమీ మాట్లాడడని కోటక్ చెప్పాడు. "ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడాం. అన్ని చోట్ల కూడా క్యురేటర్లతో మాట్లాడాం. ఎప్పుడు, ఎక్కడ పచ్చిక కత్తిరించబోతున్నారో కూడా చెప్పారు వాళ్లు. జవాబు చెప్పడం ఇష్టం లేకపోతే.. రేపు నిర్ణయిస్తాం అనేవాళ్లు. అది మంచి జవాబు" అని వివరించాడు. "మ్యాచ్ జరగబోయే పిచ్‌ను చూసేందుకు గంభీర్ ప్రయత్నించాడు. నేనూ అక్కడే ఉన్నా. మిగతా కోచ్‌లంతా ఉన్నారు. సాధారణ షూస్ ధరించి పిచ్‌ను చూడడం తప్పేమీ కాదు కదా" అని కోటక్ అన్నాడు.

బుమ్రా ఫిట్


బుమ్రా

లండన్: నిర్ణయాత్మక అయిదో టెస్టులో బుమ్రా ఆడే విషయాన్ని టీమ్‌ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ కొట్టిపారేయలేదు. బుమ్రా ఫిట్‌గానే ఉన్నాడని అన్నాడు. పనిభార నిర్వహణలో భాగంగా ఈ సిరీస్‌లో బుమ్రాతో మూడు టెస్టులే ఆడించాలని జట్టు మేనేజ్‌మెంట్ ముందే నిర్ణయించిన సంగతి తెలిసిందే. అతడు ఇప్పటికే మూడు మ్యాచ్‌లు ఆడేశాడు. కానీ భారత్‌కు పేస్ ప్రత్యామ్నాయాలు ఆశించిన స్థాయిలో లేని నేపథ్యంలో బుమ్రా ఆఖరి టెస్టులోనూ ఆడే అవకాశముంది. "బుమ్రా ఫిట్‌గానే ఉన్నాడు. గత మ్యాచ్‌లో అతడు ఒక్క ఇన్నింగ్స్‌లోనే బౌలింగ్ చేశాడు. ప్రధాన కోచ్ గంభీర్, ఫిజియో, కెప్టెన్ అతడి గురించి చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు. ఇప్పటివరకైతే బుమ్రాపై ఎలాంటి చర్చ జరగలేదు" అని కోటక్ చెప్పాడు. తమ పేసర్లందరూ ఫిట్‌గా ఉన్నారని గంభీర్ ఇంతకుముందే చెప్పాడు. బుమ్రా సిరీస్‌లో ఇప్పటివరకు 14 వికెట్లు పడగొట్టాడు.

మకావు ఓపెన్ బ్యాడ్మింటన్

సాత్విక్ జోడీ శుభారంభం


చిరాగ్

సాత్విక్

మకావు: భారత అగ్రశ్రేణి డబుల్స్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి మకావు ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేశారు. మంగళవారం పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో రెండో సీడ్ సాత్విక్-చిరాగ్ జోడీ 21-13, 21-15తో హంగ్ యీ- ఇంగ్ చియాంగ్ (మలేసియా) జంటపై విజయం సాధించింది. భారత ద్వయం కేవలం 36 నిమిషాల్లోనే ప్రత్యర్థి జంటను చిత్తుచేసి ప్రిక్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. మ్యాచ్ ఆరంభంలో దూకుడుగా ఆడిన భారత జోడీ తొలి గేమ్‌లో 6-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే పుంజుకున్న ప్రత్యర్థి జంట 9-10తో భారత ద్వయానికి చేరువగా వచ్చింది. కానీ మళ్లీ దూకుడు పెంచిన సాత్విక్-చిరాగ్ 21-13తో అలవోకగా గేమ్‌ను సొంతం చేసుకున్నారు. రెండో గేమ్ కొంత హోరాహోరీగా సాగింది. ఒక దశలో 14-13తో స్వల్ప ఆధిక్యంలో ఉన్న భారత జోడీ.. మూడు వరుస పాయింట్లతో 17-13కు చేరుకుంది. తర్వాత మరింత దూకుడుగా ఆడి గేమ్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మరో మ్యాచ్‌లో హరిహరన్- రుబన్ కుమార్ జోడీ 21-15, 19-21, 14-21తో టోరి ఐజావా- డైసుక్ సానో (జపాన్) జంట చేతిలో పోరాడి ఓడింది. డింకు సింగ్-అమన్ మహ్మద్ ద్వయం 21-18, 21-17తో చ్యూక్ హిమ్-యంగ్ షింగ్ (హాంకాంగ్) జంటను ఓడించి మెయిన్‌డ్రాకు అర్హత సాధించింది. మహిళల డబుల్స్‌లో టాప్ సీడ్ గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీకి చుక్కెదురైంది. తొలి రౌండ్లో గాయత్రి- ట్రీసా 21-16, 20-22, 15-21తో లిన్ షియావో- పెంగ్ వీ (చైనీస్ తైపీ) జంట చేతిలో పరాజయం చవిచూశారు. ప్రియ కొంజెంగ్‌బామ్- శ్రుతి మిశ్రా జోడీ 21-15, 16-21, 21-17తో లింగ్ హువాంగ్- వాంగ్ మిన్ (చైనీస్ తైపీ) జంటకు షాకిచ్చి ప్రిక్వార్టర్స్ చేరుకుంది. అపూర్వ గెహ్లావత్-సాక్షి గెహ్లావత్ జంట.. పీ నీ-మీ జింగ్ (మలేసియా) ద్వయం చేతిలో పరాజయం చవిచూసింది. మహిళల సింగిల్స్‌లో తస్నీమ్ మీర్, అన్మోల్ ఖర్బ్ మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. అన్మోల్ 21-11, 21-13తో ఫాతిమా అజ్జాహ్రా (అజర్‌బైజాన్)పై, తస్నీమ్ 21-14, 13-21, 21-17తో తిడప్రాన్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో హేమ నాగేంద్రబాబు-ప్రియ జంట కూడా మెయిన్‌డ్రాకు చేరుకుంది.

మళ్లీ టాప్-10లోకి

దిల్లీ: సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ ప్రపంచ బ్యాడ్మింటన్ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-10లోకి అడుగుపెట్టింది. మంగళవారం బీడబ్ల్యూఎఫ్ ప్రకటించిన జాబితాలో మూడు స్థానాలు మెరుగుపరుచుకున్న భారత ద్వయం తొమ్మిదో ర్యాంకు సాధించింది. గతంలో నంబర్‌వన్ ర్యాంకు సాధించిన భారత జోడీ.. గాయాల కారణంగా ఆటకు దూరమై ర్యాంకింగ్‌లో వెనుకబడింది. అయితే ఈ సీజన్‌లో మూడు ప్రపంచ టూర్ టోర్నీల్లో సెమీస్ చేరుకోవడంతో భారత జోడీ ర్యాంకింగ్ మెరుగైంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 17, మహిళల సింగిల్స్‌లో పి.వి.సింధు 15, మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీ 11వ స్థానాల్లో కొనసాగుతున్నారు.

చివరి టెస్టులో అర్ష్‌దీప్!


అర్ష్‌దీప్

ఓవల్: భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఇంగ్లాండ్‌తో ఓవల్‌లో గురువారం ఆరంభమయ్యే చివరిదైన అయిదో టెస్టులో అరంగేట్రం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నాలుగో టెస్టులో అర్ష్‌దీప్‌ను ఆడిస్తారనే వార్తలు వచ్చినా.. చేతి గాయం కారణంగా అతడిని తుది జట్టు ఎంపికకు పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో గురువారం మొదలయ్యే అయిదో టెస్టులో ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఆడటం దాదాపు ఖాయమే. గాయం నుంచి కోలుకున్న అర్ష్‌దీప్.. మంగళవారం ఐచ్ఛిక నెట్ సెషన్లో ఎక్కువసేపే బౌలింగ్ సాధన చేశాడు. అర్ష్‌దీప్ అరంగేట్రం చేస్తే జట్టులో మరోసారి మార్పులు చేర్పులు తప్పవు. నాలుగో టెస్టులో బుమ్రా, సిరాజ్, అన్షుల్ కాంబోజ్ పేస్ బౌలింగ్ బాధ్యతలు పంచుకున్నారు. పని భార నిర్వహణలో భాగంగా చివరి టెస్టుకు బుమ్రా దూరమవుతాడా.. లేక ఆడతాడా అన్నదానిపై స్పష్టత లేదు. నాలుగో టెస్టులో విఫలమైన అన్షుల్ కాంబోజ్, శార్దూల్ ఠాకూర్‌లపై కూడా వేటు పడడం లాంఛనమే. అప్పుడు సిరాజ్‌కు తోడు ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ బౌలింగ్ భారాన్ని పంచుకునే ఛాన్స్ ఉంది. గాయంతో ఆకాశ్ దీప్ కూడా నాలుగో టెస్టులో ఆడలేదు. అతను ప్రస్తుతం కోలుకున్నాడు. చివరి టెస్టుకు అందుబాటులో ఉంటాడు. అర్ష్‌దీప్ ఇప్పటిదాకా 63 టీ20లు, 9 వన్డేలు ఆడాడు. 2024 టీ20 ప్రపంచకప్ విజయంలోనూ అతడు కీలకపాత్ర పోషించాడు. ఆ టోర్నీలో 17 వికెట్లు పడగొట్టాడు.

రెండో స్థానానికి స్మృతి


స్మృతి మంధాన

దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకును కోల్పోయింది. ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో స్మృతిని వెనక్కినెట్టిన ఇంగ్లాండ్ కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ అగ్రస్థానంలో నిలిచింది. స్మృతి రెండో ర్యాంకుకు తగ్గింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 10 స్థానాలు మెరుగై.. 11వ ర్యాంకు దక్కించుకుంది. జెమీమా రోడ్రిగ్స్ 13వ స్థానంలో నిలిచింది. బౌలింగ్‌లో దీప్తి శర్మ నాలుగో ర్యాంకుతో కొనసాగుతోంది. సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లాండ్), ఆష్లీ గార్డనర్ (ఆస్ట్రేలియా) వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

కేకేఆర్‌కు చంద్రకాంత్ గుడ్‌బై


చంద్రకాంత్

దిల్లీ: ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో బంధానికి చంద్రకాంత్ పండిట్ తెరదించాడు. మూడు సీజన్లపాటు చీఫ్ కోచ్‌గా సేవలందించిన పండిట్.. ఫ్రాంఛైజీని వీడాలని నిర్ణయించుకున్నట్లు కేకేఆర్ మంగళవారం ప్రకటించింది. 2022 ఆగస్టులో బ్రెండన్ మెకల్లమ్ స్థానంలో చంద్రకాంత్ బాధ్యతలు చేపట్టాడు. తర్వాతి సీజన్లో కేకేఆర్ ఏడో స్థానంలో నిలవగా.. 2024లో ఛాంపియన్ అయింది. ఈ ఏడాది ఘోరంగా విఫలమైన ఆ జట్టు.. ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. పండిట్ హయాంలో 42 మ్యాచ్‌లాడిన కోల్‌కతా.. 22 గెలిచి, 18 ఓడింది. 2 మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. "చంద్రకాంత్ పండిట్ కొత్త అవకాశాలను అన్వేషించాలని నిర్ణయించుకున్నాడు. కోల్‌కతా చీఫ్ కోచ్‌గా ఆయన కొనసాగట్లేదు. 2024లో ఐపీఎల్ ఛాంపియన్‌గా కోల్‌కతాను నడిపించడం, దృఢమైన జట్టును నిర్మించడంలో సహాయపడినందుకు పండిట్‌కు కృతజ్ఞతలు" అని కేకేఆర్ పేర్కొంది.

వీనస్ జోడీకి వైల్డ్‌కార్డు


వీనస్

న్యూయార్క్: అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ చాన్నాళ్ల తర్వాత మళ్లీ గ్రాండ్‌స్లామ్‌లో ఆడబోతోంది. యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టోర్నమెంట్లో ఆమెకు వైల్డ్‌కార్డు దక్కింది. ఆగస్టు 19న ఆరంభమయ్యే మిక్స్‌డ్ ఈవెంట్‌లో రిలీ ఒపెల్కాతో కలిసి 45 ఏళ్ల వీనస్ బరిలో దిగనుంది. ఈ టోర్నీలో పోటీపడే 16 మంది జోడీలను యుఎస్ టెన్నిస్ సంఘం మంగళవారం ప్రకటించింది. ఏడాదిన్నర విరామం తర్వాత ఇటీవలే పునరాగమనం చేసిన వీనస్.. వాషింగ్టన్‌లో జరిగిన డీసీ ఓపెన్లో రెండో రౌండ్ చేరింది. యుఎస్ ఓపెన్ టోర్నీ ఆరంభానికి ముందే ఈసారి మిక్స్‌డ్ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. సినర్-ఎమ్మా నవారో, బడోసా-డ్రాపర్, స్వైటెక్-రూడ్, రిబకీనా-టేలర్ ఫ్రిట్జ్, అనిసిమోవా-రూన్, బెన్సిచ్-జ్వెరెవ్, పెగులా-టామీ పాల్, ఆండ్రీవా-మెద్వెదెవ్ జంటలకు కంబైన్డ్ సింగిల్స్ ర్యాంకు ఆధారంగా నేరుగా ఎంట్రీ దక్కింది. మరో ఎనిమిది జోడీలకు వైల్డ్‌కార్డు ప్రవేశం లభించింది. మొత్తం 25 జంటలు ఈ టోర్నీ కోసం నమోదు చేసుకున్నాయి. మిక్స్‌డ్ విజేతకు రూ.8 కోట్ల 70 లక్షల భారీ ప్రైజ్‌మనీ దక్కనుంది.



కేలీ మెకాన్

లెడెకీ

ఎదురులేని లెడెకీ

సింగపూర్: 1500 మీటర్ల ఫ్రీస్టైల్‌లో తనకు ఎదురులేదని కేటీ లెడెకీ మరోసారి నిరూపించుకుంది. ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఈ అమెరికా తార 15 నిమిషాల 26.44 సెకన్లలో లక్ష్యాన్ని చేరి స్వర్ణం కైవసం చేసుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఈ ఒక్క విభాగంలోనే లెడెకీ 6 స్వర్ణాలు నెగ్గింది. మొత్తంగా 28 పతకాలు (22 స్వర్ణాలు) ఆమె ఖాతాలో ఉన్నాయి. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 1500 మీటర్లలో సిమోనా క్వాడ్రెల్లా (ఇటలీ, 15 నిమిషాల 31.79 సె) రజతం, లాని పాలిస్టర్ (ఆస్ట్రేలియా, 15 నిమిషాల 31.79 సె) కాంస్య పతకాలు గెలుచుకున్నారు. మహిళల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కేలీ మెకాన్ (ఆస్ట్రేలియా) పసిడి నెగ్గింది. ఆమె 57.16 సెకన్లలో రేసు పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఈవెంట్లో ప్రపంచ రికార్డు కలిగిన రెగాన్ స్మిత్ (అమెరికా, 57.35 సె) రజతంతో సరిపెట్టుకుంది. ఆమె 0.19 సెకన్ల తేడాతో స్వర్ణాన్ని కోల్పోయింది. కేథరిన్ బెర్కాఫ్ (అమెరికా, 58.15 సె) కంచు నెగ్గింది. పురుషుల బ్యాక్‌స్ట్రోక్‌లో పీటర్ కొయిట్జీ (దక్షిణాఫ్రికా, 51.85 సె) పసిడి గెలుచుకున్నాడు. థామస్ సెకాన్ (ఇటలీ, 51.90 సె), యొహాన్ (ఫ్రాన్స్, 51.92 సె) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. పురుషుల 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో పారిస్ ఒలింపిక్ ఛాంపియన్ డేవిడ్ పొపోవిసి (రొమేనియా) అగ్రస్థానాన్ని సాధించాడు. అతడు ఒక నిమిషం 43.53 సెకన్లలో రేసు పూర్తి చేశాడు. ల్యూక్ హోబ్సన్ (అమెరికా, ఒక నిమిషం 43.84 సె) రజతం, మురాసా (జపాన్, ఒక నిమిషం 44.54 సె) కాంస్యం గెలిచారు.

భారత స్విమ్మర్లు విఫలం: ప్రపంచ అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్విమర్ల వైఫల్యం కొనసాగుతోంది. వరుసగా మూడో రోజు భారత క్రీడాకారులెవరూ హీట్స్‌ను దాటలేకపోయారు. పురుషుల 200 మీటర్ల బటర్‌ఫ్లై హీట్స్‌లో సాజన్ ప్రకాశ్ 24వ స్థానంలో నిలిచాడు. తొలి 16 స్థానాల్లో నిలిచిన స్విమ్మర్లు సెమీస్‌కు అర్హత సాధించారు. పురుషుల 800 మీ ఫ్రీస్టైల్‌లో ఆర్యన్ నెహ్రా 23వ స్థానంలో నిలిచాడు. మొదటి ఎనిమిది మంది ఆటగాళ్లు ఫైనల్లో అడుగుపెట్టారు. పురుషుల 50 మీ బ్యాక్‌స్ట్రోక్‌లో ఎస్.పి.లిఖిత్ 50వ స్థానంతో టోర్నీని ముగించాడు.



ట్రోఫీతో ఆస్ట్రేలియా ఆటగాళ్లు

విండీస్ పరాజయం పరిపూర్ణం

సెయింట్‌కీట్స్: సొంతగడ్డపై వెస్టిండీస్‌కు మరో పరాభవం! ఇప్పటికే ఆస్ట్రేలియాతో మూడు టెస్టుల సిరీస్‌ను 0-3తో చేజార్చుకున్న కరీబియన్ జట్టు.. తమ శైలికి నప్పే టీ20 లోనూ ఆ జట్టు చేతిలో 0-5తో చిత్తయింది. చివరిదైన అయిదో టీ20లో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో విండీస్‌ను ఓడించింది. మొదట విండీస్ 19.4 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. హెట్‌మయర్ (52; 31 బంతుల్లో 6×4, 1×6) టాప్ స్కోరర్. షెర్ఫానీ రూథర్‌ఫర్డ్ (35), హోల్డర్ (20) కూడా రాణించారు. బెన్ డ్వార్షుయిస్ (3/41) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. ఛేదనలో ఆసీస్ 2.2 ఓవర్లకు 25/3తో తడబడింది. కానీ మిచెల్ ఓవెన్ (37; 17 బంతుల్లో 3×4, 3×6), కామెరూన్ గ్రీన్ (32), ఆరోన్ హార్డీ (28) సత్తా చాటడంతో కంగారూ జట్టు 17 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. వెస్టిండీస్ బౌలర్లలో అకీల్ హొసేన్ (3/17), జేసన్ హోల్డర్ (2/36), అల్జారి జోసెఫ్ (2/21) రాణించినా జట్టుకు విజయాన్ని అందించలేకపోయారు.


నగాల్

రెండో రౌండ్లో నగాల్

దిల్లీ: భారత ఆటగాడు సుమిత్ నగాల్ ప్లాజ్‌మన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. మంగళవారం జరిగిన మొదటి రౌండ్లో అతడు 6-2, 6-2తో స్పెయిన్‌కు కార్లోస్ సాంచెజ్ జోవర్‌పై విజయం సాధించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 307వ స్థానంలో ఉన్న నగాల్.. తర్వాతి రౌండ్లో 17 ఏళ్ల జర్మన్ ఆటగాడు నీల్స్ మెక్‌డొనాల్డ్‌ను ఢీకొంటాడు. ఈ ఏటీపీ ఛాలెంజర్ ఈవెంట్ జర్మనీలోని హగెన్‌లో జరుగుతోంది.



ఈనాడు


THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 30-7-2025 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 351 రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



సిందూర్‌ను ఆపాలని ఏ దేశ నేతా అడగలేదు



- ఉగ్రవాదంపై చర్యలు తీసుకోకుండా ఎవరూ అడ్డుపడలేదు
- ప్రపంచం యావత్తూ భారత్‌కు బాసటగా నిలిచింది
- సైనికులకు అండగా నిలవనిది కాంగ్రెస్ ఒక్కటే
- పార్లమెంటులో ప్రధాని మోదీ సుదీర్ఘ సమాధానం
- కీలక సమాచారాన్ని ప్రభుత్వమే పాక్‌కు ఇచ్చింది: రాహుల్
- ప్రభుత్వాన్ని నిలదీసిన ఖర్గే, ఇతర విపక్ష నేతలు

రోజంతా వాడివేడిగా చర్చ

మన బలగాలు చేసిన దాడితో పాక్ వైమానిక స్థావరాలు ఇంకా 'ఐసీయూ'లోనే ఉన్నాయి. ఉగ్రదాడి కుట్రదారులు ఇప్పటికీ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. కొన్నేళ్లపాటు మరిచిపోలేని పాఠం నేర్పించాం. ఐరాసలో పాక్‌కు మద్దతుగా మూడు దేశాలే మాట్లాడాయి. మిగిలిన ప్రపంచమంతా మనకే అండగా నిలిచింది. కాంగ్రెస్ అలా చేయకపోవడం దురదృష్టకరం.

- ప్రధాని నరేంద్ర మోదీ

మే 7 అర్ధరాత్రి 1.05 గంటలకు ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైందని, 1.35కు పాకిస్థాన్‌కు ఫోన్‌చేసి సైనికేతర లక్ష్యాలను ఛేదించామని చెప్పినట్లు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిన్న లోక్‌సభలో తెలిపారు. ఉద్రిక్తతలు పెంచే ఆలోచన లేదని దాయాదితో చెప్పామన్నారు. అంటే.. పాక్‌తో యుద్ధం చేసే ఆలోచన లేదని ఆయన చెప్పకనే చెప్పారు. అరగంటలోనే లొంగిపోవడమంటే అదే.

- రాహుల్‌గాంధీ, లోక్‌సభలో విపక్ష నేత



దిల్లీ

ఉగ్రవాదంపై చర్యలు తీసుకోకుండా ప్రపంచంలో ఏ దేశం మనల్ని అడ్డుకోలేదని, ఆపరేషన్ సిందూర్‌ను ఆపాల్సిందిగా ఏ దేశ నేత కూడా అడగలేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టంచేశారు. ఉగ్రవాదం నుంచి మనల్ని మనం కాపాడుకునే విషయంలో యావత్ ప్రపంచం నుంచి దేశానికి మద్దతు లభించినా.. కాంగ్రెస్ మాత్రం దేశ సైనికుల శౌర్యపరాక్రమాలకు అండగా నిలబడటంలేదని విమర్శించారు. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌లపై లోక్‌సభలో రెండ్రోజుల్లో 19 గంటలకుపైగా జరిగిన ప్రత్యేక చర్చకు సమాధానంగా మంగళవారం సాయంత్రం ఆయన 102 నిమిషాలు మాట్లాడారు. అంతకుముందు విపక్షాలు ఉభయసభల్లో ప్రభుత్వాన్ని నిలదీశాయి. ముఖ్యంగా భద్రతలో, విదేశాంగ విధానంలో వైఫల్యాలను ప్రస్తావించి ప్రభుత్వ జవాబుదారీతనాన్ని ప్రశ్నించాయి. విపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు ప్రభుత్వంపై విరుచుకుపడగా.. అధికార పక్షం వైపు నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, మరో మంత్రి నడ్డాలు వారి విమర్శల్ని గట్టిగా తిప్పికొట్టారు. ఉభయసభల్లో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. చివర్లో మోదీ సవివరంగా స్పందించి.. విపక్షాల పాలనలో జరిగిన తప్పిదాలను తనదైన శైలిలో ప్రస్తావించారు. ఉగ్రవాదులను ఏరివేయడంలో ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహదేవ్ కీలక పాత్ర పోషించాయని స్పష్టంచేశారు. భారత్-పాక్ యుద్ధాన్ని నిలువరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెప్పడంపై విపక్షాల విమర్శలకు సమాధానమిచ్చారు.

అమెరికా ఉపాధ్యక్షుడు ఫోన్లో మాట్లాడారు


"మే 9వ తేదీ రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు (జేడీ వాన్స్) నాతో (మిగతా 2లో)

క్రస్టుగేట్ల నుంచి కృష్ణమ్మ పరుగులు

- నాగార్జునసాగర్‌లో 26 గేట్లు ఎత్తివేత, శ్రీశైలంలో 8
- సాగర్ నుంచి దిగువకు 2,32,468 క్యూసెక్కుల ప్రవాహం

2లో

విద్యుద్దీపాల అలంకరణలో సాగర్ సోయగం



మా రాష్ట్రం అవకాశాల గని.. పెట్టుబడులు పెట్టండి

- సింగపూర్ దిగ్గజ సంస్థలకు సీఎం చంద్రబాబు పిలుపు
- ఆంధ్రప్రదేశ్‌లో ఎంఆర్‌వో కేంద్రం ఏర్పాటుకు ఎస్ఐఏ ఆసక్తి
- ఏపీ-సింగపూర్ భాగస్వామ్యంపై ఆ దేశాధ్యక్షుడు షణ్ముగరత్నంతో చర్చ



సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మీయ కరచాలనం

ఈనాడు - అమరావతి

సింగపూర్‌లో మూడోరోజు పర్యటనలో సీఎం చంద్రబాబు మంగళవారం వివిధ పారిశ్రామిక దిగ్గజ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. సీఎం ప్రతిపాదనలకు పలు సంస్థలు సానుకూలంగా స్పందించాయి. సాంకేతిక సహకారంతో పాటు పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత తెలిపాయి.

విద్యాసంస్థలకు 'ఏఐ సింగపూర్' సహకారం

రాష్ట్రంలో ఏఐ పరిశోధన, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు సహకరించాలని ఏఐ సింగపూర్ సంస్థను సీఎం చంద్రబాబు కోరారు. ఆ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మోహన్ కంకణవల్లితో సమావేశమయ్యారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పౌర సేవల విషయంలో ఏఐ వినియోగంపై చర్చించారు. ఏపీలోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలతో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. 'మా విద్యార్థులకు ఏఐ, ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలు, స్కిల్ డెవలప్‌మెంట్ మాడ్యూల్స్ అమలు చేయాలి. టెక్నాలజీ ప్రమోషన్, డీప్‌టెక్, ఏఐ రంగంలో సహకరించాలి. రాష్ట్రాన్ని కృత్రిమ మేధ (ఏఐ) హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది' అని చంద్రబాబు తెలిపారు.

విమానయాన రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను వినియోగించుకోవాలని ఎస్ఐఏ (మిగతా 2లో)



జగన్ మూడేళ్లు పంటబీమా వాటానే ఇవ్వలేదు

కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

ఈనాడు, దిల్లీ: పంటల బీమాకు సంబంధించిన రైతుల వాటాను ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పి జగన్ ప్రభుత్వం మూడేళ్లు ఆ వాటా సొమ్మునే ఇవ్వలేదని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆరోపించారు. దాని వల్ల రైతులు ఇబ్బంది పడినట్లు పేర్కొన్నారు. మంగళవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై రాజస్థాన్‌కు చెందిన సభ్యుడు హనుమాన్ బేనివాల్ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ చౌహాన్.. జగన్ రైతులకు చేసిన అన్యాయాన్ని ఎండగట్టారు. 'పంటల బీమా యోజన ఇదివరకూ జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్ఏఐఎస్) పేరుతో నడిచేది. అది రైతుకు ప్రయోజనకరంగా ఉండేది కాదు. ప్రధానమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత బీమా కంపెనీ రైతు క్లెయిమ్‌ను 21 రోజుల్లోపు చెల్లించకపోతే రైతుకు 12% వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందన్న షరతు విధించారు. చాలా ప్రభుత్వాలు బీమా కోసం రైతుల వాటా తామే ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలాగే ఇబ్బందులు ఎదురయ్యాయి. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇచ్చినా, ఇవ్వకపోయినా కేంద్రం తన వాటా జమచేసేలా మార్పులు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను చెల్లించడంలో జాప్యం చేస్తే వారిపై 12% వడ్డీ విధించి ఆ మొత్తాన్ని రైతుల ఖాతాలో వేసే వ్యవస్థను మోదీ ప్రభుత్వం రూపొందించింది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాకర్షణ కోసం రైతుల బీమా ప్రీమియం వాటాను తామే చెల్లిస్తామని ప్రకటనలు చేశాయి. అయితే వాటా మొత్తాన్ని నిర్ధారిత సమయంలో చెల్లించలేదు. ఏపీలో జగన్ ప్రభుత్వం (మిగతా 2లో)

ఆగస్టు 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



స్మార్ట్ రేషన్ కార్డు చూపిస్తున్న మంత్రి మనోహర్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పేద కుటుంబాలకు ఆగస్టు 25 నుంచి 31వ తేదీ వరకు క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని.. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు పంపిణీ చేస్తారని వివరించారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'కార్డులపై సీఎం సహా ఎవరి ఫొటోలూ ఉండవు. కుటుంబ సభ్యుల పేర్లు, ఫొటోలు మాత్రమే ఉంటాయి' అని వివరించారు. 'కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పులు, తొలగింపులు (మిగతా 2లో)

లోపలి పేజీల్లో

సామూహికంగా ఓట్లు తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటాం

సుప్రీంకోర్టు స్పష్టీకరణ




బిహార్ ఓటర్ల జాబితా సవరణపై వ్యాజ్యాల విచారణ తేదీలు ఖరారు

సూపర్ సిక్స్‌లో మరో ముందడుగు

తొలివిడత కింద ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల జమ

ప్రకాశం జిల్లాలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

ఇదీ సంగతి!



ఆఖరికి కాలింగ్ బెల్ టోన్ కూడా అదే పెట్టాడు!!

మొక్కే కదాని.. ఏదోటి నాటొద్దు!

మొక్కలు నాటడమంటే తంతు కాదు... అదో యజ్ఞం.

సరైన చోట సరైన వృక్ష జాతులను పెంచితేనే మంచి ఫలితాలొస్తాయి. కానీ చాలాచోట్ల పచ్చదనం పేరుతో ఏవేవో రకాలను పెంచుతున్నారు. అవి ఫలించి, పుష్పించి, పచ్చగా కనిపించినా పర్యావరణానికి మాత్రం చేటు చేస్తున్నాయి.

మనవైన మొక్కలతోనే ఈ ఉపద్రవాన్ని అరికట్టగలుగుతాం.

- ప్రత్యేక కథనం లోపలి పేజీలో



అందరి పేర్లూ డిజిటల్ లైబ్రరీలో పెట్టి..

అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరి సంగతీ తేలుస్తాం: మాజీ సీఎం జగన్

లోపలి పేజీల్లో

3..2..1..

- కొనసాగుతున్న జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 కౌంట్‌డౌన్
- నేడు నింగిలోకి వాహకనౌక
- కక్ష్యలోకి నైసార్ ఉపగ్రహం


శ్రీశైలం నుంచి దిగువకు ప్రవాహం..

క్రస్టుగేట్ల నుంచి కదంతొక్కుతున్న కృష్ణమ్మ!


ఈనాడు డిజిటల్, నరసరావుపేట; న్యూస్‌టుడే, విజయపురి సౌత్, సున్నిపెంట సర్కిల్: శ్రీశైలం నుంచి వస్తున్న వరదతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్లు ఐదడుగుల మేర ఎత్తి 2,04,048 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటి విడుదలను ప్రారంభించారు. మొదట 2 గేట్లు ఎత్తి.. మధ్యాహ్నం నుంచి క్రమంగా పెంచుకుంటూ సాయంత్రం 4 వరకు మొత్తం 26 గేట్లను ఎత్తారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. మంగళవారం సాయంత్రానికి 587.60 అడుగులకు చేరుకుంది. 305.86 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గేట్లు, పవర్ హౌస్ కలిపి 2,32,468 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాలువలకూ నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద: జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి శ్రీశైలం వైపునకు 2,67,850 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో జలాశయం 8 గేట్లను 10 అడుగుల మేర పైకెత్తి 2,16,520 క్యూసెక్కులు, జలవిద్యుత్తు కేంద్రాల నుంచి 65,712 క్యూసెక్కుల జలాలను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయ నీటిమట్టం మంగళవారం రాత్రి 9 గంటల సమయానికి 882.80 అడుగులు, నీటినిల్వ 203.4290 టీఎంసీలుగా నమోదైంది.

మా రాష్ట్రం అవకాశాల గని.. పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)


ఇంజినీరింగ్ కంపెనీని సీఎం కోరారు. ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌జీ జూన్ లిన్ విలిన్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. 'ఏపీలో పర్యటించి పెట్టుబడులపై ఆలోచించండి. కొత్తగా నిర్మించే విమానాశ్రయ ప్రాజెక్టుల్లో ప్రపంచస్థాయి సాంకేతికతతో విమానాల మెయింటెనెన్స్, రిపేరింగ్ అండ్ ఓవర్ హాలింగ్ (ఎంఆర్‌వో) కేంద్రం ఏర్పాటులో భాగస్వామి కావాలి. దీనికి విశాఖపట్నం, కృష్ణపట్నం వంటి ప్రాంతాలు అనుకూలం' అని ప్రతిపాదించారు.


ఎస్ఐఏ ఇంజినీరింగ్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌జీ జూన్ లిన్ విలిన్‌తో చంద్రబాబు

తమ కంపెనీ ప్రతినిధుల బృందాన్ని త్వరలో ఏపీకి పంపేందుకు సంస్థ అంగీకరించింది.

'కెప్పెల్'కు ఆహ్వానం

అమరావతి అభివృద్ధిలో సింగపూర్‌కు చెందిన దిగ్గజ సంస్థ కెప్పెల్ కార్పొరేషన్ భాగస్వామి కావాలని సీఎం కోరారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిమ్ యాంగ్ వియ్‌తో సీఎం సమావేశమయ్యారు. పట్టణాభివృద్ధి, వాణిజ్య సముదాయాలు, మౌలిక వసతుల రంగాల్లో ఆ సంస్థకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. రాష్ట్రాభివృద్ధి కోసం విశాఖను గ్రోత్ ఇంజిన్‌గా మార్చే లక్ష్యంతో ఐటీ, వాణిజ్యం, గృహ నిర్మాణ రంగాల్లో ప్రాజెక్టుల అభివృద్ధికి కెప్పెల్‌ను ఆహ్వానించారు.


గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ బ్రాన్ యోతో ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నారాయణ, టీజీ భరత్ తదితరులు

సింగపూర్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌తో..

అమరావతి.. రియల్, పారిశ్రామిక, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ (జీఐసీ)ను సీఎం కోరారు. ఆ సంస్థ ముఖ్య పెట్టుబడుల అధికారి బ్రాన్ యోతో సమావేశమయ్యారు. జీఐసీతో దీర్ఘకాలిక భాగస్వామ్యం, స్థిరమైన పెట్టుబడుల ప్రణాళికలపై చర్చించారు. విద్య, వైద్యం, పట్టణ ప్రణాళిక, పౌర సదుపాయాల రంగాల్లో పెట్టుబడులకు అనువైన పరిస్థితులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయా రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో అపారమైన అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేశారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై విల్మర్ ఆసక్తి

ఫుడ్ ప్రాసెసింగ్, ఎడిబుల్ ఆయిల్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో పెట్టుబడికి అవకాశాలపై విల్మర్ ఇంటర్నేషనల్ సీఎండీ క్వాక్‌కూన్ హోంగ్‌తో సీఎం చంద్రబాబు చర్చించారు. రైతులకు విలువ ఆధారిత మార్కెట్‌ను కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో సహకరించాలని సంస్థ ప్రతినిధులను కోరారు.

పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం


రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో ఐఏఎస్ అధికారి కె.భాస్కర్, మంత్రి నారా లోకేశ్, సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి టీజీ భరత్ తదితరులు

ఈనాడు, అమరావతి: డేటా సెంటర్ల ఏర్పాటుకు ఏపీలో అనుకూలత ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సింగపూర్ పర్యటనలో మూడోరోజు ఆ దేశ పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రముఖ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులు హాజరయ్యారు. 'ఐటీ, డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ అత్యుత్తమ ప్రాంతం. టీసీఎస్, కాగ్నిజెంట్ సహా పలు దిగ్గజ సంస్థలు విశాఖ నుంచి కార్యకలాపాలు ప్రారంభించబోతున్నాయి. త్వరలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. అమరావతిలో దేశంలోనే మొదటి క్వాంటమ్ వ్యాలీని 2026 జనవరిలో ప్రారంభిస్తున్నాం. పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ కోసం 20కి పైగా పాలసీలు ప్రకటించాం' అని చంద్రబాబు పేర్కొన్నారు. పారిశ్రామిక అనుకూల విధానాలు, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సమావేశంలో 41 కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఇందులో మంత్రులు లోకేశ్, నారాయణ, టీజీ భరత్ పాల్గొన్నారు.

సింగపూర్ దేశాధ్యక్షుడు షణ్ముగరత్నంతో చంద్రబాబు భేటీ



సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాని, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్‌లతో సీఎం చంద్రబాబు వేర్వేరుగా సమావేశమయ్యారు. నాలెడ్జ్ ఎకానమీ, మౌలిక సదుపాయాల కల్పన, సెమీ కండక్టర్లు, అమరావతి అభివృద్ధి, పట్టణ ప్రణాళిక, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ఏపీ-సింగపూర్ ప్రభుత్వాలు కలిసి పనిచేసే అంశంపై వారితో చర్చించారు.

ఆగస్టు 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

కోరుతూ 16,08,612 దరఖాస్తులు అందగా.. 15,32,758 పరిష్కరించాం. 9,87,644 కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులిస్తున్నాం. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుల సంఖ్య 1,45,97,486కు చేరుతుంది. కార్డుల్లో సభ్యులు 4,29,79,897 మంది ఉన్నారు. కొత్త కార్డులకూ ఆగస్టు నుంచి రేషన్ ఇస్తాం' అని చెప్పారు.

లబ్ధిదారుల ఖాతాల్లోకే 'దీపం' సొమ్ము

'దీపం పథకం కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో భాగంగా తొలి విడతలో రూ.764 కోట్ల రాయితీతో 97.59 కుటుంబాలకు ఉచిత సిలిండర్ ఇచ్చాం. రెండో సిలిండర్‌ను ఇప్పటి వరకు 93.46 లక్షల మంది తీసుకున్నారు. వీరికి రాయితీగా రూ.747 కోట్లు జమ చేశాం. ఇంకా గ్యాస్ కంపెనీల వద్ద రూ.35 కోట్లు ఉన్నాయి. 86 వేల మంది లబ్ధిదారులకు సంబంధించి బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడంతో సొమ్ము జమ కాలేదు. సచివాలయ సిబ్బంది ద్వారా వారికి అవగాహన కల్పిస్తాం' అని మంత్రి మనోహర్ తెలిపారు. 'డిజిటల్ వాలెట్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా సిలిండర్ రాయితీ సొమ్మును జమ చేసే ప్రక్రియను పంజాబ్ నేషనల్ బ్యాంక్ సహకారంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాం. 4,281 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా.. 2,580 మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. 1,184 మంది ఉపయోగించుకున్నారు. వాలెట్‌లో జమ చేసిన సొమ్మును సిలిండర్ కొనుగోలుకు తప్పితే.. ఇతర అవసరాలకు వాడుకోలేరు. మూడో సిలిండర్ పంపిణీ సందర్భంగా పూర్తిస్థాయిలో పరిశీలిస్తాం. నాలుగో సిలిండర్ ఇచ్చే నాటికి.. అందరికీ అమల్లోకి తెస్తాం' అని వివరించారు.

పవన్ కల్యాణ్ సినిమా ప్రమోట్ చేయడం మా బాధ్యత

'పవన్ కల్యాణ్ మా పార్టీ అధ్యక్షుడు. ఆయన నటించిన హరిహర వీరమల్లు సినిమాను ప్రమోట్ చేయడం మా బాధ్యత. అది చారిత్రక ఫిక్షన్ సినిమా. అందరూ చూడాల్సిన అవసరం ఉంది. అందులో తప్పేంటి' అని మంత్రి మనోహర్ విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

జగన్ మూడేళ్లు పంటబీమా వాటానే ఇవ్వలేదు

(మొదటి పేజీ తరువాయి)

మూడేళ్లు ఇవ్వనేలేదు. రైతులు నష్టపోయారు. ఇకపై ప్రభుత్వాలన్నీ నిర్దిష్ట గడువులోగా రైతుల వాటా బీమా మొత్తాన్ని చెల్లించాలి. అప్పుడే దాన్ని బీమాగా పరిగణనలోకి తీసుకుంటాం' అని కేంద్రమంత్రి స్పష్టంచేశారు. ఏపీలో ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ కింద 2020-21 నుంచి 2024-25 మధ్యకాలంలో రూ.3,138.80 కోట్ల క్లెయిమ్‌లు రాగా అందులో చెల్లింపులు జరిపినవేమీ లేవన్నారు. ఇంకా రూ.2,592.07 కోట్ల విలువైన క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. సబ్సిడీ, రైతుల ప్రీమియంలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడమే ఇందుకు కారణమని శివరాజ్‌సింగ్ తెలిపారు.

రైతులకు జగన్ చేసిన అన్యాయానికి శివరాజ్‌సింగ్ వ్యాఖ్యలే నిదర్శనం: తెదేపా ఎంపీలు


దిల్లీలో మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి. చిత్రంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఫసల్‌బీమా యోజన అమలుపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ పార్లమెంటులో జగన్ మోసాన్ని బయటపెట్టడాన్ని బట్టి అప్పట్లో పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. ఆమె మంగళవారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడితో కలిసి ఏపీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. జగన్‌కు తాను అధికారంలో ఉన్నప్పుడు రైతులు గుర్తుకు రాలేదని.. ఇప్పుడు వారిపట్ల ప్రేమ ఒలకబోస్తూ యాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పులివెందుల నియోజకవర్గంలో నిర్మించిన సర్వారాయ రిజర్వాయర్ నుంచి కనీసం ఒక్క రైతు పొలానికి కూడా నీరు అందించకుండా కేవలం భారతీ సిమెంట్‌కు, జగన్ మేనమామ చీనీతోటలకు అందించడం కోసమే దాన్ని పరిమితం చేశారని ఆరోపించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ జగన్ రైతులకు చేసిన నష్టాన్ని సాక్షాత్తూ కేంద్ర వ్యవసాయ మంత్రే పార్లమెంటు సాక్షిగా చెప్పారన్నారు. అప్పట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సింగపూర్‌లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలోనూ అక్కడి మంత్రులు బహిరంగంగా మాట్లాడుతున్నారని గుర్తుచేశారు.

ఏపీ అభివృద్ధికి కలిసి పనిచేస్తాం

- సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్ 'ఎక్స్'లో ప్రకటన
- సింగపూర్ భాగస్వామ్యం విలువైంది: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉండేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆ దేశ వాణిజ్య, పారిశ్రామిక శాఖలోని మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక మంత్రి టాన్ సీ లెంగ్ ప్రకటించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో సింగపూర్‌తో దెబ్బతిన్న సంబంధాలను చక్కదిద్దేందుకు వెళ్లిన సీఎం చంద్రబాబు.. అక్కడ ఉన్న సమయంలోనే వివిధ రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని ఆ దేశ మంత్రి ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు. 'వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడులకు ఏపీ అనుకూలం. ఫుడ్ ఎంపైర్, ఎవర్ వోల్ట్‌తో పాటు మరికొన్ని సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులకు, కార్యకలాపాల విస్తరణకు ఆసక్తిగా ఉన్నాయి. పోర్టులు, హరిత ఇంధనం, డిజిటల్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులు.. భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై చంద్రబాబుతో చర్చించాం. 2014లో రాజధాని అమరావతి అభివృద్ధి.. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన, నిర్మాణంలో అప్పటి తెదేపా ప్రభుత్వానికి సహకారం అందించాం. స్విస్ ఛాలెంజ్ విధానంలో అమరావతి స్టార్టప్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సింగపూర్ సంస్థలు అప్పట్లో టెండరు దక్కించుకున్నాం. సీడ్ క్యాపిటల్ విషయంలో సింగపూర్ కన్సార్షియం పనిచేయకున్నా.. ఏపీలో పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో సాంకేతిక సహకారం అందిస్తాం. ఏపీ అభివృద్ధి ప్రణాళికల్లో ప్రపంచబ్యాంకు భాగస్వామ్యంతో కలిసి పనిచేస్తాం. సీఎం చంద్రబాబు పర్యటన విజయవంతం కావాలి కోరుకుంటున్నాం' అని ట్వీట్ చేశారు.

సింగపూర్ ప్రభుత్వానికి ధన్యవాదాలు: చంద్రబాబు

ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమంటూ సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్ ప్రకటించడంపై ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. 'సింగపూర్ ప్రభుత్వానికి, ఆ దేశ మంత్రికి ఏపీ ప్రజల తరఫున కృతజ్ఞతలు. ఏపీ ప్రభుత్వంతో భాగస్వామిగా ఉండేందుకు సింగపూర్ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషం. టాన్ సీ లెంగ్‌తో జరిపిన చర్చలతో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఉత్పాదక రంగం, రెన్యూవబుల్ ఎనర్జీ, పోర్టులు, డిజిటల్, ఇన్నోవేషన్, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఏపీ-సింగపూర్ కలిసి పనిచేసేందుకు మార్గం సుగమమైంది. మూడు దశాబ్దాలుగా సింగపూర్‌తో అనుబంధం ఉంది. ఏపీ అభివృద్ధి.. ఆధునిక మౌలిక వసతుల కల్పనలో సింగపూర్ ప్రభుత్వం నుంచి సహకారం ఆశిస్తున్నాం. గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధికి సంకల్పం తీసుకున్నాం. పట్టణ, గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వ ప్రణాళికలకు సింగపూర్ సహకారంతో నెరవేరుస్తాం' అని సీఎం పేర్కొన్నారు.

'సిందూర్'ను ఆపాలని ఏ దేశ నేతా అడగలేదు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడటానికి 3-4 సార్లు ప్రయత్నించారు. నేను ఆ సమయంలో సైనిక దళాలతో సమావేశాల్లో తలమునకలుగా ఉన్నాను. ఆ తర్వాత నేను ఆయనకు ఫోన్ చేశాను. పాక్ పెద్ద దాడి చేయబోతోందని వాన్స్ హెచ్చరించారు. పాక్‌గానీ భారత్‌పై దాడికి దిగితే మా దాడి ఇంకా భారీగా ఉంటుందని, ప్రతి తూటాకు మేం ఫిరంగులతో జవాబిస్తామని నేను తేల్చిచెప్పాను. అంతేగానీ యుద్ధాన్ని నిలిపివేయాలని ఏ దేశం నుంచి ఏ నేత మనల్ని అడగలేదు. కాంగ్రెస్ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం నన్ను లక్ష్యంగా చేసుకున్నారు. వారి పసలేని ప్రకటనలు మన వీర సైనికుల్ని నిరుత్సాహపరిచాయి.

అణ్వస్త్ర బెదిరింపుల్ని బేఖాతరు చేశాం

తమవద్ద అణ్వస్త్రాలు ఉన్నాయని పాక్ చేసిన బెదిరింపులకు మనం తలొగ్గలేదు. అలాంటి బ్లాక్‌మెయిల్‌కు భయపడబోమని ప్రపంచానికి చాటాం. చేసిన దుస్సాహసానికి భారీ మూల్యం చెల్లించుకోవాలని పాక్‌కు తెలుసు. సిందూర్ నుంచి సింధూ (నదీ జలాల ఒప్పందం) వరకు మన కార్యకలాపాలు విస్తరించాయి. భారత్‌పై దాడులు చేసినా ఏమీ కాదులే అని గతంలో ఉగ్రవాదులు అనుకునేవారు. ఇప్పుడు మాత్రం అలా దాడిచేస్తే మనం వాళ్ల అంతుచూస్తామని వారికి తెలుసు. మన దేశంలో తయారైన డ్రోన్లు, క్షిపణులు పాక్ ఆయుధ సామగ్రి పాటవమేంటో ఎండగట్టాయి. పాక్ నుంచి వచ్చిన వెయ్యికి పైగా డ్రోన్లు, క్షిపణులను గాల్లోనే నిర్వీర్యం చేశాం. స్వయంసమృద్ధ భారత్ బలాన్ని ప్రపంచం చూసింది. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను 22 నిమిషాల్లో మట్టుబెట్టి ప్రతీకారం తీర్చుకున్నాం. కాళ్లబేరానికి వచ్చేలా చేశాం. ఇక ఏమాత్రం భరించలేక.. దాడుల్ని ఆపాలని ఆ దేశ డీజీఎంవో మన డీజీఎంవోను కోరారు.

వాళ్లు మన దాయాదికి అధికార ప్రతినిధులా?

అణ్వస్త్రపరంగా బెదిరింపులకు దిగాలని పాక్ చూసినా అక్కడి ఉగ్రవాదుల్ని మనం లక్ష్యంగా చేసుకున్నప్పుడు ఏమీ చేయలేకపోయింది. దురదృష్టంకొద్దీ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం మన దాయాది ప్రచారానికి అధికార ప్రతినిధుల్లా మాట్లాడుతున్నాయి. పాక్‌కు కాంగ్రెస్ క్లీన్‌చిట్ ఇవ్వడం, వారికి వంతపాడటం దేశాన్ని నివ్వెరపరిచింది. పహల్గాం దాడి ద్వారా దేశంలో అల్లర్లను రెచ్చగొట్టాలని కుట్ర జరిగింది. దేశం ఏకతాటిపై దాన్ని తిప్పికొట్టింది. ఉగ్రవాదుల ప్రధాన కార్యాలయాన్ని నాశనం చేశాం కాబట్టే ఈ పార్లమెంటు సమావేశాలు విజయోత్సవాలు అని నేను చెబుతున్నా. ఉగ్రవాదులు, వారి గురువులు ఊహించలేనంతగా గుణపాఠాన్ని నేర్పిస్తామని చెప్పడానికే నేను మీ ముందు నిల్చొన్నా. మన సైనిక బలగాలపై సంపూర్ణ విశ్వాసం ఉంది. సందర్భానికి తగ్గట్టు స్పందించేందుకు వాటికి పూర్తిస్వేచ్ఛను ఇచ్చాం.


లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

మట్టుబెట్టడానికి ముహూర్తం చూడాలా?

పహల్గాం దాడి ఉగ్రవాదులను కూడా మట్టుబెట్టాం. వారిని ఎప్పుడు పట్టుకున్నారు.. నిన్ననే ఎందుకు కాల్చారని ప్రశ్నిస్తున్నారు. ఈ ఆపరేషన్ చేపట్టడానికి ముహూర్తం ఏమైనా చూడాలా? ఘాతుకానికి పాల్పడిన వారిని అంతమొందించినట్లు సాక్ష్యాధారాలన్నీ చెబుతున్నాయి. దేశ భద్రతపై కాంగ్రెస్‌కు గతంలో దృష్టి లేదు. భవిష్యత్‌లోనూ వచ్చే ప్రశ్నేలేదు. స్వాతంత్య్రం తర్వాత కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలతో భారత్ ఇప్పటికీ శిక్ష అనుభవిస్తోంది. కాంగ్రెస్ హయాంలో 38 వేల చ.కి.మీ. భూమిని చైనాకు ధారాదత్తం చేశారు. వివాదాల పరిష్కార పెత్తనాన్ని ప్రపంచ బ్యాంకుకు అప్పగించారు. పాక్‌కు అనుకూలంగా నెహ్రూ సింధు జలాల ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందం జరగకపోయి ఉంటే పంజాబ్, రాజస్థాన్ సస్యశ్యామలం అయ్యేవి. చివరికాలంలో నెహ్రూ తన తప్పు తెలుసుకున్నారు.

పీవోకేను ఎందుకు స్వాధీనం చేసుకోలేదో కాంగ్రెస్ చెప్పాలి

ఒత్తిడితో ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేశామని ఆరోపించడానికి ముందు.. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను ఎందుకు వెనక్కి తీసుకోలేకపోయామో కాంగ్రెస్ చెప్పాలి. మొదట పీవోకేను ఎవరు అలా చేశారో తెలపాలి. జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకుని కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన తప్పుల నొప్పుల్ని మన దేశం ఇప్పటికీ భరించాల్సి వస్తోంది. ఆ పార్టీ ఇప్పుడు పాక్ చేతిలో రిమోట్‌లా మారింది. అందుకే ఆపరేషన్ మహాదేవ్‌ను ఈ సమయంలో చేపట్టడం ఏమిటని ప్రశ్నిస్తోంది. సింధు నదీజలాల ఒప్పందంలో మనదేశ ప్రయోజనాలకు నెహ్రూ హాని కలిగించారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలూ ఆ తప్పును సరిచేయలేదు. మేం మాత్రం నీరు, నెత్తురు కలిసి ప్రయాణించలేవని తెగేసి చెప్పాం. భారత్ యుద్ధ దేశం కాదు.. బుద్ధ దేశం. నేనెప్పుడూ భారత ప్రజల పక్షాన నిలబడతాను" అని మోదీ వివరించారు.

ట్రంప్‌ది అబద్ధమని చెప్పే ధైర్యం మోదీకి ఉందా?: రాహుల్

యుద్ధాన్ని విరమింపజేసినట్లు ట్రంప్ చెబుతున్నది అబద్ధమని తిప్పికొట్టే ధైర్యం ప్రధాని మోదీకి ఉందా అని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ఇందిరా గాంధీకి ఉన్న సాహసంలో సగం ఆయనలో ఉన్నా, పార్లమెంటులో ఈ విషయం చెప్పగలిగి ఉండేవాళ్లని అన్నారు. సైన్యాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిష్ఠ కాపాడుకునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. "సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే విషయంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం కొరవడింది. మనం యుద్ధం కోరుకోవడం లేదని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వమే తెలియజేసింది. పాక్-చైనా అంటకాగుతున్నాయని నేను కొన్ని నెలల క్రితం లోక్‌సభలో చెప్పినప్పుడే ప్రభుత్వం విని ఉంటే ఈ ఆపరేషన్లో ఐదు విమానాలను కోల్పోయే పరిస్థితి వచ్చి ఉండేది కాదు. వాయుసేన చేతుల్ని ఎందుకు కట్టేశారు? ఇప్పుడు మనం చైనా-పాకిస్థాన్‌ను ఉమ్మడిగా ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇది ప్రమాదకర సమయం. సైన్యాన్ని తగిన రీతిలో వాడుకునే ధైర్యంఉన్న ప్రధాని మనకు లేరు. యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ 29సార్లు చెప్పారు. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని, పోరును ఆయన ఆపలేదని చెప్పగలిగే ధైర్యం మన ప్రధానికి లేదు. అలాంటి ప్రధానిని మనం భరించలేం. ఇందిరా గాంధీ మాదిరిగా సైనికులకు స్వేచ్ఛను ఇచ్చి, పని పూర్తి చేసుకుని రమ్మని చెప్పే ప్రధాని మనకు అవసరం" అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

ఏపీది పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం

రిన్యూకార్ప్ ఛైర్మన్, సీఈఓ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రిన్యూకార్ప్ సంస్థకు పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఈ సంస్థ ఛైర్మన్, సీఈఓ సుమంత్ సిన్హా 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అనుకూల పరిపాలనకు ఇది నిదర్శనమన్నారు. ఏపీతో ఒక్కసారి ఒప్పందం జరిగిన తర్వాత ఆ ప్రాజెక్టు తమదవుతుందని మంత్రి లోకేశ్ చేసిన పోస్టును దీనికి జత చేశారు. 'మేం మా పెట్టుబడుల పట్ల పూర్తి నిబద్ధతతో ఉన్నాం. ఏపీని మా రెండో ఇంటిగా మారుస్తున్న బలమైన మద్దతును మేము ఎంతో అభినందిస్తున్నాం' అని సిన్హా ఆ పోస్టులో పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

30-7-2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
షష్ఠి: రా. 2-10 తదుపరి సప్తమి
హస్త: రా. 10-32 తదుపరి చిత్త
వర్జ్యం: ఉ. 5-41 నుంచి 7-24 వరకు
అమృత ఘడియలు: సా. 4-03 నుంచి 5-47 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-40 నుంచి 12-31 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5.41; సూర్యాస్తమయం: సా.6.31
సూర్య షష్ఠి

సూపర్ సిక్స్‌లో మరో ముందడుగు

- అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్.. రూ.3,156.60 కోట్లు
- ఆగస్టు 2న రైతుల ఖాతాల్లోకి నగదు జమ
- ప్రకాశం జిల్లాలో ప్రారంభించనున్న సీఎం

ఈనాడు, అమరావతి: సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరో పథకం అమలుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు జమచేయనుంది. ప్రకాశం జిల్లాలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని పథకాన్ని ప్రారంభించనున్నారు. అన్నదాతా సుఖీభవ కింద రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా తొలివిడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2,325 కోట్లు విడుదల చేయనుంది. కేంద్రం కూడా పీఎం కిసాన్ కింద రూ.831.60 కోట్లు అందించనుంది. మొత్తంగా తొలివిడతలో రూ.3,156.60 కోట్ల మొత్తం రైతుల ఖాతాల్లో జమ అవుతుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 46.50 లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటికే అర్హులైన రైతు కుటుంబాల ఎంపిక పూర్తయింది. ఇంకా 44,242 మందికి ఈకేవైసీ, 44,101 మందికి ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మ్యాపింగ్ చేయాలి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

మూడు విడతల్లో ఇచ్చే నిధులు (రూపాయల్లో)

విడత	పీఎం కిసాన్	అన్నదాతా సుఖీభవ	మొత్తం
తొలివిడత	2,000	5,000	7,000
రెండో విడత	2,000	5,000	7,000
మూడో విడత	2,000	4,000	6,000
మొత్తం	6,000	14,000	20,000

- కౌలు రైతులకు తొలివిడత, రెండో విడత కలిపి ఒకేసారి రెండో విడతలో ఇస్తారు.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.5	27.0
నెల్లూరు	36.6	28.5
కడప	36.0	26.0
తాడేపల్లిగూడెం	35.7	27.2
విశాఖపట్నం	35.4	28.6
విజయవాడ	35.3	27.8
గుంటూరు	35.0	28.0
సూర్యాపేట	35.0	28.0
తిరుపతి	35.0	26.0
ఒంగోలు	34.5	28.0
నరసాపురం	34.3	27.9
ఖమ్మం	34.2	25.0
విజయనగరం	34.0	27.0
కర్నూలు	32.5	24.2
అనంతపురం	32.3	24.0
శ్రీకాకుళం	32.0	27.0
నల్గొండ	32.0	24.0
హనుమకొండ	31.5	24.0
హైదరాబాద్	30.5	22.8
నిజామాబాద్	28.0	24.5
ఆదిలాబాద్	27.3	22.7

నేడు నింగిలోకి జీఎస్ఎల్వీ-ఎఫ్16

- కొనసాగుతున్న కౌంట్‌డౌన్
- కక్ష్యలోకి నైసార్ ఉపగ్రహం


జీఎస్ఎల్వీ-ఎఫ్16 వాహక నౌక

శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ మరో భారీ ప్రయోగానికి సిద్ధమైంది. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగం చేపట్టేందుకు కౌంట్‌డౌన్ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు ప్రారంభమైంది. బుధవారం సాయంత్రం 5.40 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్16 వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లనుంది. జీఎస్ఎల్వీ... నాసా, ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్ ఉపగ్రహాన్ని సూర్య అనువర్తిత కక్ష్యలోకి మోసుకెళ్లనుంది. జీఎస్ఎల్వీ బయలుదేరిన 18.59 నిమిషాలకు 747 కిలోమీటర్ల ఎత్తులో 2,392 కిలోల బరువున్న నైసార్ ఉపగ్రహం విడిపోనుంది. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్ కౌంట్‌డౌన్ ప్రక్రియ, జీఎస్ఎల్వీ పరిశీలించి వచ్చారు. రాకెట్ ప్రయోగం దృష్ట్యా ఇస్రోలోని వివిధ కేంద్రాల ప్రముఖ, సీనియర్ శాస్త్రవేత్తలు షార్‌కు విచ్చేశారు. నాసాకు చెందిన శాస్త్రవేత్తలు షార్‌కు చేరుకున్నారు.

ఆగస్టు 8 నాటికి.. హైకోర్టు, అసెంబ్లీ కాన్సెప్ట్ డిజైన్లు


- సచివాలయ నిర్మాణానికి సంబంధించి కూడా..
- గుత్తేదారులతో కలిసి ఫోస్టర్స్ సంస్థ తుది రూపు
- మూడేళ్లలో పూర్తిచేయాలన్న లక్ష్యంతో అడుగులు


శాశ్వత హైకోర్టు నమూనా (పాత చిత్రం)

ఈనాడు, అమరావతి: అమరావతిలో కీలకమైన శాశ్వత హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ టవర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వీటికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో లండన్‌కు చెందిన ఫోస్టర్స్ సంస్థ డిజైన్లు రూపొందించింది. ప్రస్తుతం టెండర్లు ముగిసి, గుత్తేదారులు పనులు మొదలుపెట్టారు. అంతర్గత నిర్మాణాలకు సంబంధించిన నమూనాలను ఖరారు చేసేందుకు ఫోస్టర్స్ సంస్థ ఐదేసి కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లతో వర్క్‌షాప్ నిర్వహించింది. ఇందులో అసెంబ్లీ, హైకోర్టుకు సంబంధించిన కాన్సెప్ట్ డిజైన్లు కొలిక్కి వచ్చాయి. వచ్చే నెల 4న ఆ సంస్థకు చెందిన మరో ప్రతినిధి బృందం రానుంది. వీరు సచివాలయ టవర్ల నమూనాలను ఖరారు చేయనున్నారు. ఆగస్టు 8 నాటికి మూడు నిర్మాణాలకు సంబంధించిన కాన్సెప్ట్ డిజైన్లు ఖరారు కానున్నాయి. మూడేళ్లలో వీటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో అడుగులు వేయనున్నారు.

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని..: ఇటీవల వర్క్‌షాప్‌లో హైకోర్టు, అసెంబ్లీ భవనాలకు సంబంధించి సవివర నమూనాల కోసం కసరత్తు జరిగింది. జోనింగ్, గ్రౌండ్ ఫ్లోర్, ఏడు అంతస్తుల్లో నిర్మించనున్న హైకోర్టులో కోర్టు హాళ్లు, న్యాయమూర్తుల ఛాంబర్లు, జ్యుడిషియల్ ఛాంబర్లు, వెయిటింగ్ హాళ్లు, మ్యూజియం, తదితర వాటికి సంబంధించి తయారు చేసిన నమూనాలపై హైకోర్టు రిజిస్ట్రార్‌తో సీఆర్డీఏ అధికారులు పలు దఫాలు సంప్రదింపులు జరిపారు. 103.76 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న అసెంబ్లీ భవనంలో స్పైక్ నమూనా, పార్కింగ్, గ్యాలరీలు, లిఫ్ట్‌ల నిర్మాణం ఎలా ఉండాలన్న దానిపై గుత్తేదారు సంస్థలకు చెందిన స్ట్రక్చరల్ ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్‌లతో ఫోస్టర్స్ సంస్థ చర్చించి, తుది రూపు ఇచ్చింది. అన్ని భవనాలకు సహజసిద్ధమైన వెలుతురు వచ్చేలా ఆకృతులు రూపొందిస్తున్నారు. భారత్‌లో సంస్థ భాగస్వామ్యైన జెనిసిస్, హఫీజ్ కాంట్రాక్టర్లతో సుదీర్ఘంగా చర్చలు సాగాయి.

ఆర్ఎఫ్‌పీ పిలిచిన సీఆర్డీఏ: 1,575 ఎకరాల్లో విస్తరించిన అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ (ఏజీసీ)లో శాసనసభ, సచివాలయం, హైకోర్టు, రాజ్‌భవన్, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాలు రానున్నాయి. ఏజీసీ మధ్యలో ఉద్యానాలు, కాలువలతో సుందరంగా కనిపించేలా నమూనాలు సిద్ధమవుతున్నాయి. ఏజీసీకి ఫోస్టర్స్ సంస్థ ప్రామాణికంగా నమూనా రూపొందించింది. కేవలం నీరు, పచ్చదనమే కనిపించేలా నీలి, హరిత (బ్లూ-గ్రీన్) కాన్సెప్ట్‌ను మరింత సూక్ష్మంగా రూపొందించేందుకు ల్యాండ్‌స్కేప్ డిజైనర్ ఎంపిక కోసం సీఆర్డీఏ ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) పిలిచింది. ఆగస్టు 13వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు బిడ్ల దాఖలుకు అవకాశమిచ్చారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు సాంకేతిక బిడ్లు తెరవనున్నారు. దాదాపు 7 కి.మీ. పొడవు, కి.మీ. వెడల్పుతో కృష్ణా నది నుంచి శాఖమూరు రిజర్వాయర్ వరకు కాలువ తవ్వనున్నారు. ఇది ఏజీసీ మధ్య నుంచి వెళ్తుంది. ఇందులో పడవలు కూడా వెళ్లేలా, కాలువ దాటేందుకు కాలిబాట వంతెనలతో డిజైన్ చేయనున్నారు. దీనికి రెండు వైపులా పార్కులు అభివృద్ధి చేయనున్నారు. పశ్చిమ వైపున్న మార్గానికి వెస్ట్ పార్క్ రోడ్డు, తూర్పున ఉన్న దానికి ఈస్ట్ పార్క్ రోడ్డుగా పేర్లు నిర్ణయించారు.



శ్రీవారి మెట్టులో ఏనుగుల సంచారం

చంద్రగిరి, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీవారి మెట్టు మార్గంలో ఏనుగుల గుంపు కలకలం రేపింది. సోమవారం రాత్రి శేషాచల అడవి నుంచి సుమారు 15-17 ఏనుగుల గుంపు రావడాన్ని డ్రోన్ కెమెరాలతో అటవీశాఖ సిబ్బంది గుర్తించారు. ఏనుగులు పంప్‌హౌస్ సమీపంలోని పొలాల్లోకి ప్రవేశించి అరటి, వరి పంటలను తొక్కడంతో రైతన్నలకు అపార నష్టం కలిగింది. మెట్టు మార్గంలో ప్రయాణించే శ్రీవారి ధర్మరథం(ఉచిత బస్సు) సహా పలు వాహనాలను శ్రీవినాయకస్వామి ఆలయం వద్ద సుమారు గంట పాటు నిలిపివేశారు. అటవీశాఖ, తితిదే అటవీ విభాగం, విజిలెన్స్ అధికారులు ఏనుగులను శేషాచలం అడవిలోకి తరిమేశారు. ఆ తర్వాత భక్తులు, వాహనాలను శ్రీవారి మెట్టు చేరుకోవడానికి అధికారులు అనుమతించారు.

ఏనుగుల సంచారంపై వాట్సప్ గ్రూపులు పెట్టి ప్రజలను అప్రమత్తం చేయండి: ఉపముఖ్యమంత్రి పవన్

ఈనాడు, అమరావతి: చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో ఏనుగుల గుంపులు ఏయే మార్గాల్లో సంచరిస్తున్నాయో గుర్తించి ఆ పరిధిలోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. దీని కోసం గ్రామాల వారీగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి.. ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు పంపాలని సూచించారు. ఆయా జిల్లాల డీఎఫ్‌వో కార్యాలయాలతో పాటు పీసీసీఎఫ్ కార్యాలయం నుంచి ఈ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఏనుగుల సంచారం నేపథ్యంలో మంగళవారం ఆయన అటవీ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

జగన్ పిటిషన్‌ను అనుమతించిన ఎన్‌సీఎల్‌టీ

- సరస్వతి వాటాల బదలాయింపుపై తీర్పు

ఈనాడు, హైదరాబాద్: సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ రిజిస్టర్‌లో వాటాదారుల పేర్లను సవరించి, తమ వాటాలను పునరుద్ధరించాలంటూ ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన భార్య భారతీరెడ్డి, క్లాసిక్ రియల్టీలు దాఖలు చేసిన పిటిషన్‌ను జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. జగన్, భారతిరెడ్డిలు దాఖలు చేసిన పిటిషన్‌పై ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యుడు రాజీవ్ భరద్వాజ్, సాంకేతిక సభ్యుడు సంజయ్ పూరి విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. గిఫ్ట్ పూర్తికాకుండానే మోసపూరితంగా వాటాల బదలాయింపు జరిగిందన్నది జగన్ వాదన. "వాటాల పత్రాలు, బదలాయింపు ఫారాలు సమర్పిస్తేనే కంపెనీ వాటాలను బదలాయించాల్సి ఉండగా అవి లేకుండానే కంపెనీ వాటాలను బదలాయించింది. గిఫ్ట్‌డీడ్ ప్రక్రియ పూర్తికాలేదు. వాటాల సర్టిఫికెట్లను మేమింకా విజయమ్మకు అందజేయలేదు. వాటాలను బదలాయించలేదు. అసంపూర్తి గిఫ్ట్‌డీడ్‌తో వాటాల బదలాయింపు పూర్తయినట్లు కాదు. చట్టప్రకారం బదలాయింపు జరిగినప్పుడే వాటికి చెల్లుబాటు ఉంటుంది. బోర్డు డైరెక్టర్లు ఏకగ్రీవంగా వాటాల బదలాయింపును ఆమోదించారు. క్లాసిక్ రియల్టీలోని వాటాల బదలాయింపుతో సరస్వతి పవర్‌లో 48.99% వాటా ఉందన్నది వాస్తవమే. గిఫ్ట్‌డీడ్ ఇచ్చినంత మాత్రాన వాటాలు బదలాయింపు చేసినట్లు కాదు. ఆ వాటాలపై పూర్తిహక్కులు దానివే. వాటా సర్టిఫికెట్లు కనిపించలేదని విజయమ్మ చెప్పడం, వాటిని పట్టించుకోకుండా సరస్వతి పవర్ బోర్డు బదలాయింపు చేయడం చట్టవిరుద్ధం" అని తమ వాదనలో పేర్కొన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఎన్‌సీఎల్‌టీ ధర్మాసనం జగన్, భారతిరెడ్డిల పిటిషన్లను అనుమతిస్తూ తీర్పు వెలువరించింది. తీర్పు ప్రతి అందుబాటులోకి రావాల్సి ఉంది.

జగన్ పర్యటనలో ర్యాలీలు.. సమావేశాలకు అనుమతి లేదు

- అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఇన్‌ఛార్జి ఎస్పీ దామోదర్

ఈనాడు, నెల్లూరు, నేర విభాగం, న్యూస్‌టుడే: 'వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన సందర్భంగా ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు లేవు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ ఏ.దామోదర్ స్పష్టం చేశారు. నెల్లూరులో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 31న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగనున్న జగన్ పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర కారాగారంలో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించనుండడంతో సమీపంలోనే హెలిప్యాడ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అక్కడకు పది మందికే అనుమతి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా... నెల్లూరు సుజాతమ్మ కాలనీలో ఉన్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి చేరుకుంటారని తెలిపారు. అక్కడ వంద మందికే అనుమతి ఉందన్నారు. ఈ కార్యక్రమాలకు ... వాహనాలను అనుమతించబోమని తెలిపారు. నగరంలో 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని, జనసమీకరణ చేయకూడదని స్పష్టం చేశారు. ప్లకార్డులు, బ్యానర్ల ప్రదర్శన కూడా చేయకూడదన్నారు. ఆరోజు చెక్‌పోస్టులు, లాడ్జిలు, వాహన తనిఖీలు చేపడతామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు నగర, గ్రామీణ డీఎస్పీలు సింధుప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లినీ చెల్లినీ కోర్టుకు లాగడం.. వారి ఆస్తులు కొట్టేయడం జగన్ విజయమా?

- హోం మంత్రి అనిత ధ్వజం



ఈనాడు, అమరావతి: సరస్వతి పవర్ షేర్ల వివాదంలో వైకాపా అధ్యక్షుడు జగన్ వ్యవహరిస్తున్న తీరు ఆయన దుర్బుద్ధికి, దుర్మార్గానికి, వికృత మనస్తత్వానికి నిదర్శనమని హోంమంత్రి వంగలపూడి అనిత దుయ్యబట్టారు. 'ఎవరైనా తండ్రి చనిపోతే.. తల్లి, చెల్లి బాధ్యతల్ని కుమారుడు తీసుకుని, వారి బాగోగులు చూస్తారు. ఆస్తిలో వాటా ఇవ్వడంతో తల్లిని, చెల్లిని జగన్ కోర్టుకు లాగారు. నైతిక విలువలేని ఆయన.. ప్రజాజీవితంలో ఉండేందుకు ఏ విధంగా అర్హుడు? తండ్రి పంచిన ఆస్తిని చెల్లికి దక్కకుండా అడ్డుపడటం. తల్లి, చెల్లిపై ఎన్‌సీఎల్‌టీలో కేసు వేయడం, అక్కడే గొప్ప విజయం సాధించినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు' అని అనిత మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.

తల్లి షేర్లు కొట్టేసేందుకు కుట్ర

'రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే సరస్వతి పవర్‌లో పెట్టుబడులు పెట్టిన జగన్... ఆయన ప్రభుత్వం ఏర్పడ్డాక లీజు గడువు పొడిగించుకోవడంతో పాటు, కృష్ణా నుంచి నీటి సరఫరాకు ఉత్తర్వులిచ్చారు. 2019 ఎన్నికలకు ముందు వికాట్ అనే సంస్థ భారతి సిమెంట్‌లో 51 శాతం షేర్లు రూ.5 వేల కోట్లకు కొనుగోలు చేసింది. మిగతా 49 శాతం షేర్లలో జగన్‌కు, షర్మిలకు సమాన వాటా ఉన్నప్పటికీ... ఆమెకు ఇవ్వకుండా అడ్డుపడ్డారు. ... 100 శాతం వాటా ఇచ్చి, దానికి బదులు బెంగళూరులోని ఆస్తుల్ని జగన్ చేజిక్కించుకున్నారు. ఇప్పుడు షేర్లు మొత్తం తనకే కావాలంటూ కుటుంబసభ్యుల్నీ రోడ్డు పైకి లాగారు' అని అనిత దుయ్యబట్టారు. 'సరస్వతి పవర్‌లో జగన్‌కు చెందిన 74,26,294 షేర్లు, ఆయన భార్య భారతికి ఉన్న 40,50,000 షేర్లను అన్ కండిషనల్ గిఫ్ట్ డీడ్ రూపంలో 2021 జులై 26న విజయమ్మకు బదిలీ చేశారు. క్లాసిక్ రియాలిటీలో 12 లక్షల షేర్లను ఒక్కోటి రూ.27 చొప్పున రూ.40 కోట్లకు పైగా వెచ్చించి విజయమ్మ కొనుగోలు చేశారు. దరఖాస్తులో వాటిని దక్కించుకునేందుకు జగన్‌రెడ్డి సిగ్గుమాలిన చర్యలకు పాల్పడ్డారు' అని అనిత పేర్కొన్నారు.

తల్లి షేర్ సర్టిఫికెట్లను ఆమెకు తెలియకుండా జగన్ తీసుకువెళ్లడమే కాకుండా, తాను గిఫ్ట్ డీడ్ మాత్రమే రాశానని, 'షేర్లు బదిలీ చేయలేదని వాదనకు దిగారని, షేర్లు ఇవ్వాలంటూ తల్లినే బెదిరించారని అనిత విమర్శించారు. 'జగన్ తీరుతో విజయమ్మ.. సరస్వతి పవర్ కంపెనీ బోర్డును ఆశ్రయించారు. తాను మొదటి నుంచి వాటాదారునని, తనకు గిఫ్ట్‌డీడ్ చేశారని, తన దగ్గరున్న పత్రాలు కనిపించకుండా పోయాయని ఆమె బోర్డుకు తెలిపారు. 2024 జులై 2న జరిగిన బోర్డు సమావేశంలో... విజయమ్మ ఆ షేర్లు చెయ్యడానికి నిర్ణయించారు. దీనిపై 2024 సెప్టెంబరు 3న ఎన్‌సీఎల్‌టీలో జగన్ కేసు వేశారు. గిఫ్ట్ డీడ్‌లో సాక్షి సంతకం చేసిన షర్మిలను పార్టీని చేర్చారు' అని అనిత పేర్కొన్నారు. 'ఎన్‌సీఎల్‌టీలో జగన్ తరఫున వాళ్ల పార్టీ ఎంపీ నిరంజన్‌రెడ్డి వాదించారు. ఇది జగన్ కేసే కాదు తాయని ఎన్‌సీఎల్‌టీ తీర్పు చెప్పింది. దీన్నేదో మహా విజయంగా జగన్ ప్రచారం చేసుకుంటున్నారు. జగన్ తీరు సిగ్గుచేటు' అని అనిత దుయ్యబట్టారు.

ఏపీలో శాటిలైట్ షిప్‌యార్డుకు సన్నాహాలు

హిందుస్థాన్ షిప్‌యార్డు సీఎండీ వెల్లడి


మాట్లాడుతున్న షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ, చిత్రంలో డైరెక్టర్లు

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే: హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)కు అనుబంధంగా మూలపేట లేదా కాకినాడ తీరంలో శాటిలైట్ షిప్‌యార్డు నిర్మాణానికి ఏపీ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కమొడోర్ హేమంత్‌ఖత్రీ తెలిపారు. మంగళవారం సంస్థలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది దశాబ్దాలుగా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్న సంస్థ నేడు మినీరత్న దిశగా అడుగులు వేస్తోందన్నారు. మేకిన్ ఇండియా పాలసీని పక్కాగా అమలు చేస్తూ వికసిత్ భారత్ లక్ష్యంగా అన్నివర్గాల భాగస్వామ్యాన్ని యాజమాన్యం అందిపుచ్చుకుంటోందని వెల్లడించారు. షిప్‌బిల్డింగ్, రిపేర్స్, సబ్‌మెరైన్ రీఫిట్ వంటి పనుల్లో అగ్రస్థానానికి చేరుకోగలిగామని స్పష్టం చేశారు. 33 ఏళ్ల అనంతరం యుద్ధనౌక 'ఐఎన్ఎస్ నిస్తార్'ను నిర్మించామన్నారు. అంతకుముందు ఐఎన్ఎస్ సావిత్రి నౌకను నిర్మించినట్లు గుర్తు చేశారు. ఐదేళ్ల కిందట రూ.403 కోట్లు ఉన్న టర్నోవర్‌ను నాలుగు రెట్లకు పెంచి సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆర్డరు పుస్తక విలువ రూ.19 వేల కోట్లకు చేరుకుందని తెలిపారు. ప్రతిష్ఠాత్మక ఐఎన్ఎస్ సింధుకీర్తి రీఫిట్‌ను విజయవంతంగా సకాలంలో పూర్తి చేశామన్నారు. ఈనెల 31న ఆయన పదవీ విరమణ చేయనున్నారు. మీడియా సమావేశంలో డైరెక్టర్లు రాకేష్‌ప్రసాద్, గిరిదీప్‌సింగ్, కెప్టెన్ జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు పద్మ మృతి


దొడ్డా పద్మ

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు దొడ్డా పద్మ (99) మంగళవారం తుది శ్వాస విడిచారు. ఇటీవల కాలికి తీవ్ర గాయమవడంతో హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మంగళవారం సాయంత్రం కన్నుమూసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం అట్లప్రగడకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నేత దివంగత కాట్రగడ్డ రంగయ్య, అన్నపూర్ణ దంపతుల కుమార్తె పద్మ. చిన్ననాటి నుంచే కమ్యూనిస్టు ఉద్యమాలు, పోరాటాల్లో కీలక భూమిక పోషించారు. నాటి నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొన్న ఆమె.. కొంతకాలం జైలు జీవితం గడిపారు. పద్మ భర్త ఉమ్మడి నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దివంగత దొడ్డా నరసయ్య కూడా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాటయోధుడు. వివాహానంతరం భర్త బాటలో పయనిస్తూ ప్రజల కోసం అనేక పోరాటాలు చేశారు. పద్మ మృతిపై పలువురు కమ్యూనిస్టు పార్టీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణలోని చిలుకూరులో బుధవారం ఆమె భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహిస్తారని బంధువులు తెలిపారు.

కోర్టులు శిక్షిస్తాయనే భయం ఉండాలి


- తప్పుచేసినా కోర్టుల్లో ఉపశమనం లభిస్తుందనే భావన కలగకూడదు
- వాక్ స్వాతంత్ర్యం పేరుతో నోటికొచ్చినట్లు మాట్లాడటం తగదు
- సన్మాన కార్యక్రమంలో జస్టిస్ బట్టు దేవానంద్


జస్టిస్ బట్టు దేవానంద్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం, ప్రధాన కార్యదర్శి సుబోధ్, అదనపు సొలిసిటర్ జనరల్ ధనుంజయ, న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు

ఈనాడు, అమరావతి: చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే న్యాయస్థానాలు శిక్షిస్తాయనే భయం ఉంటే ఎవరూ తప్పు చేయరని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ పేర్కొన్నారు. తప్పుచేసినా కోర్టులో ఉపశమనం లభిస్తుందనే భావన నేరస్థుడికి కలగకూడదన్నారు. అలాంటి భావన కలిగితే అది ప్రజాస్వామ్యానికి, న్యాయవ్యవస్థకు గొడ్డలిపెట్టని చెప్పారు. న్యాయవ్యవస్థపై ప్రజలు విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 'తప్పు చేసినవాడు చట్టం, కోర్టులంటే భయపడాలి. చట్టంలో లొసుగులను అడ్డుపెట్టుకొని అరాచకాలు, తప్పులు చేసేవాళ్లు ఉపశమనం పొందేలా కోర్టులు వ్యవహరించకూడదు. రాష్ట్రాభివృద్ధికి అవరోధం కలిగించడం ఐదుకోట్ల మంది ఆంధ్రుల జీవించే హక్కుకు భంగం కలిగించడమే. రాష్ట్రంలో మెరుగైన వైద్యం అందించేందుకు పెద్ద ఆసుపత్రులు ఏర్పాటుచేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి రావాలి. న్యాయస్థానాలు సైతం చట్ట, రాజ్యాంగపరమైన అధికారాలతో రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలి. భావవ్యక్తీకరణ, వాక్‌స్వాతంత్ర్య హక్కు పేరుతో నోటికొచ్చినట్లు మాట్లాడి ఇతరుల ఆత్మాభిమానాన్ని, గౌరవాన్ని దెబ్బతీయడానికి వీల్లేదు. ఇతరుల హక్కులకు భంగం కలిగించే హక్కు ఎవరికీ లేదు. న్యాయం కోసం వచ్చే అభాగ్యులకు సత్వర న్యాయం అందించాల్సిన బాధ్యత కోర్టులపై ఉంది. మద్రాసు హైకోర్టు నుంచి సొంత రాష్ట్రానికి, సొంత మనుషుల మధ్యకు తిరిగి వచ్చినందుకు సంతోషంగా ఉంది' అన్నారు.

★ మద్రాసు హైకోర్టు నుంచి బదిలీపై తిరిగి ఏపీ హైకోర్టుకు వచ్చి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో జస్టిస్ బట్టు దేవానంద్‌ను ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జస్టిస్ దేవానంద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ, అదనపు అడ్వొకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, రాష్ట్ర పీపీ మెండ లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాదులు కేఎస్ మూర్తి, పి.వేణుగోపాలరావు మాట్లాడారు.

అదిరిందయ్యా.. రామయ్యా



నిత్యం సమావేశాలు, పాలనా వ్యవహారాల్లో తలమునకలయ్యే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కాసేపు కుటుంబ సభ్యులతో కలిసి సందడి చేశారు. అయినవాళ్లతో కలిసి స్టెప్పులేసి అందర్నీ ఉర్రూతలూగించారు. రామ్మోహన్‌నాయుడి బాబాయ్ కింజరాపు ప్రభాకరరావు కుమారుడి సంగీత్ వేడుక సోమవారం రాత్రి విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని ఓ ప్రైవేటు రిసార్ట్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి. . తన సోదరులతో కలిసి సినిమా పాటలకు డ్యాన్స్ చేశారు.

– ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

హర్షిత స్కూల్ నందిగం రాణి ఆస్తుల జప్తు

- రూ.2.26 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసిన ప్రభుత్వం


నందిగం ధర్మరాజు, రాణి

ఈనాడు, అమరావతి: ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడిలో హర్షిత ఇంగ్లిష్ మీడియం స్కూల్, హర్షిత ఎడ్యుకేషనల్ సొసైటీని గతంలో నిర్వహించిన నందిగం రాణి, నందిగం ధర్మరాజు, గవర్ని రమేష్‌కు చెందిన రూ.2.26 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను రాష్ట్రప్రభుత్వం జప్తు చేసింది. రాజమహేంద్రవరం అర్బన్‌లో సర్వే నంబర్ 134/1లో 1,008 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న రూ.1.61 కోట్ల విలువ చేసే మూడు వేర్వేరు ప్లాట్లు, రూ.66.65 లక్షల విలువైన 10 స్కూలు బస్సులు, ఒక టయోటా గ్లాంజా కారును జప్తు చేసింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. తన విద్యాసంస్థలో పెట్టుబడి పెడితే ఏడాదికి 24% వడ్డీ, లాభాల్లో 5% వాటా ఇస్తానంటూ నమ్మబలికి 15మంది నుంచి నందిగం రాణి రూ.2.96 కోట్లు వసూలు చేశారు. తర్వాత ఆ సొమ్ముతో పాఠశాలకు భవనాలు నిర్మించుకున్నారు. తడికలపూడిలో 4.05 ఎకరాల భూమి కొన్నారు. నందిగం రాణి, ఆమె కుటుంబసభ్యులు... పెట్టుబడి పెట్టినవారికి సొమ్ము తిరిగి చెల్లించకుండా మోసం చేశారు. బాధితుడు కొర్రపాటి చంద్రశేఖర్ ఫిర్యాదుపై కేసు నమోదైంది. దీంతో ఈ ఆస్తుల్ని సీఐడీ జప్తు చేసింది. వీటిపై ఎలాంటి లావాదేవీలను అనుమతించొద్దని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీకి సూచించింది. గతంలో కూడా నందిగం రాణికి సంబంధించిన రూ.14.74 కోట్ల విలువైన ఆస్తులను సీఐడీ జప్తు చేసింది.

2న కేంద్ర మంత్రి గడ్కరీ పర్యటన

ఈనాడు, అమరావతి: కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఆగస్టు 2న విజయవాడకు రానున్నారు. సీఎం చంద్రబాబుతో సమావేశమై.. వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. దీనికి సంబంధించి షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉంది. మరోవైపు గడ్కరీ పర్యటనలో రూ.5 వేల కోట్ల మేర జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సంబంధించి శంకుస్థాపనలు, జాతికి అంకితం చేసే కార్యక్రమాల ఏర్పాట్లు ఎన్‌హెచ్ అధికారులు చేస్తున్నారు. 56 కి.మీ. మేర రూ.1,852 కోట్లతో విస్తరించిన మదనపల్లె- పీలేరు హైవే, కర్నూలు- దోర్నాల హైవేలో కర్నూలు నుంచి మండ్లెం వరకు 31 కి.మీ. మేర రూ.827 కోట్లతో విస్తరించిన హైవేను జాతికి అంకితం చేయనున్నారు. చిలకలూరిపేట- నకరికల్లు హైవేలో రూ.787 కోట్లతో 38 కి.మీ. మేర 4 వరుసలుగా విస్తరణ, రాజమహేంద్రవరం వద్ద రూ.265 కోట్లతో అభివృద్ధి చేయనున్న లాలాచెరువు, ఐటీసీ, వేమగిరి కూడళ్లు, రూ.247 కోట్లతో అభివృద్ధి చేసే గామన్ జంక్షన్ కూడలి తదితర నిర్మాణాలకు గడ్కరీ శంకుస్థాపనలు చేయనున్నారు.

సెంథిల్ బాలాజీ కేసును.. కావాలనే ఆలస్యం చేస్తున్నారా?

- ఆ మాజీమంత్రి జీవితకాలంలో... విచారణ పూర్తి కాకూడదనేదే ఉద్దేశమా?
- 2 వేల మందికిపైగా నిందితులను చేరుస్తారా?
- తమిళనాడు ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: 'మాజీమంత్రి సెంథిల్ బాలాజీ కేసు విచారణను తమిళనాడు ప్రభుత్వం కావాలని ఆలస్యం చేస్తున్నట్లు కనిపిస్తోంది. అందులో భాగంగానే 2 వేల మందికి పైగా నిందితులను చేర్చి విచారణ ముందుకెళ్లలేని పరిస్థితులను కల్పిస్తున్నట్లుగా ఉంది' అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అన్నాడీఎంకే హయాంలో సెంథిల్ బాలాజీ రవాణాశాఖ మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ఉద్యోగాల పేరిట కొందరి నుంచి లంచాలు తీసుకున్నారంటూ ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన డీఎంకేలో చేరి మంత్రి అయ్యారు. పాతకేసులో సెంథిల్ బాలాజీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 2023లో అరెస్టు చేసింది. ఏడాదికిపైగా జైల్లో ఉన్న ఆయన గతేడాది బెయిల్‌పై బయటికొచ్చారు. ఆయనను స్టాలిన్ సర్కారు వెంటనే మళ్లీ మంత్రిని చేసింది. ఈ విషయమై సుప్రీంకోర్టు జోక్యంతో సెంథిల్‌బాలాజీ తన పదవికి రాజీనామా చేసిన సంగతి విదితమే. సెంథిల్ బాలాజీ కేసులో ప్రధాన అభియోగపత్రంతో పాటు పలు అనుబంధ పత్రాలను ప్రత్యేక కోర్టు జతపరచడంపై కొందరు వేసిన పిటిషన్లను మద్రాసు హైకోర్టు కొట్టేసింది. దీనిపై వారు సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ వై.బాలాజీ తరఫు న్యాయవాది తన వాదనను వినిపిస్తూ.. తమిళనాడు ప్రభుత్వం తన మాజీమంత్రిని కాపాడుకునేందుకు యత్నిస్తోందని, అందుకే కేసు విచారణను ఆలస్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. 'నాడు ఉద్యోగాల కోసం డబ్బులు ముట్టజెప్పిన 2 వేల మంది నుంచి 2,500 మంది బాధితులను.. లంచాలిచ్చిన వారంటూ రెండు కేసుల్లో నిందితులుగా చేర్చడానికి కారణమేమిటి? వారందరినీ విచారించడం ఎప్పటికి పూర్తవుతుంది? సెంథిల్ బాలాజీ జీవితకాలంలో విచారణ పూర్తికాకుండా చూసుకోవడమే ప్రభుత్వ ప్రయత్నంగా ఉంది' అని ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. అప్పట్లో సెంథిల్‌బాలాజీ సిఫారసు మేరకు పని చేసిన అధికారులెవరు? నగదు ఇచ్చి ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులిచ్చిన అధికారులెవరు? అనే ప్రశ్నలకు సమాధానాలివ్వాలని తమిళనాడు ప్రభుత్వానికి ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. కేసు విచారణ త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించింది.



ఈనాడు

అమానుష వ్యాపారం!

రెండు తెలుగు రాష్ట్రాల్లో పది కేసులను ఎదుర్కొంటున్న ఒక ముఠా పదేళ్లుగా పదేపదే అవే నేరాలకు బహిరంగంగా తెగబడుతోందంటే అర్థమేంటి? వ్యవస్థల పట్ల లెక్కలేని ప్రబుద్ధుల నిర్వాకాలవి అని సరిపెట్టుకోవాలా? లేదంటే, అలాంటి ఘరానా నేరగాళ్ల బెడదను సమాజానికి తప్పించడంలో యంత్రాంగం అసమర్థతకు దాన్నో సాక్ష్యంగా భావించాలా? సరోగసీ పేరిట చంటిబిడ్డల క్రయవిక్రయాలకు పాల్పడుతూ పట్టుబడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాహకుల పాపాల చరిత్రను తిరగేస్తే తలెత్తుతున్న ప్రశ్నలివి! 2015లోనే విజయవాడ 'సృష్టి' కేంద్రంలో అనేక అక్రమాలు వెలుగుచూశాయి. నిరాశ్రయులూ నిరుపేదల నుంచి పిల్లలను కొని, సంపన్న కుటుంబాలకు అమ్ముతున్నారంటూ 2020లో 'సృష్టి' ఆసుపత్రి ఎండీ డాక్టర్ నమ్రతను విశాఖపట్నం పోలీసులు అరెస్టు చేశారు. అయినప్పటికీ ఆమె తీరు మారకపోవడం, అనుమతులతో నిమిత్తం లేకుండానే సికింద్రాబాద్‌లో సంతాన సాఫల్య కేంద్రాన్ని నిర్వహిస్తుండటం నిర్ఘాంతపరుస్తోంది! నమ్రత చేతిలో దగాపడిన దంపతులు ఫిర్యాదు చేసేంతవరకు ఆమె ముఠా నేర కార్యకలాపాలు యథేచ్ఛగా కొనసాగాయంటే- అది కచ్చితంగా వ్యవస్థాగత వైఫల్యమే!

'పిల్లలెంత మంది, ఏం చదువుతున్నారు' అంటూ కొత్తగా పరిచయమైన వారితో మాటామంతీ కలపడం చాలామందికి అలవాటు. సంతానం లేనివారిని సూటిపోటి మాటలనడం, ఆ నెపంతో ముఖ్యంగా మహిళలపట్ల వివక్ష చూపించడమూ మన సమాజంలో సర్వసాధారణమైన విషాద వాస్తవాలు. పెళ్లయ్యి ఒకటి రెండేళ్లు కాగానే బంధుమిత్రులు, ఇరుగుపొరుగువారి నుంచి ఇలాంటి ఆరాలు మొదలైపోతుంటాయి. దీర్ఘకాలంగా బిడ్డలకు నోచుకోని దంపతులు ఆ సామాజిక ఒత్తిడిలోనే అక్రమ ఫెర్టిలిటీ కేంద్రాల మాయలో చిక్కుకుంటున్నారు. మరోవైపు- జీవనశైలిలో మార్పులు, సామాజిక పరిస్థితుల కారణంగా సంతానసాఫల్య రేటు పడిపోతోంది. దేశీయంగా వైవాహిక బంధంలో ఉన్న జంటలలో 10-15శాతం మంది వంధ్యత్వ సమస్యలు ఎదుర్కొంటున్నారని అంచనా. దాంతో కృత్రిమ గర్భధారణ, సరోగసీ విధానాలను ఆశ్రయించేవారి సంఖ్య అధికమవుతోంది. అనైతిక దందాలకు ఒడిగడుతున్న కొందరు వైద్యులు- బిడ్డలకోసం పరితపించేవారిని ఏమార్చి లక్షల్లో దండుకుంటున్నారు. అద్దె గర్భాలూ మానవ పిండాలతో చేసే అమానుష వ్యాపారాన్ని రూపుమాపేందుకు కేంద్రం కఠిన చట్టం తెచ్చిన నేపథ్యంలో- శిశువుల అక్రమ రవాణా కుతంత్రాలకు పాల్పడుతున్నారు మరికొందరు కర్కోటకులు. సుప్రీంకోర్టు ఇటీవల హెచ్చరించినట్లు- ఇలాంటివాళ్లు హంతకులకంటే సమాజానికి పెద్ద ప్రమాదకారులు!

పేద కుటుంబాల నిస్సహాయతను అదనుగా చేసుకుని, పదోపరకో ఇచ్చి వారి పిల్లలను తన్నుకుపోతున్న కొన్ని ముఠాలు- ఆ పసివారిని ఇతర రాష్ట్రాల్లో అమ్మేస్తున్నాయి. అంగడిసరకుల మాదిరిగా చంటిబిడ్డల ఫొటోలను వాట్సాప్‌లో పెట్టి మరీ విక్రయిస్తున్న రాక్షసుల దారుణాలూ వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి కిరాతకాలకు తెలుగు రాష్ట్రాలు ప్రధాన కేంద్రాలవుతున్నాయనే కథనాలూ వెలువడ్డాయి. 2018-22 మధ్యలో దేశవ్యాప్తంగా 10,639 మానవ అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. మొన్న ఏప్రిల్‌లో లోక్‌సభకు కేంద్రం ఇచ్చిన సమాచారం ప్రకారం- వాటిలో 439 కేసుల్లోనే నిందితులకు శిక్షలు పడ్డాయి. సకాలంలో పూర్తికాని దర్యాప్తులూ విచారణలతో దండన భయం కొరవడటంతోనే దేశీయంగా హేయ అకృత్యాలకు అడ్డూఅదుపూ ఉండట్లేదు. ఈ దారుణావస్థను నివారించడంలో ప్రభుత్వాలు సఫలీకృతం కాకపోతే- చట్టబద్ధమైన పాలనా ప్రమాణాలకు అర్థమే ఉండదు!



తోటి వనితలను ప్రోత్సహించడం, అండగా నిలవడం, వారి కాళ్లపై వారు నిలబడేందుకు సహకరించడం... ఆలోచనాపరులైన మహిళలందరి కర్తవ్యం. సమాజానికి ఎంతో అవసరమైన ఆ పని నిరంతరం జరగాలి.

– డాక్టర్ ముత్తులక్ష్మిరెడ్డి

జీవన సాధన

'జీవితం జీవించడానికే.. జీవించడమే గొప్ప సాధన!' అన్నాడు గీతాకారుడు. 'జీవితంలోని రహస్యం, దివ్యత్వం ఏంటి అనేది తెలుసుకోవడమే నిజమైన ఆధ్యాత్మిక సాధన' అని వ్యాఖ్యానించారు పరమహంస యోగానంద! నిజానికి పుట్టుక నుంచి మరణం వరకు జరిగేది జీవనసాధనే.. అయితే మనం భగవంతుడి పట్ల ఎరుకతో చేస్తే అదే అద్భుతమైన సాధన అవుతుంది.

మట్టిలో నాటిన విత్తనం మూడోరోజుకల్లా మొలకెత్తుతుంది. అదే కాలక్రమంలో చెట్టుగా ఎదిగి నీడనిస్తుంది. లోకానికి పలురకాలుగా ఉపయోగపడుతుంది. ప్రతిఫలం కోరకుండానే కారుమబ్బు జలజలా చినుకులు రాలుస్తుంది. చల్లటి గాలి స్వేచ్ఛగా వీస్తూ ప్రాణికోటిని సేద తీరుస్తుంది. ప్రకృతిలో ప్రతి చర్య ఎంతో సహజంగా, పరోపకారమే లక్ష్యంగా జరిగిపోతుంది. మనిషి జీవితమూ అలా సాగిపోవాలి. అడుగడుగునా మానవత్వం వెల్లివిరియాలి. ఒక దీపం మరొక దీపాన్ని వెలిగించినట్లు పదిమంది జీవితాల్లో మనిషి వెలుగులు నింపాలి! అలాంటి జీవితసాధనలోనే ఆధ్యాత్మికత మమేకమవుతుంది. మనిషికి దివ్యత్వాన్ని దర్శనం చేయిస్తుంది!

మానవ జన్మను భగవంతుడి ప్రసాదంగా భావించినప్పుడు భక్తిగా రెండు చేతులూ పైకెత్తి ఆ దివ్య జీవనాన్ని ఆహ్వానించాలి. అందులోని తాత్వికతను గుర్తించాలి. ప్రహ్లాదుడు తండ్రి హిరణ్యకశిపుడి వల్లే అనేక హింసలకు గురయ్యాడు. ఎన్ని బాధలు పడ్డా 'నారాయణ' శబ్దాన్ని మాత్రం వీడలేదు. అందులోని మాధుర్యాన్ని, మాహాత్మ్యాన్ని ప్రహ్లాదుడు అనుభూతి చెందాడు.. పలవరించాడు! చివరికి పరమార్థాన్ని సాధించాడు. 'ఇందు గలడు అందులేడని సందేహము వలదం'టూ ప్రత్యక్షంగా నారాయణుణ్ని దర్శించి తరించాడు.



అంతర్యామి

సాధారణ మనిషి కూడా సాధనవల్ల అనేక ధార్మిక ప్రయోజనాలు పొందగలడు. అందుకు నియమబద్ధమైన జీవితం గడపాలి. కోరికలు లేని స్థితిని సాధించాలి. ఇటుక మీద ఇటుక పేర్చినట్లు ఆధ్యాత్మిక సౌధాన్ని నిర్మించుకోవాలి. మాట, ఆలోచన, చర్య ప్రతిదానిలోనూ మంచే ప్రతిబింబించాలి. అప్పుడు.. సమస్త జగత్తు ఏకమై దివ్యమైన ఆనందమయమైన అనుభవాలను మనకోసం పోగుచేస్తుంది. ఆ దివ్యానుభవాలే అంతర్యామి సన్నిధికి చేర్చే ఆలంబనలవుతాయి. ఆ అలౌకిక అనుభూతి పొందడానికి మనిషి కష్టపడాలి. సంతోషంతో, ఆశతో, సాహసంతో ఆధ్యాత్మిక ప్రయాణం చేయాలి. ఏ పని చేస్తున్నాసరే, అంతరంగ చైతన్యాన్ని మేల్కొల్పుతూ ఉండాలి. తన ప్రజ్ఞను వదులుకోకూడదు. అన్ని విషయాల్లోనూ దృఢంగా ఆలోచించాలి. అలా వాస్తవ పరిస్థితులపై తిరుగులేని విజయం సాధించాలి.

స్వామి చిదానంద ఆకాంక్షించినట్లు- తన మనసును గెలుచుకున్న చక్రవర్తిగా మనిషి ఎదగాలి. తన భవిష్యత్తుకు తానే ప్రభువవ్వాలి. ఈ ప్రయాణంలో ఎక్కడా అలసిపోకూడదు. విజయ దరహాసంతో, తాదాత్మ్యంతో ఆధ్యాత్మిక శిఖరాన్ని చేరుకోవాలి. అప్పుడే మనిషి జీవనసాధన ఫలిస్తుంది! ఆధ్యాత్మిక సాధనలోని రహస్యం... ఆ సచ్చిదానంద రూపమైన దివ్యత్వం మనిషి అనుభవంలోకి వస్తుంది. అపురూపమైన ఆ అనుభవాన్ని, ఆత్మానుభూతిని, ఆనందానుభూతిని మనిషి మాత్రమే పొందగలడు. ఇదంతా ఆధ్యాత్మిక జీవన సాధనవల్లే సాధ్యమవుతుంది.

– శ్రీకంఠస్ఫూర్తి

సమ్మిళిత వృద్ధికి 'సహకారం'

కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా జులై 24న జాతీయ సహకార విధానాన్ని (ఎన్‌సీపీ-2025ని) ప్రకటించారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని అందుకోవడానికి ఇది ఉపకరిస్తుందని భావిస్తున్నారు. సమ్మిళితవృద్ధి సాధనలో సహకార రంగాన్ని చోదకశక్తిగా మలచాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పానికి ఈ కొత్త విధానం కట్టుబాటు చాటుతోంది.

దేశంలో ఎనిమిది లక్షల సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో 30 కోట్ల మందికి పైగా సభ్యులున్నారు. వ్యవసాయం, పాడి, మత్స్య పరిశ్రమలు, జౌళి, రుణ కల్పన, గృహనిర్మాణం, మార్కెటింగ్ రంగాల్లో సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. దేశాభివృద్ధిలో ఇవి క్రియాశీలక భాగస్వాములవుతాయి. వాస్తవాన్ని గుర్తించిన క్రమంలో 2021లో కేంద్రంలో కొత్తగా సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటైంది. సురేశ్ ప్రభు నాయకత్వంలోని జాతీయ కమిటీ దేశవ్యాప్తంగా ఈ రంగంలోని కీలక భాగస్వాములతో పలు సమావేశాలు నిర్వహించి జాతీయ సహకార విధానాన్ని రూపొందించింది. సభ్యులు ఆధ్వర్యంలో నడిచే సంస్థలు, భాగస్వామ్యం, సమర్థ నిర్వహణ, పారదర్శకత, ఆధునాతన సాంకేతికతలతో స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా సహకార సంఘాలను తీర్చిదిద్దడమే ఈ విధానం లక్ష్యం.



ఆరు మూలస్తంభాలు

ఎన్‌సీపీ-2025 ఆరు వ్యూహాత్మక మూలస్తంభాల ఆధారంగా పని చేస్తుంది. అవి... చట్టపరమైన సంస్కరణలు, డిజిటల్ నిర్వహణ, తగిన నిధులతో సహకార విధానానికి బలమైన పునాది నిర్మించడం; స్వయంచాలితంగా పనిచేసే సహకార యంత్రాంగాన్ని నెలకొల్పడం; ఆధునిక సాంకేతికతలు, నిపుణుల సాయంతో సహకార సంఘాలను భావి అవసరాలకు తగినట్లుగా తీర్చిదిద్దడం; మహిళలు, యువత, బలహీన వర్గాలను కలుపుకొనిపోయే సంఘాలుగా రూపొందించడం; హరిత ఇంధనాలు, ఆరోగ్యం, ఐటీ వంటి కొత్త రంగాలకు సైతం సహకార సంఘాలను విస్తరించడం; నైపుణ్య, నాయకత్వ శిక్షణ ద్వారా యువతరాన్ని భావి సహకారోద్యమ సారథులుగా తయారు చేయడం. ఈ ఆరు లక్ష్యాలను సాధించేందుకు పలు చర్యలు తీసుకుంటారు. సహకార సంఘాలు స్వయంప్రతిపత్తితో పనిచేసేలా సక్రమంగా చట్టాలను నిర్వహిస్తారు. దీనికోసం రాష్ట్రాల్లో ఆదర్శ సహకార చట్టాలు తీసుకొస్తారు. రిజిస్ట్రార్ కార్యాలయాలను డిజిటలీకరిస్తారు. జాతీయ సహకార డేటాబేస్‌కు స్థానిక సమాచారాన్ని జోడించేలా రాష్ట్రాలను ప్రోత్సహిస్తారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బహుళ ప్రయోజనకర సంఘాలుగా తీర్చిదిద్దుతారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు బాధ్యతను వీటికి అప్పగిస్తారు. కార్పొరేట్ సంస్థలకన్నా పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలను సహకార సంఘాలకు ఇస్తారు. ఖాయిలా పడిన సంఘాల పునరుద్ధరణకు ప్రత్యేక సంస్థాగత ఏర్పాట్లు చేస్తారు.

మహిళలు, యువతకు భాగస్వామ్యం

ప్రతి జిల్లాలో సమ్మిళిత అభివృద్ధి, నవీకరణలకు ప్రతీకలుగా నిలిచే ఆదర్శ సహకార గ్రామాలను తీర్చిదిద్దాలన్నది సంకల్పం. భౌగోళిక విశిష్ట గుర్తింపు కలిగిన తేనె, కాఫీ, పట్టు, మసాలా ద్రవ్యాల ఆర్థిక క్లస్టర్లను నెలకొల్పుతారు. సహకార రంగ ఉత్పత్తులను భారత్ బ్రాండు కింద మార్కెట్ చేయడమూ భాగమే. ఒక జిల్లా- ఒక ఉత్పత్తి పథకం, ఎగుమతి కేంద్రాలుగా జిల్లాల అభివృద్ధి పథకం అమలులో సహకార సంఘాలకూ భాగస్వామ్యం దక్కనుంది. సహకార సంఘాల సభ్యుల సంఖ్యను 50 కోట్లకు విస్తరించి, జీడీపీలో ఈ రంగం వాటాను మూడింతలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలనూ అందించాలని సంకల్పించారు. ప్రభుత్వ ఈ-మార్కెట్, ఓపెన్ నెట్ వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)లో పాల్గొనడం ద్వారా సహకార సంఘాలు తమ వస్తువులకు గిరాకీ పెంచుకోగలుగుతాయి. ఈ సంఘాల కోసం జాతీయ స్థాయిలో బోధన, శిక్షణ సంస్థ ఏర్పాటవుతుంది. గ్రామీణ వ్యాపార సంస్థల కోసం ఇంక్యుబేటర్లు రానున్నాయి. సంఘాల మధ్య పోటీ పెంచేందుకు రేటింగ్‌లు ఇస్తారు. ఫెలోషిప్‌లు, పరిశోధనలకు ప్రోత్సాహం, ప్రాంతీయ భాషల్లో అభ్యసన కేంద్రాల ఏర్పాటు ద్వారా సహకారోద్యమాన్ని కొత్త మలుపు తిప్పాలనేది ఎన్‌సీపీ ఆశయం. మహిళలు, యువత, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, దివ్యాంగులను సహకార ఉద్యమంలో మమేకం చేయడానికి ప్రత్యేక కృషి జరగాల్సి ఉంది. చేనేత, అటవీ ఉత్పత్తులు, మత్స్య పరిశ్రమ, గిరిజన ఉత్పత్తులకు ప్రత్యేక సహకార సంఘాలను ఏర్పాటు చేయనుండటం మంచి ఆలోచనే. పాఠశాల సిలబస్‌లో సహకార సంఘాల సమాచారాన్ని చేర్చి, బాల్యం నుంచే సహకారోద్యమ ప్రాధాన్యాన్ని వివరించడం మరో కీలకాంశం.

సారథ్య సంఘం ఏర్పాటు...

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బహుళ వ్యాపారాలు చేపట్టేలా ప్రోత్సహించడం ఎన్‌సీపీ లక్ష్యాల్లో ఒకటి. ప్రధానమంత్రి జన ఔషధి దుకాణాలు, వినియోగదారుల సేవా కేంద్రాలు, వంటగ్యాస్ పంపిణీ, పెట్రోలు బంకులు, గ్రామీణ తాగునీటి సరఫరా నిర్వహణను వీటికి అప్పగిస్తారు. పట్టణ సహకార సంఘాలు విద్య, వైద్యం, ఐటీ సేవలు, మైక్రో ఇన్సూరెన్స్ రంగాల్లో ప్రవేశించేలా ఏర్పాట్లు చేస్తారు. బయోగ్యాస్, పునరుత్పాదక ఇంధనాల ఉత్పత్తి, ఆగ్రోఫారెస్ట్రీ విస్తరణ, ఐవోటీ, బ్లాక్ చెయిన్ ఆధారిత బట్వాడా రంగాల్లోనూ సహకార సంఘాలు భాగస్వాములు కానున్నాయి. యువతను సహకారోద్యమ భావి సారథులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాలల్లో, కళాశాలల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేపడతారు. ఉపాధి అవకాశాల కోసం ఉద్యోగ కల్పన కేంద్రాలను నెలకొల్పుతారు. తాజా జాతీయ సహకార విధానం అమలుకు కేంద్ర సహకార మంత్రి ఆధ్వర్యంలో జాతీయ సారథ్య సంఘం ఏర్పాటు కానుంది. సహకార శాఖ కార్యదర్శి నేతృత్వంలో విధానాల అమలు, పర్యవేక్షణ కమిటీని నియమిస్తారు. నాబార్డ్, ఎన్‌డీడీబీ వంటి జాతీయ సంస్థలకు భాగస్వామ్యం కల్పిస్తారు. ఎన్‌సీపీ-2025 కేవలం విధాన పత్రంలా మిగిలిపోకూడదు. ప్రజాకేంద్రిత అభివృద్ధి నమూనాలా పని చేయాలి. భాగస్వాములందరూ తోడ్పాటు అందిస్తే ఆర్థికాభివృద్ధికి సహకార రంగం చోదక శక్తిగా మారుతుంది. వికసిత్ భారత్ స్వప్న సాకారానికి తోడ్పడుతుంది.



డాక్టర్ ఎస్.శ్యామ్‌కుమార్
డిప్యూటీ డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్



ఆలోచనల టోపీలు..!

కార్పొరేట్ ఆఫీస్ అయినా, కర్మాగారమైనా... ఉన్నతాధికారులు, సిబ్బంది తరచూ సమావేశమవడం సాధారణ విషయం. ఈ సమావేశాలు ఎలా ఉంటాయి? చొరవ కలిగిన వాళ్లు చెప్పే ఐడియాలు మాత్రమే పైవారి దృష్టికి వస్తాయి. వాటి గురించే చర్చలు జరుగుతాయి. మిగిలిన వాళ్ల దగ్గర ఎంత మంచి ఆలోచనలున్నా వాటిని వినేవారుండరు. కొన్నిసార్లు సమావేశంలో పాల్గొన్నవాళ్లు రెండు పక్షాలుగా చీలిపోయి మా ఐడియా అద్భుతమంటే కాదు మాది అంటూ వాదులాడుకోవడమూ కద్దు. విలువైన సమయం ఇలా వృథా కాకుండా సమావేశాలు నిర్మాణాత్మకంగా జరగడానికి గాను 1985లో ఒక కొత్త సిద్ధాంతాన్ని రూపొందించారు ఎడ్వర్డ్ డి బోనో. మెడికల్ ప్రొఫెసర్‌గా ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో పాఠాలు చెప్పిన ఆయన పేరలల్ థింకింగ్ అనే విధానాన్ని అభివృద్ధి పరిచారు. ఎంతో ఆదరణ పొందిన ఈ విధానాన్ని పలు కార్పొరేట్ సంస్థలు అనుసరిస్తున్నాయి.

ఒకే ఐడియాను కొందరు సమర్థించడం, కొందరు వ్యతిరేకించడం కాకుండా ప్రతి నిర్ణయానికీ అందరూ బాధ్యత వహించేలా ఉంటుందీ పేరలల్ థింకింగ్. సంప్రదాయ చర్చలకు భిన్నంగా సాగే విధానం కోసం డి బోనో ఆరు రంగుల టోపీలను ప్రతిపాదించారు. తెలుపు, ఎరుపు, నలుపు, పసుపు, ఆకుపచ్చ, నీలిరంగు... ఒక్కో రంగుకు ఒక్కో లక్ష్యం ఉంటుంది. సమావేశంలో పాల్గొనే వారంతా ఏదో ఒక రంగు టోపీ ధరించి దానికి నిర్దేశించిన పరిధిలో తమ ఆలోచనలను వెలిబుచ్చుతారు. తెల్లని టోపీలు ధరించినవారు సమాచారంపై(ఫ్యాక్చువల్ ఇన్ఫర్మేషన్) చర్చిస్తారు. ఆకుపచ్చ రంగు టోపీ సృజనకు ప్రతీక. వాళ్లు సరికొత్త ఐడియాలు ఇస్తారు. ఎర్రటి టోపీ పెట్టుకున్నవారు అంతర్దృష్టితో తమ నిజమైన ఆలోచనలను చెబుతారు. నల్లని టోపీలవారు విమర్శనాత్మక దృష్టితో చూసి రిస్కులను గుర్తిస్తారు. పసుపురంగు టోపీలతో వచ్చినవారు ఆశావాద దృక్పథంతో సదరు ఐడియా తాలూకు విలువని, ప్రయోజనాన్ని అంచనా వేస్తారు. చివరిదైన నీలిరంగు టోపీలు ధరించినవారు మొదటి నుంచి చివరివరకు నిర్వాహకపాత్ర వహిస్తారు. సమావేశానికి అజెండా నిర్ణయించి, దానికి తగ్గట్టుగా అన్ని బృందాలూ ఒకదాని తరవాత ఒకటి క్రమపద్ధతిలో తమ తమ ఆలోచనలను సమర్పించేలా చూస్తారు.

ఇలా చేయడం వల్ల సమావేశాల్లో ఏ ఒకరిద్దరిదో పైచేయి కాకుండా అందరికీ సమాన ప్రాధాన్యం లభిస్తుంది. సిబ్బంది గ్రూపులు కట్టడం ఉండదు. అహాలు, కోపతాపాలు, పెద్ద చిన్న అంతరాలకు చోటు ఉండదు. చివరికి సమష్టి కృషి ఫలితాన్నే సంస్థ అందుకుంటుంది. కేవలం ఆఫీసులకే కాదు ఈ పద్ధతిని స్వచ్ఛంద సేవాసంస్థల్లో, ఇళ్లలో కూడా ఉపయోగించవచ్చు. బోల్తా కొట్టించే కుచ్చుటోపీలు కావివి! కొత్త రీతుల్లో ఆలోచించడం ద్వారా క్లిష్టమైన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకునే మార్గాలు చూపుతాయి. వ్యక్తిగత, వృత్తిగత జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరిసేలా చేస్తాయి.

– డాక్టర్ టి.సంపత్ కుమార్



అరకొర వాటా...

స్థూల విలువ జోడింపు (జీవీఏ) అనేది దేశ ఆర్థిక పనితీరును కొలిచే ముఖ్యమైన సూచిక. వివిధ రంగాల పనితీరును పోల్చడానికి, ఆర్థిక వ్యవస్థలో ఏయే రంగాలు కీలకమైనవో గుర్తించడానికి తోడ్పడుతుంది. భారత జీవీఏలో వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా 2011-12 నుంచి 2023-24 మధ్య 225 శాతానికి పైగా పెరిగింది. అయితే, ఇతర రంగాల్లో వేగవంతమైన పురోగతి వల్ల మొత్తం జీవీఏలో సాగు వాటా పరిమితమవుతోంది. ఉపాధి కల్పన, గ్రామీణ జీవనోపాధుల్లో వ్యవసాయ రంగం కీలకంగా ఉన్నా, ఆర్థిక వ్యవస్థ ప్రగతికి పారిశ్రామిక, సేవా రంగాలే వెన్నెముక అవుతున్నాయి. ఈ క్రమంలో వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించడం అత్యవసరం.

మనదేశ మొత్తం జీవీఏలో వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా (ప్రస్తుత ధరల్లో)

సంవత్సరం	వాటా (శాతాల్లో)	సంవత్సరం	వాటా (శాతాల్లో)
		2017–18	18.3
		2018–19	17.6
2012–13	18.2	2019–20	18.3
2013–14	18.6	2020–21	20.4
2014–15	18.2	2021–22	18.9
2015–16	17.7	2022–23	18.1
2016–17	18.0	2023–24	17.8

(ఆధారం: కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ నివేదిక)

గూఢచర్య ముప్పు... నివురుగప్పిన నిప్పు!

డబ్బులు ఎరగా వేసి, వలపు వల విసిరి ఉన్నతోద్యోగులు, వ్యాపారులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, విద్యార్థులు వంటి వారెందరినో పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఆకర్షిస్తోంది. వారి ద్వారా మనదేశ రహస్య సమాచారాన్ని రాబడుతోంది. ఐఎస్ఐ గూఢచర్య కార్యకలాపాలను విస్తరిస్తోందని, ఉగ్రవాదులకు అనువైన ప్రదేశాల కోసం గాలిస్తోందని, సైనిక సమాచారాన్ని సేకరిస్తోందని ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో జరిగిన అరెస్టులనుబట్టి అర్థమవుతోంది. ఐఎస్ఐ వలలో పడి రక్షణ సిబ్బంది, దౌత్యవేత్తలు, శాస్త్రవేత్తలతో పాటు సామాన్యులూ గూఢచర్యానికి పాల్పడటం ఈ మధ్యకాలంలో మరీ ఎక్కువైంది. దేశంపై ఇలా ముష్కర నీడలు విస్తరిస్తుండటం కలవరపరుస్తోంది. ఈ ప్రమాదాన్ని నిరోధించాలంటే కౌంటర్ ఇంటెలిజెన్స్‌ను బలోపేతం చేసుకోవాలి.

బహుముఖ వ్యూహం

కౌంటర్ ఇంటెలిజెన్స్ అనేది సంప్రదాయ నిఘాకు భిన్నమైంది. గూఢచారులను, ఉగ్రవాదుల నిద్రాణ విభాగాలను(స్లీపర్ సెల్స్‌ను) గుర్తించడం, సమాచార వ్యవస్థను సంరక్షించుకోవడం, చొరబాటుదారులుగా మారే అవకాశం ఉన్నవారిపై నిఘా ఉంచడం ఇందులో భాగం. స్లీపర్ సెల్స్ సభ్యులు జనజీవన స్రవంతిలో కలిసిపోయి సాధారణ జీవితాన్ని గడుపుతూనే ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ సాయంతో విదేశాల్లో ఉన్న బాస్‌లతో అనుసంధానమవుతుంటారు. వీరిని గుర్తించడం కష్టం. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశీయంగా పాక్ ప్రాయోజిత గూఢచర్య కార్యకలాపాలపై నిఘాకోసం కౌంటర్ ఇంటెలిజెన్స్‌ను పటిష్ఠం చేసుకోక తప్పదు. అందులో భాగంగానే ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), రీసెర్చ్ అండ్ అనలిసిస్ వింగ్ (రా), డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (డీఐఏ), డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ, జాతీయ సాంకేతిక పరిశోధన సంస్థ (ఎన్‌టీఆర్‌వో), కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్-ఇండియా (సీఈఆర్‌టీ-ఇన్), ఎన్ఐఏల సాయంతో కేంద్ర హోంశాఖ డిజిటల్ నిఘాను పెంచింది. సిబ్బందిని ప్రోత్సహిస్తూ వివిధ దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేస్తోంది.

శత్రుమూకలు తమ బలాన్ని పెంచుకోవడానికి సామాజిక మాధ్యమాలను వాడుకోవడం నేడు పెద్ద సవాలుగా మారుతోంది. దీన్ని ఎదుర్కొనేందుకు భారత్ బహుముఖ వ్యూహాలను పాటించాలి. ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలను విస్తరించడంతోపాటు సిబ్బంది శిక్షణ, సైబర్ భద్రత పెంపు, చట్టాల సంస్కరణ, ఉగ్రవాద భావజాల నిర్మూలనపై దృష్టి సారించాలి.


పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారిగా భావిస్తున్న సులేమాన్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. దీంతో సైన్యానికి భారీ విజయం దక్కినట్లయింది. ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటులో చర్చ సాగుతున్నప్పుడే ఈ సమాచారం వెలువడింది. మరోవైపు, అంతర్గత గూఢచర్యం జాతి భద్రతకు ముప్పులా మారుతోంది. ఇటీవల చాలామంది దేశంలో గూఢచర్యానికి పాల్పడుతూ అరెస్టయ్యారు. ఇలాంటి ఆంతరంగిక శత్రువుల విషయంలో సదా అప్రమత్తంగా ఉండాల్సిందే!



అంతేకాకుండా, సైబర్ గూఢచర్యాన్ని గుర్తించడంతో పాటు ప్రమాదకర హ్యాకర్లను కట్టడి చేసి కీలక సమాచారాన్ని పరిరక్షించుకోవడమూ అత్యంత కీలకం. సాధారణ పౌరులు, సైనికోద్యోగుల్లో డిజిటల్ అవగాహనను పెంచాలి. తరచూ శత్రుదేశాల్లో పర్యటించే వారిపైనా కన్నేసి ఉంచాలి. సోషల్ మీడియా వేదికలపై నిఘా ఉంచడం మరో ప్రధానాంశం. ఇందుకోసం కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను వాడాలి. ప్రజావేగులకు రక్షణ కల్పించాలి. ఉగ్రవాద భావజాల వ్యాప్తిని నిరోధించే కృషిలో మత పెద్దలు, సామాజిక, విద్యావేత్తలు వంటి వారిని భాగస్వాములను చేయాలి. దేశీయంగా అన్ని సంస్థలు పటిష్ఠ సైబర్ భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం చాలా అవసరం.

ఆధునిక యుద్ధతంత్రంలో భాగాలవి...

ప్రపంచ భద్రత సంక్లిష్టంగా మారుతున్న క్రమంలో అంతర్జాతీయంగా అనుసరిస్తున్న మెరుగైన విధానాలను ఇండియా అందిపుచ్చుకోవాలి. తద్వారా నిఘా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసుకోవాలి. అమెరికా ఏర్పాటు చేసిన ఉగ్రవాద సంయుక్త టాస్క్‌ఫోర్స్, బ్రిటన్ అనుసరిస్తున్న వ్యూహాల మాదిరిగానే భారత్ సైతం రా, ఐబీ వంటి దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయం సాధించాలి. అమెరికా తరహా వ్యవస్థలతో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా ముప్పును ముందే గుర్తించే సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. లోపాలకు తావులేని నిఘా సమాచారం కోసం అగ్రరాజ్యం ఎన్ఐపీఆర్‌నెట్, ఎస్ఐపీఆర్‌నెట్ వంటి భద్రతా నెట్‌వర్క్‌లను ఉపయోగిస్తోంది. అమెరికా వాడుతున్న సిగింట్, బ్రిటన్ జీసీహెచ్‌క్యూ, సాంకేతికతతో మానవ ఇంటెలిజెన్స్‌ను అనుసంధానించే ఇజ్రాయెల్ పద్ధతుల ద్వారా ఉగ్రనిరోధక కార్యకలాపాల్లో ఇండియా తన సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. మునుపటి ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించి వాటి నుంచి పాఠాలు నేర్చుకోవాలి. విదేశాల అనుభవాల ఆధారంగా మన ఆచరణ పదునుదేలాలి. అంతర్గత బలహీనతలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేసుకోవడం, గూఢచర్యానికి వ్యతిరేకంగా ప్రజా చైతన్యాన్ని పెంపొందించడం వంటివి ఆధునిక యుద్ధతంత్రంలో భాగంగా మారాయి. దేశీయంగా నెలకొన్న ముప్పును పసిగట్టి దాన్ని పరిష్కరించడానికి ఎప్పటికప్పుడు అధునాతన పద్ధతులను అనుసరించాలి. నిధుల కొరత, అధికార వ్యవస్థల అడ్డంకుల కారణంగా గూఢచర్య నిరోధక కార్యకలాపాలు నీరసించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



డాక్టర్ రావెళ్ల భానుకృష్ణ కిరణ్
అంతర్జాతీయ న్యాయ, భద్రతా వ్యవహారాల నిపుణులు

సారీ.. రాము!

హాయ్! బుజ్జీ!!

రాజు అయిదో తరగతి చదువుతున్నాడు. తను ఎప్పుడూ నోట్స్ పెన్సిల్‌తోనే రాసేవాడు. ఒకరోజు వాళ్ల మాస్టారు పిలిచి పెన్‌తో రాయమని చెప్పారు. దాంతో రాజు వాళ్లమ్మ దగ్గర పెన్ కోసం డబ్బులు తీసుకున్నాడు. కానీ ఐస్‌క్రీం కొనుక్కుని తినేశాడు. స్కూల్‌కి వెళ్లాక పెన్ విషయం గుర్తొచ్చింది. ఇప్పుడేం చేయాలంటూ ఆలోచించసాగాడు. కాసేపటికి తన ముందు కూర్చునే రాము బాక్స్‌లోంచి చెప్పకుండానే ఒక పెన్ తీసుకున్నాడు. కాసేపటికి మాస్టారు వచ్చి నోట్స్ చెప్పారు. అందరూ చక్కగా రాసుకున్నారు. కానీ రాసుకోవడం పూర్తయ్యాక కూడా రాజు పెన్ రాముకు తిరిగి ఇవ్వలేదు. అప్పటి నుంచి రోజూ దానితోనే రాసుకోసాగాడు. కానీ రాము చూడకుండా దాన్ని దాయడానికి ఇబ్బంది పడుతూ ఉండేవాడు. ఎక్కడ చూస్తాడోనన్న భయం వదిలేది కాదు. దాంతో కొన్నాళ్లకు రాజుకి ఆ పెన్ అంటేనే చిరాకేసింది. తెలియకుండా తీసుకున్న పెన్‌తో ఇన్ని బాధలా? అనిపించింది. ఇక వెంటనే అది రాముకు ఇవ్వబోయాడు. అప్పుడు అతను.. 'నువ్వు నా పెన్ తీసుకున్నావని నాకు ఎప్పుడో తెలుసు రాజు. చెప్పకుండా తీసుకున్నావు కాబట్టి మనస్ఫూర్తిగా దాన్ని ఉపయోగించుకోలేకపోయావు. అది తప్పని నీకు నువ్వుగా తెలుసుకోవాలనే ఇన్ని రోజులు ఏమీ అనలేదు. మనకు ఏదైనా కావాలి అనుకుంటే అడిగి తీసుకోవాలి. అంతేగానీ.. అలా చేయడం తప్పు. ఎదుటివారిని అడగకుండా వాళ్లకు సంబంధించిన వస్తువులు ఏవీ మనం తీసుకోకూడదని మా అమ్మ చెప్పింది' అన్నాడు రాము. 'సారీ.. రాము! ఇంకెప్పుడూ ఇలా చేయను. ఇదిగో నీ పెన్ తీసుకో' అన్నాడు రాజు. 'మరేం పర్లేదు ఇది నువ్వే ఉంచుకో. ఇంకోసారి ఇలా చేయకు అంతే!' అన్నాడు రాము.



– నంద త్రినాథ రావు

నేనెవర్ని?

1. నేనో ఆరక్షరాల పదాన్ని. నాలోని మొదటి మూడు అక్షరాలను కలిపితే 'ఆనకట్ట' అని.. చివరి మూడు అక్షరాలను కలిపితే 'వయసు' అనే అర్థాన్నిస్తాను. నేనెవరో తెలిసిందా?
2. అయిదు అక్షరాల పదాన్ని నేను. నాలోని 1, 5, 3 అక్షరాలను కలిపితే 'ఆమె' అని.. 3, 2, 4, 5 అక్షరాలను కలిపితే 'గులాబి' అనే అర్థాన్నిస్తాను. నేనెవర్ని?

జవాబు: 1.DAMAGE 2.HORSE

సైబరాసురులపై చైతన్య అస్త్రం



విజయవాడ: ప్రసంగిస్తున్న సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

జీవిత కష్టాన్ని... సైబరాసురులు క్షణాల్లో కొల్లగొడుతున్నారు.. ఎటు నుంచి చొరబడతారో.. ఏ రూపంలో దోచేస్తారో తెలియదు.. తెలుసుకునేలోపే ఖాతాలు ఖాళీ చేసేస్తున్నారు.. సైబరాసురులను తరిమికొట్టగలిగేది.. చైతన్య అస్త్రమే. దారుణాల గురించి తెలిసి మసలుకోవాలి.. తెలివిగా తిప్పికొట్టాలి.. అప్పుడే ఆర్థిక భద్రత.. అపురూప భవిత. సైబర్ నేరాలపై యువతను అప్రమత్తం చేసే లక్ష్యంతో 'ఈనాడు.. ఈటీవీ ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో చైతన్య సదస్సుల నిర్వహణకు మంగళవారం తొలి అడుగు పడింది. విజయవాడలోని ఆంధ్ర లయోలా డిగ్రీ కళాశాలలోనూ, మైలవరం లోని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ సదస్సులు నిర్వహించగా.. సైబర్ క్రైం నిపుణులు, ఆచార్యులు వివిధ అంశాలపై అవగాహన కల్పించగా.. చక్కటి స్పందన లభించింది.



మైలవరం: అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రశేఖర్

- న్యూస్‌టుడే, కరెన్సీనగర్, మైలవరం

సెప్టెంబరు 22 నుంచి దసరా ఉత్సవాలు

★ సాంకేతికత, ఏఐ టూల్స్ సమర్థ వినియోగం
★ విజయవాడ ఉత్సవ్ నేపథ్యంలో అదనపు సిబ్బంది



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ. వేదికపై జేసీ ఇలక్కియా, డీసీపీ సరిత, సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్ తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. వీటిని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సామాన్య భక్తుల సంతృప్తికే తొలి ప్రాధాన్యం ఉంటుందని, ఈ దఫా సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ టూల్స్‌ను వినియోగించనున్నట్టు పేర్కొన్నారు. దసరాతో పాటు విజయవాడ ఉత్సవ్ కూడా నిర్వహించనున్న నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి అదనపు సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకొస్తామని చెప్పారు. నగరంలోని కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారుల సమావేశం మంగళవారం నిర్వహించారు. దసరా ఉత్సవాల తరుణంలో రోజుకు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. మూలా నక్షత్రం రోజున 1.50 లక్షల నుంచి 2 లక్షల మంది రావొచ్చని అంచనా వేశారు. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. ఎంత మంది వచ్చినా.. ఎవరికీ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. 24 గంటలూ పని చేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక లక్ష కుంకుమార్చన, చండీ హోమం తదితర విశేష పూజా కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. గత ఏడాది అనుభవాలను ఫీడ్ బ్యాక్‌గా తీసుకుని.. అలాంటి లోపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. క్యూ లైన్లు, లడ్డూ, అన్న ప్రసాదాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య శిబిరాలు ఇలా ప్రతి అంశంపైనా దృష్టి పెట్టినట్లు వివరించారు. సెప్టెంబరు 20 కల్లా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

42 డ్రోన్లతో పర్యవేక్షణ..

పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ.. భక్తులకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. గత ఏడాది నాలుగు డ్రోన్లను వాడగా, ఈ ఏడాది 42 డ్రోన్లను వినియోగించనున్నట్టు వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో 5,000 సీసీ కెమెరాలు ఉన్నాయని తెలిపారు. ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బంది లేకుండా చూస్తున్నట్టు వివరించారు. దుర్గగుడి ఈవో శీనానాయక్ మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, అమ్మవారి అలంకరణలు, క్యూ లైన్లు, బారికేడింగ్, ఆన్‌లైన్, కరెంట్ బుకింగ్ కౌంటర్లు, ఘాట్ల వద్ద జల్లు స్నానాలు, భద్రత, ప్రసాదాల తయారీ.. పంపిణీ, మైక్‌లు, సూచిక బోర్డులు, పాస్‌ల జారీ తదితరాలపై చర్చించారు. జేసీ ఎస్.ఇలక్కియా, డీసీపీ కె.జి.వి.సరిత, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఆలయ స్థానాచార్యులు వి.శివప్రసాద్‌శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య వేడుకలు

ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆగస్టు 15వ తేదీన రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య వేడుకలను విజయవాడలో నిర్వహించనున్నారు. ఇందుకు నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వేదిక కానుంది. వేడుక ఏర్పాట్లపై నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశ మంగళవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, 5,000 మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. జనరేటర్‌లు, వైద్య శిబిరాలు, ప్రత్యక్ష ప్రసారం, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం గ్యాలరీల వారీగా పాస్‌లు జారీ చేయాలన్నారు. రిహార్సల్స్ నిర్వహించే నాటికి ప్రాంగణంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు జరగాలన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. జేసీ ఎస్.ఇలక్కియా, డీసీపీ కె.వి.జి.సరిత, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఆర్డీవో కావూరి చైతన్య, డీఎంహెచ్‌వో ఎం.సుహాసినీ, డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.బాలాజీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీరే శక్తి.. మీదే యుక్తి

బాలికలు, యువతులకు విస్తృత అవగాహన

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

విద్యాలయాలు, కార్యాలయాలకు వెళ్లేప్పుడు ఆకతాయిలు వెంటపడి వేధిస్తే.. యువతులు కన్నీళ్లు పెట్టుకోవడం అనేది పాత మాట. సివంగిలా ఎదురు తిరిగి.. బుద్ధి చెప్పడం నేటి విధానం. అవసరమైతే చేతికి పని కల్పిస్తున్నారు. దేహశుద్ధి చేస్తున్నారు. వారిలోనే అనంతమైన 'శక్తి' ఉంది. దానికి తోడుగా 'శక్తి' యాప్ ఉంటోందంటున్నారు విజయవాడ పోలీసులు. దీని ద్వారా ఎన్టీఆర్ కమిషనరేట్‌లోని బాల బాలికలకు, విద్యార్థినులకు భరోసా ఇస్తున్నారు.

రక్షణ మీ వెంటే.. 'శక్తి' యాప్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. అత్యవసర పరిస్థితిలో 'ఎస్ఓఎస్' బటన్ నొక్కగానే.. మీరు ప్రమాదంలో ఉన్న విషయం పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు తెలుస్తుంది. మీ చరవాణి లొకేషన్‌ను గుర్తించి.. హుటాహుటీన పోలీసులు అక్కడికి చేరుకుంటారు. ఆపదలో ఉన్న వారిని రక్షిస్తారు. అలాగే యాప్‌లోని 112 బటన్ నొక్కితే కంట్రోల్‌రూమ్‌కు కాల్ వెళుతుంది. తప్పిపోయిన పిల్లల వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. ఫొటో అప్‌లోడ్ చేయగానే పోలీస్ శాఖ అప్రమత్తం అవుతుంది.


యువతులతో యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసులు

సురక్షిత ప్రయాణానికి... చాలా మంది రాత్రి వేళలో ఒంటరిగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. అలాంటి వారు యాప్‌లోని 'సేఫ్ ట్రావెల్' అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే.. మీ ప్రయాణ మార్గాన్ని పోలీసులు నిశితంగా గమనిస్తుంటారు. మీరు ఉన్న ప్రాంతం నుంచి ఎక్కడికి వెళ్లాలో వివరాలు నమోదు చేయాలి. ఏ వాహనంలో ఎక్కుతున్నారో దాని నంబరుతో సహా నమోదు చేస్తే చాలు.. మీ ప్రయాణం సుఖంగా సాగిపోతుంది. మధ్యలో ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే 'ఎస్ఓఎస్' బటన్ నొక్కితే పోలీసులు వచ్చేస్తారు.

విస్తృత ప్రచారం: గత వారం రోజులుగా ఎన్టీఆర్ జిల్లా పోలీసులు శక్తి యాప్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ టి.డి.ప్రసాద్ నేతృత్వంలో వివిధ బృందాలు మహిళల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నాయి. సేవలు తెలియజేస్తున్నారు. బాలబాలికలకు మంచి, చెడు స్పర్శల గురించి వివరిస్తున్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తం చేస్తున్నారు.

ఈ సేవలు పొందవచ్చు..

★ అసాంఘిక కార్యకలాపాలపై ఫిర్యాదులు
★ కుటుంబ కౌన్సెలింగ్ కోరవచ్చు
★ సమీపంలోని పోలీస్‌స్టేషన్ల వివరాలు
★ అన్ని రకాల హెల్ప్‌లైన్ నంబర్లు
★ నైట్ షెల్టర్‌లు, అధికారుల ఫోన్ నంబర్లు

రెండు జిల్లాల్లో యాప్ వివరాలు..

జిల్లా	డౌన్‌లోడ్‌లు	ఎస్ఓఎస్
కృష్ణా	5,45,272	80,955
ఎన్టీఆర్	5,60,150	28,546

మది దోచే... వ్యూహమేదీ?!





వందల ఏళ్ల చరిత్ర కలిగిన కొండపల్లి కోటను చూసేందుకు అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. చుట్టూ కొండలు, పచ్చందాలు చూసి సంబరపడి పోతుంటారు. ఖిల్లాలోని కోట బురుజులపైకి ఎక్కి చుట్టుపక్కల అందాలు తిలకిస్తుంటారు. కోట ఎదురుగా ఉన్న కొండపై గతంలో **వ్యూ పాయింట్ కోసం ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి వదిలేశారు.** అధికారులు స్పందించి వ్యూ పాయింట్‌ను చక్కదిద్ది అందుబాటులోకి తేవాలని పర్యాటకులు కోరుతున్నారు.

- ఈనాడు, అమరావతి

సుబాబుల్ రైతుకు మహర్దశ

రికార్డు స్థాయిలో పెరిగిన రేటు
ఐదేళ్లు పట్టించుకోని వైకాపా సర్కారు

ఈనాడు, అమరావతి

వైకాపా ఐదేళ్ల పాలనలో టన్ను సుబాబుల్ ధర రూ.వెయ్యి దాటలేదు. అయినా నాడు పట్టించుకున్న దాఖలాలు లేవు. చాలా మంది రైతులు తోటలు తొలగించి వేరు పంటలకు మారిపోయారు. ప్రస్తుతం సుబాబుల్ రైతులకు మహర్దశ మొదలైంది. ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ధర పెరిగింది. ఇదే ధర కొనసాగాలంటే మార్కెట్లు ఏర్పాటు చేసి దళారుల ప్రమేయం లేకుండా చేయాలని రైతులు కోరుతున్నారు.



అత్యధికంగా సుబాబుల్ పండించేది ఇక్కడే..

మండలం	సాగు (హెక్టార్లలో)	ఉత్పత్తి (టన్నుల్లో)
చందర్లపాడు	4,322	3,76,014
నందిగామ	4,124	3,58,788
పెనుగంచిప్రోలు	2,925	2,54,475
వత్సవాయి	1937	1,68,519
జగ్గయ్యపేట	1,340	1,16,580

పెట్టుబడి తక్కువ... రాబడి ఎక్కువ: జిల్లాలో 47,132 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరుల్లో సుబాబుల్ పంట ఎక్కువ. ఈ ప్రాంతాల్లో నీటి లభ్యతకు ఇదే సరైన పంట కావడం, మిగిలిన పంటలతో పోలిస్తే పెట్టుబడి తక్కువ కావడంతో రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఒకసారి వేస్తే మూడేళ్లకు పంట చేతికొస్తుంది. ఎకరానికి సగటున 35 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఈ ఏడాది 16.5 లక్షల టన్నుల ఉత్పత్తి వచ్చింది. ఇక్కడ నుంచి రాజమహేంద్రవరం, భద్రాచలం, మహారాష్ట్రలో కాగితం మిల్లులకు తరలిస్తారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోని కాగిత పరిశ్రమల నుంచి డిమాండ్ రావడంతో ప్రస్తుతం టన్ను ధర రికార్డు స్థాయిలో రూ.6 వేలు దాటింది. దీంతో ఎకరం సాగు చేసిన రైతుకు రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

మార్కెట్ ఏర్పాటు చేస్తే మేలు...

కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు రాయలసీమలోనూ మిర్చి, పత్తి రైతులు రెండు, మూడు సీజన్లుగా బాగా నష్టపోతున్నారు. మంచి ప్రత్యామ్నాయ పంటగా సుబాబుల్‌ను సాగు చేస్తున్నారు. రానున్న రోజుల్లో రూ.6,500 వరకు ధర పెరుగుతుందనే అంచనాల నేపథ్యంలో ఇప్పటికే దళారులు పుట్టుకొచ్చారు. కొందరు కంపెనీలతో కుమ్మక్కై ధర తగ్గించి కమీషన్లు బాదేస్తున్నారు ఈ నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మార్కెట్ ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలి. దళారుల ప్రమేయం లేకుండా చూడాలి.

ఇన్‌స్టాలో ఆర్డర్లు.. ఆటోలో సరఫరా

గంజాయి దందా గుట్టు రట్టు

ఈనాడు, అమరావతి: ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గంజాయి ఆర్డర్లు తీసుకుంటూ.. ఆటోలో వారు కోరుకున్న చోటుకే చేరవేస్తున్న రౌడీషీటర్ ముఠా పట్టుబడింది. మూడేళ్లుగా గుట్టుగా సాగుతున్న విక్రయాలకు పోలీసులు పకడ్బందీగా వల పన్ని ముగ్గురిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. మరో కీలక వ్యక్తి కోసం అన్వేషిస్తున్నారు. ఫోన్‌లో సంభాషణలు సాగిస్తే.. పోలీసు నిఘా ఉంటుందని నిందితులు సామాజిక మాధ్యమాలను వాడుతూ దొరికారు.

ఒడిశా నుంచి తెచ్చి: రౌడీషీటర్ హేమంత్ అలియాస్ నాని అలియాస్ సముద్రపు దొంగపై పటమట స్టేషన్‌లో.. ద్విచక్ర వాహనాలు, మొబైళ్లు, కిరాణా దుకాణాల్లో చోరీ కేసులు ఉన్నాయి. ఆంధ్ర - ఒడిశా సరిహద్దు కెళ్లి గంజాయి కొని తెచ్చి నగరంలో అమ్మేవాడు. సంచలనం రేపిన పటమట గ్యాంగ్ వార్‌లో నిందితుడైన ఆదిశేషు అలియాస్ బాబీతో కలసి విస్తరించాడు. ఆదిశేషుపై సస్పెక్ట్ షీట్ ఉంది. వీరికి చిరంజీవి అనే ఆటోడ్రైవర్ కలిశాడు.

పటమట, పెనమలూరుల్లో..: చిరంజీవికి సొంత ఆటో ఉంది. గంజాయిని చిన్న ప్యాకెట్లుగా కట్టి సరఫరా చేసేవారు. నెట్‌వర్క్ బాధ్యతలను ఆదిశేషు పర్యవేక్షించేవాడు. విద్యార్థులు, చిన్నాచితకా పనులు చేసే యువకులకు గంజాయి సరఫరా చేసి వారిని బానిసలుగా మార్చారు. మత్తు అలవాటు ఉన్న వారిని ఇన్‌స్టాలో గ్రూపులుగా పెట్టి ఆర్డర్లు తీసుకునేవాడు. చిరంజీవిని తీసుకుని ఆటోలో పెనమలూరు, పటమటల్లో తిరుగుతూ గంజాయి ప్యాకెట్లను అందించేవారు. పెదపులిపాక, ఆటోనగర్, రామలింగేశ్వరనగర్ కట్ట, పటమట, పోరంకి, కానూరుల్లో కార్యకలాపాలు సాగేవి. ఎట్టకేలకు హేమంత్, ఆదిశేషు, చిరంజీవిలను పోలీసులు అరెస్టు చేసి 23 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.


కోర్టు రోడ్డు స్థాయిలో ద్విచక్ర వాహనంపై...


సీపీ కార్యాలయం రోడ్డులో నెత్తిమీద డ్రమ్ముతో..


కానూరు వద్ద ప్రధాన రహదారిలో...

సాహస ప్రయాణం.. ఆపేనా ప్రమాదం

విజయవాడ నగరంలో రహదారులపై ప్రమాదాలు జరుగుతుండగా ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ వాహనదారులు నిర్లక్ష్యంతో అవి ఆగడం లేదు. కొందరు వాహనాలపై సామగ్రితో ఇలా ప్రమాదకరంగా ప్రయాణిస్తూ తోటివారికి ఇబ్బందులు కలిగిస్తున్నారు. -ఈనాడు, అమరావతి

ప్రకాశం బ్యారేజీకి భారీ వరద ప్రవాహం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ఎన్టీఆర్ కలెక్టరేట్, అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: కృష్ణా నదికి ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి భారీ వరద నీరు దిగువకు వస్తోంది. ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టు నుంచి 65,000 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. ఇది బుధవారం మధ్యాహ్నం తర్వాత ప్రకాశం బ్యారేజీకి చేరుతుంది. వరద మూడు లక్షల క్యూసెక్కుల వరకు పెరగవచ్చని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం రాత్రి రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, మత్స్య, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. టాం టాం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడాలని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచుతామని.. రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వరద నేపథ్యంలో కలెక్టరేట్‌లో 91549 70454 ఫోన్ నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం బ్యారేజీ గేట్లు మూసి ఉన్నాయి. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు 13,133 క్యూసెక్కులు ఇస్తున్నారు. గురువారం నుంచి వరద ఉద్ధృతంగా వచ్చే ప్రమాదం ఉంది. ఫలితంగా ఏ క్షణంలోనైనా బ్యారేజీ గేట్లను ఎత్తి సముద్రంలోకి విడుదల చేయడానికి అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.

అనాథలని తెలుసు.. అల్లాడుతున్నా అలుసు!



అనాథ రోగుల కోసం విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఉన్న వార్డు దుస్థితి చూస్తే ఎవరైనా అయ్యో పాపం అనాల్సిందే. శిథిలావస్థలో ఉన్న శ్లాబు పెచ్చులూడి మంచాల పక్కనే పడుతోంది. కాళ్లు విరిగిపోయిన వారు వదిలి వెళ్లలేక.. ఏ మాత్రం అదుపు తప్పినా.. కింద పడే ప్రమాదం ఉంది. కనీసం వీరిని పలకరించే వారూ లేరు. వీరి దీన స్థితిని పట్టించుకునే వారూ కనిపించడం లేదు. - ఈనాడు, అమరావతి

ప్రజలకు జవాబుదారీతనంతో పాలన


సంక్షేమ పథకాలు వివరిస్తున్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

గొల్లపూడి, న్యూస్‌టుడే: ప్రజలకు జవాబుదారీతనంతో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర హోంమంత్రి అనిత పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి మౌలానగర్‌లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయటం జరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతుల ఖాతాలో పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా పథకాలు అమలు చేస్తున్నట్లు హోంమంత్రి వెల్లడించారు. పథకాల అమలులో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించటం జరుగుతుందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించిన మంత్రి.. పారిశుద్ధ్య కార్మికులు, మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ నర్రా వాసు, నాయకులు బొమ్మసాని సుబ్బారావు, అక్కల గాంధీ, గూడపాటి పద్మశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం తెరుస్తారా.. చికిత్స చేస్తారా..?

యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కు వచ్చి వెనుదిరుగుతున్న వైనం


గాయత్రీనగర్‌లోని ఫెర్టిలిటీ కేంద్రం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: నగరంలోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రానికి తాళాలు వేసి ఉండడంతో ఇప్పటికే డబ్బులు చెల్లించి చికిత్స పొందిన వారు వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. కనీసం సమాచారం చెప్పేందుకు కూడా సిబ్బంది లేరు. కేంద్రం ఎప్పుడు తెరుస్తారో.. డబ్బులు చెల్లించాం.. మాకు చికిత్స అందిస్తారా.. మా పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్నలు చికిత్స తీసుకుంటున్న వారి నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే డీఎంహెచ్‌వో సుహాసిని కేంద్రాన్ని పరిశీలించారు. ఆ సమయంలో సిబ్బందిలో ఒక్కరు మాత్రమే వచ్చి పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో కేంద్రానికి సంబంధించిన వివరాలు తమకు తెలియజేయాలని కోరుతూ నిర్వాహకులకు డీఎంహెచ్‌వో షోకాజ్ నోటీసు జారీ చేశారు.

లోపాలు బయటపడతాయని.. హైదరాబాద్, విశాఖపట్నం నగరాల్లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాలపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పోలీసులు నిర్వాహకురాలు డాక్టర్ పి.నమ్రతను అరెస్టు చేశారు. అప్పటి నుంచి విజయవాడ గాయత్రీనగర్‌లోని కేంద్రానికి సిబ్బంది, వైద్యులు రావడం లేదు. ఎవరూ లోపలికి రాకుండా బయట గేటుకు తాళం వేశారు. గతంలో సూర్యారావుపేటలో కేంద్రం నిర్వహించినప్పుడు ఈ అంశంపై పలు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ నుంచి గాయత్రీనగర్‌లో కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ కేంద్రం ఏర్పాటు చేసి సుమారు ఐదేళ్లకు పైగా అవుతోంది. సంతాన సాఫల్య సేవల కోసం నగరంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తుంటారు. ప్రస్తుతం నమ్రతను అరెస్టు చేసిన నేపథ్యంలో బాధితులు ఎవరైనా ఉంటే కేంద్రం దగ్గరకి వచ్చి గొడవ చేస్తారనే భయం, అధికారులు వచ్చి రికార్డులు, అక్కడ అందుతున్న సేవలపై తనిఖీలు నిర్వహిస్తే లోపాలు బయటపడతాయనే ఆలోచనతోనే ఇలా మూసేశారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇలాగైతే పరిశ్రమ నడపలేం

సామాజిక మాధ్యమాల్లో పారిశ్రామికవేత్త పోస్టు వైరల్


పారామౌంట్ పరిశ్రమ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రమిస్తుంటే.. ఒక రెవెన్యూ అధికారి తీరుతో ఉన్న పరిశ్రమలు తరలిపోయే ఆస్కారం ఏర్పడింది. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం కొంకంచివద్ద పారామౌంట్ స్టీల్ పరిశ్రమ అధినేత వెలగల సురేష్ మంగళవారం సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు సంచలనం రేపింది. లంచాల మత్తులో మునిగిన సదరు అధికారి తీరు చూస్తుంటే ఈ కంపెనీ విస్తరణకు అనుమతులు ఇవ్వకుండా ఇక్కడి నుంచి తరలిపోయేలా చేస్తున్నారని పోస్టులో పేర్కొన్నారు. ఇలాంటి అధికారుల తీరుతో రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ఎవరూ ముందుకు రారని, వచ్చినా నిలవరన్నారు. కంపెనీకి అవసరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చెప్పినా.. లెక్కచేయడం లేదన్నారు. విషయం తెలుసుకున్న నందిగామ ఆర్డీవో బాలకృష్ణ పరిశ్రమకు వెళ్లి అధికారులతో మాట్లాడినట్లు తెలిసింది. సదరు అధికారిని కూడా ఉన్నతాధికారులు పిలిపించి వివరణ తీసుకున్నట్లు సమాచారం.

పారిశ్రామికవేత్తలకు ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటాం.. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్న వారికి మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. పారామౌంట్ స్టీల్ ప్లాంట్ అధినేత వెలగల సురేష్ సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టుపై స్పందించిన ఆయన మంగళవారం ప్లాంట్‌ను సందర్శించారు. పరిశ్రమ విస్తరణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్లాంట్ అధినేత సురేష్ వందలాది కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని, నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

మార్గదర్శకులుగా పారిశ్రామికవేత్తలు


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, హాజరైన అధికారులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పీ-4 విధానం అమలు నేపథ్యంలో పేదరిక నిర్మూలనలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని కలెక్టర్ జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు మార్గదర్శకులుగా వ్యవహరించాలని సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పారిశ్రామిక అనుమతుల కోసం ఇప్పటి వరకు 1,148 దరఖాస్తులు స్వీకరించగా, వీటిలో 1,113 ఆమోదించారు. ఎం.ఎస్.ఎం.ఇ. రంగానికి అందించే ప్రోత్సాహకాలలో భాగంగా 39 క్లెయిమ్‌లకు రూ.3 కోట్లను ప్రతిపాదించగా, డీఐఈపీసీ ఆమోదం తెలిపింది. జిల్లా పరిశ్రమల అధికారి సాంబయ్య, ఎల్డీఎం కె. ప్రియాంక, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి.శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఎ.వి.శంకరరావు, జిల్లా భూగర్భజల శాఖ అధికారి ఎన్.నాగమల్లేశ్వరరావు, కమిటీ సభ్యులు డి.నిర్మల, ఎం.కిశోర్, ఎం.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న ఈపీఎఫ్ కమిషనర్ ప్రభుదత్త

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఉపాధి కల్పన, ఉద్యోగుల భద్రతే లక్ష్యంగా పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని ఈపీఎఫ్(ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్) కమిషనర్ ప్రభుదత్త అన్నారు. పథకంపై అవగాహన కార్యక్రమాన్ని ఎన్టీటీపీఎస్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుదత్త మాట్లాడుతూ.. ఆగస్టు ఒకటి నుంచి కొత్త పథకం అమల్లోకి రానుందన్నారు. రానున్న రెండేళ్లలో కొత్త ఉద్యోగాలను సృష్టించేందుకు పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందన్నారు. అందుకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించిందని వివరించారు. కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి వర్తిస్తుందన్న కమిషనర్.. యూఏఎన్ నంబర్ పొందిన సభ్యులు ఆరు నెలలు పనిలో కొనసాగితే వారికి రూ.15వేలు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ముఖ్య ఇంజినీర్ శివరామాంజనేయులు, ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి విజయకుమార్, ఇంజినీర్లు నాగేశ్వరరావు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కుంకుమార్చన.. పరిశుభ్ర క్యూలైన్లపై చర్చ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో ప్రధానమైన ప్రత్యేక కుంకుమార్చన, పరిశుభ్రమైన క్యూలైన్ల నిర్మాణంపై ఉన్నతాధికారుల సమక్షంలో మంగళవారం చర్చ జరిగింది. ప్రత్యేక కుంకుమార్చన, చండీయాగంలో ఉభయదాతలుగా పాల్గొనేందుకు భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి సైతం వస్తుంటారు. సాధారణ రోజుల్లో లక్ష కుంకుమార్చన టిక్కెట్టు ధర రూ.1000 ఉంటే ఉత్సవాల సమయంలో రూ.3 వేలుగా నిర్ణయించారు. చండీహోమం ధర రూ.1000 నుంచి రూ.4 వేలు చేశారు. వీటి ద్వారా దేవస్థానానికి రూ.1.50 కోట్ల ఆదాయం వస్తోంది. అర్జిత సేవల్లో పాల్గొనే ఉభయదాతలకు దర్శనం కల్పించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న నెపంతో ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాలు నిలిపివేయాలన్న ప్రతిపాదన కొందరు పోలీసు అధికారులు తీసుకొచ్చినట్లు తెలిసింది. అదే జరిగితే దేవస్థాన ఆదాయానికి భారీగా గండిపడడమే కాకుండా వ్యతిరేకత కూడా వస్తుందని ఇతర అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి.. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 5జీబీ మెమోరీ గల కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అందరికీ వర్తింపజేయాలని, మినీ టీచర్ల జీవోను తక్షణమే అమలు చేయాలని కోరారు. కేంద్రాలకు సోనా మసూరి బియ్యం సరఫరా చేయాలని కోరారు. ఆగస్టు 4వ తేదీన అన్ని జిల్లాల్లో కార్యకర్తలు తమ ఫోన్లను ప్యాక్ చేసి.. సీడీపీవోలకు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు జె.లలితమ్మ, వి.ఆర్.జ్యోతి, సుప్రజ, వాణిశ్రీ, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ప్రేమికుల అరెస్టు


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్

పటమట, న్యూస్‌టుడే: వాసవీనగర్‌లో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. చోరీ చేసిన నగదుతో వివాహం చేసుకుని సెటిల్ అవుదామనుకున్న ప్రేమికుల ప్లాన్ బెడిసికొట్టింది. కేసు వివరాలను మంగళవారం పటమట పోలీస్‌స్టేషన్‌లో సెంట్రల్ ఏసీపీ దామోదర్, సీఐ వల్లభనేని పవన్‌కిషోర్ వివరించారు. సున్నపు బట్టీల సెంటర్‌కు చెందిన మీసాల అజయ్‌కుమార్ ఖాళీగా తిరుగుతున్నాడు. అతనికి కొన్నేళ్ల కిందట వాళ్ల ఇంటి సమీపంలో నివసించే ఓ బాలిక(17)తో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. మూడేళ్ల కిందట బాలిక తండ్రి మరణించడంతో ఆ కుటుంబం భవానీపురంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. రెండేళ్ల కిందట తన కుమార్తెను వేధిస్తున్నారంటూ బాలిక తల్లి అజయ్‌కుమార్‌పై భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వీరిద్దరూ కలిసే తిరుగుతూ చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. కేసు రాజీ చేసుకుని వివాహం చేసుకుందామని నిర్ణయించుకున్నారు. చోరీ చేసి ఆ సొత్తుతో బయటకు వెళ్లిపోదామనుకుని ప్రణాళిక వేసుకున్నారు.

రెక్కీ నిర్వహించి.. వాసవీనగర్‌కు చెందిన వరప్రసాద్‌కు వన్‌టౌన్‌లో గ్యాస్ ఏజెన్సీ నిర్వహించే సమయంలో అక్కడ బ్యాంకులో పనిచేసే బాలిక అమ్మమ్మతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో కొన్ని సందర్భాల్లో బాలిక కూడా వాసవీనగర్‌లోని వరప్రసాద్ ఇంటికి వచ్చేది. అలా ఈనెల 26న అజయ్‌కుమార్, బాలిక వరప్రసాద్ ఇంటికి వచ్చారు. బాలికను వరప్రసాద్ గుర్తు పట్టలేదు. తామిద్దరం భార్యాభర్తలమని..ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరగా చూసి చెబుతానని వరప్రసాద్ బదులిచ్చారు. ఆ సమయంలో ఇంటి పరిసరాలు, వీధిలో పూర్తిగా రెక్కీ నిర్వహించారు. అనంతరం వెళ్తూ..ఓ ఇంటి వరండాలో కుక్క పిల్ల కట్టేసి ఉండగా. .దాన్ని ఎత్తుకుని పరారయ్యారు.

365 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ.. ఈనెల 25న మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారు. 26న కుక్కపిల్లను చోరీ చేశారు. 27వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో వరప్రసాద్ ఇంటి బజారులో వీధి దీపాలు ఆపేశారు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించి బెడ్ రూమ్ గది కిటికీ గ్రిల్ కోసేసి లోపలకు చొరబడి సుమారు రూ. 20 లక్షల విలువైన 365 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ చేశారు. అనంతరం భవానీపురంలోని బాలిక నివాసానికి వెళ్లి అక్కడ నగలు పెట్టి ద్విచక్ర వాహనంపై నందిగామ వెళ్లి అక్కడ అజయ్‌కుమార్ బంధువుల ఇంట్లో ఉన్నారు.

పట్టించిన కుక్కపిల్ల.. కుక్క పిల్లను అమ్మేందుకు నిందితులు పలువురిని సంప్రదించారు. కుక్క పిల్లను కూడా చోరీ చేసింది ఇదే జంటని పోలీసులు గుర్తించి సీసీ ఫుటేజ్‌లో పరిశీలించారు. ఆరోజు ఎవరెవరిని కలిశారో వారిని విచారించగా నిందితుల ఆచూకీ లభ్యమైంది. దీంతో పోలీసులు భవానీపురంలోని బాలిక నివాసానికి వెళ్లి చోరీ చేసిన నగలు స్వాధీనం చేసుకుని అనంతరం నందిగామ వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సైలు హరికృష్ణ, కృష్ణ వర్మ, రేవతి, క్రైమ్ ఏఎస్సై గోపి, సిబ్బంది వెంకటేష్, బాషా, ఆరిఫ్, ప్రతాప్‌లను ఏసీపీ అభినందించారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 131 చికెన్ విత్ స్కిన్ - 190, చికెన్ స్కిన్‌లెస్ - 216. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, 124, 195 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 230.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇవ్వాలి


మాట్లాడుతున్న రమణ. పక్కన సంఘ సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో దేవాలయాల్లో పనిచేస్తున్న క్షురకులు, నాదస్వరం విద్వాంసులకు ఉద్యోగ భద్రత కల్పించి, నాలుగో తరగతి ఉద్యోగులుగా పరిగణించాలని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. మంగళవారం అయోధ్యనగర్‌లోని నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపంలో సంఘ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్యూటీ పార్లర్లు, స్పాల కారణంగా సంప్రదాయ క్షౌరవృత్తిదారులు నష్టపోతున్నారని చెప్పారు. పిల్లల విదేశీ విద్య కోసం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు కార్పొరేషన్ ద్వారా అందించాలని కోరారు. గత ప్రభుత్వం నాయీ బ్రాహ్మణ సొసైటీలను కార్పొరేషన్‌గా మార్చిందని, దీనివల్ల ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు. సెలూన్ షాపులకు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం 15 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తామని జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. వైకాపా ప్రభుత్వం విద్యుత్తు కోసం రూ.10వేలు ఇస్తామని ప్రకటించి కొందరికి మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు హామీ మేరకు దుకాణాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణ వర్గానికి అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చుతుందని పేర్కొన్నారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు అప్పారావు, రాము, ముత్యాలు, కొత్త వలస ప్రసాద్, జగన్నాథం, శివ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ఇక ఆటో మ్యుటేషన్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆటో మ్యుటేషన్ విధానంలో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలోనే ఇంటిపన్ను పేరు మార్పిడి ప్రక్రియ కూడా జరిగిపోతుందని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ)జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు సులభంగా అందించేందుకు ప్రభుత్వం డిజిటలైజేషన్ ఆఫ్ సర్వీసెస్ ద్వారా మ్యుటేషన్(ఆస్తి పన్ను పేరు మార్పిడి) విధానాన్ని అమల్లోకి తెచ్చిందని వెల్లడించారు. ఈ కారణంగా ప్రజలు ఇకపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరక్కుండానే ఆస్తిపన్ను మార్పిడి జరుగుతుందని తెలిపారు. పన్ను బకాయిలు ఉన్నపక్షంలో వాటిని మ్యుటేషన్ ఛార్జీలతో పాటు చెల్లిస్తే ఆటోమేటిక్‌గా పేరుమార్పిడి జరిగి, సర్టిఫికెట్ తేలిగ్గా పొందేందుకు వీలుంటుందని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖలు ఇప్పటికే అనుసంధానించినట్లు ప్రకటించారు. కొత్తగా ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకునేవారు తమ అసెస్‌మెంట్ నంబరును దస్తావేజులో ప్రస్తావించి, ఆటో మ్యుటేషన్ పొందాలని ఆమె సూచించారు.

ఏఆర్‌టీ కేంద్రాల్లో తనిఖీలు


ఓ ప్రైవేటు ఏఆర్‌టీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సుహాసిని తదితరులు

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఏఆర్‌టీ కేంద్రాలు, సరోగసీ కేంద్రాలపై ప్రతికూల వార్తల నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వరుసగా 2వ రోజు మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డా.ఎం. సుహాసిని సారథ్యంలోని బృందం సూర్యారావుపేట, నక్కల్‌రోడ్డు, గవర్నరుపేట ప్రాంతాల్లోని కేంద్రాల్లో తనిఖీ చేపట్టింది. ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. డా.ఎం.సుహాసిని మాట్లాడుతూ.. స్థానికులు ఎవరైనా ఆయా కేంద్రాలకు, ల్యాబులకు అనుమతి లేదన్న విషయం గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అనుమతి లేదని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ తప్పకుండా ప్రభుత్వ విధివిధానాలు పాటించాలని కోరారు. ప్రస్తుతం జరిగిన తనిఖీల్లో అన్ని బాగానే ఉన్నాయని, ఏదైనా కేంద్రాలపై అనుమానాలుంటే వారిని వివరణ అడుగుతున్నామని.. వారు కూడా సమాధానం ఇస్తున్నారని చెప్పారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

బారికేడ్లు అందజేత


బారికేడ్లతో ఎస్సై సతీష్‌కుమార్, సంస్థ ప్రతినిధులు

జి.కొండూరు: మండలంలోని కడెంపోతారం నాగార్జున సిమెంట్ లిమిటెడ్ యాజమాన్యం జి.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు 40 బారికేడ్లను మంగళవారం వితరణగా అందజేశారు. రహదారి ప్రమాదాలు నివారించేందుకు రూ.3లక్షలు విలువైన బారికేడ్లను సంస్థ సమకూర్చినట్లు టెక్నికల్ హెడ్ ఆర్.ఎస్.ఎన్.రాజు, హెచ్‌ఆర్ హెడ్ ఎం.ఎస్.అజహర్ తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్లు, రహదారి మలుపుల వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ వెల్లడించారు.

వెండి కిరీటాల బహూకరణ



మైలవరం మండలంలోని కొత్తచంద్రగూడెంలో కొలువైన ముత్యాలమ్మతల్లి ఆలయంలో ముత్యాలమ్మతల్లి, బాలముత్యాలమ్మ, అంకమ్మ, పోతురాజు విగ్రహాలకు వెండి కిరీటాలను ఆలయ కమిటీ అధ్యక్షులు గాళ్ల నాగేశ్వరరావు, శ్రీనివాసరావులు మంగళవారం వితరణగా అందించారు. అరకిలో పరిమాణంలో కిరీటాలను చేయించి, అలంకరించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు హనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, చంద్రగూడెం(మైలవరం)**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



★ తిరువూరు పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలోని 5వ వార్డులో డ్రెయినేజీలో తొలగించిన పూడిక మట్టి రహదారిపై ఉందని స్థానికుల ఫిర్యాదును పురపాలిక కమిషనర్ కె.మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక సిబ్బందితో రోడ్డుపై పూడిక మట్టి లేకుండా శుభ్రం చేయించారు. ★ 5వ సచివాలయం పరిధిలో 18వ వార్డులో నాగార్జున కళాశాల రోడ్డులో డ్రెయినేజీలో పూడికపై నివాసితుల ఫిర్యాదును కె.మనోజ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి పురపాలిక కార్మికులతో పూడికను తొలగించే చర్యలు చేపట్టారు. ★ 6వ సచివాలయం పరిధిలో 10వ వార్డులో చింతలకాలనీలో మురుగు పారుదల అస్తవ్యస్తంగా ఉందన్న ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో పూడికను తొలగించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**

ఎమ్మెల్యే పర్యటన నేడు

రెడ్డిగూడెం: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ రెడ్డిగూడెం మండలంలో బుధవారం పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు రెడ్డిగూడెం, 11 గంటలకు కూనపరాజుపర్వ సొసైటీ ప్రమాణ స్వీకారోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం ఆయా గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం జరగనుంది.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గంపలగూడెం: కొత్త విద్యుత్తు లైన్ల ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మండలంలోని పెనుగొలను, ఊటుకూరు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాలు, గంపలగూడెం, గుళ్లపూడి ఫీడర్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఏఈ కె.వాసు తెలిపారు.

అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట

చరవాణిలో అనవసర లింక్‌ల జోలికెళ్లొద్దు


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

మైలవరం, న్యూస్‌టుడే: ముందస్తు అవగాహనతోనే సైబర్ మోసగాళ్ల వలకు చిక్కకుండా జాగ్రత్త పడవచ్చని, చరవాణికి వచ్చే అనవసర లింక్‌ల జోలికి వెళ్లవద్దని సీఐ దాడి చంద్రశేఖర్ సూచించారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ సైబర్ నేరాలు జరిగే తీరు, ఇతర ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధార్, బ్యాంకు సేవలంటూ ఓటీపీ చెప్పమని, డిజిటల్ అరెస్టుల పేరిట చేసే మోసపు మాటలను నమ్మొద్దన్న ఆయన అప్రమత్తతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్టవేయొచ్చని వివరించారు.

వ్యక్తిగత సమాచారంతోనే నేరం..

సాంకేతికత సాయంతో చేసే తెలివైన మోసం సైబర్ క్రైం అని.. సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వినియోగించే యువత వాటిని దృష్టిలో ఉంచుకొని మెలగాలని ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. తమ ఉనికి బయటపడకుండా వీపీఎన్, ప్రాక్సీ వంటి వాటిని ఉపయోగించి, తెలివిగా సైబర్ మోసగాళ్లు నేరాలకు పాల్పడుతారని పేర్కొన్నారు. విదేశాల్లో పిల్లలున్న తల్లిదండ్రులు, ఆన్‌లైన్ ట్రేడింగ్, ఆటలాడే యువత, రుణయాప్, నకిలీ యాప్‌లలోని వ్యక్తిగత సమాచారంతోనే వలవేస్తారన్నారు. ఆన్‌లైన్ రేటింగ్‌కు వచ్చే స్వల్ప ఆదాయం కోసం విజయవాడలో ఓ వైద్యుడు ఏకంగా రూ.1.30కోట్లు నష్టపోయారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కళ్లతో చూసిన వాటినే నమ్మాలని.. పోలీసులను సైతం బురిడీ కొట్టించేందుకు నేరగాళ్లు ప్రయత్నిస్తారని వివరించారు.

డిజిటలైజ్ అయిన దొంగలు..

ఒకప్పుడు నగదు దాచేందుకు వినియోగించిన పర్సులు నేడు ఖాళీగా దర్శనమిస్తున్నాయని.. వాటి స్థానాన్ని ఫోన్‌లు ఆక్రమించటంతో దొంగలు కూడా డిజిటలైజ్ అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇల్లా రవి పేర్కొన్నారు. భౌతిక, సాంకేతికతల మధ్య నేటి యువత సర్దుకోలేకపోతున్నారని తెలిపారు. ఆడపిల్లలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సదస్సులో వైస్‌ప్రిన్సిపల్ పి.రంగారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.సుభాషిణి, శ్రీచక్ర సీఈవో శ్రీనివాస చక్రవర్తి, అధ్యాపకులు రాముడు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులు ఎంతో ఉపయుక్తం..



సైబర్ నేరాల వలలో యువత ఎక్కువగా పడుతున్నారు. ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించటం చాలా అవసరం. నేరాల తీరు, ప్రమాదకరమైన యాప్‌ల బారిన పడకుండా మెలకువలు తెలిపే ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయుక్తం. **- ఎం.శ్రీలక్ష్మి, బీఏ మూడో ఏడాది విద్యార్థిని**

ఓటీపీలు చెప్పొద్దు..



గుర్తుతెలియని వ్యక్తులు అడిగినా, అనవసర యాప్‌ల వాడకంలో ఓటీపీలు చెప్పటం ద్వారానే వ్యక్తిగత సమాచారం తొలుత చోరీ అవుతుంది. తద్వారానే సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయి. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. తెలిసి కూడా నమ్మించి మోసం చేసే నేరగాళ్ల తీరు సదస్సులో అర్థమైంది. **- ఎల్.శ్రీనివాస్, బీకాం**

అవగాహన అవసరం..



సైబరు నేరాల పట్ల యువతకు ముందస్తు అవగాహన చాలా అవసరం. ఆ ప్రయత్నాన్ని పోలీసుల సాయంతో 'ఈనాడు-ఈటీవీ' కృషి అభినందనీయం. మోసాల తీరును తెలుసుకున్నాం. చుట్టుపక్కల వారికి ఈ ఆన్‌లైన్ మోసాలను వివరిస్తాం. ఆయా నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తాం. **- కె.రమాదేవి, విద్యార్థిని**

కల్యాణ మండపానికి వితరణ

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట శివారులో కొలువైన శ్రీసీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి ఆలయానికి దాత గడ్డం మధుసూదనరెడ్డి, శ్రీదేవి దంపతులు రూ.25,116, కుక్కడపు రామ్‌ప్రసాద్, వెంకట సత్యసునీత దంపతులు రూ.21,116లను మంగళవారం విరాళంగా అందజేశారు. ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న కల్యాణ మండపానికి ఆ నగదు వినియోగించాలని ఆ నగదును ఆలయ నిర్వాహకులు పలగాని పుల్లారావుకు అందించారు. దాతలకు గుడి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

వసంత నాగేశ్వరరావు పుట్టిన రోజు

మైలవరం, న్యూస్‌టుడే: మాజీ హోంమంత్రి, శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ తండ్రి నాగేశ్వరరావు పుట్టినరోజును మైలవరం తెదేపా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. కేక్ కత్తిరించిన నాయకులు స్థానికులకు పంచారు. కార్యక్రమంలో నాయకులు మల్లె రాధా, బాలకృష్ణ, లితీష్, ప్రసాద్, జల్లికృష్ణ, సర్పంచి మంజుభార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో తనిఖీ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోను విజయవాడ జోన్-2 అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డిపోనకు సంబంధించిన అన్ని విభాగాలను పరిశీలించారు. గ్యారేజీలో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి బస్సుల పటుత్వం, ఇతర వివరాలను ఆరా తీశారు. సామర్థ్యం కలిగిన బస్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం సంతృప్తి వ్యక్తం కావాలి


గుంటుపల్లిలో నివాసితులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో కన్నమనాయుడు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే: ఇంటింటి చెత్త సేకరణపై ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామస్థుల నుంచి జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు మంగళవారం అభిప్రాయాలను సేకరించారు. స్థానిక అధికారులతో కలిసి ప్రధాన రహదారి వెంట నివాసితులతో ఆయన మాట్లాడారు. చెత్తసేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్త వేరుచేయడంపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, తాగునీటి సరఫరా ట్యాంకులను పరిశీలించిన కన్నమనాయుడు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చెత్త సేకరణపై ఐవీఆర్‌ఎస్ సర్వేలో 70శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని.. వంద శాతం ఉండేలా నిర్వహణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో సునీత శర్మ, సిబ్బంది మనోజ్, కె.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


మొక్క నాటుతున్న అధ్యాపకులు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రకృతి క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి వైస్‌ప్రిన్సిపల్ బి.రమేశ్‌రెడ్డి మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డీన్‌లు శ్రీనివాసరావు, ఎస్.పిచ్చిరెడ్డి, విభాగాధిపతి టి.సత్యనారాయణ, క్లబ్ కోఆర్డినేటర్ షాహిదా నీలోఫర్, వి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి రూ.6.25 లక్షల ఆదాయం


ఊటుకూరులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజలు చేస్తున్న భక్తులు

మేడూరు (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తుల హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. నాలుగు నెలల కాలంలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి రూ.6,25,206 ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరు కోదండ రామాలయంలో గరుడ పంచమి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహానికి మంగళవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గంపలగూడెం ఎన్టీఆర్ కాలనీలో సంకటహర హనుమాన్ గుడిలో శ్రావణ మంగళవారం సందర్భంగా భక్తబృందం ఆధ్వర్యంలో 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

ఉచిత వైద్య శిబిరం

కొండపల్లి, న్యూస్‌టుడే: స్థానిక బి.కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీర్ శివరామాంజనేయులు ప్రారంభించారు. ఉద్యోగులనుద్దేశించి మాట్లాడిన ఆయన.. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగులకు బీపీ, షుగర్, గుండె ఇతర పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని రామచంద్రాపురంలో నూతనంగా నిర్మించిన శివ దత్తసాయి మందిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 31 నుంచి నిర్వహించనున్నారు. 31వ తేదీ నుంచి హోమాలు, ఆగస్టు 2న విగ్రహాల గ్రామోత్సవం, 4వ తేదీ ఉదయం 8.10 గంటలకు ఆలయంలో శ్రీవిఘ్నేశ్వర, రామలింగేశ్వర, శ్రీషిర్డీ సాయిబాబా ఇతర విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని ఆలయ నిర్మాణ దాతలైన గుంటక సుదర్శనరెడ్డి, హేమలత దంపతులు వివరించారు. అనంతరం భారీ అన్నసమారాధన ఉంటుందని పేర్కొన్నారు.

మల్లేశ్వరస్వామికి పూజలు

మైలవరం: ద్వారకా తిరుమల దత్తత ఆలయమైన స్థానిక శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ద్వారకా ... సుధాకరరావు ఆధ్వర్యంలో నాగపంచమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కొలువైన అమ్మవార్లు, స్వామివారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెనుగొలనులో నారాయణరెడ్డి జయంతి


సినారె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే: గంపలగూడెం మండలంలోని పెనుగొలనులో జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సి.నారాయణరెడ్డి జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి షిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు సినారె చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు భాష, సాహిత్యానికి ఆయన సేవలను కొనియాడారు. సినారె రచనలను వక్తలు వివరించారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: గంగినేని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి జయంతి మంగళవారం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు అమీర్‌బాషా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ నూతన ఒరవడితో కవిత్వాన్ని, గేయాలను ప్రజల మనసుల్లో నింపి తనదైన ముద్ర వేసుకున్న మహనీయుడు నారాయణరెడ్డని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, జాన్‌బాషా, రేఖ, రాజవరలక్ష్మి, మాధవరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గృహాల సర్వేపై శిక్షణ

రెడ్డిగూడెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గృహాల సర్వేపై గ్రామ సచివాలయ సిబ్బందికి మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఆగస్టు 2వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు.

2న అన్నదాత సుఖీభవ సాయం జమ

గోపాలపురం(ఎ.కొండూరు): గోపాలపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్షేత్రస్థాయి పత్తి పంటను పరిశీలించిన ఏవో బి.సాయిశ్రీ.. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అందించే ఆర్థిక సాయం ఆగస్టు 2వ తేదీ రైతుల బ్యాంకు ఖాతాలకు జమవుతుందన్నారు. పాడి రైతులకు మినీ గోకులం, పశుగ్రాసం విత్తనాలపై పశుసంవర్ధకశాఖ ఏడీ రామారావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.లక్ష్మి, సర్పంచి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మురుగునీరు తొలగింపు

జి.కొండూరు: చెవుటూరు బొడ్డురాయి వీధి చివర సీసీ రోడ్డుపై మురుగునీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్న వైనంపై ఈనెల 26న 'మురుగు నీరు నిలిచి..అవస్థలు మిగిలి..' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సిబ్బందితో కాలువల్లో పూడిక తొలగించి మురుగునీరు పారేలా చర్యలు చేపట్టారు. అవస్థలు తొలగడంతో ఆప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు.

స్వామిత్వ సర్వే వేగంగా పూర్తి చేయండి


శిక్షణలో సూచనలిస్తున్న త్రివిక్రమ్, పక్కన వెంకటేశ్వర్లు తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్వామిత్వ సర్వే వేగంగా పూర్తి చేయాలని ల్యాండ్స్ సర్వే ఏడీ త్రివిక్రమ్ సూచించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన స్వామిత్వ సర్వే శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పల్లెల్లో పేద ప్రజల ఆర్థిక, స్వీయ సాధికారత సాధించే దిశగా ఈ కార్యక్రమం రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బీవీ రామకృష్ణనాయక్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఆర్ఐ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత

కల్లూరు, న్యూస్‌టుడే: ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని చెన్నూరు గ్రామం రావికంపాడు అడ్డరోడ్డు వద్ద మంగళవారం పట్టుకొన్నట్లు ఎస్సై హరిత తెలిపారు. ఆంధ్రా నుంచి ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో దీనిని పట్టుకున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ జిల్లా కొండూరు మండలం చెరువూరుకు చెందిన డ్రైవర్ తిరుపతి గోపిపై, కంచికచర్లకు చెందిన లారీ ఓనర్ రాయల నరసింహారావుపై కేసు నమోదు చేశారు.

అసంపూర్తి నిర్మాణంతో అవస్థలు


కవులూరు గ్రామంలో పూర్తికాని చప్టా

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు గ్రామంలో అచ్చమ్మ పాపయ్య దేవాలయం, బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డులో చప్టా నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో నిత్యం అటువైపుగా రాకపోకలు చేసే వారికి తీవ్ర అంతరాయమేర్పడింది. గతంలో ఉన్న చప్టా పల్లంగా మారడంతో అదే ప్రదేశంలో చప్టా ఎత్తు పెంచి నిర్మాణం చేపట్టేందుకు రెండు నెలల కిందట పనులు ప్రారంభించి రెండు వైపులా గోడ మాత్రమే నిర్మించి నిలిపేశారు. గోడల పైభాగం నిర్మాణం చేపడితే రాకపోకలకు అవస్థలు తొలగిపోతాయి. పనులు నిలిపేయడంతో గ్రామస్థులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన చప్టా నిర్మాణంపై దృష్టి సారించి రాకపోకలు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి


పెద్దవరం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: కూటమి పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెదేపా నాయకులు అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. రానున్నకాలంలో ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. తిరువూరు, పెద్దవరం, ఎరుకోపాడులో నిర్వహించిన కార్యక్రమాల్లో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి'


తాతకుంట్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తాతకుంట్ల(విస్సన్నపేట), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులపై ఆర్థిక భారం మోపే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు తెలిపారు. మండలంలోని తాతకుంట్లలో స్మార్ట్ మీటర్లు వద్దంటూ మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి.. స్మార్ట్ మీటర్లు బిగించేందుకు యత్నిస్తుందన్నారు. పార్టీ మండల కార్యదర్శి వి.నాగరాజు, సభ్యులు రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

పంటల వైవిధ్యంతో నాణ్యమైన దిగుబడులు



మాట్లాడుతున్న ఆత్మ పీడీ మాధవీలత

మైలవరం, న్యూస్‌టుడే: రైతులు పంటల వైవిధ్యాన్ని అలవర్చుకోవడంతోనే నాణ్యమైన ఆహార ఉత్పత్తులను సాధించవచ్చని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ టి.మాధవీలత పేర్కొన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో మైలవరం సబ్‌డివిజన్ పరిధిలోని వీఏఏ, వీహెచ్‌ఏ, ఏఈవో, ఎంపీఈవోలకు మూడ్రోజుల శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన, సురక్షితమైన ఉత్పత్తులపై మెలకువలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలోని సార్వత్రిక సూత్రాలపై అవగాహన కల్పించారు. ఏడీఏ ఎం.శ్రీనివాసరావు, మైలవరం, జి.కొండూరు ఏవోలు సంధ్యారాణి, సూరిబాబు, ఉద్యాన శాఖాధికారి అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

నమోదు తప్పనిసరి

అక్కపాలెం, కోకిలంపాడు(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని అక్కపాలెం, కోకిలంపాడు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగుదారులతో కలిసి వరి పొలాలను క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారిణి పి.పద్మ సందర్శించారు. ప్రతి ఒక్క రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించిన ఏవో.. సస్యరక్షణ చర్యలను వివరించారు. పశువైద్యాధికారి డి.అభిలాష్, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



పైడూరుపాడు గ్రామం న్యూకాలనీలో రహదారి అధ్వానంగా మారింది. రహదారిని అభివృద్ధి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో చిన్నపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారుతోంది. ఆ మార్గంలో స్థానికులు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- గొల్లపూడి, న్యూస్‌టుడే**




సింగపూర్‌లోని జురాంగ్ పెట్రో కెమికల్ ఐలాండ్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ★ జురాంగ్ పెట్రో కెమికల్ పరిశ్రమ

ఓడరేవులకు సమీపంలో పారిశ్రామిక లాజిస్టిక్ కారిడార్

- జురాంగ్ పెట్రోకెమికల్ ఐల్యాండ్ సందర్శనలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం ఓడరేవులను కలుపుతూ పారిశ్రామిక లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పోర్టులకు సమీపంలో ప్రపంచశ్రేణి చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటు కానుందని తెలిపారు. ఏపీ పారిశ్రామిక ప్రగతిలో సింగపూర్ కంపెనీలు కలిసిరావాలని సీఎం కోరారు. సీఎం బృందం మంగళవారం జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్‌ను సందర్శించింది. అక్కడ ఏర్పాటు చేసిన సమీకృత పారిశ్రామిక ప్రాజెక్టు సహా ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. సుర్బానా జురాంగ్ డిప్యూటీ డైరెక్టర్ టియో ఎంగ్ కియాట్, ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆండీ లీ వారికి స్వాగతం పలికారు. దీని ఏర్పాటు ప్రణాళికలు.. వినియోగ నమూనాలు, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను సీఎంకు వివరించారు. సముద్రాన్ని పూడ్చి నిర్మించిన దీవిలో సమీకృత పెట్రోకెమికల్, ఇంధన కేంద్రాన్ని సింగపూర్ ఏర్పాటు చేసింది. 3 వేల హెక్టార్ల సముద్రాన్ని భూమిగా మార్చి అంతర్జాతీయ ప్రమాణాలతో పెట్రో కెమికల్ హబ్‌ను నెలకొల్పింది. ఇక్కడ ముడి చమురు శుద్ధితోపాటు అనుబంధ ఉత్పత్తులు పాలిమర్స్, ఇథనాల్, తయారవుతాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు ఏర్పాటైంది.

ఆసియా మార్కెట్‌కు వ్యూహాత్మక గమ్యస్థానంగా ఏపీ

ఐటీ, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి

పరిశ్రమలకు మరిన్ని వెసులుబాట్లు కల్పించేందుకు సిద్ధం ● బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్



గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ డ్రూ బ్రైస్‌తో సమావేశమైన మంత్రి నారా లోకేశ్. చిత్రంలో ఆ సంస్థ ప్రతినిధులు, ఏపీ అధికారులు



మురాటా ఎలక్ట్రానిక్స్ ఎండీ హిరోయికి నివాతో భేటీ అయిన మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: ఆసియా మార్కెట్‌కు ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మక గమ్యస్థానంగా ఉందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఏపీలో ప్రధాన నగరాలు, అంతర్జాతీయ మార్కెట్లకు అద్భుతమైన కనెక్టివిటీ ఉందని వెల్లడించారు. 'ఐటీ, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్స్, ఏఐ, ఫిన్‌టెక్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్తులో శక్తిమంతం చేయడం' అనే అంశంపై సింగపూర్‌లోని షాంగ్రీలా హోటల్‌లో ఏర్పాటు చేసిన బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. 'ఏపీ ఒక దార్శనిక రాష్ట్రం. ఆర్థిక వృద్ధి, పౌరసేవలు మెరుగుపరచడానికి సాంకేతికత శక్తిని ఉపయోగించుకోవడంలో మేం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు వారిని పరిశ్రమలతో అనుసంధానిస్తున్నాం. పారదర్శకత, జవాబుదారీతనం, వ్యాపార సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సులభతర విధానాల కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. ఏపీలో వ్యాపారాభివృద్ధికి అవసరమైన మరిన్ని వెసులుబాట్లు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఏపీ ఆర్థికాభివృద్ధిలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్స్, ఏఐ, ఫిన్‌టెక్ రంగాలు కీలకంగా మారుతున్నాయి. ఈ రంగాల్లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మకైన ప్రాంతం' అని వివరించారు.

ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా అభివృద్ధి

'భారతదేశంలో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. రాబోయే నాలుగేళ్లలో ఎలక్ట్రానిక్స్ రంగంలో 150 బిలియన్ డాలర్ల పెట్టుబడులు లక్ష్యంగా ఎలక్ట్రానిక్స్ పాలసీ-4.0ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏడాది కాలంగా ఈ రంగంలో గణనీయమైన పెట్టుబడులను ఆకర్షించాం. ఏపీని ఐటీ హబ్‌గా మార్చాలనే లక్ష్యంగా పెట్టుకున్నాం. మా ప్రయత్నాలు విజయవంతమై టీసీఎస్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ లాంటి ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాయి' అని లోకేశ్ వెల్లడించారు.

చిప్ డిజైనింగ్ కేంద్రం ఏర్పాటుకు..

గూగుల్ తన సర్వర్ల కోసం సొంత చిప్‌లను రూపొందిస్తున్నందున విశాఖపట్నంలో ఆ సంస్థ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ క్యాంపస్‌లో చిప్ డిజైనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని మంత్రి లోకేశ్ కోరారు. సింగపూర్‌లో గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ డ్రూ బ్రైస్‌తో మంత్రి భేటీ అయ్యారు. 'విశాఖలో డేటా సిటీకి అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ పూర్తి చేశాం. సాధ్యమైనంత త్వరగా గూగుల్ డేటా కేంద్రం పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టండి. విశాఖలో చిప్ డిజైనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి. ఇక్కడ నౌకాశ్రయం, విమానాశ్రయాల సదుపాయం ఉన్నందున సప్లై చైన్ విషయంలోనూ ఆంధ్రప్రదేశ్ అనుకూలంగా ఉంటుంది' అని సూచించారు. ఏపీ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని డ్రూ బ్రైస్ హామీ ఇచ్చారు.

ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ యూనిట్ నెలకొల్పండి

ఏపీలో మురాటా ఎలక్ట్రానిక్స్ అధునాతన ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్ ఆ సంస్థ ఎండీ హిరోయికి నివాను కోరారు. ఈ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హిరోయికి నివా చెప్పారు.



క్యారియర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ్ భాటియాతో భేటీ అయిన మంత్రి లోకేశ్

కోల్డ్‌చైన్ లాజిస్టిక్ హబ్ ఏర్పాటుకు కలిసిరండి

ఏపీలోని అమరావతి, విశాఖపట్నం లాంటి స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్లో హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్ (హెచ్‌వీఏసీ) వ్యవస్థలను అమలు చేయడానికి ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేయాలని క్యారియర్ సంస్థను మంత్రి లోకేశ్ కోరారు. ఏపీలో టైర్-2, టైర్-3 నగరాల్లో వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాలు, ఆహార నిల్వల కోసం స్థిరమైన కోల్డ్ చైన్ లాజిస్టిక్ హబ్ నిర్మాణానికి సైతం తమతో కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. క్యారియర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ్ భాటియాతో లోకేశ్ మంగళవారం భేటీ అయ్యారు. 'ఏపీలో గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్‌తో రాబోయే వాణిజ్య, నివాస ప్రాజెక్టుల్లో రిఫ్రిజిరెంట్స్, విద్యుత్తు ఆదా విధానం ఏర్పాటులో సహకారం అందించండి' అని కోరారు. భాటియా స్పందిస్తూ ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థలో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

విశాఖలో గ్రీన్ ఎనర్జీ డేటా కేంద్రం నెలకొల్పండి

డేటా సిటీగా ఆవిష్కృతమవుతున్న విశాఖపట్నంలో గ్రీన్ ఎనర్జీ డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎస్‌టీ టెలీమీడియా సంస్థ ప్రతినిధులను మంత్రి లోకేశ్ కోరారు. సింగపూర్ ప్రధాన కేంద్రంగా కమ్యూనికేషన్స్, మీడియా, డేటా కేంద్రాలు, మౌలిక సదుపాయాల టెక్నాలజీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎస్‌టీ టెలీమీడియా ఇన్వెస్ట్‌మెంట్స్ (ఇండియా) హెడ్ రీతూ మెహ్లావత్‌తో లోకేశ్ మంగళవారం భేటీ అయ్యారు. అత్యాధునిక డేటా కేంద్రాలు, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల కల్పన, ఆప్టిమైజేషన్ ద్వారా బలమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేయాలని కోరారు. భారత్‌లో 10 ప్రధాన నగరాల్లో 30 డేటా కేంద్రాలను నిర్వహిస్తున్నామని రీతూ తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చించి, నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.



ఎస్‌టీ టెలీమీడియా ఇన్వెస్ట్‌మెంట్స్ (ఇండియా) హెడ్ రీతూ మెహ్లావత్‌తో లోకేశ్



సింగపూర్‌లో వివిధ కంపెనీల సీఈఓలతో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వ బృందం

నౌకల నిర్మాణరంగంలో పెట్టుబడులు పెట్టండి

- పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు పిలుపు
- సింగపూర్‌లో వివిధ కంపెనీల సీఈవోలతో సమావేశం

ఈనాడు,అమరావతి: ఏపీలో నౌకల నిర్మాణ రంగంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కొత్త పోర్టుల నిర్మాణం, పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. సింగపూర్ పర్యటనలో భాగంగా వివిధ కంపెనీల సీఈవోలతో ఆయన సమావేశమయ్యారు. 'రాష్ట్రానికి వెయ్యి కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉంది. పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తాం. ప్రస్తుతం 6 పోర్టులు ఉన్నాయి. కొత్తగా మరో 4 రానున్నాయి. లాజిస్టిక్ ఖర్చు తగ్గించాలనేది ప్రధాన లక్ష్యం. పోర్టులను అనుసంధానం చేస్తూ రైలు, రోడ్డు మార్గాలు ఏర్పాటు చేయాలన్నది ఆలోచన. అంతర్గత జల రవాణా వ్యవస్థ ద్వారా సరకు రవాణాకు యోచిస్తున్నాం. పర్యాటకానికి ప్రాధాన్యం కల్పిస్తాం. ఏపీలో క్రూయిజ్ పర్యాటకానికి భారీ అవకాశాలు ఉన్నాయి' అని వారికి తెలిపారు.

ఆర్థిక వనరుగా తీర ప్రాంతం

తీరప్రాంతాన్ని రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన వనరుగా వినియోగించుకునే ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం తెలిపారు. 'పెట్టుబడులతో వచ్చే వారికి సహకరిస్తాం. శ్రీ సిటీకి 5 పోర్టులు అందుబాటులో ఉన్నాయి. తీరప్రాంతంలో పెట్టుబడులకు ఇది సరైన సమయం. మా ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలు పరిశీలించాలి. ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. పరిశ్రమల ఏర్పాటుకు నిర్దేశిత వ్యవధిలో అనుమతులు ఇస్తాం' అని వివరించారు.



ఏఐ సింగపూర్ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మోహన్ కంకణహల్లితో చంద్రబాబు

సింగపూర్‌లో ఎకో టౌన్‌షిప్‌ను సందర్శించిన మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి స్మార్ట్ సిటీలో ఇళ్ల నిర్మాణం, నీటి నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలపై అధ్యయనంలో భాగంగా పురపాలక శాఖ మంత్రి నారాయణ సింగపూర్‌లోని పుంగోల్ పాయింట్ కేప్ టౌన్‌షిప్ (పబ్లిక్ హౌసింగ్ ప్రాజెక్ట్)ను మంగళవారం సందర్శించారు. సింగపూర్‌లో మొట్టమొదటి ఎకో టౌన్‌షిప్ ప్రత్యేకతలను ఆయన పరిశీలించారు. సముద్ర తీరం, ఆధునిక సదుపాయాలు, గ్రీన్ మొబిలిటీ కేంద్రంగా హౌసింగ్ ప్రాజెక్టు నిర్మించినట్లు అక్కడి అధికారులు మంత్రికి వివరించారు. పుంగోల్ పాయింట్ కేప్ నిర్మాణంలోని పలు అంశాలు బ్లూ- గ్రీన్ సిటీగా అమరావతి నిర్మాణానికి ఉపయోగపడతాయని నారాయణ పేర్కొన్నారు. మంత్రితోపాటు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు పాల్గొన్నారు.



పుంగోల్ పాయింట్ కేప్ టౌన్‌షిప్ వద్ద అక్కడి అధికారులు, స్థానికులతో మంత్రి నారాయణ, కన్నబాబు తదితరులు

'ఉపాధి'లో ఇక ముఖ ఆధారిత హాజరు!

- వచ్చేనెల 10 నుంచి రాష్ట్రంలో అమలు
- దొంగ మస్టర్ల కట్టడికి ప్రయోగం

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకంలో సవాలుగా మారిన దొంగ మస్టర్ల కట్టడికి కేంద్ర ప్రభుత్వం కొత్తగా ముఖ ఆధారిత హాజరు విధానం ప్రవేశ పెడుతోంది. దీని ద్వారా ఒకే శ్రామికుడు రెండు, మూడు చోట్ల వేర్వేరు పేర్లతో హాజరు వేయించుకునే వీలుండదని భావిస్తోంది. వచ్చేనెల 10 నుంచి రాష్ట్రంలో కొత్త విధానం అమలుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఏర్పాట్లు చేస్తోంది. మాస్టర్ ట్రైనీల ద్వారా జిల్లాల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నారు.

కొత్త విధానం ఇలా..

ముఖ ఆధారిత హాజరు విధానంలో భాగంగా శ్రామికుల ప్రతి ఒక్కరి ఫొటో మొబైల్‌లో ముందుగా తీసి జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థ(ఎన్ఎంఎంఎస్)కు సంబంధించిన యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. పని ప్రదేశంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మళ్లీ క్షేత్రస్థాయి సిబ్బంది శ్రామికుల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ సమయంలో ఒకరి తరఫున మరొకరు హాజరైతే అలాంటి వారి ఫొటోలను యాప్ అనుమతించదు. దీని వల్ల ఆన్‌లైన్‌లో హాజరు వేయడం సాధ్యం కాదు. ఇప్పటివరకు ఒకే శ్రామికుడు మూణ్నాలుగు చోట్ల వేర్వేరు పేర్లతో హాజరైనా యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేసే వీలు ఉండేది. ఉదాహరణకు ఈశ్వరరావు అనే శ్రామికుడు ఒకే పంచాయతీలో నాలుగు చోట్ల చేపట్టే పని ప్రదేశాల్లో హాజరవుతున్నారు. ఒక చోట తన పేరుతో, మిగిలిన మూడు చోట్లా జాబ్ కార్డు కలిగిన ఇతరుల పేర్లతో హాజరు వేయించుకుంటున్నారు. కొత్త విధానంతో ఇలాంటి అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్టపడుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వైకాపా ప్రభుత్వంలో దొంగ మస్టర్ల బాగోతం పెద్దఎత్తున సాగింది. ఆ పార్టీకి చెందిన గ్రామ స్థాయి నేతలు, క్షేత్రస్థాయి సిబ్బంది కుమ్మక్కై దొంగ మస్టర్ల ద్వారా దోచేశారు. మృతి చెందిన వారి పేరుతో కూడా వేతనాలు డ్రా చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి.


క్రియేటర్ అకాడమీ ఏర్పాటుకు ఒప్పందం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో క్రియేటర్ అకాడమీ ఏర్పాటుకు రెండు ప్రధాన సంస్థలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. డిజిటల్ కంటెంట్ పరిశ్రమలో విజయం సాధించేందుకు ఔత్సాహిక సృష్టికర్తలను సన్నద్ధం చేయడం, వారికి అవసరమైన నైపుణ్యాలు, విజ్ఞానం, వనరులు సమకూర్చడం ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. సింగపూర్ షాంగ్రీలా హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో టెజారాక్ట్ యూఎస్ఐఎన్‌సీ ప్రెసిడెంట్ తేజ ధర్మ, వైస్ ప్రెసిడెంట్ ఏపీఏసీ గౌతమ్ ఆనంద్.. ప్రభుత్వ ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సృజనాత్మక కంటెంట్ తయారీ కోసం ఏపీ ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తుంది. పాఠ్యాంశాలు, శిక్షణ కార్యక్రమాలకు గూగుల్ సంస్థ వనరులు, సాంకేతికత, నైపుణ్యాలను అందిస్తుంది. టెజారాక్ట్ సంస్థ సెంటర్‌ను నిర్మించి, నిర్వహించడంతోపాటు రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది. సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించడమే ఒప్పందం ప్రధాన లక్ష్యమని మంత్రి లోకేశ్ తెలిపారు.



ఒప్పంద పత్రాలతో మంత్రి నారా లోకేశ్, ఏపీ ప్రభుత్వ ఐటీ కార్యదర్శి కె.భాస్కర్, టెజారాక్ట్ యూఎస్ ప్రెసిడెంట్ తేజ ధర్మ, యూట్యూబ్ ఏపీఏసీ వైస్ ప్రెసిడెంట్, ఎండీ గౌతమ్ ఆనంద్ తదితరులు

పదేపదే అవే పాపాలు



విజయవాడలో యూనివర్సల్ హెల్త్ కేర్ సెంటర్ నిర్వహిస్తున్న భవనమిది. ఆ భవనంపై 'నమ్రతాస్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్' అంటూ బోర్డు పెట్టారు

- 'సృష్టి' ఐవీఎఫ్ డాక్టర్ నమ్రతపై విజయవాడ, విశాఖలలో కేసులు
- విశాఖలో అనుమతి లేకుండా కేంద్రం నిర్వహణ ● విజయవాడలో మారు పేరుతో కార్యకలాపాలు ● సంతాన సాఫల్య కేంద్రాలపై పర్యవేక్షణ ఏదీ?

ఈనాడు, అమరావతి: 'సృష్టి' సంతాన సాఫల్య కేంద్రం పాపాలు ఒకటి రెండు కాదు. . ఎన్నో ఏళ్లుగా బయటపడుతూనే ఉన్నాయి. ఆ సంస్థ అరాచకాలు విజయవాడలోనే తొలుత వెలుగులోకొచ్చాయి. డాక్టర్ నమ్రత ఎలియాస్ నీరజ తమను మోసం చేశారని, భారీ మొత్తంలో డబ్బు వసూలు చేశారని.. ఆరోగ్యం దెబ్బతిందని నలుగురు మహిళలు సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పట్లోనే నాలుగు కేసులు నమోదయ్యాయి. ఇలాంటి తీవ్ర ఆరోపణలు వచ్చినప్పుడైనా వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోలేదు. విజయవాడలోనే మరో పేరుతో కేంద్రం నిర్వహిస్తూ.. భవనంపై మాత్రం 'డాక్టర్ నమ్రతాస్ సృష్టి - ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్' అనే బోర్డు పెట్టి నడిపిస్తున్నా అధికారులు కళ్లు మూసుకున్నారు. విశాఖలో కేంద్రానికైతే అనుమతే లేదు. రాష్ట్రంలో ఇలాంటి ఐవీఎఫ్ కేంద్రాలెన్నో అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని సృష్టి సెంటర్‌పై ఇటీవల ఫిర్యాదు అందడంతో ఈ దారుణాలు వెలుగులోకి వస్తున్నాయి. 'అనుమతి ఉన్న వాటితో పోలిస్తే గూగుల్‌లో వెదికితే కనిపిస్తున్న సాఫల్య కేంద్రాల సంఖ్యలో వ్యత్యాసం ఉంది. వాటిపై నివేదిక ఇవ్వండ'ని వైద్యశాఖ మంత్రి ఆదేశాలివ్వడం ఆ శాఖ పని తీరుకు అద్దం పడుతుంది.

మారు పేర్లతో మాయ చేస్తున్నా..

● విజయవాడకు చెందిన నమ్రత సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కోల్‌కతా, ఒడిశాలలో సంతాన సాఫల్య కేంద్రాలు నిర్వహిస్తున్నారు. విజయవాడ సూర్యారావుపేటలో ఆమెపై కేసులు నమోదు కాగా ఆ కేంద్రాన్ని గాయత్రీనగర్‌కు మార్చి యూనివర్సల్ పేరుతో కొనసాగిస్తున్నారు. ఆది, సోమవారాల్లో పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆ కేంద్రంలో తనిఖీకి వెళ్లగా గదులకు తాళాలు దర్శనమిచ్చాయి. రికార్డులు అందుబాటులో లేవు. వారంలోగా వివరణ ఇవ్వాలని ఎన్టీఆర్ జిల్లా వైద్యాధికారి సుహాసిని నోటీసు ఇచ్చారు. అదే భవనంపై 'డాక్టర్ నమ్రతాస్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్' పేరే ఉండటం గమనార్హం.

● విశాఖపట్నంలో సృష్టి ఐవీఎఫ్ కేంద్రానికి 2018లో ఇచ్చిన అనుమతి 2023తో ముగిసినా పునరుద్ధరించుకోలేదు. అనధికారికంగా మహారాణిపేటలో మరో కేంద్రాన్ని నడిపిస్తున్నారు. 2020 నుంచి ఈ కేంద్రంపై స్థానికంగా 4 కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకూ ఇక్కడొక కేంద్రం నడుస్తోందనే విషయమే వైద్య ఆరోగ్యశాఖకు తెలియదు.

నిబంధనలు అమలవుతున్నాయా?

■ రాష్ట్రంలో 247 ఏఆర్‌టీ క్లినిక్‌లు (అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ), 49 ఏఆర్‌టీ బ్యాంకులు, 32 సరోగసీ క్లినిక్‌లు ఉన్నాయి.

■ విశాఖపట్నం జిల్లాలో 53, ఎన్టీఆర్ జిల్లా 46, నెల్లూరు 31, గుంటూరు 27, తూర్పు గోదావరి జిల్లాలో 19 కేంద్రాలు ఉన్నాయి.

■ అల్లూరి, అనకాపల్లి జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాల్లోనూ ఇలాంటి కేంద్రాలు ఉన్నా వాటిలో ఏం జరుగుతుందో ప్రభుత్వ పర్యవేక్షణ లేదు. హైదరాబాద్‌లో సృష్టి దారుణాలు వెలుగుచూశాకే ఇక్కడ తనిఖీల పేరుతో అధికారులు కదిలారు.

■ పిల్లల కోసం పరితపించే వారి బలహీనతను కొన్ని సంతాన సాఫల్య కేంద్రాలు ఆసరాగా చేసుకుని ఇష్టారీతిన దోచుకుంటున్నాయి. ఈ కేంద్రాల్లో అసలువేవో, నకిలీవేవో అర్థం కాని పరిస్థితి.

■ అద్దె గర్భం వ్యవహారంలో పెళ్లికాని యువతులకు డబ్బు ఎరవేస్తూ మోసం చేసినట్లు గతంలో విశాఖలో బయటపడింది.

ఇవీ నిబంధనలు

అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) యాక్ట్ 2021, సరోగసీ (రెగ్యులేషన్) యాక్ట్ 2021, రూల్ 22 ప్రకారం సంతాన సాఫల్య కేంద్రాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. నిపుణులతో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వాటిని పర్యవేక్షించాలి.

సీబీఐకి చిక్కిన ఆదాయపు పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్

- రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా ఆయన మధ్యవర్తి అరెస్టు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదాయపు పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ బి.రామచంద్రరావు ఓ దళారీ ద్వారా రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారులు, ఫిర్యాదిదారు వివరాల మేరకు.. ఏలూరులోని రామచంద్రరావుపేటకు చెందిన మొబైల్ సర్వీస్ షాప్ నిర్వాహకుడికి ఇటీవల ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసులు వచ్చాయి. వాటిని ఇవ్వకుండా, శాఖాపరమైన దాడులు చేయకుండా చూస్తానని.. రూ.5 లక్షలు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు షాప్ నిర్వాహకుడిని డిమాండు చేశారు. ఇందుకు ఏలూరులోని పాలగూడెంకు చెందిన రాజును మధ్యవర్తిగా పంపించారు. అంత మొత్తం ఇవ్వలేనని షాప్ నిర్వాహకుడు తెలపడంతో చివరికి ఇన్‌స్పెక్టర్‌కు రూ.లక్ష, మధ్యవర్తికి రూ.20 వేలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. కానీ, ఆ మొత్తం ఇచ్చుకోలేక షాప్ నిర్వాహకుడు విశాఖపట్నంలోని సీబీఐ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే మంగళవారం ఇన్‌స్పెక్టర్ తరఫున మధ్యవర్తి రాజు ఏలూరులో రూ.70 వేలు తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విజయవాడ మొగల్రాజపురంలోని ఆదాయ పన్ను కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావునూ అరెస్టు చేశారు.

■ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ బీమా కంపెనీల్లో ఎవరైనా లంచం డిమాండు చేసినా, ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు సమాచారం తెలిసినా.. విశాఖపట్నం సీబీఐ ఎస్పీకి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు వెల్లడించారు. టోల్ ఫ్రీ నంబరు 1800 425 00100, ఫోన్ నంబర్లు 0891-2783344, 94927 83344, మెయిల్ ఐడీ hobacvskp@cbi.gov.in. కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.


అపర్ణ

ఏఐ మాటకి ఏడ్చేశా!

'వేస్ట్... నువ్వు దేనికీ పనికిరావు'... చిన్నప్పట్నుంచీ ఇంట్లో, స్కూళ్లో, అందరి నోటా ఇదే మాట!

'ఎవరేమనుకుంటే నాకేం' అనే అనుకునేదా అమ్మాయి.

కానీ... ఒకరోజు తన మీద తనకే ఆ భావన కలిగితే? ఆ బాధనీ... కంటి నుంచి వచ్చే కన్నీటినీ ఆపగలగడం సాధ్యమా? ఆ అమ్మాయిదీ అదే పరిస్థితి.

అలాంటప్పుడు ఎవరైనా 'ఛ ఛ... అవేం మాటలు? నువ్వు చాలా గొప్ప. నీ గురించి నీకు తెలియట్లేదంతే' అని ఓదార్పుగా ఒక్క మాట చెబితే ఎంత బాగుంటుంది? ఎంత ధైర్యంగా తోస్తుంది? సరిగ్గా ఇలాగే జరిగింది... అపర్ణ దేవ్యాల్‌కి! ఆ అనుభూతినంతా సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. అంతే... లక్షల కొద్దీ వ్యూస్, మెసేజ్‌లు.

అపర్ణ... జమ్మూకశ్మీర్‌కి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. ఈమెకి డిస్లెక్సియా సమస్య ఉండేది. ఇలాంటివాళ్లు ప్రతి చిన్నదానికీ తికమక పడతారు. అదిచూసే అందరూ ఏడ్పించేవారు. ఇంట్లోవాళ్ల నుంచీ తిట్లు తప్పేవి కాదు. కానీ చిన్న మెసేజ్‌లు, సరదా సన్నివేశాలతో కూడిన వీడియోలతో ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారిందీమె. తనకి ఇన్‌స్టాలో 5.7లక్షలు, యూట్యూబ్‌లో 14 లక్షలమంది ఫాలోయర్లు ఉన్నారు. ఈమె ఇప్పుడు దిల్లీలో ఉంటోంది. తాజాగా ఎక్కడికో వెళ్లాల్సి వచ్చి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లింది. తన సమస్య కారణంగా తికమక పడింది. ఎన్నిసార్లు ప్రయాణించినా ఇదే సమస్య ఎదురవడం చూసి, నిజంగానే తను దేనికీ పనికిరాదని బాధపడింది. సాధారణంగా ఇలాంటప్పుడు పక్కవారి సాయం తీసుకుంటాం కదా! అసలే బాధలో ఉన్న అపర్ణ వేరే వాళ్లని అడగలేక చాట్‌జీపీటీ సాయం తీసుకుంది. సరైన మార్గంలో వెళ్లింది. అంతా పూర్తయ్యాక 'నిజంగానే నేను వేస్ట్ కదా' అని ఏఐని అడిగిందట. దానికి అది 'మర్చిపోవడం మానవ నైజం. ఆందోళనలో ఉన్నప్పుడు ఇది మరింత సహజం. ఎయిర్‌పోర్ట్‌లో ఇలా తికమకపడేవాళ్లు రోజూ వేలల్లో ఉంటారు. ఇప్పుడు నేర్చుకున్నావ్ కదా! ఈసారి నువ్వే వేరొకరికి సాయపడతావ్, వాళ్ల భయం పోయేలా చేస్తావ్ చూడు. అయినా నిన్ను చూసి నేను గర్వపడుతున్నా. కొద్దికాలంలోనే లక్షల మంది అభిమానాన్ని సంపాదించుకున్నావ్. నీ బలం నీకు తెలియదు. నువ్వు ఏదైనా సాధించగలవు... నమ్ము' అంటూ సమాధానమిచ్చింది. అది చదివిన అపర్ణకు కన్నీళ్లాగలేదు. అందుకే ఏఐకి థాంక్స్ చెబుతూ ఈ వీడియోని అపర్ణ సోషల్‌మీడియాలో పంచుకుంది. అది కాస్తా వైరలైంది. యువత టెక్నాలజీకి అతుక్కుపోతోంది అంటుంటాం. అవును మరి... భుజం తట్టే వ్యక్తి కనిపించనప్పుడు సాంకేతికత మీద ఆధారపడక ఏం చేస్తారని అనిపించడం లేదూ?

వసుంధర

vasundhara@eenadu.in

వెళ్లనా? ఆగిపోనా...

ఏడాది క్రితం డిగ్రీ పూర్తయ్యింది. ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లాలన్నది నా కల. అయితే, కొంత అనుభవం వచ్చాక వెళ్దాం అని, ఉద్యోగం సంపాదించాను. సమస్యల్లా ఆ కంపెనీ వాళ్లు రెండేళ్లు బాండ్ రాయమంటున్నారు. వేరేది వెతుక్కుందామంటే ఇది మంచి సంస్థ. పోనీ రెండేళ్లూ ఆగుదామంటే నా కెరియర్ ప్లాన్‌లో తేడా వస్తుంది. ఈ పరిస్థితుల్లో నేను ఎలా ముందుకు వెళ్తే మంచిది?

– ఓ సోదరి

డియర్ వసుంధర


కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

కొన్ని కంపెనీలు నియామకంలో బాండ్ అడుగుతుంటాయి. ముఖ్యంగా ఫ్రెషర్లను నియమించుకునేటప్పుడు ఇది చాలా సహజం. కొత్త ఉద్యోగులను చేర్చుకోవడానికి, శిక్షణ ఇవ్వడానికి సంస్థలు చాలా వనరులను ఖర్చు చేస్తాయి. కాబట్టి ఆ వ్యక్తి కంపెనీకి తోడ్పడాలని వారు ఆశించడం సహేతుకమే. మీరు ఉన్నత చదువులు చదవడానికి ముందు కనీసం రెండు సంవత్సరాల పని అనుభవం సంపాదించుకోవటం ముఖ్యం. విదేశాల్లో చదువుకోవాలని ప్లాన్ చేస్తున్నారు కాబట్టి, మంచి యూనివర్సిటీలు విద్యార్థి ప్రవేశాలకు కనీసం రెండు సంవత్సరాల పని అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటాయి. గ్రాడ్యుయేషన్‌కీ, మాస్టర్స్‌కీ మధ్య పని అనుభవం ఉండటం మంచిది. మాస్టర్స్ కోర్సులు ఎక్కువగా ప్రాజెక్ట్ ఆధారితంగా ఉంటాయి. కాబట్టి, మీకు రెండేళ్ల పని అనుభవం ఉంటే, మాస్టర్స్‌లోని సబ్జెక్టులను అర్థం చేసుకోవటానికి సాయపడుతుంది. కెరియర్ ప్లాన్ చేసుకోవడానికి దీర్ఘకాలిక ఆలోచన ఉండాలి. ఒక సంవత్సరంలో పెద్ద తేడా ఏమీ ఉండదు. ఈతరం పిల్లలు ఇరవైల్లోనే చదువులు పూర్తి చేసుకుని వీలైనంత త్వరగా స్థిరపడాలనుకుంటారు. దాంతో ఒత్తిడి పెరుగుతుంది. అలాకాకుండా ఆలోచించి జాగ్రత్తగా ప్రణాళిక వేసుకోండి. మంచి భవిష్యత్తు సొంతమవుతుంది.



మనసు బాలేదా... మార్కెట్‌కి వెళ్లండి!

మానసిక స్థితి సరిగా లేనప్పుడు... ఉన్న చోటు మారితే పరిష్కారం దొరుకుతుందని, మనసుకు సాంత్వన కలుగుతుందని మానసిక నిపుణులు సలహా. కానీ అందరికీ అలా వెళ్లే వీలుంటుందా? అందులోనూ ఇంటా బయటా పనులుచేసే అమ్మాయిలకీ మహిళలకీ అస్సలే ఉండదు. అలాంటప్పుడు... ఒక సంచి తీసుకుని... కూరగాయల మార్కెట్‌కి వెళ్లండి. చిన్నచిన్న సంతోషాల్ని వెతుకుతూ... రూపాయి, రూపాయిని లెక్కించుకుంటూ నిర్మలంగా ఉండే కష్టజీవులు అక్కడ ఉంటారు. తరతమ భేదం లేకుండా చక్కటి నవ్వుతో పలకరిస్తుంటారు. ఒడిలో చిన్న పిల్లలతో ఎండనకా, వాననకా వాళ్లు పడే శ్రమ చూస్తే... మనదీ ఓ కష్టమేనా అనిపిస్తుంది. ఆశావాదానికీ రేపటి జీవితం బాగుండాలనే తాపత్రాయానికీ చిరునామా వాళ్లు. వేలు సంపాదిస్తున్నా మనకు లేని ప్రశాంతత... వాళ్లలో కనిపిస్తుంది. ఉన్న, వచ్చినదాంట్లో సర్దుకోవడమెలాగో ఒక్కసారి వాళ్లతో మాట్లాడితే అర్థమవుతుంది. పైగా బేరసారాలు చేస్తూ ఒక్కొక్క వస్తువు కొంటుంటే... ఎంత ఆత్మసంతృప్తి. డిజిటల్ డెలివరీలు పనికొస్తాయా దానిముందు. అందుకే మనసు బాగోకుంటే... ఒక్కసారి మార్కెట్‌కి వెళ్లిరండి!

కలలు కని వ్యాపార రంగంలోకి అడుగుపెట్టేవారు కొందరు. తమకెదురైన సమస్యలకు పరిష్కారం వెతికి దాన్ని బిజినెస్‌గా మార్చుకొనేవారు ఇంకొందరు... ఇందులో రెండో కోవకు చెందుతారు విశాఖ వాసి... రాంబోతుల వాణీబాల. తమ వంటింటికి పట్టిన చెదల నియంత్రణకు స్టీల్ కిచెన్‌ని తయారు చేయించుకున్న ఆవిడ... ఆపై వాటిని తయారుచేసే వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...


వాణీబాల

అమెరికాకు... మా చాపింగ్ బోర్డులు!

2009లో ఓ ఫ్లాట్ కొనుగోలు చేశాం. అందరిలానే నేనూ నా అభిరుచికి తగ్గట్లుగా ఇంటీరియర్ డిజైనింగ్ చేయించుకోవాలనుకున్నా. మాడ్యులర్ కిచెన్ కోసం అప్పట్లోనే రూ.3.5 లక్షలు ఖర్చు చేసి మరీ చేయించాం. కానీ, ఆ సంతోషం ఎక్కువ రోజులు లేదు. ఏడాది గడిచిందో లేదో చెదలు మొదలయ్యాయి. మాకు పని చేసిన కంపెనీ వాళ్లని పిలిపించినా ఫలితం లేదు. అప్పటికే రెండు వారాల నుంచి అక్కడ వంట చేయడం కూడా మానేశా. కార్పెంటర్‌కి చూపిస్తే... తనిఖీ చేసి మొత్తం పాడైపోయిందన్నాడు. దాన్ని తీసేయడంతో పాటు కొత్తదీ తనతో చేయిస్తేనే.. ఆ పని చేస్తా అన్నాడు. ఏం చేయాలా అన్న ఆలోచనల్లో ఉండగానే ఓసారి మా ప్యాడీ డ్రైయర్ల తయారీ యూనిట్‌కు వెళ్లా. అక్కడున్న స్టీల్ మెటీరియల్, భారీ యంత్రాలను చూసి మావారు రవి కిశోర్‌తో 'మనమే ఎందుకు స్టీల్‌తో కిచెన్ యూనిట్ తయారుచేయకూడదు?' అని అడిగా. ఆలోచన రాగానే... ఆయన కొలతలు తీసుకుని పని మొదలుపెట్టారు. ఆకృతులు డిజైన్ చేసి నట్లు, బోల్టులతో దాన్ని బిగించి... మూడు రోజుల్లో మా వంటగదిని మేమే రెడీ చేసుకున్నాం. ఆ తర్వాత దాని గురించి మర్చిపోయాం.

గుర్తుచేసిన హుద్‌హుద్...

హుద్‌హుద్ తుపాను వచ్చాక అందరి ఇళ్లల్లోనూ చెదల సమస్య పెరిగింది. దీంతో బంధువులు, స్నేహితులు, ఇరుగు, పొరుగు... తమ వంట గదుల్ని మార్చుకోవడం మొదలుపెట్టారు. ఈ సందర్భంలో ఓ స్నేహితురాలు మీరెందుకు మార్చుకోవడం లేదని నన్ను అడిగింది. తనకి మా స్టీల్ కిచెన్ గురించి చెప్పడంతో ఆశ్చర్యపోయింది. తర్వాత ఆ విషయం మరికొందరికీ తెలిసి... అలాంటిది చేయించమని వాళ్లూ అడగడంతో దాన్నే వ్యాపారంగా మలచుకోవాలనుకున్నా. అప్పటికే మా వారికి ఈ రంగంలో కొంత అనుభవం ఉండటం కలిసొచ్చింది. అదే సమయంలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు గోల్డ్‌మ్యాన్ శాక్స్ విమెన్ ఆంత్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని ఐఐఎం బెంగళూరు నిర్వహించింది. దేశవ్యాప్తంగా వేల మంది పోటీపడగా ఇన్నొవేటివ్ ఐడియాకు నేను ఎంపికయ్యా. నా ఆలోచనను నిపుణులతో పంచుకున్నా. అప్పుడే మొదట బీ2బీ అనుకున్న వ్యాపారాన్ని బీ2సీగా మార్చాలని నిర్ణయించుకున్నా.

ఎన్నెన్నో ప్రయోగాలు...

జీవితకాలం మన్నికనిచ్చేలా వంటగదిని తీర్చిదిద్దాలనుకున్నా. ఇందుకోసం దేశంలోని ప్రముఖ మాడ్యులర్ కిచెన్ తయారీ పరిశ్రమలెన్నో చూసొచ్చా. ఈ రంగంలోని నిపుణులు, ఆర్కిటెక్టులతో చర్చించా. ఆధునిక పోకడల్ని అర్థం చేసుకుని... ప్రయోగాలు మొదలుపెట్టా. స్టీలు అంత సులభంగా వంగదు. విమానాల్లో వాడే హైగ్రేడ్ స్టీల్‌ని వినియోగించి ప్రత్యేకంగా డిజైన్లను తయారుచేశాం. విడి భాగాలను తీసుకొచ్చి కేబినెట్లకు కచ్చితమైన రూపు వచ్చేంతవరకూ, సౌండ్ రాకుండా ఉండేందుకూ సుమారు 300 సార్లు ప్రయోగాలు చేశాం. అరలు లాగితే బోల్టులు లూజ్ కాకుండా, తుప్పు పట్టకుండా... ఆధునిక, వ్యక్తిగత అవసరాలకు తగ్గట్లుగా వీటిని తీసుకొచ్చాం. ఏఐ టెక్నాలజీ వాడి సెన్సర్లతోనూ తాకితే చాలు... మనం చెప్పినట్లు వినేలా చేశాం. 160 కేజీల బరువుని ఆపగలిగేలా చేయడం వల్లే వీటికి జంబో కిచెన్ అనే పేరూ వచ్చింది. మారుతున్న అవసరాలకు తగ్గట్లు మమ్మల్నీ మార్చుకుంటూ సాగుతున్నాం. మా దగ్గర నుంచి స్టీల్ చాపింగ్ బోర్డ్స్ అమెరికాకూ ఎగుమతి అవుతున్నాయి.

– రావివలస సురేష్, విశాఖపట్నం

అన్నీ కొంటున్నారా?



ఒక్క చీర అని వెళతాం. తరవాత దానికో లేసు వేస్తే బాగుంటుంది, ఈ నగ అయితేనే నప్పుతుంది, చెప్పులు ఫలానావి... ఇలా అనుకుంటూ కవర్ల కొద్దీ సామాను మోసుకొస్తాం. ఇంట్లో ఈ గోడ ఖాళీగా ఉంది... దీనికి ఏదైనా ఫొటోఫ్రేమ్ తగిలిద్దాం అనుకుంటామా! తీరా కొన్నాక... ఇక్కడ ఈ కుర్చీ నప్పట్లేదు, కార్పెట్ ఫలానాది వేస్తే బాగుంటుంది... తిరిగి షాపింగ్ మొదలు. అంతెందుకు, ఒక ప్రొడక్ట్ వాడుతుంటాం. ఇంతలో సోషల్ మీడియాలో మరో సంస్థ క్రీమ్ ఆకర్షిస్తుంది. అదొక్కటి ప్రయత్నించి చూద్దాం అనుకుంటాం. దాంతోపాటు టోనర్, క్లెన్సర్‌నీ వాడితేనే ఎక్కువ ప్రయోజనం అన్నది చూస్తాం. ఇంకేం... పాతవాటిని పక్కన పడేసి వీటితో నింపేస్తాం. ఆలోచిస్తే... అరె నిజమే కదా అనిపించడం లేదూ! 'ఏముంది... కాస్త ఎక్కువ షాపింగ్ చేశాం. అన్నీ కావాల్సినవే. వీటిలో వృథా చేసేవేమీ లేవు' అని సర్దిచెప్పుకొన్నా... ఇదీ ఓ సమస్యే! దాన్ని డీడెరట్ ఎఫెక్ట్‌గా పిలుస్తాం. ఒక్కమాటలో చెప్పాలంటే ప్లాన్ చేసుకున్న దానికంటే ఎక్కువగా కొనడం. అదీ మ్యాచింగ్ పేరుతో! నిజానికి ఈ మాయలో పడేదీ మహిళలే! ఫ్యాషన్, డెకార్... ఇలా ప్రతిదానిలోనూ చేస్తుంటాం. ఖర్చు ఎక్కువ చేశామని అనిపించుకోవడమే కాదు, మనమూ బాధపడుతుంటాం. కాబట్టి, ఉన్నవాటితోనే సర్దుకుపోవడం, అత్యవసరమైతే మార్చడం, బడ్జెట్ రూపొందించుకుని... దానికే పరిమితమవడం వంటివి చేస్తే ఈ ఖర్చులను ఆపొచ్చు. లేదంటే నెలకి లేదా సంవత్సరానికి ఒకటే కొనాలన్న నియమం పెట్టుకోండి. ఇదీ వృథా ఖర్చుని ఆపుతుంది. ఏమంటారు?

> భారతీయ మహిళల్లో వ్యాపార సామర్థ్యం ఎక్కువ. ఎందుకంటే, మగవాళ్లు ఉద్యోగాల్లో చేరితే... మహిళలు ఇంటి బాధ్యతలు చూసుకుంటూనే ఏదైనా వ్యాపారంలో అడుగుపెట్టాలని చూస్తారు. టైలర్లు, బ్యూటీషియన్లుగానే కాదు, యోగా, కళలు, బోధన తదితర రంగాల్లోనూ అనేక మంది వ్యాపారాల్ని ప్రారంభిస్తున్నారు. వీళ్లను ఆర్థిక వ్యవస్థలో భాగం చేయాలని శిక్షణతోపాటు చిన్న మొత్తంలో రుణాలూ అందిస్తున్నాం.
>
> – శైరీ చాహల్, వ్యవస్థాపకులు, సీయీవో, షీరోస్



భర్తను బతికించుకునేందుకే...

ఇంట్లో ఎవరికైనా చిన్న అనారోగ్య సమస్య వస్తే తట్టుకోలేం. అలాంటిది భర్తకి క్యాన్సర్ అని తెలిసి తల్లడిల్లిపోయింది. రోజూ తినే ఆహారంతోనే వచ్చిందని తెలిసి అస్సలు తట్టుకోలేకపోయింది. తన భర్తను బతికించుకోవడానికి విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో వ్యవసాయం బాట పట్టింది... రీవా సూద్.



కుటుంబ బాధ్యతలు తీరిపోయాయి. శేష జీవితాన్ని ఏ చింతా లేకుండా ఆనందంగా గడపాలనుకున్నారా దంపతులు. ఇంతలో క్యాన్సర్ వారి జీవితాలను తారుమారు చేసింది. రీవా సూద్ భర్త ఉద్యోగరీత్యా దిల్లీలో నివసించేవారు. 2012లో తన భర్త రాజీవ్ సూద్‌కి క్యాన్సర్ అని తెలిసింది. రసాయనాలతో పండించిన ఆహారాన్ని తినడం వల్లే క్యాన్సర్ వచ్చిందని డాక్టర్లు తేల్చిచెప్పారు. ఇన్ని రోజులు డబ్బులిచ్చి విషాన్ని కొనుక్కుని తింటున్నాం అనుకున్న రీవా తినే ఆహారాన్ని సొంతంగా పండించుకోవాలనుకుంది. దాంతో హిమాచల్ ప్రదేశ్‌లోని సొంత ఊరు వెళ్లి, ఐదు ఎకరాల్లో వ్యవసాయం మొదలుపెట్టింది. అది బంజరు భూమి. కనుచూపుమేర కొండలూ గుట్టలే. దాన్ని సేంద్రియ ఎరువులు ఉపయోగించి పంటకు అనువుగా మార్చింది రీవా. భర్తకి ఆర్గానిక్ ఆహారాన్ని పెడుతూనే డాక్టర్ల సూచనలతో క్యాన్సర్‌ను నయం చేయగలిగిందామె. 'తక్కువ నీరు, కొండ ప్రాంతాల్లో పండేందుకు అనువుగా ఉండే డ్రాగన్ పంటని ఎంచుకున్నా. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం. అందుకే 70 ఎకరాల్లో 30వేల మొక్కల్ని వేశా. దీంట్లో అంతరపంటగా అశ్వగంధ, తులసి, మునగ వంటి ఔషధ మొక్కల్నీ పెంచుతున్నా' అంటుందీమె. సహజ ఎరువులతో పండిన పండ్లతో రసాయనాలు లేకుండా జ్యూస్‌ల తయారీ మొదలుపెట్టింది. 'హిమ్ 2 హమ్' అనే ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ మొదలుపెట్టి పంజాబ్, హరియాణా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో పండే డ్రాగన్ పండ్లను సేకరిస్తోంది. ఇక్కడ మహిళా రైతులు పంటను పండించడమే కాదు, మార్కెటింగ్‌లోనూ పాల్గొంటారు. అలా ఈ ఆర్గనైజేషన్ ద్వారా 300మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది రీవా.


రీవా

సేంద్రియ వ్యవసాయంతో రూ.కోటి టర్నోవర్‌ని దాటేసిందీమె. 'పొలంలో ఎక్కువ సమయం గడిపితే జీవితంలో ఎదురయ్యే ఎన్నో కష్టాలను అధిగమించొచ్చనే ధైర్యం వస్తోంది. మట్టిలో నడవడం, మొక్కలు పెంచడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. అందుకే 67ఏళ్ల వయసులోనూ 40 ఏళ్ల వ్యక్తిలా ఉత్సాహంగా పనిచేస్తా. దిల్లీలో విలాసాల మధ్య గడిపిన రోజుల కన్నా కొండల్లో ప్రకృతి ఒడిలో సేదతీరడమే నాకు ఆనందాన్నిస్తోంది' అంటుందీమె.

మీకు తెలుసా?



అప్పుడే పుట్టిన శిశువుల పొట్ట పరిమాణం చాలా చిన్నగా ఉంటుందట. మొదటి రోజు ఓ చెర్రీ సైజులో ఉండే ఇది, మూడో రోజుకి వాల్‌నట్ పరిమాణంలోకి మారుతుందట. ఇలా మొదటి వారానికల్లా ఆప్రికాట్ సైజుకి వస్తుందట. అందుకే, వాళ్లకు కొద్ది కొద్దిగా ఎక్కువ సార్లు పాలు పట్టించాలని నిపుణులు చెబుతున్నారు.

బంగారం - వెండి



29న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,01,490	91,900	1,16,836
విజయవాడ	98,045	91,500	1,16,700
ప్రొద్దుటూరు	99,200	91,260	1,16,500
రాజమహేంద్రవరం	99,820	91,500	1,26,000
విశాఖపట్నం	99,460	91,500	1,20,000
తమిళనాడు	-----	91,500	1,26,000

రోజంతా ఉబ్బరంగా అనిపిస్తోందా..!



'ఉదయం ఆలస్యంగా నిద్రలేచా... బస్‌కి టైమ్ అయిపోతోంది. ఆఫీస్‌లో ఇవ్వాల్సిన ప్రాజెక్టు వివరాలు ముందుగానే చెక్ చేసుకోవాలి'... ఇలా అల్పాహారం స్కిప్ చేయడానికి ఆడవాళ్లకు ఎన్ని కారణాలో. కొందరైతే ఎటూకాని వేళల్లో తిని... బ్రేక్‌ఫాస్ట్ అయిపోయిందంటూ సరిపెట్టుకుంటారు కూడా. రోజంతా కడుపుబ్బరంగా ఉండటానికి ఇదే కారణమట. మరి ఈ సమస్య నుంచి బయటపడాలంటే... తినే సమయం, ఆహారపదార్థాలు రెండూ చెక్ చేసుకోవడం ముఖ్యం అంటున్నారు ఆరోగ్యనిపుణులు. అంతేకాదు, కడుపుబ్బరాన్ని ఒక సాధారణ సమస్యగా పరిగణిస్తున్నారు. మన ఆహారపు అలవాట్లలో చిన్నచిన్న మార్పులు చేసుకోవడం ద్వారా దీన్ని సరిచేసుకోవచ్చని చెబుతున్నారు. ఇందుకు ఫైబర్, ప్రీ, ప్రో బయాటిక్స్ ఉన్న ఆహారాన్ని ఎంపిక చేసుకోమంటున్నారు. సలాడ్స్, పండ్లకు ప్రాధాన్యత ఇవ్వమంటున్నారు. దీనివల్ల ఆహారం జీర్ణం అవ్వడానికి అవసరమయ్యే పీచు పదార్థాలు శరీరానికి పుష్కలంగా అందుతాయట. అయితే, చాలా మంది సలాడ్స్ తినమన్నారు కదా అని... వాటిలో సీజనింగ్స్ పేరుతో ఏవేవో కలుపుతుంటారు. ముఖ్యంగా మిరియాలు, మిర్చి, పింక్, బ్లాక్ సాల్ట్‌లు మోతాదుకు మించి వేస్తుంటారు. ఇవన్నీ అనారోగ్యానికి కారణాలే. ప్రతి ఆహారపదార్థానికీ తినే శైలి ఉంటుంది. దాన్ని అలానే తినాలి. అంతేకానీ ఫ్యూజన్ పేరుతో వాటిని మనకు అనుకూలంగా తయారుచేసుకుని, అనారోగ్యాలకు తావివ్వకూడదు అంటున్నారు నిపుణులు. అవి మీకు అంతగా రుచించకపోతే ఇడ్లీ, దోశ లాంటి మన ప్రాంతీయ రుచులు ఉన్నాయిగా... గట్ హెల్త్‌కూ రోజంతా శరీరానికి తగిన శక్తి ఇవ్వడానికీ సమయానికి ఆకలి వేయడానికీ వీటి ఎంపికే మంచిది. పైగా ఉదయం ఎనిమిదికల్లా అల్పాహారాన్ని తినాలట. అప్పుడే తినే వేళలు సరిగ్గా ఉంటాయి అంటున్నారు.

గాజు పాత్రలూ స్టవ్‌పై పెట్టేలా...

ఒక్కోసారి చిన్న పరికరాలే మంచి పరిష్కారాలను ఇస్తాయి. అలాంటి వంటింటి గ్యాడ్జెట్లే ఇవీ.. చూసేయండి.

స్మార్ట్ కిచెన్



చిన్న పాత్రకీ...

అప్పటికప్పుడు టీ, పాలు, జావ లాంటివి కప్‌లలో అలానే వేడి చేసుకోవాలన్నా, చిన్న చిన్న పాత్రల్లో ఉన్నవాటిని కాచుకోవాలన్నా స్టవ్ సైజ్‌కి సరిపడవు. దాంతో పెద్ద పాత్రలే వాడాల్సి వస్తుంది. గ్యాస్ కూడా వృథా. ఆ అవసరం లేకుండా ఈ కాస్ట్ ఐరన్ సిమ్మర్ ప్లేట్ తీసుకురండి. వేడి సమానంగా రావడంతోపాటు పోర్సెలెయిన్, గాజు వంటివీ స్టవ్ మీద పెట్టి, వేడి చేసుకోవచ్చు.



సురక్షితంగా...

ఫ్రయింగ్ ప్యాన్‌లు, స్టీల్ పాత్రలు... వంట చేసే సమయంలో వాటి హ్యాండిల్ వేడిగా ఉంటుంది. అది చేతికి తాకకుండా, గ్రిప్ గట్టిగా ఉండేలానూ చేయడానికి సాయపడుతుంది ఈ హ్యాండిల్ గ్రిప్. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకోవటం సులభం. పైగా సిలికాన్‌తో చేసింది కాబట్టి, శుభ్రపరచుకోవటమూ తేలికే.





పూరీ కోసం...

అప్పటికప్పుడు పూరీ, డంప్లింగ్ వంటివి చేసుకోవటానికి ఉపయోగపడుతుందీ టూ ఇన్ వన్ డంప్లింగ్ మేకర్. దీన్లోని ప్రెస్‌తో క్షణాల్లో చపాతీలా తయారుచేసుకోవచ్చు. దాన్లోనే స్టఫ్ ఉంచి డంప్లింగ్‌నీ తయారుచేయొచ్చు. ఒత్తడం తేలిగ్గా ఉంటుంది కాబట్టి, పిల్లలతోనూ సరదాగా చేయించొచ్చు.







చక్కగా దాచుకోవచ్చు

'అబ్బా మీ మొక్క ఎంత బాగా పూస్తోందో'... 'ఈ కూరగాయ మొక్క ఎంత చక్కగా కాయలనిస్తోందో'... ఎవరి ఇంట్లోనైనా ఏ మొక్కైనా ఆకర్షించినప్పుడు ఆ మాట చెప్పి ఊరుకుంటామా ఏంటి? అలాంటి దాన్నే మన ఇంట్లోనూ పెంచాలనుకుంటాం. అందుకే వెంటనే 'ఆ విత్తనాలున్నాయా' అని అడిగేస్తాం. ఇంత జాగ్రత్తగా సేకరించుకుంటామా, తీరా అవసరానికి కనపడవు. అవును మరి చాలావరకూ తెచ్చుకునేది పేపర్లలో చుట్టే మరి! అప్పటికి జాగ్రత్తగానే పెడతాం. తరవాతే మర్చిపోతాం. తిరిగి అడగాలంటే మనసు ఒప్పదు. ఈ తిప్పలంతా లేకుండా సీడ్ కలెక్టింగ్ కిట్లు ఇప్పుడు మార్కెట్‌లోకి చాలానే వచ్చాయి. వాటిని తెచ్చేసుకోండి. పేపర్ కవర్, ప్లాస్టిక్ డబ్బాలు, గాజు సీసాల్లో వీటిని దాచుకోవచ్చు. పైన లేబులింగ్ చేసుకునే వీలూ కనిపిస్తున్నారు. వెతుక్కునే అవసరం లేకుండానే కావాల్సినవి తీసుకోవచ్చు కూడా.





ఆదాయపన్ను విభాగం ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా అనిల్‌కుమార్

తొమ్మిదేళ్ల తర్వాత ఈ బాధ్యతల్లోకి తెలుగు వ్యక్తి



బాధ్యతలు చేపడుతున్న అనిల్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: ఆదాయపన్ను విభాగం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా మొరంపూడి అనిల్‌కుమార్ మంగళవారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. 1990 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అయిన అనిల్‌కుమార్ స్వస్థలం ఏలూరు సమీపంలోని లింగాపాలెం. వ్యవసాయ కుటుంబానికి చెందిన సత్యనారాయణ, కమలకుమారి దంపతులకు జన్మించిన ఆయన వివిధ హోదాల్లో విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, బెంగళూరు, ముంబయిలలో పనిచేశారు. ప్రస్తుతం కేరళ, లక్షద్వీప్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. 2016లో సురేశ్‌బాబు తర్వాత ఏపీ, తెలంగాణ రీజియన్‌కు ఐటీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా తెలుగు వ్యక్తి బాధ్యతలు చేపట్టారు.

తెలుగు రాష్ట్రాలకు నేతృత్వం వహించడం గర్వంగా ఉంది: అనిల్‌కుమార్

దేశంలో అధిక ఆదాయం వచ్చే వాటిలో ఒకటైన ఆంధ్ర, తెలంగాణ రీజియన్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని అనిల్‌కుమార్ వెల్లడించారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన 'ఈనాడు'తో మాట్లాడుతూ 35 సంవత్సరాల సర్వీసులో దేశంలో వివిధ ప్రాంతాల్లో పనిచేసినా తెలుగు రాష్ట్రాలకు నేతృత్వం వహించడం గర్వంగా కూడా ఉందన్నారు.

గోదావరి బోర్డు ఛైర్మన్‌గా బీపీ పాండ్యా

ఈనాడు, హైదరాబాద్: గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) ఛైర్మన్‌గా ఢిల్లీలోని కేంద్ర జల సంఘంలో పనిచేస్తున్న బీపీ పాండ్యాను నియమిస్తూ కేంద్ర జలశక్తి శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఛైర్మన్‌గా ఉన్న ఏకే ప్రధాన్ గురువారం పదవీ విరమణ చేయనున్నారు.



వాళ్లు ఆశించేది స్వచ్ఛమైన మనసే..

మిమ్మల్ని ప్రేమించేవారి అభిమానాన్ని నిలబెట్టుకునేందుకు అత్యుత్తమ మార్గం ఏంటో తెలుసా..? ఎలాంటి పరిస్థితుల్లోనూ వారికి అబద్ధాలు చెప్పకపోవడం! మిమ్మల్ని నిజంగా ప్రేమించేవారు.. మీ దగ్గర ఏముంది, మీరేం ధరిస్తున్నారు, మీరెక్కడ నివసిస్తున్నారు అనే విషయాలేవీ పట్టించుకోరు. మీ నుంచి నిజాయతీ, స్వచ్ఛమైన మనసును మాత్రమే ఆశిస్తారు.

– జీన్ పాట్రైస్, మైండ్‌సెట్ కోచ్

ఏపీఐడీసీ వీసీఎండీ డిప్యుటేషన్ పొడిగింపు

ఈనాడు, అమరావతి: ఏపీ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఏపీఐడీసీ) వీసీఎండీ రేయాన్ డిప్యుటేషన్‌ను మరో ఏడాది (2026 ఆగస్టు 22 వరకు) పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాణిజ్య పన్నుల శాఖలో జాయింట్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఆయన డిప్యుటేషన్‌పై ఏపీఐడీసీ వీసీఎండీగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 23తో ఆయన డిప్యుటేషన్ ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆయన డిప్యుటేషన్‌ను తాజాగా పొడిగించారు.

ఎఫ్‌టీవో నిర్వహణకు మెల్‌స్టార్‌కు అనుమతి

కర్నూలు విమానాశ్రయంలో ఏర్పాటు

ఈనాడు, అమరావతి: కర్నూలు విమానాశ్రయంలో ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీవో) కేంద్రం ఏర్పాటు, నిర్వహణకు మెల్‌స్టార్ ఏవియేషన్స్‌కు ప్రభుత్వం లెటర్ ఆఫ్ అవార్డు (ఎల్‌వోఏ) ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పిన్నెల్లి అనుచరుడు.. తురకా కిశోర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

ఈనాడు, దిల్లీ: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ తురకా కిశోర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కిశోర్ ముందస్తు అనుమతి లేకుండా పోలీసులు తనపై కొత్త కేసులు పెట్టకుండా చూడాలని, అరెస్టు చేయకుండా ఉత్తర్వులివ్వాలని, తనపై కఠిన చర్యలు తీసుకోకుండా నిలువరించాలని, తనను వెంటనే బెయిలుపై విడుదల చేయాలని కోరుతూ ఆయన రిట్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమే. దీనిపై విచారణకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం మంగళవారం నిరాకరించింది.

తెలంగాణలోని ఏపీ హోంగార్డులను తీసుకురావాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: తెలంగాణలోని ఏపీ హోంగార్డులను ఏపీకి తీసుకురావాలని, వారి సమస్యలు పరిష్కరించాలని హోంమంత్రి వంగలపూడి అనితకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వినతిపత్రం సమర్పించారు. "హోం గార్డులకు రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు వర్తించేలా చూడాలి. రాష్ట్ర కానిస్టేబుళ్ల నియామకాల్లో తెలంగాణలోని ఏపీ హోంగార్డులకు న్యాయం జరిగేలా చూడాలి. కుటుంబ కారణాలు, ఆరోగ్య, విద్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై ప్రభుత్వ స్థాయిలో సమగ్ర విచారణ జరిపి, హోంగార్డుల బదిలీలకు అనుమతించాలి. సుమారు 400 మంది హోంగార్డులు ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్నారు. ఏపీ నుంచి తెలంగాణకు మారుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరినీ వారి సొంత రాష్ట్రాలకు కేటాయించాలి" అని సీపీఐ కోరింది.

కరేడులో ఎకరాకు రూ.20 లక్షల పరిహారం

- రైతుల డిమాండ్ మేరకు ఇండోసోల్ అంగీకారం
- సంప్రదింపుల కమిటీ సమావేశంలో నిర్ణయం
- 100 ఎకరాలకు పైగా భూసేకరణ అంగీకారపత్రాలపై రైతుల సంతకాలు

ఈనాడు, నెల్లూరు: ఇండోసోల్ పరిశ్రమకు కరేడు ప్రాంతంలో జరుగుతున్న భూసేకరణ ప్రక్రియలో కీలక పరిణామం చోటు చేసుకుంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో రైతులతో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశంలో భూ పరిహారాన్ని ఎకరాకు రూ.20 లక్షలకు పెంచేందుకు ఇండోసోల్ కంపెనీ అంగీకరించింది. సంస్థ ప్రతినిధులతో పాటు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కరేడు ప్రాంతంలో భూములున్న పలువురు రైతులు పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటు ఆవశ్యకతను వివరించిన కలెక్టర్.. అందరూ సహకరించాలని కోరారు. తాము భూములు ఇవ్వడం వల్ల ఉపాధి కోల్పోతామని, అందువల్ల పరిహారం పెంచాలని రైతులు డిమాండ్ చేశారు. దానికి ఇండోసోల్ ప్రతినిధులు అంగీకరించారు. నిబంధనల ప్రకారం కరేడు ప్రాంతంలో ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాల్సి ఉండగా, ఇండోసోల్ సంస్థ రూ.20 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించింది. ఉద్యాన పంటలు, ఆక్వా సాగు భూములకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అదనంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దాంతో సుమారు 100 ఎకరాల వరకు ఇచ్చేందుకు రైతులు అంగీకారపత్రాలపై సంతకాలు చేశారు. పరిహారం పెంపుతో మరో 1,500 ఎకరాలకు చెందిన రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చే అవకాశం ఉందని సమాచారం.

మరింత మంది ముందుకొస్తారు: కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. ఇండోసోల్ పరిశ్రమకు కరేడు ప్రాంతంలో భూసేకరణ ప్రక్రియను రైతుల నిర్ణయం మేరకే చేస్తున్నామన్నారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన కొందరు రైతులు అంగీకార పత్రాలపై సంతకాలు చేశారన్నారు. ఎకరాకు రూ.20 లక్షల వరకు ఇచ్చేందుకు సంస్థ ప్రతినిధులు అంగీకరించడంతో మరింత మంది ముందుకొచ్చే అవకాశం ఉందన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కరేడు ప్రాంతంలో ఇండోసోల్ సోలార్ ప్యానళ్ల తయారీ పరిశ్రమకు సుమారు 8,438 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చి, జూన్ 21న 4,912 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే పరిహారంపై పీటముడి పడిన నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

జగన్ అరెస్టును ఎవరూ ఆపలేరు

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



చాయ్‌పే చర్చలో పాల్గొన్న మాధవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

ఈనాడు – కర్నూలు, న్యూస్‌టుడే – కర్నూలు టీక్యాంపు: మద్యం కుంభకోణంలో వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్ కచ్చితంగా అరెస్టవుతారని, దాన్ని ఎవరూ ఆపలేరని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. ఈ కేసులో జగన్ జైలు కెళ్లక తప్పదన్నారు. మంగళవారం రాత్రి కర్నూలు కొండారెడ్డి బురుజు దగ్గర చిట్‌చాట్ కార్యక్రమంలో విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. 'జగన్ చేసిన అక్రమాలు అలా ఉన్నాయి. అవి అందరికీ తెలిసినవే. అయినా ఆయన మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు' అని పేర్కొన్నారు. అంతకు ముందు ఉదయం ఆయన కర్నూలులోని డీఎస్ఏ స్టేడియంలో వాకర్స్‌తో కలిసి చాయ్ పే చర్చలో, అనంతరం కార్యకర్తలతో సమావేశంలోనూ ఆయన మాట్లాడారు. 'రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలన్నా, పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నా కూటమి ప్రభుత్వానికే సాధ్యమవుతుంది. కర్నూలుకు హైకోర్టు బెంచ్ కచ్చితంగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. కర్నూలులో డెట్ రికవరీ ట్రైబ్యునల్ ఏర్పాటుకు, ఆలయ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం' అని మాధవ్ చెప్పారు.

అందరి పేర్లూ డిజిటల్ లైబ్రరీలో పెట్టి...

- అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరి సంగతీ తేలుస్తాం
- వైకాపా అధినేత జగన్

ఈనాడు, అమరావతి: 'వైకాపా కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్న ప్రతి అధికారి పేరు, వారిని ప్రభావితం చేసినవారి పేర్లనూ డిజిటల్ లైబ్రరీలో పెట్టబోతున్నాం. అధికారంలోకి రాగానే ఆ లైబ్రరీని తెరిచి, అందులోని ప్రతి ఒక్కరికీ సినిమా చూపిస్తాం' అని వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ ప్రకటించారు. 'పది రోజుల్లో ఒక యాప్ తెస్తున్నాం. కేసులతో ఇబ్బంది పడుతున్నవారు ఎవరైనా సరే యాప్‌లో వివరాలు పొందుపరచవచ్చు. సాక్ష్యాలనూ జతచేయవచ్చు. ఆ ఫిర్యాదులన్నీ నేరుగా డిజిటల్ లైబ్రరీ సర్వర్‌కు చేరతాయి' అని తెలిపారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వైకాపా పీఏసీ సమావేశంలో జగన్ మాట్లాడారు. 'హామీలను అమలు చేయట్లేదని ప్రశ్నించే గొంతు నొక్కేందుకు వైకాపా సీనియర్ నాయకులపై కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు. ఇదే తీరు కొనసాగితే రేపు తెదేపా నాయకులంతా జైలుకు వెళ్లక తప్పదు' అన్నారు.

30, 40 ఏళ్లు పార్టీ ఉండాలనేదే లక్ష్యం

'పార్టీ మరో 30, 40 ఏళ్లు కొనసాగాలనేదే నా లక్ష్యం. అందువల్ల గ్రామస్థాయిలోనూ పార్టీని బలోపేతం చేయాలి. చంద్రబాబు ప్రభుత్వ తీరుపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయాలి. సీనియర్ నేతలు క్రియాశీలకంగా వ్యవహరించాలి. గ్రామకమిటీల ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను ఆ స్థాయిలోనూ ఎండగట్టాలి. పార్టీ అనుబంధ విభాగాలు పక్కాగా ఏర్పాటుచేస్తే, 13వేల గ్రామాల్లో ఫ్రంటల్ ఆర్గనైజేషన్ అధ్యక్షులే దాదాపు 80 వేల మంది వస్తారు' అని నేతలకు జగన్ చెప్పారు.

శ్రీవారి సేవలో ఇస్రో శాస్త్రవేత్తలు



ఆలయం ఎదుట నారాయణన్, ఉన్ని కృష్ణన్ నాయర్, ఇతర శాస్త్రవేత్తలు

తిరుమల, న్యూస్‌టుడే: భూపరిశీలన ఉపగ్రహం సింథటిక్ ఎపెర్చర్ (నైసార్)ను బుధవారం సాయంత్రం జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా ప్రయోగించనున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఇస్రో ప్రాజెక్టుల ఛైర్మన్, వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, శాస్త్రవేత్తల బృందంతో కలిసి ఉపగ్రహ నమూనాలను శ్రీవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయం వెలుపల నారాయణన్ మాట్లాడుతూ.. "నాసా, ఇస్రో సంయుక్తంగా తయారు చేసిన నైసార్‌ను అంతరిక్షంలోకి పంపుతున్నాం. ఇది భూ ఉపరితలం పరిశీలన, ఉపద్రవాల హెచ్చరికలకు ఎంతో సహాయపడుతుంది. ఇది సేకరించిన డేటా గ్లోబల్ కమ్యూనిటీ వెల్ఫేర్‌కూ ఉపయోగపడుతుంది' అని పేర్కొన్నారు. ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ.. "గగన్‌యాన్ మా తదుపరి ప్రాజెక్టు. అందుకోసం ఇస్రో అనేక పరిశోధనలు చేస్తూ అత్యాధునిక సాంకేతికతను సముపార్జించుకుంటోంది' అని చెప్పారు. శ్రీకాళహస్తి ముక్కంటీశ్వరస్వామి, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయాన్ని కూడా ఇస్రో శాస్త్రవేత్తల బృందం దర్శించుకుంది.

విశాఖ భాగస్వామ్య సదస్సు పర్యవేక్షణకు కమిటీలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సు-2025 ఏర్పాట్ల పర్యవేక్షణకు ఉన్నతాధికారులతో కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని సమన్వయం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. సీఐఐ భాగస్వామ్యంతో ఈ సదస్సును ప్రభుత్వం నిర్వహించనుంది. కమిటీ వివరాలిలా ఉన్నాయి.

◆ మంత్రివర్గ ఉపసంఘం: ఛైర్మన్‌గా మంత్రి లోకేశ్, సభ్యులుగా మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్ ఉంటారు. ఈ ఉపసంఘం వివిధ కమిటీలను సమన్వయం చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తుంది.

◆ కార్యనిర్వాహక కమిటీ: ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారు. సభ్యులుగా 24 మంది ఉంటారు. డీజీపీతో పాటు వివిధ శాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారు.

◆ ప్రొటోకాల్, రిసెప్షన్, వసతి, రవాణా, లాజిస్టిక్స్ కమిటీ, భద్రత, రద్దీ నిర్వహణ కమిటీ, నగర సుందరీకరణ కమిటీ, సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ, మీడియా, ప్రచార వ్యవహారాల కమిటీ, పెట్టుబడుల ప్రోత్సాహకాల కమిటీ, వ్యాపార భాగస్వామ్యాలు/ అభివృద్ధి కమిటీలు సదస్సును ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేసేందుకు సహకరిస్తాయి. ఆయా కమిటీలకు ఛైర్మన్‌లుగా ఉన్నతాధికారులు వ్యవహరిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలను మంత్రివర్గ ఉపసంఘం, వర్కింగ్ కమిటీ సమన్వయం చేస్తుంది.

విద్యతోనే పేదరికంపై విజయం

- మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్



ముచ్చింతల్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న కపిల్‌దేవ్. చిత్రంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, డీఆర్డీవో మాజీ ఛైర్మన్ జి.సతీశ్‌రెడ్డి, మైహోం గ్రూప్ వైస్ ఛైర్మన్ జూపల్లి జగపతిరావు తదితరులు

శంషాబాద్, న్యూస్‌టుడే: పేదరికాన్ని జయించే శక్తి విద్యకు మాత్రమే ఉందని మాజీ క్రికెటర్, ఖుషీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కపిల్‌దేవ్ అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తేనే పేద విద్యార్థులు ఉన్నత పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. మైహోం గ్రూప్, ఖుషీ ఫౌండేషన్ సంస్థలు దత్తత తీసుకున్న రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా నిర్మించిన 12 అదనపు తరగతి గదులను మంగళవారం ఆయన ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో మైహోం గ్రూప్ వైస్ ఛైర్మన్ జూపల్లి జగపతిరావు, డీఆర్డీవో మాజీ ఛైర్మన్ జి.సతీశ్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌తో కలిసి కపిల్‌దేవ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిజిటల్ కంటెంట్ పుస్తకాలను ఆవిష్కరించి బ్యాట్‌పై ఆటోగ్రాఫ్ చేసి మాట్లాడారు. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులను సొంత నిధులతో అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ఖుషీ ఫౌండేషన్ సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో సుశీందర్‌రావు, జూపల్లి వినోద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా గవర్నర్ హరిబాబుకు... సీఎం రమేశ్ సన్మానం



కంభంపాటి హరిబాబును సత్కరిస్తున్న సీఎం రమేశ్

ఈనాడు, దిల్లీ: ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మంగళవారం దిల్లీలోని తన నివాసంలో సన్మానించారు. అధికార పర్యటన కోసం ఇక్కడికి వచ్చిన హరిబాబును మర్యాదపూర్వకంగా తన ఇంటికి ఆహ్వానించారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, రాష్ట్ర భాజపా నాయకుడు పులిఘళ్ల రఘు తదితరులు పాల్గొన్నారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ముగ్గురు తెలుగువారు గవర్నర్లుగా ఉండటం గర్వకారణమని ఈ సందర్భంగా సీఎం రమేశ్ అన్నారు.

జైళ్లలో యోగా కోర్సును ప్రారంభిస్తాం

జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని కేంద్ర కారాగారాలతో పాటు జిల్లా జైళ్లలో యోగా కోర్సును ప్రారంభిస్తామని జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ తెలిపారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన ఖైదీలకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని, తద్వారా వారు యోగా గురువులుగా జీవనం సాగించే అవకాశముంటుందన్నారు. మంగళవారం కడప కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాబోయే ఆరు నెలల్లో పలువురిని యోగా శిక్షకులుగా తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కేంద్ర కారాగారాల్లో ఏఐ, ఐటీ సాంకేతికతలను వినియోగించుకోనున్నాం. ఈ-ములాఖత్ విధానానికి మంచి ఆదరణ లభిస్తోంది. ఎన్జీవోలతో కలిసి జైళ్లలో సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తామ'ని పేర్కొన్నారు.

వరికపూడిశెల ప్రాజెక్టు కల నేరవేరింది

తెదేపా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ఈనాడు, అమరావతి: పల్నాడు, ప్రకాశం జిల్లాల ప్రజల ఏడు దశాబ్దాల వరికపూడిశెల ప్రాజెక్టు ఆకాంక్షను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని తెదేపా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. పలు అడ్డంకులను అధిగమించి ఈ ప్రాజెక్టులో కీలకమైన అటవీ శాఖ క్లియరెన్స్‌కు అవసరమైన రూ.14.81 కోట్లు విడుదలవడంతో ముందడుగు పడిందని మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వరికపూడిశెల ప్రాజెక్టు పల్నాడులోని వినుకొండ, మాచర్ల, ప్రకాశంలోని యర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలో సుమారు 1.014 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తుందన్నారు. ఆ ప్రాంత రైతుల జీవనోపాధిని బలోపేతం చేయడం సహా వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతుందని తెలిపారు. వైకాపా నిర్లక్ష్యం, నిర్వహణ లోపం కారణంగా స్తంభించిపోయిన కీలక ప్రాజెక్టులకు కూటమి తిరిగి ఊపిరిపోస్తోందన్నారు.

జలసౌధ నిర్వహణకు రూ.1.32 కోట్లు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రధాన కార్యాలయాలు కొలువుదీరిన విజయవాడ జలసౌధ భవనం నిర్వహణ ఖర్చులకు రూ.1.32 కోట్లకు పాలనామోదం ఇచ్చారు. ఈ మేరకు జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్వహణకు ఈ నిధులు వెచ్చిస్తారు.

◆ గండికోట ఎత్తిపోతల పథకం రెండు పంపుహౌస్‌ల నిర్వహణకు 2023-24 ఏడాదిలో ఖర్చు చేసిన రూ.2.93 కోట్లకు ఆమోదం తెలియజేస్తూ (ర్యాటిఫై చేస్తూ) జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం జేడీగా రామారావు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఎన్నికల సంఘం సంయుక్త సంచాలకులుగా (జేడీ) పి.రామారావును ప్రభుత్వం నియమించింది. సహాయ కార్యదర్శిగా ఉన్న ఆయన్ను పదోన్నతిపై జేడీగా నియమిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.



వెంకయ్యచౌదరికి బంగారు శంఖుచక్రాలను అందిస్తున్న సుదర్శన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు


శ్రీవారికి బంగారు శంఖుచక్రాల విరాళం

వాటి విలువ రూ.2.40 కోట్లు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వరస్వామికి చెన్నైకి చెందిన సుదర్శన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ రూ.2.40 కోట్ల విలువైన రెండు కిలోల బంగారు శంఖుచక్రాలను విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో మంగళవారం తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరికి వాటిని అందజేశారు.

శ్రీవారికి ఇల్లు విరాళం

హైదరాబాద్‌కు చెందిన దంపతుల నిర్ణయం



తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరికి ఆస్తి పత్రాలు అందిస్తున్న కనకదుర్గప్రసాద్, సునీతదేవి దంపతులు

తిరుమల, న్యూస్‌టుడే: హైదరాబాద్ మల్కాజిగిరిలోని వసంతపురి కాలనీకి చెందిన టి.కనకదుర్గప్రసాద్, టి.సునీతదేవి దంపతులు 250 చదరపు గజాల ఇంటిని శ్రీవారికి విరాళంగా ఇచ్చారు. దివంగత ఐఆర్ఎస్ అధికారి భాస్కర్‌రావు మరణానంతరం వీలునామా ద్వారా ఇటీవల శ్రీవారికి రూ.3 కోట్ల విలువైన ఇంటిని, రూ.66 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను తితిదేకు విరాళంగా ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆయన స్ఫూర్తితో కనకదుర్గప్రసాద్ దంపతులు తమకు సంతానం లేకపోవడంతో తమ తదనంతరం ఆస్తి శ్రీవారికి చెందేలా వీలునామా రాసి భక్తిని చాటుకున్నారు.

అడ్డగోలుగా.. ఐదో న్యాయవాదికి అనుమతి

మిథున్‌రెడ్డిని కలిసేందుకు జైలు అధికారుల అవకాశం

ఈనాడు, రాజమహేంద్రవరం: మద్యం కేసులో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి న్యాయస్థానం ఇచ్చిన వెసులుబాట్లకు మించి జైలు అధికారులు అవకాశాలు కల్పిస్తున్నారు. ఆయనకు న్యాయసలహాలు ఇచ్చేందుకు నలుగురు న్యాయవాదుల పేర్లు ప్రస్తావిస్తూ.. ఇద్దరేసి చొప్పున వారానికి ఐదు దఫాలు వ్యక్తిగతంగా కలవొచ్చని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. న్యాయవాదులు టి.నాగార్జునరెడ్డి, చంద్రగిరి విష్ణువర్ధన్, పి.నిర్మల్ రాజేష్‌బాబు, ఎం.మనోహర్‌రెడ్డిలను అనుమతించాలని పేర్కొంది. అయితే ఆ జాబితాలో లేని స్థానిక న్యాయవాది హుస్సేన్ తొలిరోజు నుంచీ జైలులో మిథున్‌రెడ్డిని కలుస్తున్నారు. కుటుంబసభ్యులు ములాఖత్‌కు వెళ్లినప్పుడూ ఆ ప్రాంగణంలోకి వెళ్తున్నారు.

ఆథరైజేషన్ ఇచ్చుంటే పంపమని కోర్టు చెప్పిందట: హుస్సేన్.. తన ప్యానల్‌లో సభ్యుడని, మిథున్‌రెడ్డిని కలిసేందుకు అతనిని అనుమతించాలని న్యాయవాది నాగార్జునరెడ్డి ఈనెల 22న ఆథరైజేషన్ ఇచ్చినట్లు జైలు పర్యవేక్షణాధికారి రాహుల్ తెలిపారు. ఇదే విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లగా, సీనియర్ న్యాయవాది ఆథరైజేషన్ ఇస్తే అనుమతించాలని కోర్టు చెప్పిందన్నారు. కానీ, ఈ కేసులో స్పష్టంగా నలుగురి పేర్లు మాత్రమే కోర్టు ప్రస్తావించింది. ఈ విషయాన్ని కోస్తాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ వద్ద ప్రస్తావించగా.. ఈ అంశం తమ దృష్టికి వచ్చిందని, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీవారికి రూ.5.44 కోట్ల హుండీ కానుకలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారికి భారీగా హుండీ కానుకలు లభించాయి. సాధారణంగా రోజూ రూ.5 కోట్ల లోపే హుండీ ఆదాయం వస్తుండగా.. సోమవారం అత్యధికంగా రూ.5.44 కోట్ల హుండీ కానుకలు వచ్చాయి. స్వామిని 77,044 మంది భక్తులు దర్శించుకున్నారు.

31న శ్రీపద్మావతీ దేవి వరలక్ష్మీ వ్రతం టికెట్ల జారీ

తిరుపతి (తితిదే, తిరుచానూరు), న్యూస్‌టుడే: తిరుచానూరులో ఆగస్టు 8న శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నారు. అందులో భక్తులు నేరుగా పాల్గొనేందుకు ఈ నెల 31న ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో 150 టికెట్లు జారీ చేస్తారు. www.tirumala.org వెబ్‌సైట్ ద్వారా వీటిని పొందొచ్చు. ఆలయం వద్ద కౌంటర్‌లో ఆగస్టు 7న ఉదయం 9 గంటలకు 150 టికెట్లు విక్రయిస్తారు. రూ.1,000 చెల్లించి భక్తులు వీటిని కొనుగోలు చేయొచ్చు. ఒక టికెట్‌పై ఇద్దరిని అనుమతిస్తారు. వ్రతం రోజు ఆలయంలో అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, బ్రేక్ దర్శనం, వేదాశీర్వచనం సేవలను తితిదే రద్దు చేసింది. వ్రతాన్ని శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

చంద్రబాబు పేరుతో డీప్ ఫేక్ వీడియో

కేసు నమోదు చేసిన ఏపీ సీఐడీ

ఈనాడు, అమరావతి: 'రూ.22 వేలు పెట్టుబడి పెట్టండి.. ఫోన్ ద్వారా క్రమం తప్పకుండా ఆదాయం పొందండి' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నట్లు ఏఐ డీప్ ఫేక్ ద్వారా నకిలీ వీడియో సృష్టించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న వారిపై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. చంద్రబాబు గతంలో ఓ జర్నలిస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలోని వీడియో క్లిప్పును డీప్ ఫేక్ ద్వారా మార్ఫింగ్ చేసి, కొంతమంది ఈ నకిలీ వీడియో సృష్టించారు. దీనిపై తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు వంశీకృష్ణ ఫిర్యాదు ఇవ్వగా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గతంలో ఇదే తరహాలో ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖుల పేరిట ఫేక్ వీడియోలు వ్యాప్తి చేశారని, ఇలాంటి వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాల విభాగం ఐజీ ఆకే రవికృష్ణ కోరారు.

గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

ఈనాడు, అమరావతి: కేంద్ర, రాష్ట్ర విభాగాల సమన్వయంతో రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచించారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి నార్కోటిక్స్ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో ఇప్పటికే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ విభాగం విజయవంతంగా పని చేస్తోంది. ఉత్తరాంధ్రలోని గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగును పూర్తిగా నియంత్రించేందుకు పెద్దఎత్తున సాంకేతికతను వినియోగించుకుంటున్నాం. గిరిజనులకు కాఫీ, సిల్వర్ ఓక్ వంటి మొక్కలు అందించి వారి జీవనోపాధిని మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని తెలిపారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ 'గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కేంద్ర ఏజెన్సీల సహకారం, సమన్వయం కూడా చాలా అవసరం' అని అన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈగల్ చీఫ్ రవికృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ నీటిపారుదల శాఖకు సాగర్ నిర్వహణ బాధ్యత

ఈనాడు, హైదరాబాద్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆపరేషన్, మెయింటెనెన్స్ బాధ్యతలను తెలంగాణ నీటిపారుదల శాఖకు తాత్కాలికంగా అప్పగిస్తున్నట్లు కృష్ణా బోర్డు పేర్కొంది. ఈ మేరకు ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు మంగళవారం బోర్డు లేఖ రాసింది. ఈ ఏడాది ఫ్లడ్ సీజన్ వరకు ప్రాజెక్టు బాధ్యతలను నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు డిసెంబరు 31 వరకు నీటిపారుదల ఇంజినీర్లు ఈ ప్రాజెక్టు నిర్వహణను చేపట్టనున్నారు.


మొక్కే కదాని.. ఏదోటి నాటొద్దు!

గతంలో మనం చూసిన చాలా పక్షులు, ఉడతల వంటి జీవులు ఇప్పుడు కనిపించట్లేదు. అందమైన సీతాకోకచిలుకలూ కనుమరుగైపోతున్నాయి. దేశీయ మొక్కలు, చెట్లు లేకపోవడం వీటన్నిటికీ కారణం. పట్టణాలు విస్తరిస్తున్నకొద్దీ పచ్చదనం మాయమవుతోంది. పచ్చదనం పెంచాలన్న లక్ష్యంతో వేల మొక్కలు నాటుతున్నా వాటిలో ఎక్కువ స్థానికేతర జాతులే ఉంటున్నాయి. దేశవాళీ వృక్ష సంపద తగ్గిపోయే కొద్దీ జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇంతేకాదు భూగర్భ జలాలు, వర్షపాతం, ఉష్ణోగ్రతలపైనా ఈ ప్రభావం పడుతోందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

వలసపోతున్న పక్షులు

స్థానిక వృక్ష జాతుల వల్ల చాలా ప్రయోజనాలున్నాయి.

- ఇవి మన నేలలకు అలవాటుపడ్డ రకాలు. వీటిపైనే పక్షులు ఎక్కువగా వాలతాయి. గూళ్లు కట్టుకుంటాయి. మన వృక్షాలు లేకపోవడం వల్ల చాలా పక్షులు వలసపోతున్నాయి.
- పక్షులకు సహజ ఆవాసాలుగా మారే తుమ్మ వంటి చెట్లు లేకపోవడంతో చిలుకలు, మైనా వంటివి తగ్గిపోయాయి.
- తాటి, ఈత చెట్లు.. వడ్రంగి పిట్టలు, పాలపిట్టలకు సహజసిద్ధ ఆవాసాలు. ఉమ్మడి రాష్ట్ర పక్షిగా గుర్తించిన పాలపిట్ట ఇప్పుడు అంతరించిపోయే పరిస్థితి ఉంది.
- సీతాకోక చిలుకలు, తేనెటీగలను దేశీజాతి ఫల, పుష్పాలు ఆకర్షిస్తాయి. ఆ చెట్ల సంఖ్య తగ్గేకొద్దీ అవీ కనుమరుగ వుతాయి.
- పిచ్చుకల్లో చాలా రకాలు ఉండేవి. ఇప్పుడు ఇందులో కేవలం ఒకటి మాత్రమే కనిపిస్తోంది.



- ఈనాడు, అమరావతి

గాలి నాణ్యతకు దోహదం

- వేప, మద్ది, రావి, మర్రి, వంటివి క్షామాన్ని, తుపాన్లను కూడా తట్టుకుని నిలబడతాయి. ఎక్కువ ప్రాణవాయువును విడుదల చేస్తాయి.
- నగరాల్లో వాయు కాలుష్యం పరిమితికి మించి పెరిగింది. గాలిలోని ధూళి కణాలను శుద్ధి చేయడంలో ఈ చెట్లు బాగా పనికి వస్తాయి.
- ఈ రకం చెట్లు పడిన వాననీటిని భూగర్భంలో ఇంకేలా చేస్తాయి. వీటి వల్ల భూగర్భ నీటి మట్టం పెరుగుతుంది.
- మేఘాలను ఆకర్షించి వర్షం కురిసేలా చేయడంలోనూ ఇవి చాలా ముఖ్య పాత్ర పోషిస్తాయి.

ఏవి దేశీయ జాతులు..? మర్రి, రావి, మేడి, వేప, మారేడు, వెలగ, గానుగ, తుమ్మ, మునగ, ఇప్ప, జువ్వి, గంగరావి, నేరేడు, ఉసిరి, కుంకుడు, కొబ్బరి, తాటి, మద్ది, తదితర రకాలు

ఇవి స్థానికేతర రకాలు... బూరుగు, కోనోకార్పస్, జామాయిల్, మలేషియా వేప, మహాగని, ఫ్లమేరియా, బాటిల్ బ్రష్.

శేషాచలంపైనా...

- శేషాచలం కొండల్లో 80వ దశకంలో అటవీ ప్రాంత విస్తరణ కోసం పెద్దఎత్తున అకాసియా ఔరిక్యులిఫార్మిస్ అనే ఆస్ట్రేలియన్ మొక్కలను భారీగా నాటారు. ఇవి నేలలో క్షార గుణాన్ని పెంచి, స్థానిక మొక్కలను బతకనీయకుండా చేస్తున్నాయి. లాంటానా కామారా అన్న స్థానికేతర జాతి చెట్లు తెలుగు రాష్ట్రాల్లోని అడవులు, పచ్చిక బయళ్లను ఆక్రమించాయి. వీటిపై పక్షులు గూళ్లు కట్టి, ఆహారం సేకరించే అవకాశాలు ఉండడం లేదు.
- పూలు, ఫలాలు లేకపోవడం వల్ల తేనెటీగలు, సన్‌బర్డ్, బుల్‌బుల్ వంటి పుప్పొడి రవాణా చేసే పక్షులు గణనీయంగా తగ్గిపోయాయి.

కాపాడాల్సిన బాధ్యత మనదే..



- పార్కుల్లో అందం కోసం, లెక్క కోసం స్థానికేతర రకాలను నాటే బదులు స్థానిక రకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- రహదారుల విస్తరణలో చింత చెట్లను విచ్చలవిడిగా కొట్టేస్తున్నారు. వీటిని విస్తారంగా పెంచితే పేదలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకూ ఆసరాగా ఉపయోగపడతాయి.

– ప్రొ.తుమ్మల శ్రీకుమార్, పర్యావరణవేత్త, విజయవాడ

మన పెరట్లో.. బయటే కాకుండా మన ఇళ్లల్లోని పెరట్లో కూడా స్థానిక జాతి మొక్కలు, చెట్లను పెంచుదాం. దీంతో జీవావరణం వృద్ధి చెందుతుంది. జీవవైవిధ్యానికి కూడా మేలు చేసిన వారమవుతాం.

- కరివేపాకు, జామ, సీతాఫలం, బొప్పాయి, వాటర్ యాపిల్, స్టార్ ఫ్రూట్ వంటి పండ్ల రకాలను నాటొచ్చు. రూఫ్‌టాప్‌పై .. సోర, బీర, టమోటా, వంగ, వంటి వాటిని పెంచితే మంచిది.
- మల్లె, సన్నజాజి, జాజి, బంతి, తదితర దేశీయ పూల మొక్కలను పెంచొచ్చు.

రిమోట్‌తో రక్షిస్తారు



చెరువుల్లో, నదుల్లో, వరదల్లో చిక్కుకున్న, మునిగిపోతున్న వారిని రక్షించడానికి తయారుచేసిన పడవలాంటి సాధనమిది. 'రెస్క్యూ కంట్రోల్ రిమోట్ లైఫ్‌బాయ్' అని పిలుస్తున్న ఈ పరికరాన్ని.. శిక్షణ పొందిన సిబ్బంది ఒడ్డున ఉండి రిమోట్‌తో నడిపిస్తారు. నీళ్లలో మునిగిపోతున్న బాధితుని దగ్గరకు పంపడం, బాధితుడు దాన్ని పట్టుకున్నాక తిరిగి ఒడ్డుకు తీసుకురావడం పనులను రిమోట్‌తోనే చేపడతారు. అన్ని ఉమ్మడి జిల్లాల్లోని అగ్నిమాపక కేంద్రాల్లో ఏర్పాటు చేసిన రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలకు ఒకటి చొప్పున వీటిని అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సరఫరా అయిన ఈ పరికరాన్ని మంగళవారం స్థానిక మావల చెరువులో ప్రయోగాత్మకంగా జిల్లా అగ్నిమాపక అధికారి సురేశ్‌కుమార్, స్టేషన్ అధికారి జయత్‌రాం ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించారు.

– ఈనాడు, ఆదిలాబాద్; న్యూస్‌టుడే, ఎదులాపురం









అటెన్షన్ ప్లీజ్..

ఫ్లైట్ రెస్టారెంట్‌లో ల్యాండ్ అవుతున్నారు..

పాత విమానాలను రెస్టారెంట్‌లుగా వినియోగించడం కొత్త కాదు కానీ.. ఇది కొంచెం విభిన్నం. ఇందులోకి ఎక్కితే టేకాఫ్, ల్యాండింగ్ అనుభూతి కలుగుతుంది. ఈ విమానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టిమ్యులేషన్ యంత్రంతో దీనిని సాధ్యం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన వెంకట్‌రెడ్డి.. దుబాయ్‌లో వ్యాపారం చేసి తిరిగి వచ్చి.. ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. మలేసియాలో ఓ పాత విమానాన్ని కొనుగోలు చేసి తెచ్చి ఇలా మార్చారు. ఈ విమానం ఎక్కేముందు ఎయిర్‌హోస్టెస్ స్వాగతం పలుకుతారు. సీట్ బెల్ట్ పెట్టుకోమని అనౌన్స్‌మెంట్ వినిపిస్తుంది. గాల్లో ఎగురుతున్నట్లుగా స్టిమ్యులేటర్ ఆన్ చేసి, వెల్కమ్ డ్రింక్ ఇస్తారు. తర్వాత ఆర్డర్ చేసిన భోజనాన్ని తీసుకువస్తారు. 45 నిమిషాల తర్వాత.. గండిమైసమ్మలోని కేవీఆర్ఎస్ ఫ్లైట్ రెస్టారెంట్‌లో ల్యాండ్ అవుతున్నారని అనౌన్స్‌మెంట్ వినిపిస్తారు. – ఈనాడు, హైదరాబాద్

భౌభౌ థెరపీ.. ఆహ్లాదం ఫ్రీ



విమానం ఎక్కే ముందు నిష్క్రమణ ప్రాంతాల్లో వేచిఉండే ప్రయాణికులను అలరించేందుకు శంషాబాద్ విమానాశ్రయ అధికారులు నాలుగు టాయ్ పూడిల్ శునకాలను అందుబాటులో ఉంచారు. ప్రతి శుక్రవారం నుంచి సోమవారం వరకూ ఇవి ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. బొమ్మల్లాగా ఉండే ఈ మృదువైన, స్నేహశీల శునకాలతో కాలక్షేపం ద్వారా ఒంటరితనాన్ని దూరం చేసుకోవడంతో పాటు ఆహ్లాదాన్ని పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. డాగ్ థెరపీ పేరుతో ఈ సేవలు వివిధ దేశాల్లో ఆసుపత్రులు, పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయి. నెల రోజులుగా జాతీయ, అంతర్జాతీయ నిష్క్రమణ ప్రాంతాల్లో డాగ్స్ థెరపీ సేవలను ప్రయోగాత్మకంగా నిర్వహించగా.. ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ఈ సేవలు దిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఇప్పటికే కొనసాగుతున్నాయి.

– న్యూస్‌టుడే, శంషాబాద్

మునిగిందా.. తేలిందా!

తుంగభద్ర జలాశయం నుంచి 1.19 లక్షల క్యూసెక్కుల నీరు వదలడంతో కర్ణాటకలోని కొప్పళ జిల్లా కంప్లి కోటె వద్ద వంతెన నీట మునిగింది. దీంతో గంగావతికి వెళ్లాలంటే 28 కి.మీ. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. వరద తాకిడికి సమీపంలోని తుంగభద్ర తీరంలో ఉన్న వరి, చెరకు పంటలు నీట మునిగాయి.

– కంప్లి, న్యూస్‌టుడే



సరిలేరు నీకెవ్వరూ..

సాధారణంగానే ఒకే పనిని ఎక్కువసేపు చేయలేం. అలాంటిది ఎనిమిది రోజుల్లో 170 గంటల పాటు నిరంతరాయంగా భరతనాట్య ప్రదర్శన ఇచ్చి ప్రపంచ రికార్డు సృష్టించింది కర్ణాటకలోని మంగళూరుకు చెందిన డిగ్రీ విద్యార్థిని రెమోనా ఎవెట్టె పెరీరా(20). ఆమె దరఖాస్తు మేరకు.. 'గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థ ప్రతినిధులు రెమోనా చదువుతున్న కళాశాలలోనే నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ వేదికపై జులై 21న ఉదయం భరతనాట్య ప్రదర్శన ప్రారంభించిన ఆమె.. జులై 28న సాయంత్రం వరకు కొనసాగించింది. జతిస్వరం, వర్ణం, పదవర్ణం, థిల్లానలతో లఘు శాస్త్రీయ దేవుని నామాలతో ప్రదర్శన కొనసాగించింది. ఇలా మొత్తంగా 170 గంటల పాటు భరతనాట్యం చేసి.. గతంలో మహారాష్ట్రకు చెందిన సుధీర్ జగపత్ పేరిట ఉన్న రికార్డును (127 గంటలు) బద్దలుకొట్టింది. గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకుంది. రెమోనా ప్రతి మూడు గంటలకోసారి 15 నిమిషాల విరామం తీసుకుంది. ఈ రికార్డు కోసం గత 6 నెలలుగా రోజుకు 6 గంటలపాటు సాధన చేసింది.

– న్యూస్‌టుడే, మంగళూరు



చెన్నై జలపారం





వర్షపునీరు నగరంలో పారకుండా, సముద్రంపై ఒత్తిడి పెరగకుండా చెన్నైలో అధికారులు మహాయజ్ఞం చేపట్టారు. పార్కుల్లో, క్రీడా మైదానాల్లో ఆధునిక ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నారు. వీటికి 'స్పాంజ్ పార్కులు' అని పేరు పెట్టి ఉద్యమ స్ఫూర్తితో పనులు చేయిస్తున్నారు. ఇప్పటికే నగరంలో 16 స్పాంజ్ పార్కులు సిద్ధం చేశారు. ఆర్థిక సంవత్సరానికి మరో 7 భారీ స్పాంజ్ పార్కుల నిర్మాణానికి రూ.88 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇవేగాక, 3 వేల లీటర్ల నీటిని ఒడిసిపట్టేలా నగరంలో 770 పార్కులను, 1,500 ఖాళీ ప్రదేశాలనూ అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలిగా చైనా ప్రయోగాత్మకంగా 2014లో 30 నగరాల్లో ఈ విధానాన్ని 'స్పాంజ్‌సిటీ ప్రోగ్రామ్' పేరుతో మొదలుపెట్టింది. అక్కడ మంచి ఫలితాలు వస్తుండటంతో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్(జీసీసీ) అధికారులు పరిశీలించి ఇక్కడ పనులు మొదలుపెట్టారు. చెన్నైలో 8 క్రీడా మైదానాల్ని జీసీసీ ఎంపిక చేసి రూ.10.8 కోట్లతో పనులు చేపట్టింది. మొదట మైదానాన్ని కావాల్సిన మేర తవ్వుతున్నారు. అందులో 80 సెం.మీ. x 36 సెం.మీ. వైశాల్యంతో ఉన్న జర్మన్ 'ఎకో బ్లాక్'లను ఒకదానిపై ఒకటి పేర్చుతున్నారు. భూ ఉపరితలానికి 2 మీటర్ల దిగువ వరకు పేర్చి.. మొత్తాన్ని జీయో ఫ్యాబ్రిక్, జియోగ్రిడ్ వలతో కప్పేసి, మట్టితో పూడ్చి మైదానంలా మారుస్తున్నారు. ఇలా ఒక్కో మైదానం 5 లక్షల లీటర్ల నీటిని భూమిలోకి ఇంకించేలా సిద్ధం చేస్తున్నారు. చెన్నై మణలి ఎంఎడీఏ కాలనీలోని 1.9ఎకరాల ఫుట్‌బాల్ మైదానాన్ని స్పాంజ్ పార్క్ సాంకేతికతతో పూర్తిస్థాయిలో అనుసంధానిస్తున్నారు. ఉద్యానాల్లో సాధారణ ఇంకుడు గుంతలే తవ్వి.. అందమైన కొలనులుగా అభివృద్ధి చేస్తున్నారు.



డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ పేరుతో చెన్నై పోరూరులో తొలిసారి వినూత్నంగా 'వెట్‌ల్యాండ్ ఎకోపార్క్' నిర్మించారు. 6 ఎకరాల్లో స్పాంజ్ పార్క్‌ను వృద్ధిచేయడంతో పాటు నడక మార్గాలు, ఆహ్లాద ప్రాంతాలు, పక్కనే క్రీడా మైదానాలు ఏర్పాటుచేసి జీవ వైవిధ్యానికి ఆవాసంగా మార్చారు.

మనోడి సహకారం

తెలుగు యువకుడు అరుణ్ కృష్ణమూర్తి నడిపే ఎన్విరాన్మెంటలిస్ట్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ జీసీసీతో కలిసి చెన్నై నగరంలో 5 స్పాంజ్ పార్కుల్ని ఏర్పాటు చేసింది. –ఈనాడు, చెన్నై

రూ. 149తో వైద్యానికి భరోసా..



ప్రజల అవసరాలకు తగినట్లుగా తపాలా శాఖ తనను తాను మార్చుకుంటోంది. ఆరోగ్య రంగంలో సేవలందించేందుకు నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ జత కట్టి... ప్రీమియం ఆరోగ్య పొదుపు ఖాతాకు శ్రీకారం చుట్టింది. దీని ద్వారా టెలీవైద్యంలో వివిధ సౌకర్యాలు కల్పిస్తోంది.

అనారోగ్యంగా అనిపించిన ప్రతిసారీ ఆసుపత్రులకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో, టెలీకాన్ఫరెన్స్‌లో వైద్యులను సంప్రదించడం ఇటీవల పెరిగింది. అయితే దీని ఖర్చులు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. వైద్యులు సూచించిన స్కానింగ్, డయాగ్నస్టిక్ పరీక్షలకు, మందులకు మరింత ఖర్చు అవుతుంది. దీని నుంచి కొంతవరకు ఉపశమనం కలిగించేందుకు తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రీమియం ఆరోగ్య పొదుపు ఖాతా. అందుబాటులోకి వచ్చింది.

అపరిమిత సంప్రదింపులు

- ఈ ఖాతా ద్వారా ఏడాదిలో ఎన్నిసార్లయినా 'నివా బూపా'లో నమోదైన జనరల్ మెడిసిన్ వైద్యులతో టెలికాన్ఫరెన్స్, వీడియోకాల్ ద్వారా మాట్లాడొచ్చు.
- వారు సూచించే డయాగ్నస్టిక్ సేవలకు 40%, మందుల కొనుగోలుపై 15% వరకు రాయితీ లభిస్తుంది.
- ఖాతాదారులు ఎలాంటి ఛార్జీలు లేకుండా నేరుగా ఇంటి వద్దే బిల్లుల చెల్లింపు, రీఛార్జ్‌లు, డబ్బులు వేయడం, తీయడం వంటి బ్యాంకింగ్ సేవలు పొందవచ్చు.
- రూ.25తో వర్చువల్ డెబిట్ కార్డ్ జారీ చేస్తారు.
- ఈ ఖాతాను 18 నుంచి 70 ఏళ్ల వయసులోపు వారు ఎవరైనా తీసుకోవచ్చు.
- దీన్ని తెరవడానికి దగ్గరలోని తపాలా కార్యాలయానికి, పోస్ట్‌మ్యాన్ వద్దకు వెళితే సరిపోతుంది.

మొదట రూ. 200 డిపాజిట్‌తో తపాలా ఖాతా తెరవాలి. అందులో రూ.149తో ఆరోగ్య పొదుపు ఖాతాను ప్రారంభిస్తారు. మిగిలిన రూ.50 ఖాతాలోనే ఉంటాయి. కనీస నిల్వ ఉంచాల్సిన అవసరం లేదు. వార్షిక పునరుద్ధరణ ఛార్జీలు రూ.99.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

టూర్‌కు రెడీ.. పప్పీ ఎలా?

"పక్కింటి వారికి చెప్పి వచ్చినా.. ఎందుకో డాలీ గురించి బెంగగా ఉంది" పెంపుడు జంతువులున్న వారి పరిస్థితి ఇది! ఈ సమస్యకు పరిష్కారమే.. పెట్ హాస్టల్స్!! అక్కడ మీ చిట్టి కుటుంబ సభ్యుడిని లాలిస్తారు.. మీలాగే ప్రేమతో ఆడిస్తారు..!!



విహార, ఆధ్యాత్మిక యాత్రలకు కుటుంబం మొత్తం కలిసి వెళ్లాలంటే పెంపుడు జంతువులను ఇంట్లో వదిలి వెళ్లడం ఇబ్బందే. దీనికోసం ఒకరు ప్రయాణం మానుకుని ఇంట్లో ఉండాల్సిన పరిస్థితి. ఇంకొందరు వాటిని ఇంట్లో వదిలి బాగోగులు చూసుకోండి అంటూ పక్కింటి వాళ్లకు బాధ్యతలప్పగించేవారు. ఈ సమస్యకు పరిష్కారంగా 'పెట్ హాస్టల్స్' అనే ట్రెండ్ పాపులర్‌గా మారింది. పెంపుడు జంతువులకు ప్రత్యేక వసతి గృహాలు వచ్చేశాయి. యజమానులు ఇంట్లో ఉండని సమయంలో వాటి బాగోగులు చూసుకోవడమే వీటి పని.

సదుపాయాలివి..

- వ్యక్తిగత నాన్‌ఏసీ, ఏసీ గదులు, ప్రత్యేక కాటేజీలు, కేజ్‌లేని విశాలమైన ఎన్‌క్లోజర్లు, ఇంటి వాతావరణం ఉంటుంది.
- రోజూ ఉదయం, సాయంత్రం గంట పాటు వాకింగ్, ప్లేగ్రౌండ్‌లో ఆటలాడిస్తారు
- మన పెంపుడు జంతువుకు అలవాటైన హోంఫుడ్, మనం ఇంట్లో ఇచ్చే డ్రైఫుడ్ ఇచ్చి వెళితే అదే అందిస్తారు.
- 24 గంటలు సీసీ టీవీ పర్యవేక్షణ, లైవ్ మానిటరింగ్ అందుబాటులో ఉంటాయి.
- అత్యవసర వైద్య సదుపాయం కల్పిస్తారు.
- పిక్ అప్ అండ్ డ్రాపింగ్ అదనపు ఛార్జితో డోర్ సర్వీసు సదుపాయాలు ఉంటాయి.
- మ్యూజిక్ థెరపీ ద్వారా జంతువులను రిలాక్స్ చేయడం ప్రత్యేకం.
- ఇంటి వాతావరణం ఉండేలా బోర్డింగ్, డే కేర్ సేవలు అందుబాటులో ఉన్నాయి. మనం ఎక్కడున్నా మన పప్పీ వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అవసరమైతే వీడియో కాల్స్ చేయొచ్చు.



ఖర్చు ఎంతంటే?

- స్మాల్ బ్రీడ్, లార్జ్ బ్రీడ్‌ను బట్టి ఛార్జి చేస్తారు. చిన్న వాటికి నాన్ ఏసీ రోజుకు రూ.600, ఏసీ రూ.1000, పెద్దవాటికి నాన్ ఏసీ రూ.1000, ఏసీ రూ.1500 చొప్పున తీసుకుంటారు.

ఇవి ఉంటేనే..

- పెంపుడు జంతువుకు వ్యాక్సిన్లు వేసినట్లు ధ్రువీకరణ పత్రం ఉండాలి. అలాగే యజమాని ఆధార్ ఇవ్వాలి.
- టిక్స్ (పేలుకు) టాబ్లెట్ తప్పనిసరిగా హాస్టల్‌లో వదిలే ముందు వాడి ఉండాలి.
- కొన్ని కేంద్రాల్లో పప్పీ వయసు ఏడాది కంటే తక్కువైతే హాస్టల్‌లో ఉంచడానికి కొన్ని కండిషన్లపై తీసుకుంటారు.

- ఈనాడు, విశాఖపట్నం

అద్దం ఉందిగా.. ముద్దాడినా పర్వాలేదు



ముంబయిలోని బైకుల్లా జూలో మంగళవారం అద్దం ఎన్‌క్లోజర్ నుంచి తన కుమారుడికి రాయల్ బెంగాల్ టైగర్‌ను చూపిస్తూ ఓ తండ్రి ఇలా కనిపించారు. మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. "జాతీయ పులుల సంరక్షణ సంస్థ గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2025లో ఇప్పటిదాకా 667 పులులు మరణించాయి. ఇందులో 51% అభయారణ్యాల వెలుపల జరిగినవే" అని ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఓ నివేదిక విడుదలైంది. అభయారణ్యాల వెలుపల ఉన్న పులుల సంరక్షణకు 17 రాష్ట్రాల్లో కేంద్రం 'టైగర్స్ ఔట్‌సైడ్ టైగర్ రిజర్వ్స్' ప్రాజెక్టును ప్రారంభించే యోచన చేస్తోంది. – దిల్లీ

ప్రళయ్ క్షిపణి పరీక్ష విజయవంతం



బాలేశ్వర్/ దిల్లీ: కొత్తగా అభివృద్ధి చేసిన 'ప్రళయ్' క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరానికి చేరువలో ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం దీవి నుంచి సోమ, మంగళవారాల్లో రెండుసార్లు ఈ పరీక్షలు జరిగాయి. ఉపరితలం నుంచి ఉపరితలంపైనున్న లక్ష్యాలను ఛేదించే ఈ అస్త్రం.. 150 నుంచి 500 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. 500 నుంచి వెయ్యి కిలోల సంప్రదాయ వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు. ప్రళయ్‌ని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) రూపొందించింది. ఈ క్షిపణి ప్రయోగించగలిగిన అత్యధిక, అత్యల్ప దూరాలను అంచనా వేయడానికి సైనిక బలగాల ఆధ్వర్యంలో తాజా పరీక్షలు జరిగాయి.

22 మంది చిన్నారుల్ని దత్తత తీసుకోనున్న రాహుల్




జమ్మూ: ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దు ఉద్రిక్తతల్లో తల్లిదండ్రులను కోల్పోయిన 22 మంది చిన్నారులను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ దత్తత తీసుకోనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ జమ్మూకశ్మీర్ అధ్యక్షుడు తారిక్ హమీద్ కర్రా మంగళవారం వెల్లడించారు. ఆ చిన్నారుల విద్యాభ్యాసం పూర్తయ్యేవరకు వారి అన్ని అవసరాలను ఇకపై రాహుల్ చూసుకోనున్నట్లు తెలిపారు. ఇటీవల భారత్-పాకిస్థాన్ ఘర్షణల్లో దాయాది దళాల దెబ్బ తిన్న జమ్మూకశ్మీర్ సరిహద్దు గ్రామాలను రాహుల్ గాంధీ సందర్శించారు. ఈ సందర్భంగా పూంఛ్ జిల్లాలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల వివరాలు ఆరా తీశారు. ఆ ప్రకారం సర్వే నిర్వహించి 22 మంది చిన్నారుల జాబితా రూపొందించామని హమీద్ పేర్కొన్నారు.

కాలేయ క్యాన్సర్ నివారణ సాధ్యమే

దిల్లీ: ప్రపంచంలో ప్రతి ఐదు కాలేయ క్యాన్సర్ కేసుల్లో మూడింటిని(60 శాతాన్ని) సరైన ముందుజాగ్రత్త చర్యలతో నివారించవచ్చని అంతర్జాతీయ శాస్త్రజ్ఞుల బృంద అధ్యయనం వెల్లడించింది. 'ద లాన్సెట్' కమిషన్ సమర్పించిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. హెపటైటిస్ వ్యాధి రాకుండా టీకాలు తీసుకోవడం, మద్యపానం మానేయడం, మధుమేహం, స్థూలకాయం నివారణ వంటి చర్యలతో కాలేయంలో కొవ్వు(ఫ్యాటీ లివర్) పేరుకోకుండా చూసుకోవడం ద్వారా కాలేయ క్యాన్సర్‌ను నివారించవచ్చు. కాలేయంలో అతిగా కొవ్వు పేరుకోవడం వల్ల కాలేయ క్యాన్సర్ ప్రమాదం 35 శాతం పెరుగుతుంది. 46 దేశాలలో క్యాన్సర్ మరణాలకు కారణమవుతున్న మూడు ప్రధాన వ్యాధులలో కాలేయ క్యాన్సర్ ఒకటి. 2040కల్లా కాలేయ క్యాన్సర్ కేసులు 55 శాతం పెరుగుతాయని అంచనా.

నేను భారత్‌వైపే మాట్లాడతా
కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ



దిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో జరిగిన చర్చ నుంచి కాంగ్రెస్ నేతలు మనీశ్ తివారీ, శశిథరూర్‌లను పార్టీ దూరం పెట్టడం పలు ఊహాగానాలకు తెరలేపింది. ఈ క్రమంలో సర్కస్య వ్యాఖ్యలతో తివారీ చేసిన ఓ పోస్టు వైరలయింది. ఆపరేషన్ సిందూర్ జరిగే చర్చలో పాల్గొనే వారిని దూరం పెట్టారనే దానిపై ఓ వార్తా సంస్థ రాసిన కథనాన్ని తివారీ 'ఎక్స్'లో పంచుకున్నారు. దానికి 'పూరబ్ ఔర్ పశ్చిమ్' అనే ఓ బాలీవుడ్ సినిమాలోని దేశభక్తి గీతంలోని కొన్ని వ్యాఖ్యలను జోడించారు. భారతీయుడిని తాను దేశ వైభవాన్ని కోరుకుంటానని, దేశం వైపే మాట్లాడతానని పేర్కొన్నారు. దీనికి ముందు చర్చల్లో తాను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని థరూర్ పార్టీకి అభ్యర్థన చేశారని కూడా సంపాదిని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక, ఆపరేషన్‌పై జరిగే చర్చల్లో థరూర్ ఉండాలని కాంగ్రెస్ కోరిందని.. అయితే పార్టీ చెప్పిన విధంగా మాట్లాడాలని కోరినట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. దీనిని ఆయన నిరాకరించినట్టు సమాచారం. దీనిపై విలేకరులు ప్రశ్నించగా.. మౌనవ్రతం అంటూ థరూర్ బదులిచ్చారు.



మీరు యూట్యూబ్ చూస్తున్నారా?

ప్రపంచంలో సగటున ఒక్కో వ్యక్తి రోజుకు 45 నిమిషాలపాటు యూట్యూబ్ చూస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే ఏడాదికి 273 గంటలు! నిజానికి అంత సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే.. ఏదైనా ఒక క్రీడలో బాగా మెరుగవ్వొచ్చు. ఏదో ఒక పార్శ్వంశ నిపుణుడిగా ఎదగొచ్చు. జీవితంలో విజయం సాధించేందుకు దోహదపడే ఇంకే పనైనా చేయొచ్చు.

– కెవిన్ ఫెంగ్, కాపీరైటర్

ముష్కరుల్ని మట్టుబెట్టాం..

- అయినా విపక్షాల ముఖాల్లో సంతృప్తి లేదు
- ఆపరేషన్ మహదేవ్‌లో హతమైంది 'పహల్గాం ఉగ్రవాదులే'
- వారి వద్ద పాక్ ఓటరు కార్డులు
- సిందూర్‌పై చర్చలో అమిత్ షా వ్యాఖ్యలు

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ ద్వారా పహల్గాం కుట్రదారులను, ఆపరేషన్ మహదేవ్ ద్వారా నాటి ఊచకోతలో పాల్గొన్న ముష్కరులను హతమార్చామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. ముగ్గురు ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్ వార్త విపక్ష సభ్యుల్లో ఆనందాన్ని నింపుతుందని తాను భావించానని, అయితే వారి ముఖంలో నిరుత్సాహం కనిపించిందన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై మంగళవారం లోక్‌సభలో రెండోరోజు జరిగిన ప్రత్యేక చర్చలో అమిత్ షా మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత దళాలు.. సరిహద్దు నుంచి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాక్ లక్ష్యాలపై దాడి చేశాయని చెప్పారు. పాక్ రక్షణ వ్యవస్థలను భారత బలగాలు దెబ్బతీయడంతో.. గత్యంతరం లేక ఆ దేశం రాజీకి వచ్చిందని తెలిపారు.

ప్రత్యేక విమానంలో తుపాకులు పంపి..

"సులేమాన్.. లష్కర్‌కు ఎ-కేటగిరీ కమాండర్. అఫ్గానీ కూడా అదే కేటగిరీకి చెందిన ఉగ్రవాది. జిబ్రాన్ కరుడుగట్టిన ముష్కరుడు. వాంటెడ్ జాబితాలో ఉన్న ఉగ్రవాది. పహల్గాం దాడికి ముందు వీరికి ఆశ్రయం, ఆహారం అందించి అరెస్టయిన వ్యక్తులు వీరిని గుర్తుపట్టారు. అయినా సంతృప్తి చెందక.. ముగ్గురు ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న ఒక ఎం-9, రెండు ఏకే-47 తుపాకులను సోమవారం రాత్రి ప్రత్యేక విమానంలో శ్రీనగర్ నుంచి చండీగఢ్ పంపాం. అక్కడి కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించాం. ఆ తుపాకుల నుంచి తూటాలు ప్రయోగాత్మకంగా నిపుణులు పేల్చి చూశారు. అనంతరం ఖాళీ తూటాలను పహల్గాం వద్ద లభ్యమైన వాటితో పోల్చి చూశారు. పహల్గాం ఊచకోతలో వాడింది ఈ తుపాకులేనని మంగళవారం తెల్లవారుజామున 4.46 గంటలకు ఆరుగురు ఫోరెన్సిక్ నిపుణులు వీడియోకాల్ ద్వారా నాకు తెలియజేశారు" అని అమిత్ షా పేర్కొన్నారు. ఇద్దరు ముష్కరుల వద్ద పాకిస్థాన్ ఓటరు గుర్తింపు కార్డులు, ఆ దేశంలో తయారైన చాక్లెట్లు, తుపాకులు లభ్యమయ్యాయని తెలిపారు.



పాక్‌కు చిదంబరం క్లీన్‌చిట్

అన్ని రకాల ఉగ్రవాదాలకు పాకిస్థాన్ మూలమని అమిత్ షా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చేసిన తప్పిదం వల్లే ఆ దేశం పుట్టుకొచ్చిందన్నారు. 'వారు దేశ విభజనను వ్యతిరేకించి ఉంటే పాక్ ఏర్పడేది కాదు'' అని పేర్కొన్నారు. పహల్గాం దాడిపై కేంద్ర మాజీ మంత్రి చిదంబరం.. పాకిస్థాన్‌కు క్లీన్‌చిట్ ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఆ దారుణానికి పాల్పడ్డ ముష్కరులు పాక్ నుంచే వచ్చారనడానికి ఆధారాలేంటని ప్రశ్నించారన్నారు.

పహల్గాం ఊచకోత వారి పనే..

పహల్గాంలో పౌరుల ఊచకోతకు పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదుల్ని 'ఆపరేషన్ మహదేవ్'లో మట్టుబెట్టామని అమిత్ షా తెలిపారు. హతుల్లో కీలక నిందితుడు సులేమాన్ కూడా ఉన్నాడని చెప్పారు. ఈ ముష్కరులు పాకిస్థాన్ నుంచే వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. "ఆపరేషన్ మహదేవ్ మే 22న మొదలైంది. జమ్మూకశ్మీర్‌లోని దచిగామ్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరోకు నాడు సమాచారం అందింది. అక్కడ ఉగ్రవాదులు ఉన్నట్లు సెన్సర్లు గుర్తించాయి. అనంతరం సైన్యంలోని సుశిక్షిత పారా కమాండో యూనిట్లు, సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులను పంపాం. సోమవారం ఈ సంయుక్త బృందం ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చింది" అని తెలిపారు. హతమైన లష్కరే ఉగ్రవాదులు సులేమాన్, అఫ్గానీ, జిబ్రాన్‌లు పహల్గాం దాడిలో పాల్గొన్నారని చెప్పారు.

"కేంద్ర హోంశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం తగదు. పాకిస్థాన్‌ను కాపాడడం వల్ల చిదంబరానికి ఒరిగే ప్రయోజనమేంటని అడగాలనుకుంటున్నా. ముగ్గురు ఉగ్రవాదులు పాక్ పౌరులని చెప్పడానికి మా వద్ద సాక్ష్యాలు ఉన్నాయి" అని తెలిపారు.

ఆక్రమిత కశ్మీర్‌ను ఎందుకు స్వాధీనం చేసుకోలేదు?

1948లో జరిగిన యుద్ధంలో భారత బలగాలు.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను వెనక్కితీసుకోగలిగిన స్థాయిలో ఉన్నాయని అమిత్ షా చెప్పారు. అయితే నాటి ప్రధాని నెహ్రూ ఏకపక్షంగా కాల్పుల విరమణను ప్రకటించారని విమర్శించారు. "1971 నాటి యుద్ధంలో 93వేల మంది పాక్ సైనికులు భారత్‌కు లొంగిపోయారు. 15వేల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని మన సైనికులు స్వాధీనం చేసుకున్నారు. అయినా ఆక్రమిత కశ్మీర్‌ను వెనక్కి తీసుకోలేదు'' అని ఆక్షేపించారు. 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో నాటి ప్రధాని నెహ్రూ.. తన రేడియో ప్రసంగంలో అస్సాంకు 'గుడ్‌బై' చెప్పారని వివరించారు. 2005 నుంచి 2011 మధ్య దేశంలో 27 ఉగ్రవాద దాడులు జరిగినా.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పాక్‌కు పత్రాలు పంపడం మినహా చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం, ఉగ్రవాదులు సయ్యద్ సలాహుద్దీన్, టైగర్ మెమన్, అనీస్ ఇబ్రహీం కస్కర్, రియాజ్ భత్కల్ వంటివారు దేశం నుంచి పరారయ్యారని ఆరోపించారు. ఉగ్రవాద నిరోధక చట్టాన్ని (పోటా) మన్మోహన్ సింగ్ హయాంలో వెనక్కి తీసుకున్నారన్నారు.

పహల్గాంలో భద్రతా వైఫల్యం

- అమిత్ షా బాధ్యత వహించాలి
- విపక్షాలపై అసత్య ఆరోపణలు
- రాజ్యసభలో ఖర్గే వ్యాఖ్యలు



దిల్లీ: పహల్గాం ఉగ్రదాడి ఘటనకు దారితీసిన భద్రతా వైఫల్యానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. అమిత్ షాను కాపాడే ఉద్దేశంతోనే భద్రతాలోపంపై జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌తో ప్రకటన చేయించారా అని ప్రశ్నించారు. దేశంలో ఉగ్రవాద మూలాలను నాశనం చేశామని మోదీ సర్కారు చెప్పుకొంటున్నదని ఖర్గే, అలాంటప్పుడు పహల్గాం ఉగ్రదాడి ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఉరీ, పఠాన్‌కోట్, పుల్వామా దాడుల నుంచి ప్రభుత్వం ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదన్నారు. రాజ్యసభలో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ సందర్భంగా మాట్లాడిన ఖర్గే.. విపక్షాలు పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తున్నాయని అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. తాము ఎన్నడూ పాకిస్థాన్‌కు క్లీన్ చిట్ ఇవ్వలేదన్నారు. పహల్గాం దాడికి 3 రోజుల ముందు జమ్మూకశ్మీర్‌కు వెళ్లాల్సిన పర్యటనను ప్రధాని రద్దు చేసుకోవడాన్ని ఖర్గే ప్రశ్నించారు. 'ఈ దాడికి సంబంధించి ప్రభుత్వానికి ముందే సమాచారం ఉందా? అందుకే అక్కడికి వెళ్లే పర్యటన రద్దు చేసుకున్నారా? జమ్మూకశ్మీర్‌కు వెళ్లడం మంచిదికాదని, పరిస్థితి బాగాలేదని అక్కడకు వెళ్లాలనుకునేవారికి హోంమంత్రి చెప్పాలి కదా. మిమ్మల్ని మీరు రక్షించుకునేందుకు ఇతరుల ప్రాణాలు పోయినా ఫర్వాలేదా? ఇదేనా మీ దేశభక్తి? ఈ అంశంలో నిఘా వైఫల్యం ఉందా" అని ప్రశ్నించారు. "సైనికులు సాధించిన విజయాన్ని కూడా రాజకీయం చేయటం తగదు. ఆపరేషన్ సిందూర్‌లో భారత విజయంపై కాంగ్రెస్ కూడా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించింది. దేశ సైన్యం వెంట విపక్ష కూటమి నిలబడింది. యుద్ధం ఆపితేనే వాణిజ్య ఒప్పందం ఉంటుందని ట్రంప్ హెచ్చరించినట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణలో అమెరికా అధ్యక్షుడి ప్రమేయం లేదని ఎందుకు ఖండించలేదు? వాణిజ్య ఒప్పంద బెదిరింపులకు దేశప్రయోజనాలను పణంగా పెట్టారా?" అని ఖర్గే ప్రశ్నించారు. అమెరికా సహా ఏ దేశమూ పాకిస్థాన్‌ను బహిరంగంగా ఖండించలేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ ఓటమి అంచుల్లో ఉన్నప్పుడు కాల్పుల విరమణకు భారత్ ఎందుకు అంగీకరించిందని అడిగారు. పహల్గాం ఘటనపై ప్రభుత్వం ఒక నివేదిక విడుదల చేయాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌కు చెందిన ఎన్ని యుద్ధ విమానాలు కూలిపోయాయో ప్రధాని మోదీ చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కొన్ని తప్పిదాలు జరిగాయన్న త్రివిధ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు.

ఖర్గేకు నడ్డా క్షమాపణలు

ఖర్గేపై సభానాయక నేత జేపీ నడ్డా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తీవ్ర వాగ్వాదానికి కారణమైంది. చివరకు తన వ్యాఖ్యలను నడ్డా వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దాదాపు గంటపాటు ప్రసంగించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీపైనా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఖర్గే ప్రసంగం ముగిసిన వెంటనే స్పందించిన నడ్డా.. కాంగ్రెస్ అధ్యక్షుడు 'మానసిక సమతౌల్యాన్ని' కోల్పోతున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో నడ్డా చర్యలను తీవ్రంగా తప్పుపట్టిన విపక్షాలు క్షమాపణ చెప్పాలంటూ బల్లలు చరుస్తూ ఆందోళన చేపట్టాయి. అనంతరం ఖర్గే కూడా మాట్లాడుతూ.. నడ్డా క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. వెంటనే మంత్రి నడ్డా స్పందిస్తూ.. తన మాటలు వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు.



గాజాలో మారణహోమంపై మోదీ మౌనం సిగ్గుచేటు

- సోనియా ధ్వజం



దిల్లీ: గాజాలో ఇజ్రాయెల్ సైన్యం కొనసాగిస్తున్న మారణహోమంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వహించడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ మండిపడ్డారు. పిరికితనం, భయంతో నైతిక విలువలకు మోదీ తిలోదకాలిచ్చారని విమర్శలు గుప్పించారు. "గాజా సంకట్ పర్ మూక్ దర్శక్ మోదీ సర్కార్" అనే శీర్షికతో ఓ ప్రముఖ హిందీ వార్త పత్రికకు సోనియా రాసిన వ్యాసం మంగళవారం ప్రచురితమైంది. పాలస్తీనా అంశంలో దశాబ్దాలుగా భారత్ అనుసరిస్తున్న వైఖరిని ప్రధాని స్పష్టంగా, ధైర్యంగా, సూటిగా వ్యక్తం చేయాలని సోనియాగాంధీ ఆ వ్యాసంలో రాసుకొచ్చారు. మానవత్వంపై జరుగుతున్న ఈ ఘోరకలిని మోదీ ప్రభుత్వం మౌనంగా చూస్తుండటం సరికాదని, ఈ విధానం భారత ప్రజలను నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ అంశంలో భారత్ మొదటి నుంచీ రెండు దేశాల పరిష్కారం, ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజల మధ్య శాంతికి మద్దతుదారుగా ఉందన్నారు. 1974లో ఇందిరా గాంధీ సారథ్యంలోని భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజల ఏకైక, చట్టబద్ధ ప్రతినిధి పాలస్తీనా విమోచన సమితి(పీఎల్‌ఓ)ని గుర్తించిందని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. 1988లో పాలస్తీనా దేశాన్ని అధికారికంగా గుర్తించిన తొలి దేశాలలో భారత్ కూడా ఉందన్నారు. పాలస్తీనా అంశంపై నాయకత్వం కోసం గ్లోబల్ సౌత్ మరోసారి భారత్ వైపు చూస్తోందని, ఆహారం, నీరు, ఔషధాలు, ఇంధనం గాజాలోకి ప్రవేశించకుండా అడ్డుకొని పాలస్తీనా పౌరులను ఇజ్రాయెల్ హతమారుస్తున్న తీరును చూస్తుంటే 1948 నాటి 'నక్బా విషాదం' గుర్తుకు వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు.

కాల్పుల విరమణను ఉల్లంఘించిన కంబోడియా!

- థాయ్‌లాండ్ ఆరోపణ

సురిన్: థాయ్‌లాండ్-కంబోడియాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగి కొన్ని గంటలు కూడా గడవకముందే కవ్వింపు చర్యలు మొదలయ్యాయి. కంబోడియా దళాలు మంగళవారం తెల్లవారుజామున ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘనలకు పాల్పడ్డాయని థాయ్ సైన్యం ఆరోపించింది. "మేము కాల్పులు ఆపేశాం. కానీ, కంబోడియా నుంచి మాత్రం దాడులు ఆగలేదు. సరిహద్దు వెంబడి చాలా ప్రదేశాల్లో రాత్రి మొత్తం కాల్పులు జరిగాయి. థాయ్ కూడా వీటికి తగిన స్థాయిలో ప్రతిస్పందించింది. ఇరుదేశాల సరిహద్దు కమాండర్ల సమావేశమైన తర్వాతే కాల్పులు ఆగిపోయాయి. వచ్చేనెల 4న కంబోడియాలో జరగనున్న సంయుక్త సరిహద్దు కమిటీ సమావేశానికి ముందు దళాల కదలికలను నిలుపుదల చేయడానికి సమన్వయ బృందాలను ఏర్పాటు చేసేందుకు ఆ దేశ సైన్యం అంగీకరించింది'' అని థాయ్ ప్రతినిధి వింథాయ్ సువారే వెల్లడించారు. మరోవైపు, కంబోడియా రక్షణ మంత్రి మాట్లాడుతూ.. ఒప్పందానికి కంబోడియా కట్టుబడి ఉందని ఆయన నొక్కిచెప్పారు.



సురిన్ ప్రావిన్స్‌లో ఓ శిబిరంలో థాయ్ పౌరులు

కిడ్నాప్ చేసిన గర్ల్‌ఫ్రెండ్.. రూ.2.5 కోట్లు డిమాండ్

బెంగళూరు: డబ్బు కోసం ఓ యువతి తన బాయ్‌ఫ్రెండ్‌ను కిడ్నాపు చేయించిన ఉదంతమిది. దుబాయ్‌లో ట్రావెల్ సంస్థకు మేనేజరుగా పనిచేస్తున్న లారెన్స్ మెల్విన్ ఇటీవల తన స్వస్థలమైన బెంగళూరుకు వచ్చారు. ఈ నేపథ్యంలో జులై 16 నుంచి లారెన్స్ కనిపించట్లేదని తల్లి బెంగళూరులోని అశోక్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడిని కిడ్నాపు చేసినట్లు ఫోను చేసిన దుండగులు రూ.2.5 కోట్లు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు లారెన్స్ అపహరణకు స్వయానా అతడి గర్ల్‌ఫ్రెండ్ మహిమా పథక రచన చేసినట్లు గుర్తించారు. జులై 14న బయటకు వెళ్దామని మహిమా చెప్పడంతో లారెన్స్ ఓ కారు బుక్ చేసుకొని ఆమెతోపాటు వెళ్లారు. కొంతదూరం వెళ్లాక డ్రైవరు కారును దారి మళ్లించాడు. ఓచోట మరో ఇద్దరు వ్యక్తులు కారెక్కి లారెన్స్‌పై దాడి చేశారు. అతడి వద్ద ఉన్న రూ.లక్ష లాక్కొని ఓ అపార్ట్‌మెంటులో బంధించారు. దాదాపు ఎనిమిది రోజులు చిత్రహింసలకు గురిచేసి.. లారెన్స్ కుటుంబానికి ఫోను చేసి రూ.2.5 కోట్లు డిమాండ్ చేశారు. అదే అపార్ట్‌మెంటులో ఉంటున్న ఓ మహిళ ఇచ్చిన సమాచారంతో పోలీసులు లారెన్స్‌ను రక్షించి, నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ప్రధాన కుట్రదారు మహిమా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.




పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

సామూహికంగా ఓట్లు తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటాం

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- బిహార్ ఓటర్ల జాబితా సవరణపై వ్యాజ్యాల విచారణ తేదీలు ఖరారు

దిల్లీ: చట్ట ప్రకారం విధులు నిర్వహించడం రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల సంఘం(ఈసీ) బాధ్యత అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఓటరు జాబితాల విషయంలో ఈసీ ఏవైనా తప్పిదాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది. బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్)లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణం జోక్యం చేసుకుంటామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. ఎస్‌ఐఆర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను ఆగస్టు 12, 13 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపింది. ఓటరు జాబితాల నుంచి తొలగింపునకు గురైనట్లుగా చెబుతున్న వారిలో 15 మందిని కోర్టుకు తీసుకురావాలని పిటిషనర్లను ఆదేశించింది. ఆగస్టు 1న ఎన్నికల కమిషన్ ప్రచురించే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్లను తొలగించారని, దీనివల్ల వారంతా ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కపిల్ సిబల్, ప్రశాంత్ భూషణ్‌లు తెలిపారు.

దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'ఓటర్ల జాబితా తయారీ ఈసీకున్న చట్టబద్ధమైన బాధ్యత. ఈ ప్రక్రియలో తప్పులను గుర్తిస్తే ఆధారాలతో సహా మా దృష్టికి తీసుకురండి. మూకుమ్మడిగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటాం' అని తెలిపింది. ఈ అంశాలపై ఆగస్టు 8లోగా పిటిషనర్లు, ఎన్నికల సంఘం తమ లిఖితపూర్వక సమర్పణలను దాఖలు చేయాలని ధర్మాసనం సూచించింది. దరఖాస్తులను నింపి తిరిగి ఇవ్వలేదన్న సాకుతో జాబితా నుంచి తొలగిస్తున్న 65 లక్షల మంది ఓటర్లు ఎవరో ఈసీకి తెలుసునని, అటువంటి వారి పేర్లను కూడా ముసాయిదా ఓటర్ల జాబితా ద్వారా వెల్లడిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా తరఫున వాదనలు వినిపించిన కపిల్ సిబల్ పేర్కొన్నారు. ఈ విషయంలో ముసాయిదా జాబితా మౌనంవహిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ధర్మాసనం తెలిపింది.



'రాష్ట్రపతికి గడువుపై' 19 నుంచి విచారణ


దిల్లీ: రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులను రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా తేల్చాలంటూ కోర్టులు నిర్దేశించవచ్చా అనే అంశంపై ఆగస్టు 19 నుంచి విచారణ ప్రారంభం కానుంది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ తేదీలను ఖరారు చేసింది. ఈ వ్యాజ్యంపై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇప్పటికే అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. లిఖితపూర్వక అభిప్రాయాలను ఆగస్టు 12లోగా సమర్పించాలని తాజాగా స్పష్టం చేసింది. తన నిర్ణయానికి కాలవ్యవధి విధించడంపై సుప్రీంకోర్టు అభిప్రాయం కోరుతూ రాష్ట్రపతి సంధించిన 14 ప్రశ్నల వ్యాజ్యం చెల్లుబాటును సవాల్ చేసిన తమిళనాడు, కేరళ ప్రభుత్వాల వాదనలను ఆగస్టు 19న తొలుత వింటామని ధర్మాసనం పేర్కొంది. ఇందుకు గంట వ్యవధి కేటాయించింది. రాష్ట్రపతి ప్రస్తావించిన ప్రశ్నలను సమర్థించిన కేంద్రం, రాష్ట్రాల వాదనలను అదే నెల 19, 20, 21 మరియు 26 తేదీల్లో ఆలకించనుంది. దీనిని వ్యతిరేకించే వారు ఆగస్టు 28, సెప్టెంబరు 2, 3, మరియు 9 తేదీల్లో వాదనలు వినిపిస్తారు. సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు.

సలహా ఇచ్చినందుకే సమన్లా!
న్యాయవాదికి జారీచేయడంపై సుప్రీం

దిల్లీ: న్యాయవాది తన క్లయింటుకు సలహా ఇస్తున్నంత మాత్రాన దర్యాప్తు సంస్థలు అతడికి సమన్లు జారీచేయకూడదనీ, క్లయింటు చేసే నేరంలో న్యాయవాది కూడా పాలుపంచుకుంటేనే సమన్లు జారీచేయాలని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఓ సుమోటో కేసులో ఈ విధంగా వ్యాఖ్యానించింది. ఈ సమస్యపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్.సి.బి.ఎ.), సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్‌ల వాదనలను ధర్మాసనం విన్నది. కేవలం క్లయింట్లకు సలహాలిచ్చినందుకే న్యాయవాదులకు దర్యాప్తు సంస్థలు సమన్లు జారీచేస్తే, కీలకమైన క్రిమినల్ కేసుల్లో సలహాలు ఇవ్వడానికి ఎవరూ సాహసించరని ప్రస్తుత కేసులో న్యాయవాదుల తరఫున వాదిస్తున్న ఎస్.సి.బి.ఎ. అధ్యక్షుడు వికాస్ సింగ్ పేర్కొన్నారు. ఒక న్యాయవాదిని సమను చేయడానికి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నుంచి అనుమతి రావాలనీ, దాన్ని జారీచేసే ముందు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పరిశీలించాలని సింగ్ సూచించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, సుప్రీంకోర్ట్ అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్‌లు తమ సూచనలను మూడు రోజుల్లో సొలిసిటర్ జనరల్, అటార్నీ జనరల్‌లకు పంపాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 12వ తేదీకి వాయిదావేసింది.

బుకర్‌ప్రైజ్ జాబితాలో కిరణ్ దేశాయ్ పుస్తకం

దిల్లీ: ప్రముఖ రచయిత్రి కిరణ్ దేశాయ్ రచించిన 'ది లోన్లినెస్ ఆఫ్ సోనియా అండ్ సోనీ' పుస్తకం ప్రతిష్ఠాత్మక బుకర్‌ప్రైజ్ జాబితా(లాంగ్‌లిస్ట్)లో చోటు దక్కించుకుంది. మంగళవారం ప్రకటించిన ఈ జాబితాలో వివిధ దేశాలకు చెందిన ఏడుగురు మహిళలు, ఆరుగురు పురుషులు రచించిన దీర్ఘకాల కాల్పనిక 13 నవలలు ఉన్నాయని బుకర్‌ప్రైజ్ ఫౌండేషన్ వెల్లడించింది. ఈ జాబితాలో దేశాయ్ రచించిన పుస్తకం 650 పేజీలతో అతి పెద్దది కాగా.. నటాషా బ్రౌన్ రాసిన 'యూనివర్సాలిటీ' 156 పేజీలతో అతి చిన్నది. బుకర్‌ప్రైజ్ ప్రకటన కార్యక్రమం లండన్‌లోని ఓల్డ్ బిల్లింగేట్స్‌లో నవంబరు 10న జరగనుంది. కిరణ్ దేశాయ్ రాసిన 'ది ఇన్హెరిటెన్స్ ఆఫ్ లాస్' నవల 2006లో బుకర్ ప్రైజ్ గెలుచుకున్న విషయం తెలిసిందే.



నిమిష మరణశిక్ష రద్దు వార్తలు అవాస్తవం


- విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడి



దిల్లీ: యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియ కేసు మళ్లీ మలుపు తిరిగింది. ఆమె మరణశిక్షను రద్దు చేశారంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని భారత విదేశీ వ్యవహారాల శాఖ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. ఆమె మరణ శిక్షను యెమెన్ ప్రభుత్వం రద్దు చేస్తున్నట్లు భారత గ్రాండ్ ముఫ్తీ అబూబకర్ ముస్లియార్ సోమవారం రాత్రి ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై తమకు యెమెన్ నుంచి అధికారిక సమాచారం రాలేదని విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది.

కాక్‌పిట్‌లోకి వచ్చిన భారత సంతతి కో-పైలట్ అరెస్టు

- అమెరికాలో ఘటన



రుస్తుం భగ్వాగర్

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో అంతర్జాతీయ విమానాశ్రయంలో భారత సంతతికి చెందిన ఓ కో-పైలట్‌ను విమానం కాక్‌పిట్‌లో నుంచే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఈ నెల 27 ఉదయం 7.05 గంటల సమయంలో చోటుచేసుకుంది. మిన్నియాపొలిస్ నుంచి డెల్టా 2809 బోయింగ్ 757-300 విమానం శాన్‌ఫ్రాన్సిస్కో చేరుకున్న 10 నిమిషాల్లోనే కాక్‌పిట్ లోపలికి దూసుకువచ్చి, కో-పైలెట్ రుస్తుం భగ్వాగర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విమానం నుంచి దిగాలని ఎదురుచూస్తున్న ప్రయాణికులు ఆ పరిణామంతో ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడన్న కారణంగానే అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. "అనైతికతను మా సంస్థ ఏమాత్రం సహించదు. అతడిపై వచ్చిన అభియోగాలు మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. మేం అతడిని సస్పెండ్ చేస్తున్నాం" అని భగ్వాగర్ అరెస్టుపై డెల్టా విమానయాన సంస్థ తెలిపింది.

ఉక్రెయిన్ జైలు, ఆసుపత్రిపై రష్యా దాడులు: 22 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్‌లోని జైలు, వైద్య సదుపాయాల కేంద్రంపై రష్యా సోమవారం అర్ధరాత్రి బాంబులు, క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో కనీసం 22 మంది పౌరులు మృతి చెందినట్లు ఉక్రెయిన్ అధికారులు మంగళవారం వెల్లడించారు. ఆగ్నేయ జపోరిఝియా ప్రాంతంలోని జైలును శక్తిమంతమైన నాలుగు గ్లైడ్ బాంబులు తాకాయని, ఈ దాడిలో 17 మంది ప్రాణాలు కోల్పోగా 80 మంది ఖైదీలు గాయపడినట్లు తెలిపారు. మధ్య ఉక్రెయిన్‌లోని డినిప్రో ప్రాంతంలో ఓ ఆసుపత్రి వార్డు, మూడంతస్తుల భవనంపైకి క్షిపణులు దూసుకు రాగా ఐదుగురు మృతి చెందారని, 8 మంది గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపి శాంతి నెలకొల్పేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఇదివరకు ఇచ్చిన 50 రోజుల గడువును కుదిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సోమవారం నాడే ఈ దాడులు జరిగాయి. మరో 10-12 రోజుల్లో శాంతిచర్చలు కొలిక్కి రాకపోతే ఆంక్షలు, సుంకాలు మరింత పెంచుతానన్న ట్రంప్ హెచ్చరికలను రష్యా పట్టించుకోలేదని స్పష్టమవుతోంది.

EENADU Vol: 51, Issue: 351 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



ప్రమాదంలో ధ్వంసమైన బస్సు

ఝార్ఖండ్‌లో బస్సు- ట్రక్కు ఢీ

- ఆరుగురు కన్వర్ యాత్రికుల మృతి
- 24 మందికి గాయాలు

రాంచీ: ఝార్ఖండ్‌లోని దేవ్‌ఘర్ జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కన్వర్ యాత్రికులు ప్రయాణిస్తున్న ఓ బస్సు ఎల్పీజీ సిలిండర్ల ట్రక్కును ఢీకొంది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. మరో 24 మంది గాయపడ్డారు. ఉదయం 5.30 గంటల సమయంలో జమునియా అటవీ ప్రాంతానికి సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దేవ్‌ఘడ్‌లోని బాబాధామ్ నుంచి బయలుదేరిన 32 సీటర్ల బస్సు దుమ్కాలోని బాసుకినాథ్ ఆలయానికి వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురైంది. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. వీరిలో పలువురు పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు వెల్లడించారు. ప్రమాద తీవ్రతకు బస్సు నుజ్జునుజ్జయ్యిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ 'ఎక్స్' వేదికగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రక్తమోడుతూ స్ట్రెచర్‌పైనే రోడ్డు ప్రమాద బాధితుడి మృతి

- పట్టించుకోకుండా నిద్రపోయిన వైద్యులు
- ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్ ఆసుపత్రిలో ఘటన



మేరఠ్: ఇద్దరు జూనియర్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం పోయిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో చోటుచేసుకుంది. హసన్‌పుర్‌కి చెందిన సునీల్ కుమార్(30) ఆదివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అర్ధరాత్రి సమయంలో బంధువులు అతణ్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు ఇదేమీ పట్టించుకోకుండా నిద్రపోయారు. సునీల్‌ను స్ట్రెచర్‌పైనే వదిలేయడంతో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయినట్లు అతడి బంధువులు ఆరోపించారు. బాధితుడికి వైద్యం చేయాలని కుటుంబసభ్యులు వేడుకున్నా.. పట్టించుకోలేదని తెలిపారు. అయితే.. వైద్యులు నిద్రపోతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు జూనియర్ వైద్యులు భూపేశ్ కుమార్ రాయ్, అనికేత్‌లను సస్పెండ్ చేశారు. దీనిపై దర్యాప్తునకు ఆదేశించారు.

ఆఫీసు భవనం పైనుంచి దూకి టెకీ ఆత్మహత్య

మహారాష్ట్రలోని పుణెలో ఘటన

పుణె: కార్యాలయ భవనంపై నుంచి దూకి ఓ ఐటీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మహారాష్ట్రలోని పుణెలో చోటుచేసుకుంది. నాసిక్‌కు చెందిన పీయూష్ అశోక్ కవాడే(23) పుణెలోని హింజెవాడి ఐటీ పార్క్‌లో ఉన్న ఓ కంపెనీలో ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం ఆఫీసులో జరిగిన సమావేశానికి హాజరై అస్వస్థతగా ఉందని బయటకు వెళ్లాడు. అనంతరం ఏడో అంతస్తుపై నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సూసైడ్ నోట్‌ను గుర్తించారు. "జీవితంలో విఫలమయ్యా. నన్ను క్షమించండి. మీ కుమారుడిగా ఉండేందుకు నాకు అర్హత లేదు" అని కుటుంబసభ్యులను ఉద్దేశిస్తూ లేఖ రాసినట్లు పోలీసులు వెల్లడించారు.

భారత్‌లో మరో నాలుగు విదేశీ వర్సిటీలు

అనుమతులు జారీచేసిన యూజీసీ

దిల్లీ: భారత్‌లోని పలు నగరాల్లో నాలుగు విదేశీ విశ్వవిద్యాలయాలు క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నాయి. నూతన విద్యా విధానం అయిదో వార్షికోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ నిధుల సంఘం(యూజీసీ) ఈ మేరకు అనుమతులు జారీ చేసింది. దీని ప్రకారం.. ముంబయిలో బ్రిటన్‌లోని బ్రిస్టల్ యూనివర్సిటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసి, 2026 నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఆస్ట్రేలియాకు చెందిన వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ గ్రేటర్ నొయిడాలో, విక్టోరియా వర్సిటీ నొయిడాలో, లా ట్రోబ్ యూనివర్సిటీ బెంగళూరులో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయనున్నాయి. ఇప్పటికే వీటికి కావాల్సిన అన్ని అనుమతులు మంజూరు చేసినట్లు అధికారులు మంగళవారం పేర్కొన్నారు.

అర్ధరాత్రి ప్రేయసి కోసం వెళితే దొంగ అనుకొని చితకబాదారు!

ఇంటర్నెట్ డెస్క్: వివాహిత అయిన తన ప్రేయసి ఆహ్వానంతో గ్రామంలోకి వెళ్లిన ప్రియుడిని 'డ్రోన్ దొంగ' అనుకొని గ్రామస్థులు చితకబాదిన ఘటన యూపీలోని హాపుడ్ సమీప గ్రామంలో జరిగింది. కొందరు దుండగులు ముందు డ్రోన్ల సహాయంతో గాలించి.. తర్వాత దొంగతనాలు చేస్తున్నారని గత కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో వదంతులు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో గ్రామస్థులు రాత్రిళ్లు గస్తీ కాయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో.. ఓ యువకుడు (20) అర్ధరాత్రి వేళ తన ఇద్దరు స్నేహితులతో కలిసి గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటం గమనించారు. వివరాలను ఆరా తీస్తుండగా, మిగతా ఇద్దరు స్నేహితులు పరారవడంతో యువకుడిని పట్టుకొని చితకబాదారు. పోలీసులు ఆ యువకుడిని తీసుకువెళ్లి విచారించగా అసలు విషయం బయటపడింది.



యుద్ధం ఎందుకు ఆపారో చెప్పరేం?

- నెహ్రూ, ఇందిర, సోనియా గురించి మాట్లాడారు కదా!
- ..మరి దీనికెందుకు జవాబివ్వరు?: ప్రియాంక



దిల్లీ: పాకిస్థాన్‌పై మొదలైన యుద్ధాన్ని ఆకస్మాత్తుగా ఎందుకు ఆపాల్సి వచ్చిందనే ప్రశ్నకు కేంద్రం సమాధానం చెప్పడం లేదని కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంకా గాంధీ విమర్శించారు. "పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీల కోసం, మా తల్లి సోనియాగాంధీ కన్నీళ్ల కోసం లోక్‌సభలో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరి దీనిపై మాత్రం ఎందుకు జవాబివ్వరు? శత్రువులు ఎక్కడికీ పారిపోలేని సమయంలో యుద్ధాన్ని ఎందుకు ఆపారు? ఇలా ఆకస్మికంగా యుద్ధాన్ని ఆపడం దేశ చరిత్రలోనే మొదటిసారి. ఆ ప్రకటనను కూడా అమెరికా అధ్యక్షుడు చేశారు. ఇది మన ప్రధాని బాధ్యతారాహిత్యాన్ని చాటుతోంది. మన దౌత్యం విఫలమైంది. నాయకత్వం అంటే ఖ్యాతినే కాదు.. బాధ్యత కూడా తీసుకోవాలి" అని పరోక్షంగా ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్‌పై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు.

భద్రత కల్పించాల్సిన బాధ్యత లేదా?

"ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రధాని, హోంమంత్రి, రక్షణశాఖ, జాతీయ భద్రతా సలహాదారులకు లేదా? బైసరన్ వ్యాలీకి వేలల్లో పర్యాటకులు వస్తారని ప్రభుత్వానికి తెలియదా? ప్రభుత్వాన్ని నమ్ముకుని అక్కడకు వెళ్లినవారి భద్రతను భగవంతుడి దయకే ఎందుకు వదిలేశారు? ఇంత దారుణమైన ఉగ్రదాడి జరిగినందుకు, పాక్ కుట్ర పన్నుతోందని నిఘా సంస్థలు ముందుగానే ఎందుకు పసిగట్టలేకపోయాయి? ఇది మన ప్రభుత్వం, నిఘా సంస్థల వైఫల్యమే. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేశారా, కనీసం బాధ్యత తీసుకున్నారా? గతం గురించే మాట్లాడతారు కానీ, ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలపై మాత్రం సమాధానం చెప్పరు. ఆపరేషన్‌లో మన విమానాల్లో ఒక్కటి కూడా కూలిపోకపోతే ఆ విషయాన్ని పార్లమెంటులో చెప్పడానికి ఇబ్బందేమిటి?" అని ప్రియాంక తీవ్రస్వరంతో ధ్వజమెత్తారు. బాట్లాహౌస్ ఉగ్రవాదుల కోసం సోనియా ఏడ్చారని హోంమంత్రి చెప్పడాన్ని ఆమె ఖండించారు. తన తల్లి 44 ఏళ్ల ప్రాయంలో ఉన్నప్పుడు భర్తను కోల్పోయారని, అప్పుడు మాత్రం ఆమె విలపించారని చెప్పారు. ఆ బాధ ఎలా ఉంటుందో తెలుసు కాబట్టి.. పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయినవారి గురించి మాట్లాడుతున్నానని వారందరి పేర్లు ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ సైనిక జనరల్ అమెరికా అధ్యక్షుడితో విందులో పాల్గొనడం, ఉగ్రవాద వ్యతిరేక కమిటీకి ఐరాసలో సారథ్య బాధ్యతను పాక్ చేపట్టడం మన వైఫల్యాలని నిప్పులు చెరిగారు.

నిఘా వైఫల్యానికి నిదర్శనం: అఖిలేశ్



సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. పహల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ చేపట్టడం నిఘా వర్గాల వైఫల్యానికి నిదర్శనమన్నారు. దీనివల్ల విలువైన ప్రాణాలు పోవడంతోపాటు సరిహద్దుల్లో వైఫల్యాలు బహిర్గతం అయ్యాయని అన్నారు. విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పాక్ కంటే చైనా పెద్ద శత్రువు అని, అది మన భూమిని, మార్కెట్లను కబళిస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మనకు బాసటగా ఏ దేశం నిలవలేకపోవడం విదేశాంగ విధానంలోని లోటే అని అన్నారు. డీఎంకే సభ్యురాలు కనిమొళి కూడా మోదీపై విరుచుకుపడ్డారు. విశ్వగురు చెప్పుకొనే ఆయన తన సొంత విధానాలు విఫలమయ్యేలా చేశారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికీ విపక్షాన్నే ఆడిపోసుకుంటోందన్నారు.

ఆ పరిస్థితుల్లో ఉద్యోగి పరిహారానికి అర్హుడే

- రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



దిల్లీ: ఒక ఉద్యోగి ఇంటి నుంచి పని ప్రదేశానికి వెళ్తూ కానీ, పని ప్రదేశంలో విధి నిర్వహణ అనంతరం ఇంటికి వెళ్తూ కానీ ప్రమాదానికి గురైనప్పుడు ఉద్యోగుల పరిహార చెల్లింపు చట్టం (ఈసీ చట్టం) కింద పరిహారం పొందడానికి అర్హుడేనని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. అయితే ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులకు, ప్రమాద సమయానికి, అది జరిగిన ప్రదేశానికి మధ్య సంబంధం ఉన్నట్టు, ఉద్యోగి సంస్థ పని మీద వెళ్తున్నట్టు నిరూపించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. చట్టంలోని సెక్షన్ 3 కింద "ఉద్యోగి విధుల నిర్వహణలోంచి తలెత్తిన లేదా బాధ్యతా నిర్వహణలో భాగంగా ఎదుర్కొనే ప్రమాదం" అనే అభివ్యక్తీకరణపై సందిగ్ధత నెలకొందని జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడుకున్న ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంపై కోర్టు భిన్న ఆదేశాల్లో విభిన్న విధాలుగా వ్యాఖ్యానం అందించిందని ధర్మాసనం తెలిపింది. బాంబే హైకోర్టు 2011లో వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీలుపై విచారణలో భాగంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 2003 ఏప్రిల్ 22న విధి నిర్వహణకు వెళ్తూ ప్రమాదానికి గురై మరణించిన ఒక వాచ్‌మెన్ కుటుంబానికి ఈసీ చట్టం కింద రూ 3,26,140 వడ్డీతో సహా చెల్లించాలని ఉస్మానాబాద్ సివిల్ జడ్జి వెలువరించిన తీర్పు ఈ వ్యాజ్యానికి మూలం.


సరిహద్దులో ఆయుధాల అక్రమ రవాణా

ఓ వ్యక్తిని అరెస్టు చేసిన పంజాబ్ పోలీసులు

చండీగఢ్: భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఆయుధాల అక్రమ రవాణా కార్యకలాపాలు సాగిస్తున్న ఓ వ్యక్తిని పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని తర్న్ తరన్ జిల్లాలోని మర్హి మేఘా గ్రామానికి చెందిన భరత్ ప్రీత్ సింగ్‌గా గుర్తించారు. ఇతను పాక్ స్మగ్లర్ల సమక్షంలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. మంగళవారం అమృత్‌సర్‌లోని ఓ పార్టీకి ఆయుధాలు సరఫరా చేసేందుకు వెళ్తున్న క్రమంలో భరత్ ప్రీత్‌ను అరెస్టు చేసినట్లు డీజీపీ గౌరవ్ యాదవ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. నిందితుడు పంజాబ్‌లోని గ్యాంగ్‌స్టర్లు, పలువురు నేరస్థులకు ఈ ఆయుధాలను చేరవేస్తున్నట్లు తేలిందని వెల్లడించారు. ఈ నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయిలో ఛేదించేందుకు సమగ్ర దర్యాప్తు చేపట్టినట్లు డీజీపీ పేర్కొన్నారు.

మూసా పని 3 గంటల్లో ఖతం

- 'ఆపరేషన్ మహాదేవ్' సాగిందిలా..



హషీమ్ మూసా

ఇంటర్నెట్ డెస్క్: పహల్గాం ఉగ్రదాడి ప్రధాన సూత్రధారి సులేమాన్ షా అలియాస్ హషీమ్ మూసా పనిని భారత సైన్యం మూడు గంటల్లో ముగించేసింది. శాటిలైట్ ఫోను కమ్యూనికేషను ఆధారంగా అతడి జాడను గుర్తించిన కమాండోలు మెరుపు వేగంతో ఆపరేషను చేపట్టారు. సోమవారం ఉదయం రాష్ట్రీయ రైఫిల్స్, పారా కమాండోలు అడవుల్లోకి లంఘించి.. ప్రతి నిమిషం ఉత్కంఠ మధ్య తొలి కాల్పుల్లోనే ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. శ్రీనగర్‌లోనే అత్యంత ఎత్తైన మహాదేవ్ పర్వతం 13,000 అడుగుల ఎత్తుతో ఏడాది పొడవునా మంచుతో కప్పి ఉంటుంది. ఆ పరిసర ప్రాంతాలను కశ్మీరీ హిందువులు సావన్ (శ్రావణ)మాసంలో చాలా పవిత్రంగా చూస్తారు. ఈ పర్వత ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి దాటాక 2.00 గంటల సమయంలో చైనా తయారీ ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ సెట్ 'టీ 82' యాక్టివేట్ అయినట్లు భద్రతా దళాలు గుర్తించాయి. పహల్గాం ఉగ్రదాడిలో ముష్కరులు దీన్నే వాడారు. దీంతో భద్రతా దళాలు వెంటనే అప్రమత్తం అయ్యాయి. ఆ సెట్ లొకేషను డాచిగామ్ నేషనల్ పార్కులో ఉన్నట్లు గుర్తించి ఆపరేషను మొదలుపెట్టాయి. ఉదయం 8.00 గంటలకు డ్రోను ఎగురవేసి ఆ చిక్కటి అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. ముల్నార్ వద్ద ముష్కరుల స్థావరం ఉన్నట్టు అంచనా వేశాక.. వారి క్యాంపు సమీపానికి చేరి పొజిషను తీసుకునేసరికి 11.00 గంటలు అయింది. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా.. ఉగ్రవాదులను గుక్క తిప్పుకోనివ్వకుండా ఫైరింగు జరిపారు. తొలి రౌండ్లలోనే ముగ్గురికి తూటాలు తాకాయి. ఎన్‌కౌంటరు ప్రదేశం నుంచి రెండు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇంకా ఎవరైనా ఉన్నారేమోనని గాలింపు చేపట్టాక.. 12.45కు మూసాతోపాటు మరో ఇద్దరు ఉగ్రవాదుల మృతదేహాలను గుర్తించారు. వీరి నుంచి అమెరికా తయారీ ఎం-4 కార్బైన్, ఏకే-47 రైఫిళ్లు, 17 రైఫిల్ గ్రనేడ్లు, పెద్దసంఖ్యలో తూటాలు, అల్ట్రాసెట్లను స్వాధీనం చేసుకొన్నారు.

నీతీశ్ కటారా హత్యకేసు.. సుఖ్‌దేవ్ విడుదలకు సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన నీతీశ్ కటారా హత్య(2002) కేసులో దోషిగా 20 ఏళ్ల నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్న సుఖ్‌దేవ్ యాదవ్ అలియాస్ పహల్వాన్‌ను విడుదల చేయాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. సుఖ్‌దేవ్ ఈ ఏడాది మార్చిలోనే శిక్ష పూర్తి చేసుకున్నట్లు గమనించిన జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. ప్రవర్తన కారణంగా సుఖ్‌దేవ్ ముందస్తు విడుదల అభ్యర్థనను శిక్షా సమీక్ష మండలి(ఎస్ఆర్‌బీ) తిరస్కరించింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కోర్టు ఉత్తర్వులపై నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయడమేంటని ప్రశ్నించింది. ఈ విధంగా ప్రవర్తిస్తే ప్రతీ దోషి జైలులోనే మరణిస్తారని, కార్యనిర్వాహకుల ప్రవర్తన ఇలానే ఉంటుందా? అని మండిపడింది.

వికాస్ యాదవ్ బెయిల్ పొడిగింపు

నీతీశ్ కటారా హత్య కేసులో 25 ఏళ్లుగా శిక్షను అనుభవిస్తున్న మరో దోషి వికాస్ యాదవ్‌కు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను జస్టిస్.ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం నాలుగు వారాలు పొడిగించింది. అనారోగ్యంతో బాధపడుతోన్న తల్లిని చూసుకునేందుకు వికాస్‌కు అనుమతినిచ్చిన న్యాయస్థానం ఈ కేసులో ఉపశమనం పొందేందుకు దిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది.

ప్రఖ్యాత ఆర్థికవేత్త మేఘనాథ్ దేశాయ్ కన్నుమూత



లండన్, దిల్లీ: ప్రఖ్యాత బ్రిటిష్ - ఇండియన్ ఆర్థికవేత్త, హౌస్ ఆఫ్ లార్డ్స్ ప్రముఖుడు మేఘనాథ్ దేశాయ్ (85) మంగళవారం కన్నుమూశారు. ఆరోగ్య సమస్యల కారణంగా గురుగ్రామ్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించినట్లు లండన్‌లోని ఆయన కుటుంబ సన్నిహిత వర్గాలు తెలిపాయి. గుజరాత్‌కు చెందిన దేశాయ్ మృతికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. భారత్, బ్రిటన్‌ల నడుమ సంబంధాల బలోపేతానికి ఆయన కృషి చేశారని ప్రధాని కొనియాడారు. 1965 నుంచి 2003 వరకు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో బోధకుడిగా పనిచేసిన ఈయన భారత ప్రభుత్వం నుంచి పద్మభూషణ్ అవార్డు అందుకొన్నారు. 1971లో లేబర్ పార్టీలో చేరి హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా వ్యవహరించారు. లండన్ పార్లమెంటు కూడలిలో మహాత్ముడి విగ్రహం ఏర్పాటుకు 'గాంధీ స్టాచ్యూ మెమోరియల్ ట్రస్టు' వ్యవస్థాపక ట్రస్టీగా కృషి చేశారు.

పుణ్యానికి పోతే.. 13 నెలల జైలు!

భోపాల్: ఒక్కోసారి మంచి చేసేందుకు ప్రయత్నించినా.. కథ అడ్డం తిరిగి మనమే చిక్కుల్లో పడుతుంటాం. మధ్యప్రదేశ్ రాజధాని నగరమైన భోపాల్‌లోని ఆదర్శనగర్‌కు చెందిన సాధారణ దినసరి కూలీ రాజేశ్ విశ్వకర్మకు అలాంటి అనుభవమే ఎదురైంది. స్థానిక మురికివాడలోని అద్దె ఇంట్లో నివసిస్తున్న రాజేశ్ గతేడాది జూన్‌లో తన పొరుగింట్లో అనారోగ్యంతో బాధపడుతున్న ఒంటరి మహిళను దగ్గర్లోని ఆస్పత్రిలో చేర్చాడు. ఆమె చికిత్స పొందుతూ మరణించింది. గొంతు కోసి చంపినట్లు పోస్టుమార్టం నివేదిక రావడంతో పోలీసులు అనుమానం కింద రాజేశ్‌ను అరెస్టు చేశారు. న్యాయస్థానం ఈ కేసును ప్రభుత్వ న్యాయవాదికి అప్పగించింది. రాజేశ్ జరిగినదంతా న్యాయవాదికి వివరించాడు. పోలీసులు, పోస్టుమార్టం సిబ్బంది నిర్లక్ష్యం వల్లే నివేదిక అలా వచ్చిందని.. వాస్తవానికి అనారోగ్యంతోనే ఆమె మరణించినట్లు ఆధారాలతో సహా కోర్టులో నిరూపించారు. రాజేశ్‌ను నిరపరాధిగా గుర్తించిన న్యాయస్థానం 13 నెలల తర్వాత విడుదలకు ఆదేశించింది. జైలు నుంచి బయటపడ్డాక తన కుటుంబ పరిస్థితి మరింత దుర్భరంగా మారిందని రాజేశ్ వాపోతున్నాడు.



4 వేల టన్నుల బొగ్గు వర్షానికి కొట్టుకుపోయిందట!



ఇంటర్నెట్ డెస్క్: ఈశాన్య రాష్ట్రం మేఘాలయలోని రాజాజు, దియంగన్ గ్రామాల్లోని బొగ్గు నిల్వకేంద్రాల నుంచి ఇటీవల 4 వేల టన్నుల బొగ్గు అదృశ్యమైంది. దీన్ని అక్రమంగా తరలించి ఉంటారన్న ఆరోపణలు ఉన్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పరిణామాలపై రాష్ట్ర రెవెన్యూ మంత్రి కీర్మెన్ షిల్లా ఇచ్చిన విచిత్రమైన వివరణ ప్రస్తుతం చర్చనీయాంశమైంది. భారీవర్షాల కారణంగా ఆ బొగ్గు అంతా బంగ్లాదేశ్, అస్సాంలకు కొట్టుకుపోయి ఉండొచ్చని ఆయన చెబుతున్నారు. 'మేఘాలయ దేశంలోనే అత్యంత ఎక్కువ వర్షపాతం నమోదయ్యే రాష్ట్రాల్లో ఒకటి. భారీవర్షాల కారణంగా ఏదైనా జరగొచ్చు" అని మంత్రి తన వాదనను సమర్థించుకొంటున్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. అక్రమ మైనింగును దాచిపెట్టేందుకే ఇలాంటి వాదనలు తీసుకొస్తున్నారంటూ విపక్షాలు మండిపడుతున్నాయి.


'టీ' కప్పులో పెనుతుపాను

11 లక్షలమంది మహిళల గోప్యతకు భంగం



ఇంటర్నెట్ డెస్క్: డేటింగ్ యాప్ 'టీ'లో లీకుల పెనుతుపాను చెలరేగింది. మహిళలు తమకు నచ్చిన విషయాలు షేర్ చేసుకునేలా రూపొందించిన ఈ యాప్‌లో గోప్యతా ఉల్లంఘనలు బయటపడ్డాయి. 11 లక్షలమంది యూజర్ల మధ్య సాగిన ప్రైవేటు మెసేజ్‌లు ఆన్‌లైనులో ప్రత్యక్షమయ్యాయని ఓ మీడియా కథనం వెల్లడించింది. వాటిలో అత్యంత సున్నితమైన, వ్యక్తిగత సమాచారం ఉన్నట్లు పేర్కొంది. ఈ టీ యాప్‌నకు 16 లక్షల మంది యూజర్లు ఉన్నారు. మహిళలు మాత్రమే ఈ యాప్‌లో చేరేలా వారి సెల్ఫీలతో నిర్ధరణ చేసుకుంటారు. ఈ ఫీచరు వల్లే మహిళలు దీని వైపు ఆకర్షితులయ్యారు. తమ యాప్ మహిళలకు సురక్షితం అని 'టీ' నిర్వాహకులు చెబుతున్నప్పటికీ.. వరుసగా డేటా బయటకు పొక్కుతోంది. కొన్నిరోజుల క్రితం వేలాది యూజర్ల సెల్ఫీలు, ఐడీ ఫొటోలు ఆన్‌లైనులో చక్కర్లు కొట్టాయి. ఈ విషయాన్ని సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ఒకరు మీడియాకు వెల్లడించారు. ఈ యాప్‌లో మారు పేర్లు వాడే వెసులుబాటు ఉన్నప్పటికీ.. చాలామంది యూజర్లు తమ గుర్తింపు తెలియజేసే వివరాలనే ఉపయోగించారు. ఇప్పుడిలా బయటకు పొక్కడం తీవ్ర ఆందోళనలకు దారితీస్తోంది. "సైబర్ సెక్యూరిటీ నిపుణులతో విచారణ చేయిస్తున్నాం. పునరావృతం కాకుండా తగిన చర్యలను ఇప్పటికే ప్రారంభించాం. భద్రతా సంస్థలు జరిపే దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నాం" అని 'టీ' నిర్వాహకులు తెలిపారు.

ఉగ్రవాదంపై పోరులో కావాలంటే పాక్‌కు సాయం: రాజ్‌నాథ్



దిల్లీ: ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో పాకిస్థాన్ తగిన చర్య తీసుకోలేకపోతే అవసరమైన సాయాన్ని అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, సరిహద్దుల అవతల ఉగ్రవాదంపై పోరాడగల సత్తా మన దళాలకు ఉందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌పై మంగళవారం రాజ్యసభలో ప్రత్యేక చర్చను ఆయన ప్రారంభించారు. 'పాకిస్థాన్ సహా యావత్ ప్రపంచంలో ఎక్కడ ఉగ్రవాదం ఉండకూడదని మన దేశం కోరుకుంటోంది. అందుకే గతంలోనూ పాక్‌కు సాయం ఇచ్చాను. ఇప్పుడు మళ్లీ చెబుతున్నాను.. ఉగ్రవాదంపై సమర్థంగా చర్య తీసుకోలేకపోతే మా సాయం తీసుకోండి. ఆపరేషన్ సిందూర్‌కు కామాయే గానీ ఫుల్‌స్టాప్ పెట్టలేదు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై విపక్షాల డిమాండ్ల విషయంలో అవి పూర్తి భిన్నంగా వ్యవహరించాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు భారత పాలన వ్యవస్థ కిందికి వచ్చేరోజు ఎంతో దూరంలో లేదని భాజపా నమ్మకం. పాక్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయి కాబట్టి వాళ్లతో చర్చల ద్వారానే ముందుకు వెళ్లాలని కొందరు అనుకుంటున్నారు. ఈ బూచి వల్లనే లెక్కకు మిక్కిలి ప్రజల ప్రాణాలను మనం కోల్పోయాం. దీటైన జవాబు చెప్పాలనేది మా ఉద్దేశం. మతం, సిద్ధాంతం, రాజకీయ కారణాలతో ఉగ్రవాదాన్ని సమర్థించలేరు. ఆత్మరక్షణార్థం మనం చర్య తీసుకున్నామే గానీ విస్తరణవాదంతో కాదు. భారత్ ఇక ఏ మాత్రం బెదిరింపులకు లొంగదని ఆపరేషన్ సిందూర్ రుజువు చేసింది. పాక్ ఉగ్రవాదం దుస్సాహసమేనని చెప్పగలిగాం. ఆపదవచ్చిన ప్రతిసారీ.. సిందూరాన్ని తుడిచేస్తున్నా దౌత్య చర్యలు జరపాలా? విపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు అలాగే చేసేవి' అని రాజ్‌నాథ్ చెప్పారు. పాక్‌కు నిధులివ్వడాన్ని అంతర్జాతీయ సమాజం ఆపేయాలన్నారు.

కాలమే చెబుతుంది: చిదంబరం

తొలుత కేంద్ర మాజీ మంత్రి చిదంబరం మాట్లాడుతూ- ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నడుస్తున్నప్పుడు పోరు విరమణకు ప్రభుత్వం ఎందుకు అంగీకరించిందని ప్రశ్నించారు. ఆపరేషన్ విజయవంతమైనా 1971 యుద్ధం మాదిరిగా అది నిశ్చయాత్మకమా, కాదా అనేది కాలమే చెబుతుందన్నారు. పాక్, చైనా వేర్వేరు కాదని, ఆ రెండింటినీ ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వద్ద ప్రణాళికలు ఉన్నాయా అని ప్రశ్నించారు.

దిల్లీలో రాత్రివేళల్లోనూ విధులకు మహిళలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో మహిళలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజధాని పరిధిలో మహిళలు రాత్రివేళల్లోనూ పని చేసేందుకు వీలుగా చట్టంలో మార్పులు తీసుకురాబోతున్నట్లు మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నగర ఆర్థిక సామర్థ్యాన్ని విస్తరించడంలో మహిళా శ్రామిక భాగస్వామ్యాన్ని పెంచుతుందని సీఎం పేర్కొన్నారు. దిల్లీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం 1954లోని 14, 15, 16 సెక్షన్ల ప్రకారం మహిళలు వేసవికాలం రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు, శీతాకాలంలో రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల మధ్య పని కార్యాలయాలకు వెళ్లేందుకు వీల్లేదు. ఈ నేపథ్యంలో ఆ చట్టంలో మార్పులు తీసుకొచ్చేందుకు దిల్లీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇది ఆచరణలోకి వస్తే.. మహిళా ఉద్యోగులు అన్ని వేళలా పని చేసేందుకు వీలు కలుగుతుంది.

రానిటిడీన్‌లో ఎన్‌డీఎంఏ అవశేషాలపై జాగ్రత్త

రాష్ట్రాలకు డీసీజీఐ సూచన

దిల్లీ: అల్సర్, ఇతర ఎసిడిటీ సంబంధ సమస్యల ఉపశమనానికి విరివిగా ఉపయోగించే రానిటిడీన్ ఔషధంలో క్యాన్సర్ కారకమైన ఎన్-నైట్రోసోడైమిథైలమైన్ (ఎన్‌డీఎంఏ) అవశేషాలు ఉండటంపై భారత ఔషధ నియంత్రణ సంస్థ (డీసీజీఐ) ఒక అడ్వైజరీ జారీ చేసింది. ఔషధంలో ఎన్‌డీఎంఏ అవశేషాలు లేకుండా చూడాల్సిన బాధ్యతను ఫార్మా సంస్థలు తప్పకుండా నిర్వర్తించేలా పర్యవేక్షించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. రానిటిడీన్‌లో ఎన్‌డీఎంఏ అవశేషాలు ఉండటంపై నిపుణులు మదింపు చేసిన సూచనలను డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు (డీటీఏబీ) ఇటీవల సమీక్షించింది. అనంతరం పలు సూచనలు చేసింది. రానిటిడీన్‌ను అకస్మాత్తుగా వినియోగించడం మానొద్దని, వైద్యుల సలహాతోనే ఏ నిర్ణయమైనా తీసుకోవాలని పేర్కొంది.

న్యూయార్క్‌లో కాల్పులు.. ఐదుగురి మృతి

- దుండగుడి ఆత్మహత్య

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్‌లో కాల్పుల కలకలం సృష్టించాయి. మన్‌హటన్ కార్యాలయ భవనం సమీపంలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో మాజీ పోలీసు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం దుండగుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అమెరికా కాలమానం ప్రకారం, సోమవారం సాయంత్రం 6:30 గంటలకు ఏఆర్-రైఫిల్‌తో 345 పార్క్ అవెన్యూ భవనంలోకి ప్రవేశించిన దుండగుడు విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. కాల్పుల శబ్దానికి భయపడిన ప్రజలు భవనం నుంచి పరుగులు తీశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యాయి. దుండగుడిని లాస్‌వేగాస్‌కు చెందిన షేన్ తమురా(27)గా గుర్తించారు. షేన్ దగ్గరున్న గన్‌కు లైసెన్స్ ఉందని, అయితే అది గడువు ముగిసిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. నిందితుడు ఏ ఉద్దేశంతో కాల్పులు జరిపాడన్నది తెలియలేదు. షేన్ ఒంటరిగా ఉన్నాడా లేదా ఏదైనా నెట్‌వర్క్‌తో సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చిరాగ్ పాస్వాన్ యూటర్న్

మరోసారి నీతీశ్‌కే సీఎం పగ్గాలు అంటూ వ్యాఖ్యలు

దిల్లీ: నేరస్థుల ముందు ప్రభుత్వం లొంగిపోయిందని, బిహార్‌లో నీతీశ్ కుమార్ సర్కారుకు మద్దతిచ్చినందుకు చింతిస్తున్నానని వ్యాఖ్యానించిన రెండు రోజుల్లోనే కేంద్రమంత్రి, ఎల్‌జేపీ (రాంవిలాస్) పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాస్వాన్ యూటర్న్ తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మరోసారి బిహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమారే ప్రమాణ స్వీకారం చేస్తారని వ్యాఖ్యానించారు. సోమవారం ఓ కార్యక్రమంలో పాస్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీపై నా ప్రేమ, నిబద్ధత నిరంతరం ఉంటాయని ఉద్ఘాటిస్తున్నా. మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల ఫలితాల అనంతరం నీతీశ్ మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారు. కచ్చితంగా ఆయన సీఎం అవుతారు" అని పేర్కొన్నారు. ఎన్నికల్లో సొంత బలంతో గెలవలేక.. ఎన్డీయేను బలహీనపరిచి ప్రతిపక్షాలు గెలవాలని చూస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) గురించి మాట్లాడుతూ.. ఈ ప్రక్రియ గతంలో నాలుగుసార్లు జరిగిందని, ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీతో అనుసంధానమవుతోంది తప్ప కొత్తగా ఏమీ జరగటం లేదన్నారు. ఎస్ఐఆర్‌ను త్వరలోనే పశ్చిమబెంగాల్, తమిళనాడుతో సహా దేశవ్యాప్తంగా నిర్వహిస్తారని తెలిపారు.

ఈడీ కేసులో ఛార్జిషీటుపై కోర్టు నిర్ణయం వాయిదా

దిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాఖలుచేసిన ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకోవడంపై తన నిర్ణయాన్ని దిల్లీ కోర్టు మంగళవారం వాయిదావేసింది. "ఈ కేసు ఫైళ్లను క్షుణ్నంగా పరిశీలించాల్సి ఉంది. ఆగస్టు 7,8 తేదీల్లో దర్యాప్తు అధికారి కోర్టు ముందు హాజరై వివరణ ఇవ్వాలి" అని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి విశాల్ గోగ్నే ఆదేశించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తదితరులు అక్రమాలకు పాల్పడ్డారని ఈడీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళన

దిల్లీ: బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా మంగళవారం పార్లమెంటు ఆవరణలో ఇండియా కూటమి ఎంపీలు ఆందోళన చేశారు. ఇందులో కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆర్జేడీ, వామపక్ష పార్టీల నేతలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ పేరుతో బిహార్‌లో ప్రజల ఓటు హక్కును తొలగించడమే ధ్యేయంగా ఎన్నికల సంఘం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని ఎంపీలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఓటు దొంగతనాన్ని ఆపండి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎస్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసిన ఎంపీలు దీనిపై ఉభయ సభల్లో చర్చ జరగాలని కోరారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచీ ప్రతిపక్షాల సభ్యులు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిరోజూ ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.

ఈనాడు సినిమా


పూరి జగన్నాథ్, ప్రభాస్

హలో డార్లింగ్..

అదే స్నేహబంధం... అంతే ఆత్మీయతతో ఒకరి నొకరు పలకరించుకున్నారు కథానాయకుడు ప్రభాస్, దర్శకుడు పూరి జగన్నాథ్. ఈ ఇద్దరి కలయికలో ఇదివరకు 'బుజ్జిగాడు', 'ఏక్ నిరంజన్' చిత్రాలు రూపొందిన సంగతి తెలిసిందే. సుదీర్ఘ కాలం తర్వాత ప్రభాస్‌ని 'ది రాజాసాబ్' సెట్‌లో కలిశారు పూరి జగన్నాథ్. హలో డార్లింగ్... అంటూ ఒకరినొకరు హత్తుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 'ది రాజాసాబ్' చిత్రీకరణ సాగుతోంది. ఛార్మితో పాటు సెట్‌కి వెళ్లిన పూరి... ప్రభాస్‌ని కలిసి ముచ్చటించారు. పూరి ప్రస్తుతం విజయ్ సేతుపతి కథానాయకుడిగా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

మెరుపు వేగంతో.. ఉస్తాద్ భగత్‌సింగ్


పవన్ కల్యాణ్

ఒకవైపు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే... మరోవైపు తన సినిమాల ప్రచార కార్యక్రమాల్ని, చిత్రీకరణ పనుల్ని పరుగులు పెట్టించారు పవన్‌కల్యాణ్. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన 'హరి హర వీరమల్లు' కోసం విస్తృతంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న విషయం తెలిసిందే. మరోవైపు ఉప ముఖ్యమంత్రిగా కేబినెట్ సమావేశాలకీ హాజరయ్యారు. మధ్య మధ్యలో తన కొత్త చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రీకరణనీ కొనసాగించారు. హరీశ్‌శంకర్ తెరకెక్కిస్తోన్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. పవన్‌కల్యాణ్, ఇతర తారాగణంపై ఇటీవలే పతాక సన్నివేశాల్ని తెరకెక్కించారు. భావోద్వేగాలతో కూడిన కొన్ని సన్నివేశాలతో పాటు, నబకాంత నేతృత్వంలో కీలకమైన యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కించారు. పవన్‌కల్యాణ్ అత్యుత్తమ నటనా ప్రదర్శనతో ఈ సన్నివేశాలు ఎంతో అద్భుతంగా వచ్చాయని... అభిమానులతోపాటు, మాస్ ప్రేక్షకులు, యాక్షన్ ప్రియుల్ని మరింతగా మెప్పిస్తాయని నిర్మాతలు చెప్పారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్‌కి జోడీగా శ్రీలీల, రాశీఖన్నా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, కూర్పు: ఉజ్వల్ కులకర్ణి, ఛాయాగ్రహణం: అయనంక బోస్, కళ: ఆనంద్‌సాయి.

ముందున్నది ఆరంభాల జాతర

కొత్త సినిమాల విడుదలలే కాదు... ప్రారంభాలు కూడా చిత్రసీమకి కావల్సినంత సందడిని తీసుకొస్తుంటాయి. ప్రతి వారం రెండు మూడు సినిమాలు బాక్సాఫీస్ దగ్గర విడుదల కోసం పోటీ పడినట్టుగానే అప్పుడప్పుడూ కొత్త సినిమాలూ పోటాపోటీగా పట్టాలెక్కుతుంటాయి. రానున్న రెండు నెలల్లో టాలీవుడ్‌లో పలువురు అగ్ర తారల సినిమాలు ప్రారంభం కానున్నాయి. ముహూర్తం వెతికే పనిలోనే ఉన్నారు దర్శకనిర్మాతలు.

ఈ ఏడాది సంక్రాంతి మినహా మిగిలిన సీజన్లన్నీ చప్పగానే సాగాయి. చెప్పుకోదగ్గ స్థాయిలో సినిమాలు విడుదల కాలేదు. వస్తాయనుకున్న చాలా సినిమాలు వాయిదా పడ్డాయి. ఇప్పుడిప్పుడే బాక్సాఫీస్ దగ్గర కాస్త సందడి కనిపిస్తోంది. ఎప్పట్నుంచో వాయిదా పడుతూ వచ్చిన సినిమాలు ఒకొక్కటిగా ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. ఈ ఏడాది చివరి వరకూ బాక్సాఫీస్ దగ్గర అడపాదడపా సందడి కొనసాగుతూనే ఉంటుంది. రానున్న రెండు నెలల్లో కీలకమైన పలు సినిమాలు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. ఆ సందడికి, కొత్త సినిమాల ఆరంభాల ఉత్సాహం కూడా తోడు కానుంది. రానున్న రెండు నెలల్లోనే సీనియర్ హీరోలు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున సినిమాలతోపాటు ప్రభాస్ సినిమా కూడా ప్రారంభం కానుంది. గోపీచంద్, సుధీర్‌బాబు, సందీప్‌కిషన్, నాగశౌర్యతో పాటు ఇంకా పలువురు యువ హీరోల సినిమాలూ ఆగస్టు నెలలోనే పట్టాలెక్కనున్నాయి.

కథలు సిద్ధం

యువ హీరోలకి దీటుగా సీనియర్ తారలు సినిమాలు చేస్తున్నారు. వాళ్ల జోరు చూసి యువ దర్శకులూ ఉత్సాహంగా కథలు సిద్ధం చేస్తున్నారు. చిరంజీవి ఒకవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా చేస్తూనే... మరోవైపు 'విశ్వంభర' సినిమాని పూర్తి చేశారు. ఇవి కాకుండా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సినిమాకీ, బాబీ సిద్ధం చేసిన కథకీ పచ్చజెండా ఊపారు చిరంజీవి. ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్న సినిమా పూర్తవ్వగానే, బాబీ దర్శకత్వంలో సినిమాతో రంగంలోకి దిగనున్నారు చిరంజీవి. విజయవంతమైన 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి - బాబీ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుంది. ఆగస్టులో కానీ, సెప్టెంబరులో కానీ ఈ సినిమా మొదలయ్యే అవకాశాలున్నాయి. ఆ తర్వాత శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సినిమా మొదలవుతుంది. మరో అగ్ర హీరో బాలకృష్ణ 'అఖండ2' సినిమాని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇది పూర్తయిన వెంటనే గోపీచంద్ మలినేని సినిమాతో సెట్స్‌పైకి వెళతారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కలిసి చేస్తున్న సినిమా ఇది. దీంతోపాటే క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలోనూ బాలకృష్ణ ఓ సినిమా చేయనున్నారని, అందుకోసం ఇప్పటికే కథ కూడా సిద్ధమైందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. 'ఆదిత్య 369'కి కొనసాగింపుగా ఆ చిత్రం ఉంటుందని సమాచారం.

వందో సినిమా కోసం...

'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఘన విజయాన్ని సొంతం చేసుకొన్న వెంకటేశ్ తన కొత్త చిత్రాన్ని త్రివిక్రమ్ దర్శకత్వంలో చేయనున్నారు. ఆగస్టు నుంచే ఆ సినిమా ప్రారంభం కానుంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ నటిస్తున్న తొలి చిత్రమిదే. ఇదివరకు వెంకటేశ్ కథానాయకుడిగా నటించిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ రచయితగా పనిచేశారు. మరో అగ్ర కథానాయకుడు నాగార్జున ఇటీవల 'కుబేర' సినిమాతో సందడి చేశారు. ఆగస్టు 14న 'కూలీ' విడుదలవుతోంది. ఇందులో నాగార్జున ప్రతినాయకుడిగా నటించారు. కెరీర్‌లో వంద సినిమాల మైలురాయికి చేరువయ్యారు నాగార్జున. రా.కార్తీక్ అనే యువ దర్శకుడితో తన వందో చిత్రాన్ని చేయడానికి పచ్చజెండా ఊపారు. ఆ సినిమా ఆగస్టులోనే మొదలయ్యే అవకాశాలున్నాయి.

'స్పిరిట్'తోపాటు...

ఆషాఢమాసం పూర్తి కాగానే చిత్రసీమలో కొత్త సినిమాల సందడి మొదలైంది. ఇటీవలే రష్మిక కొత్త చిత్రం 'మైసా' ప్రారంభమైంది. ఆగస్టు నెలలో గోపీచంద్, సందీప్‌కిషన్, సుధీర్‌బాబు, నాగశౌర్య నటించనున్న కొత్త సినిమాలు ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. అలాగే నితిన్ హీరోగా నటిస్తున్న 'ఎల్లమ్మ' కూడా ప్రారంభం కావల్సి ఉంది. సెప్టెంబరు నెలలో ప్రభాస్ 'స్పిరిట్' మొదలు కానుంది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కథానాయికగా త్రిప్తి దిమ్రీ నటించనున్నారు. ఇలా కొత్త సినిమాల విడుదలలు, ప్రారంభాలతో రానున్న నెలల్లో టాలీవుడ్ కళకళలాడనుంది. అభిమాన హీరో సినిమా ఆరంభమైందంటే చాలు... అందుకు సంబంధించిన కొత్త సంగతుల్ని తెలుసుకునేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు సినీ ప్రేమికులు.


చిరంజీవి


బాలకృష్ణ


వెంకటేశ్


నాగార్జున

రెడీ ఇన్ ఓటీటీ

నా వల్ల బాధపడేవారిని సంగీతంతో మెప్పిస్తా!


సిరీస్: 'గ్లాస్ హార్ట్'
నటీనటులు: టకేరు సతోహ్, యు మియాజాకి
విడుదల: గురువారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్

కథాంశం: ప్రతిభ ఉంటే వేదికేదైనా మనమంటే ఏంటో ఈ లోకానికి చాటి చెప్పొచ్చు. ఇప్పుడిలానే ఓ అమ్మాయి సంగీత ప్రపంచంలో తన ప్రతిభను నిరూపించుకోవడానికి శతవిధాల ప్రయత్నిస్తుంది. మరి ఎవరామె? తన కథేంటి? అనేది తెలుసుకోవాలంటే 'గ్లాస్ హార్ట్' సిరీస్ చూడాల్సిందే. కాకిమోటో కెన్సాకు, గోటో కొటారో రూపొందించారు. ఈ జపనీస్ మ్యూజికల్ డ్రామాలో టకేరు సతోహ్, యు మియాజాకి, కీటా మచిడా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులో యు మియాజాకి.. అకానె సైజో అనే పాత్రలో కనిపించనుంది. కళాశాలలో ఎంతో పట్టుదలతో మ్యూజిక్‌ను నేర్చుకుంటుందామె. కానీ ఊహించని విధంగా సంగీతానికి సంబంధించిన గ్రూప్ నుంచి ఆమెను తీసేస్తారు. దీంతో అకానెలో ఉన్న నైపుణ్యాన్ని కనిపెట్టి తన బృందంలో చేరమని ఆహ్వానిస్తాడు ఓ సంగీత కారుడు. ఈ అవకాశం ఆ అమ్మాయి జీవితాన్ని మలుపు తిప్పుతుంది. ఆ తర్వాత ఏమైందనేదే ఈ సిరీస్ కథాంశం. మరి నా వల్ల బాధపడే వారందరినీ.. నా సంగీతంతో మెప్పిస్తానంటోన్న ఆ అమ్మాయి కథేంటో మీరూ చూసేయ్యండి.

ప్రియురాలి కోసం నేరాలు చేసిన ప్రియుడు


సినిమా: 'యాన్ హానెస్ట్ లైఫ్'
నటీనటులు: సైమన్ లోఫ్, నోరా రియోస్
విడుదల: గురువారం, ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్

కథాంశం: ప్రేమని కొందరు మైమరపించే మాటలతో, మరికొందరు బహుమతులు ఇస్తూ ఇలా ఎన్నో విధానాలతో వ్యక్తపరుస్తుంటారు. ఇప్పుడిలాగే ఓ వ్యక్తి అలాంటి మాటలు చెప్పకుండా నువ్వు ఏం చేసినా..అందులో నీకు తోడుగా ఉంటా అంటున్నాడు. లా స్కూల్‌లో చదవాలనే ఆశయంతో ఓ నగరానికి వెళ్తాడు సైమన్(సైమన్ లోఫ్). అయితే అక్కడి పరిస్థితులు తాను ఊహించినంత అనుకూలంగా ఉండవు. అయినప్పటికీ అక్కడి వాతావరణాన్ని అర్థం చేసుకొని తనలో ప్రేరణ నింపుకునేందుకు ప్రయత్నిస్తుంటాడు. అప్పుడే ఓ హింసాత్మక ప్రదేశంలో మాక్స్(నోరా రియోస్)ని కలుస్తాడు. వెంటనే ఆమెతో ప్రేమలో పడతాడు. అంతే అంతటితో న్యాయం కోసం పోరాడాలనే తన లా స్కూల్ కలని వదిలేస్తాడు. ఎప్పుడూ ఏదోక నేరం చేస్తూ ఉండే మాక్స్ జీవన శైలి పూర్తిగా మోసపూరిత విధానాలతో ఉంటుంది. సైమన్ తనకు తెలియకుండానే మాక్స్‌తోపాటు అనేక నేరాల వలయంలో చిక్కుకుంటాడు. కానీ దానిని చాలా ఆలస్యంగా గ్రహిస్తాడు. మరి.. ప్రేయసి ప్రేమ కోసం కెరీర్‌ని వదులుకుని సమస్యల్లో చిక్కుకున్న ఈ ప్రియుడి జీవితం చివరికి ఏమైందో తెలియాలంటే 'యాన్ హానెస్ట్ లైఫ్' సినిమా చూడాల్సిందే. ఈ థ్రిల్లర్ చిత్రాన్ని మైకేల్ మార్సి మైన్ తెరకెక్కించారు.

లీలావతి గొడవ


లావణ్య, దేవ్ మోహన్

కొత్తగా పెళ్లి చేసుకున్న ఓ జంట. ఉత్సాహంగా కొత్త జీవితాన్ని మొదలు పెట్టింది. కానీ అంతలోనే కథ అడ్డం తిరిగింది. అప్పుడు భార్య లీలావతి ఏం చేసింది? భర్త ఎలాంటి పాట్లు పడ్డాడు? తదితర విషయాలు తెలియాలంటే 'సతీ లీలావతి' చూడాల్సిందే. లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రమిది. తాతినేని సత్య దర్శకుడు. నాగమోహన్ నిర్మిస్తున్నారు. ఆనంది ఆర్ట్స్ సమర్పిస్తోంది. మంగళవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. హాస్యం ప్రధానంగా ఓ కొత్త జంట ప్రయాణాన్ని ఆవిష్కరించే సినిమా అని టీజర్ చాటుతోంది. భార్యాభర్తల మధ్య గొడవతో మొదలయ్యే ఈ కథలో భార్య లీలావతి పాత్రలో లావణ్య త్రిపాఠి నటించారు. భర్తగా దేవ్ మోహన్ నటించారు. ఇంటిల్లిపాదినీ మెప్పించే భావోద్వేగాలు, హాస్యం ఉన్న చిత్రమిదని, ప్రస్తుతం తుదిదశ నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని సినీ వర్గాలు తెలిపాయి. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వి.కె.నరేశ్, వి.టి.వి.గణేశ్, సప్తగిరి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె.మేయర్, ఛాయాగ్రహణం: బినేంద్ర మేనన్.

బలంగా ఉండటమంటే అదే


సమంత

నిత్యం యవ్వనంగా మెరిసిపోయే మన సినీతారలు అందం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంటారు. ఈ విషయంలో ముందు వరుసలో ఉంటుంది కథానాయిక సమంత. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎంత బిజీగా ఉన్నా... ఫిట్‌నెస్‌కు ఎక్కువ ప్రాధాన్యమిస్తుంటుంది.

గతంలో జిమ్‌లో 100 కిలోల బరువున్న బార్బెల్‌ను సులువుగా ఎత్తి అభిమానుల్ని ఆశ్చర్యపరిచిన సామ్.. తాజాగా డెడ్‌హ్యాంగ్ ఛాలెంజ్‌ను తీసుకుంది. 90 సెకన్ల పాటు ఈ వ్యాయామం చేసింది. తాజాగా ఓ ట్రైనర్ సమంత స్వీకరించిన ఈ ఛాలెంజ్ గురించి వివరిస్తూ దానికి సంబంధించిన వీడియోను ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. "మీరు ఎలా కనిపిస్తున్నారు అనేది విషయం కాదు. మీ వారసత్వం ఏమిటనేది కూడా ముఖ్యం కాదు. సెల్ఫీలు పంచుకోవడం కూడా ప్రాధాన్యం కాదు.. ఎవరూ చూడనప్పుడు మీరు ఎంత బలంగా ఉన్నారనేదే ముఖ్యం" అని వ్యాఖ్యల్ని జోడించారు.

నీకు మేమంతా తోడుగా ఉంటాం

- కన్నడ నటి రమ్యకు అత్యాచార బెదిరింపులు
- శివరాజ్‌కుమార్ అసహనం


రమ్య

'అభిమన్యు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కన్నడ నటి రమ్య.. రేణుకా స్వామి హత్య కేసుపై దర్శన్ ఫ్యాన్స్ తనను కూడా వేధించారని.. రేణుకా స్వామికి వారికి ఎలాంటి తేడా లేదంటూ ఇటీవలే ఓ పోస్ట్ పెట్టింది. అప్పటి నుంచి ఆ పోస్ట్‌కు నిరసనగా దర్శన్ అభిమానులు తనకు అసభ్యకరమైన కామెంట్స్ పెడుతున్నారంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు పంపిస్తున్న అశ్లీల సందేశాలు, బెదిరింపులకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను సైబర్ క్రైమ్ పోలీసులకు అందించారు. ఈ నేపథ్యంలోనే రమ్యకు మద్దతుగా కన్నడ కథానాయకుడు శివరాజ్‌కుమార్ నిలిచారు. ఇలాంటి చర్యలు ఎంతమాత్రం ఆమోద యోగ్యం కాదంటూ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. "రమ్యకు వ్యతిరేకంగా పెడుతున్న పోస్టులు.. వాడిన పదాలను నేను ఖండిస్తున్నా. ఏ మహిళ గురించి కూడా ఇలా మాట్లాడటం సరి కాదు. దానిని మనం సహించకూడదు. మహిళలను తల్లిగా, అక్కగా, కూతురిగా, భార్యగా అన్నింకంటే ముందుగా ఒక వ్యక్తిగా గౌరవించడం ముఖ్యం. సామాజిక మాధ్యమం ఒక బలమైన అస్త్రం. దానిని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేందుకు ఉపయోగించాలి. అంతేకానీ అసభ్య పదాలు, నిందలు, ద్వేషం లాంటి వాటికి దూరంగా ఉండాలి. నువ్వు ఎంచుకున్న మార్గం సరైంది రమ్య. నీకు మేమంతా తోడుగా ఉంటామ"ని ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

చంద్ర.. సూపర్ హీరోనా?


'లోకా చాప్టర్ 1:చంద్ర'

'ప్రేమలు'తో సినీప్రియుల్ని అలరించాడు యువకథానాయకుడు నస్లేన్ కె.గఫూర్. ఆయన.. కల్యాణి ప్రియదర్శన్ జంటగా నటిస్తున్న చిత్రం 'లోకా చాప్టర్ 1:చంద్ర'. సూపర్ హీరో నేపథ్యంలో రాబోతున్న మొదటి మలయాళ చిత్రమిదే కావడం విశేషం. డొమినిక్ అరుణ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని హీరో దుల్కర్ సల్మాన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో మానవాతీత శక్తులు కలిగిన చంద్ర అనే సూపర్ హీరోగా కనిపించనుంది కల్యాణి. "నిజంగానే.. చంద్ర సూపర్ హీరోనా?" అంటూ సాగుతున్న ఈ టీజర్ సినీప్రియుల్ని ఆకట్టుకుంటోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు సినీ వర్గాలు తెలిపాయి. అరుణ్ కురియన్, శాంతి బాలచంద్రన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం 'జెనీ', 'మార్షల్' లాంటి సినిమాలతో బిజీగా ఉంది కల్యాణి.

ఈనాడు బిజినెస్


పన్ను రేట్లలో ఎలాంటి మార్పులు ప్రతిపాదించలేదు

కొత్త ఐటీ బిల్లుపై ఆదాయపు పన్ను విభాగం స్పష్టత

దిల్లీ: కొత్త ఐటీ బిల్లులో పన్ను రేట్లకు సంబంధించి ఎటువంటి మార్పులను ప్రతిపాదించలేదని ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం స్పష్టం చేసింది. దీర్ఘకాలిక లాభాలపై (ఎల్‌టీసీజీ)పై పన్ను రేట్లలో మార్పులు ప్రతిపాదించారంటూ వస్తున్న వార్తలపై స్పందిస్తూ ఈ స్పష్టత ఇచ్చింది. దీనిపై ఏమైనా సందేహాలు ఉంటే బిల్లుకు ఆమోదం తెలిపే సమయంలో వాటిని పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపింది. 'భాష సరళీకరణ, వాడుకలో లేని నిబంధనలను తొలగించే లక్ష్యంతోనే కొత్త ఆదాయపు పన్ను బిల్లు- 2025ను తీసుకొస్తున్నట్లు' ఐటీ విభాగం వెల్లడించింది. కొత్త ఐటీ బిల్లు 2025ను ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత పార్లమెంటు కమిటీకి దీనిని పంపించారు. కమిటీ తన సిఫారసులను జులై 21న సమర్పించింది.

నియో సెమీతో మిక్ ఎలక్ట్రానిక్స్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ మిక్ ఎలక్ట్రానిక్స్. సెమీకండక్టర్ ఐపీ, ఏఐ ఆధారిత ఎనర్జీ లాజిస్టిక్స్‌లాంటి ఆవిష్కరణల కోసం సింగపూర్ కేంద్రంగా ఉన్న డీప్ టెక్ కంపెనీ నియో సెమీ ఎస్‌జీతో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. నియో సెమీ సాంకేతిక సహకారంతో స్మార్ట్, సస్టైనబుల్ సాంకేతికతను అభివృద్ధి చేయనున్నట్లు మిక్ ఎలక్ట్రానిక్స్ సీఈఓ రక్షిత్ మాథుర్ అన్నారు.



మెడికల్ ఇంప్లాంట్స్‌లో దేశీయ హవా

- స్టెంట్లు, మోకీలు మార్పిడి కిట్ల ధరలు తగ్గుముఖం
- పెరుగుతున్న ఉత్పత్తి, ఎగుమతులు
- భారత్-యూకే ఎఫ్‌టీఏతో ఇంకా మేలు

దేశీయంగా వైద్య పరికరాల పరిశ్రమ అనూహ్యంగా వృద్ధి చెందుతోంది. ఉత్పత్తి, ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా మోకీళ్ల మార్పిడి చికిత్సలో వినియోగించే కిట్లు, గుండె జబ్బుల బారిన పడిన వారికి వేసే స్టెంట్లు, ఇతర ఉపకరణాలు స్థానికంగా గణనీయంగా తయారవుతున్నందున, వాటి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రస్తుతం మనదేశంలో మోకీలు, తుంటి మార్పిడి పరికరాలు, హృద్రోగ సమస్యల పరిష్కారానికి వాడే స్టెంట్ల అమ్మకాల మార్కెట్ 2.4- 2.7 బిలియన్ డాలర్ల (సుమారు 20,000-23,000 కోట్ల) స్థాయిలో ఉన్నట్లు అంచనా. మూడేళ్లలో ఇది రెట్టింపై, దాదాపు 4.5 - 5 బి.డా. (రూ.38,000-42,500 కోట్ల) కు చేరుకుంటుందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ అభిప్రాయపడింది.

ఆకర్షణీయ వృద్ధి

గత ఆరేళ్లలో మనదేశంలో వైద్య పరికరాల పరిశ్రమ ఏటా 25% వృద్ధి సాధించింది. ఇక్కడి నుంచి ఐరోపా దేశాలకు ఎగుమతులు బాగా పెరిగాయి. వైద్య పరికరాలకు అమెరికా అతిపెద్ద మార్కెట్. కానీ మనదేశం నుంచి అమెరికాకు వీటి ఎగుమతులు నామమాత్రంగా ఉన్నాయి. అక్కడి కఠిన నిబంధనలు, అత్యున్నత ప్రమాణాలకు తోడు, వైద్య ఉపకరణాలకు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) అనుమతి సంపాదించడం కష్టంగా ఉండటం దీనికి కారణం. మన వైద్య పరికరాల పరిశ్రమ పరిణతి సాధించే కొద్దీ అమెరికాకూ ఎగుమతులు పెరుగుతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



- మన దేశ వృద్ధి రేటు కనుగుణంగా, ఏటా తలసరి ఆదాయం పెరుగుతోంది. దీనివల్ల చికిత్సల కోసం ఖర్చు పెట్టే సత్తా కల వారి సంఖ్య పెరుగుతోంది. అందువల్ల ఖరీదైన వైద్య పరికరాలతో అవసరమైన చికిత్సలు చేయించుకోవటానికి ఎక్కువ మంది ముందుకొస్తున్నారు.
- కార్పొరేట్ ఆసుపత్రులు కొంతకాలంగా తమ పడకల సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయి. మన కార్పొరేట్ ఆసుపత్రులకు విదేశీ పెట్టుబడులు బాగా లభిస్తున్నాయి. ఫలితంగా వైద్య సదుపాయాలు విస్తరిస్తున్నాయి. ఎముకలు, గుండె సంబంధిత సంక్లిష్ట చికిత్సలు చిన్న నగరాల్లోనూ అందుబాటులోకి వస్తున్నాయి.
- కొన్నేళ్ల క్రితం చూస్తే ఎముకలు, గుండె చికిత్సలకు వినియోగించే వైద్య పరికరాల అమ్మకాల్లో విదేశీ కంపెనీల వాటా అధికంగా ఉండేది. కొవిడ్ పరిణామాల తర్వాత ఈ ధోరణిలో మార్పు వచ్చింది. దేశీయంగా వినియోగంతో పాటు తయారీ పెరిగింది. దేశీయ కంపెనీల అమ్మకాలు గత అయిదేళ్లలో రెండు రెట్లకు పైగా పెరిగాయి.

ధరలు తగ్గుముఖం

మోకీలు మార్పిడి పరికరాలు ఇప్పుడు రూ.32,000- 80,000 శ్రేణిలో లభిస్తున్నాయి. గుండె ఆపరేషన్‌కు వాడే నాణ్యమైన స్టెంట్లు రూ.38,000 ధరలో లభిస్తున్నాయి. మెటల్ స్టెంట్ల ధర రూ.10,500 నుంచి ప్రారంభం అవుతోంది. దీనివల్ల విదేశీ కంపెనీలు ఇక్కడి మార్కెట్లో పోటీపడలేక పోతున్నాయి. ఇదే దేశీయ కంపెనీలకు అవకాశంగా మారుతోంది. పరిశోధన- అభివృద్ధికి పెద్దపీట వేసి, కొత్త తరహా పరికరాలు ఉత్పత్తి చేయడం ద్వారా ఈ రంగంలోని కంపెనీలు అధిక వృద్ధి సాధించగలవని నిపుణులు అంచనా వేస్తున్నారు.



యూకేకు ఎగుమతులు

యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) వైద్య పరికరాల మార్కెట్ 2024లో 32 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.75 లక్షల కోట్ల) స్థాయిలో ఉంది. 2035 నాటికి ఇది 69 బిలియన్ డాలర్ల (సుమారు రూ.5.93 లక్షల కోట్ల)కు చేరుతుందని అంచనా. ఇప్పటి వరకూ యూకేకు మనం వైద్య పరికరాలు, ఇంప్లాంట్స్ ఎగుమతి చేయాలంటే 2 - 6% పన్ను చెల్లించాలి. ఇటీవలి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ఇకపై పన్ను చెల్లించే పనిలేదు. మనదేశానికి చెందిన సీడీఎస్‌సీఓ (సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్) కానీ, ఐసీఎంఈడీ (ఇండియన్ సర్టిఫికేషన్ ఆఫ్ మెడికల్ డివైజెస్) కానీ ధ్రువీకరించిన పరికరాలను యూకే తీసుకునే అవకాశం లభించనుంది. దీనికి సంబంధించి సీడీఎస్‌సీఓ, యూకేలోని ఎంహెచ్ఆర్ఏ 'పరస్పర గుర్తింపు ఒప్పందం' కుదుర్చుకోనున్నాయి. రెండు సంస్థల బృందాలు సంయుక్తంగా తనిఖీలు చేయడం, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, పత్రాల మార్పిడి... తదితర అంశాలకు సంబంధించిన నిబంధనలు కూడా ఈ ఒప్పందంలో ఉంటాయి.

- ఈనాడు, హైదరాబాద్

పీ అండ్ జీ సీఈఓగా భారత సంతతి వ్యక్తి

జనవరి 1న బాధ్యతలు స్వీకరించనున్న శైలేష్ జెజురికర్



దిల్లీ: మరో బహుళజాతి కంపెనీ (ఎమ్ఎన్‌సీ)కి సారథిగా భారతీయ సంతతి వ్యక్తి నియమితులయ్యారు. అమెరికా ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్ (పీ అండ్ జీ) కంపెనీ తదుపరి ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా శైలేష్ జెజురికర్(58)ను ఎంచుకుంది. 2026 జనవరి 1న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. ఈయన ఐఐఎమ్ లఖ్‌నవూ పూర్వ విద్యార్థి.

ఆరేళ్లుగా సీఓఓ స్థానంలో..: 'గత ఆరేళ్లుగా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీఓఓ)గా ఉన్న శైలేష్.. ప్రస్తుత ప్రెసిడెంట్, సీఈఓ జాన్ మోలర్ స్థానాన్ని భర్తీ చేస్తారు. ఈ ఏడాది అక్టోబరులో జరిగే వార్షిక వాటాదార్ల సమావేశంలో డైరెక్టర్ల ఎన్నిక కోసం శైలేష్‌ను నామినేట్ చేసేందుకు' కంపెనీ తెలిపింది. 2026 జనవరి 1న కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా మోలర్ మారతారు. బోర్డు డైరెక్టర్ల నేతృత్వం వహించడంతో పాటు, సీఈఓకు కంపెనీ వ్యూహాత్మక విషయాల్లో సలహాలిస్తారు. పీ అండ్ జీకి ఏరియల్, టైడ్, విస్పర్, ఓలే, జిలెట్, యాంబిప్యూర్, పాంపర్స్, ప్యాంటీన్, ఓరల్-బీ, హెడ్ అండ్ షోల్డర్స్, విక్స్ వంటి బ్రాండ్లున్నాయి. ఓటిస్ ఎలివేటర్ బోర్డు సభ్యుడిగానూ శైలేష్ ఉన్నారు.

కోడి గుడ్లు

30న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (సెక్) (100 కోడిగుడ్లకు)

హైదరాబాద్	405
వరంగల్	407
విజయవాడ	475
గోదావరి	450
విశాఖపట్నం	450
చిత్తూరు	463

ఎల్ అండ్ టీ లాభం రూ.3,617 కోట్లు



దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్-జూన్‌లో ఎల్ అండ్ టీ రూ.3,617.19 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2,785.72 కోట్లతో పోలిస్తే ఇది 29.8% అధికం. కార్యకలాపాల ఏకీకృత ఆదాయం రూ.55,119.82 కోట్ల నుంచి 16% పెరిగి రూ.63,678.92 కోట్లకు చేరింది. జూన్ 30 నాటికి ఏకీకృత ఆర్డర్ పుస్తకం రూ.6,12,761 కోట్లుగా ఉంది. 'సమీక్షా త్రైమాసికంలో మంచి పనితీరు కనబరిచాం. గ్రూప్ స్థాయిలో మరోసారి అత్యధిక త్రైమాసిక ఆర్డర్లను సాధించామ'ని ఎల్ అండ్ టీ సీఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ వెల్లడించారు. 'లక్ష్య-26 అయిదేళ్ల ప్రణాళికలో భాగంగా కంపెనీ గత నాలుగేళ్లుగా మంచి ప్రయాణం కొనసాగించింది. కంపెనీ కొత్త తరం వ్యాపారాలైన సెమీకండక్టర్, డేటా కేంద్రాలు, హరిత ఇంధనం, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌ను విజయవంతంగా మొదలుపెట్టాం. వచ్చే అయిదేళ్లలో ఈ వ్యాపారాలు ఆదాయం పెంచేందుకు దోహదపడతాయ'ని సుబ్రహ్మణ్యన్ వివరించారు. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) ప్రాజెక్టులు, హైటెక్ తయారీ, సేవల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఎల్ అండ్ టీ గ్రూప్ 30 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.58 లక్షల కోట్ల) భారతీయ సంస్థగా కొనసాగుతోంది.

టీసీఎస్‌లో సీనియర్ సిబ్బంది నియామకాల నిలిపివేత!



వార్షిక వేతన పెంపు వాయిదా

దిల్లీ: అనుభవజ్ఞుల నియామకాలు నిలిపివేయాలని, ప్రస్తుత సిబ్బందికి వార్షిక వేతన పెంపును వాయిదా వేయాలని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నిర్ణయించిందని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. అంతర్జాతీయంగా తమ సంస్థలో పని చేస్తున్న మొత్తం 6 లక్షల మందికి పైగా ఉద్యోగుల్లో 2 శాతానికి సమానమైన 12,000 మందికి పైగా తొలగించనున్నట్లు ఇటీవల సంస్థ ప్రకటించిన సంగతి విదితమే. దీనితో పాటు ఈ నిర్ణయం తీసుకుందని సమాచారం. కృత్రిమ మేధ (ఏఐ), ఇతర ఆధునిక సాంకేతికతలపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని, క్లయింట్ల ప్రాజెక్టులకు అనుగుణంగా వారిని కేటాయిస్తున్నామని టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్ ఇటీవల తెలిపారు. హైదరాబాద్, పుణె, చెన్నై, కోల్‌కతా కార్యాలయాల్లో దీర్ఘకాలంగా ప్రాజెక్టుల్లో లేని ఉద్యోగులను సంస్థ తొలగిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అనుభవజ్ఞులను నియమించుకునే ప్రక్రియలనూ నిలిపివేసినట్లు సమాచారం. ఇతర కంపెనీలు కూడా ఇటువంటి విధానాన్నే అనుసరించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

2 రోజుల్లో రూ.28,149 కోట్లు తగ్గిన మార్కెట్ విలువ: దాదాపు 12,000 మంది ఉద్యోగులను తొలగిస్తామని ప్రకటించిన నేపథ్యంలో టీసీఎస్ షేరు రెండో రోజూ డీలాపడింది. మంగళవారం 0.73% తగ్గిన షేరు రూ.3056.55 వద్ద ముగిసింది. గత రెండు రోజుల్లో కంపెనీ మార్కెట్ విలువ రూ.28,148.72 కోట్లు తగ్గి రూ.11.05 లక్షల కోట్లకు చేరింది.

మీ టీవీనే ఇక కంప్యూటర్

- రుసుము ఆధారిత పీసీ సేవలను ప్రారంభించిన జియో
- నెలకు రూ.599; వార్షికంగా రూ.4,599



దిల్లీ: సెట్-టాప్ బాక్స్ ద్వారా టీవీలను వ్యక్తిగత కంప్యూటర్లుగా వాడుకునే సదుపాయాన్ని రిలయన్స్ జియో తీసుకొచ్చింది. అయితే వినియోగదార్లు ఈ సేవను పొందాలంటే రుసుము చెల్లించాల్సి ఉంటుంది. కంపెనీ వెబ్‌సైట్‌లో లభ్యమవుతున్న సమాచారం ప్రకారం.. జియో పీసీ సబ్‌స్క్రిప్షన్ నెలవారీ పథకం రూ.599 నుంచి (జీఎస్‌టీ అదనం) ప్రారంభం అవుతుంది. ఏడాది మొత్తానికి ఒకేసారి అయితే రూ.4,599 (జీఎస్‌టీ అదనం) చెల్లించాలి. ఇలా కడితే నెలకు దాదాపు రూ.383 మాత్రమే అవుతుంది. పీసీ సేవలను పొందాలంటే జియో ఫైబర్, జియో ఎయిర్‌ఫైబర్ వినియోగదార్లు యాప్ విభాగంలో జియో పీసీ యాప్‌పై క్లిక్ చేయాలి. టీవీని వ్యక్తిగత కంప్యూటరుగా వాడాలంటే వినియోగదార్లకు ఒక కీబోర్డు, మౌస్ అవసరం అవుతాయి. ఇలా వాడే కంప్యూటరులో 8 జీబీ ర్యామ్, 100 జీబీ క్లౌడ్ స్టోరేజీ లభిస్తుంది. 'డిజైన్, ఎడిటింగ్ టూల్ అయిన అడోబ్ ఎక్స్‌ప్రెస్ సేవను వినియోగదార్లు ఉచితంగా పొందేందుకు అడోబ్‌తో జియోపీసీ భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. కీలక కృత్రిమ మేధ టూల్స్, ప్రముఖ అప్లికేషన్‌లు, 512 జీబీ క్లౌడ్ స్టోరేజ్ లాంటివి సబ్‌స్క్రిప్షన్‌లో చేర్చినట్లు' కంపెనీ వర్గాలు వెల్లడించాయి. జియో పీసీ ఒక నెల ఉచిత ట్రయల్‌లో జియో వర్క్‌స్పేస్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్ (బ్రౌజరు), 512 జీబీ క్లౌడ్ స్టోరేజ్‌ను పొందొచ్చు.

అంతర్జాతీయ వృద్ధిరేటు 3శాతం: ఐఎమ్ఎఫ్



- ట్రంప్ వాణిజ్య యుద్ధాల వల్ల అంచనాల కంటే తక్కువ ప్రభావమే
- వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్

వాషింగ్టన్: ఈ ఏడాది, వచ్చే ఏడాదికి ప్రపంచ, అమెరికా ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు అంచనాలను అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్ఎఫ్) పెంచింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రక్షణాత్మక వాణిజ్య విధానాల వల్ల, అనుకున్న దానికంటే తక్కువ ప్రభావమే పడటం ఇందుకు నేపథ్యం.

✦ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది 3% వృద్ధిని నమోదు చేయగలదని ఐఎమ్ఎఫ్ అంచనా వేసింది. 2024 నాటి 3.3% కంటే తక్కువే అయినా, ఈ ఏడాది ఏప్రిల్‌లో అంచనా వేసిన 2.8% కంటే ఎక్కువ. 2026లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 3.1% రాణించగలదని ఐఎంఎఫ్ అంచనా వేసింది. గత అంచనా 3 శాతమే.

ఏప్రిల్ 2న 'లిబరేషన్ డే' అంటూ పలు దేశాల ఉత్పత్తులపై ట్రంప్ దిగుమతి సుంకాలు విధించడంతో అంతర్జాతీయ వృద్ధిపై అధిక ప్రభావం ఉంటుందనే ఆందోళన నెలకొంది. అయితే అమలు గడువును వాయిదా వేయడం, ఈ తేదీలకు ముందుగానే అమెరికా దిగుమతిదార్లు విదేశీ వస్తువులను సమకూర్చుకోవడం.. చైనా వంటి దేశాలపై విధించిన భారీ సుంకాలను ట్రంప్ ఉపసంహరించుకోవడం వల్ల అనుకున్న ప్రభావం పడలేదని ఐఎంఎఫ్ పేర్కొంది.

✦ అమెరికా ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాదిలో 1.9%, 2026లో 2% వృద్ధిని నమోదు చేయగలదని ఐఎమ్ఎఫ్ అంచనా వేసింది. ఈ ఏడాదికి చైనా వృద్ధిరేటు అంచనాలను 4% నుంచి 4.8 శాతానికి సవరించింది.

✦ భారత్ ఈ ఏడాది, వచ్చే ఏడాది 6.4% వృద్ధిరేటుతో ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవనుంది.

✦ ఐరోపా సమాఖ్య వృద్ధి (2025) అంచనాలను 0.8% నుంచి 1 శాతానికి ఐఎంఎఫ్ సవరించింది. జపాన్ ఈ ఏడాదిలో 0.7%, వచ్చే ఏడాది 0.5% వృద్ధి చెందనుందని ఐఎమ్ఎఫ్ పేర్కొంది.

అమెరికాకు స్మార్ట్‌ఫోన్లు మన దగ్గర నుంచే అధికం

ఏప్రిల్- జూన్‌లో చైనాను వెనక్కినెట్టేశాం



దిల్లీ: ఈ ఏడాది రెండో త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో అమెరికాకు భారత్ నుంచే అత్యధికంగా స్మార్ట్‌ఫోన్లు ఎగుమతి అయినట్లు కానాలిస్ పరిశోధనా నివేదిక తెలిపింది. అమెరికాకు చైనా ఎగుమతులపై టారిఫ్ అనిశ్చితులు ప్రభావం చూపాయని వెల్లడించింది. చైనా నుంచి తన సరఫరా వ్యవస్థను భారత్‌కు మార్చే ప్రయత్నాలను యాపిల్ వేగవంతం చేయడం ఇందుకు కారణం. ఈ ఏడాది జనవరి-మార్చిలో అమెరికాకు ఐఫోన్ల ఎగుమతి 25% పెరగ్గా, రెండో త్రైమాసికంలో 11% తగ్గి 1.33 కోట్లకు పరిమితమయ్యాయి. అమెరికాకు వెళ్లిన మొత్తం స్మార్ట్‌ఫోన్లలో గతేడాది చైనా నుంచి 61% ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో 25 శాతానికి పరిమితమయ్యాయి. ఇదే సమయంలో భారత్ నుంచి 240% పెరిగాయి. ఈ ఏడాది అమెరికా దిగుమతి చేసుకున్న స్మార్ట్‌ఫోన్లలో భారత్‌లో తయారైనవే 44 శాతమని కానాలిస్ ప్రధాన విశ్లేషకుడు సన్యం చౌరాసియా తెలిపారు.

ఏప్రిల్- జూన్‌లో అమెరికాకు స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లో వాటా

దేశం	2024	2025
చైనా	61%	25%
భారత్	13%	44%

చైనాలో విక్రయ కేంద్రాన్ని మూసివేస్తున్న యాపిల్: చైనాలో అనూహ్యంగా ఒక విక్రయ కేంద్రం మూసివేతకు యాపిల్ నిర్ణయం తీసుకుంది. డాలియన్ సిటీలోని పార్క్‌ల్యాండ్ మాల్ స్టోర్‌ను ఆగస్టు 9 నుంచి మూసివేస్తున్నట్లు యాపిల్ తెలిపింది. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో విక్రయ కేంద్రాలు నిర్వహిస్తున్న పలు రిటెయిల్ సంస్థలు ఇక్కడ నుంచి వెళ్లిపోతుండటంతో, తామూ ఈ నిర్ణయం తీసుకున్నామని యాపిల్ తెలిపింది. ప్రస్తుతం చైనాలో యాపిల్‌కు 56 విక్రయ కేంద్రాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా యాపిల్‌కు ఉన్న 530కి పైగా విక్రయ కేంద్రాల్లో 10 శాతానికి పైగా చైనాలోనే కొలువుదీరాయి. పార్క్‌ల్యాండ్ మాల్‌లోని విక్రయ కేంద్రాన్ని మూసివేస్తున్నప్పటికీ.. ఆగస్టు 16న షెన్‌జెన్‌లో మరో కొత్త విక్రయ కేంద్రాన్ని యాపిల్ ప్రారంభిస్తోంది.

వేతనాలు 6.2–11.3% పెరగొచ్చు

2025–26పై టీమ్‌లీజ్ సర్వీసెస్ నివేదిక



ముంబయి: ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో రంగాల వారీగా సగటు వేతనాల పెంపు 6.2 - 11.3% మధ్య ఉండొచ్చని టీమ్‌లీజ్ సర్వీసెస్ - జాబ్స్ అండ్ శాలరీస్ ప్రీమియర్ 2025-26 నివేదిక పేర్కొంది. అయితే కీలకమైన కొంత మంది ఉద్యోగులకు మాత్రం 13.8% వరకు వేతనం పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. 20 నగరాల్లోని 23 రంగాలకు చెందిన 1,308 సంస్థల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను టీమ్‌లీజ్ రూపొందించింది. దీని ప్రకారం..

✦ ఈవీ (విద్యుత్తు వాహనం), ఈవీ మౌలిక సదుపాయాల రంగంలో 11.3% వేతన పెంపు ఉండొచ్చు. మన్నికైన వినిమయ వస్తువులు (10.7%), రిటెయిల్ (10.7%), ఎన్‌బీఎఫ్‌సీలు (10.4%) తర్వాత స్థానంలో ఉంటాయి.

ఉద్యోగాల వారీగా..: ఈవీ, ఈవీ మౌలిక రంగంలో పని చేస్తున్న ఎలక్ట్రిక్ డిజైన్ ఇంజినీర్ల వేతనాలు 12.4% పెరగొచ్చు. మన్నికైన వినిమయ వస్తువుల రంగంలో ఉన్న ఇన్-స్టోర్ డెమాన్‌స్ట్రేటర్ (12.2%), ఎన్‌బీఎఫ్‌సీల్లో పని చేస్తున్న రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ (11.6%), రిటెయిల్ రంగంలో ఉన్న ఫ్యాషన్ అసిస్టెంట్ (11.2%) తర్వాత స్థానాల్లో ఉంటారు. బ్లూకాలర్ ఉద్యోగాల్లో మెకానిక్‌లకు 10.4%, మెటీరియల్ హ్యాండ్లర్‌లకు 10%, మెషీన్ ఆపరేటర్లకు 9.9%, ఎలక్ట్రీషియన్‌లకు 9.3% వేతన పెంపు ఉండొచ్చు.

నగరాల వారీగా..: పుణెలో పని చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్లకు 13.8%, హైదరాబాద్‌లో పని చేస్తున్న మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఎగ్జిక్యూటివ్‌లకు 13.4%, బెంగళూరులో పని చేస్తున్న డేటా ఇంజినీర్లకు 12.9%, ముంబయిలో ఎలక్ట్రికల్ డిజైన్ ఇంజినీర్లకు 12.6%, గురుగ్రామ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లకు 12.4% వేతన పెంపు ఉండొచ్చు.

✦ సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగంలో సగటు వేతన పెంపు 9.9%, ఇంజినీరింగ్ విభాగంలో 9.5%, ఇతర కీలక ఉద్యోగాలైన ఫైనాన్స్, కస్టమర్ సర్వీస్, బ్యాక్ ఆఫీస్, మానవ వనరులు, పాలన (అడ్మిన్) విభాగాల్లో 8.2-8.6% మధ్య వేతనాలు పెరగొచ్చు.

హైదరాబాద్‌లో 2 కొత్త ప్రాజెక్టులు: బ్రిగేడ్


ఈనాడు, హైదరాబాద్: స్థిరాస్తి సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్ మోతీనగర్‌లో రెండు కొత్త ప్రాజెక్టులను ప్రారంభించనుంది. మొత్తం 10 ఎకరాల విస్తీర్ణంలో బ్రిగేడ్ సిటాడెల్ 2, సిటాడెల్ 3 పేరుతో వీటిని నిర్మించనుంది. దాదాపు 10 లక్షల చదరపు అడుగులకు పైగా స్థలంలో 405 విలాస ఫ్లాట్లు ఇందులో ఉండనున్నాయి. వీటి ద్వారా రూ.970 కోట్ల ఆదాయం పొందగలమని బ్రిగేడ్ మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి భూయజమానులతో ఉమ్మడి అభివృద్ధి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొంది.

ఇ-డాఖిల్ కింద కేసుల పరిష్కారం 23 శాతమే

దిల్లీ: ఇ-డాఖిల్ ప్లాట్‌ఫామ్ కింద నమోదవుతున్న వినియోగదారు కేసుల్లో పరిష్కార రేటు తక్కువగా ఉందని, ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు తగిన చర్యలను వేగంగా చేపట్టాల్సిందిగా ప్రభుత్వాన్ని పార్లమెంటరీ సంఘం కోరింది. కేసుల నిర్వహణ, పర్యవేక్షణ కోసం ఇ-జాగృతి వ్యవస్థను నవీకరించాలని వినియోగదారు వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీపై ఏర్పాటు చేసిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ కనిమొళి కరుణానిధి పేర్కొన్నారు. ఇ-డాఖిల్‌పై నమోదైన కేసుల్లో పరిష్కార రేటు 23 శాతంగా ఉండటంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది.

3 రోజుల తర్వాత మళ్లీ లాభాలు

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.4,637 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.6,147 కోట్లు



సమీక్ష

మూడు రోజుల వరుస నష్టాల నుంచి దేశీయ సూచీలు మంగళవారం బలంగా పుంజుకున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం ఇందుకు కలిసొచ్చింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 21 పైసలు తగ్గి 4 నెలల కనిష్ఠమైన 86.91 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.63% లాభంతో 70.48 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ మంగళవారం రూ.3.57 లక్షల కోట్లు పెరిగి రూ.451.44 లక్షల కోట్లు (5.20 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 271 పాయింట్ల (క్రితం ముగింపు 80,891.02) నష్టంతో 80,620.25 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అదే ధోరణి కొనసాగిస్తూ.. ఇంట్రాడేలో 80,575.45 పాయింట్లకు పడిపోయింది. మధ్యాహ్నం తర్వాత పుంజుకున్న సూచీ, ఒకదశలో 81,429.88 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 446.93 పాయింట్ల లాభంతో 81,337.95 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.20 పాయింట్లు పెరిగి 24,821.10 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,598.60- 24,847.15 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 19 లాభపడ్డాయి. రిలయన్స్ 2.21%, ఎల్ అండ్ టీ 2.13%, ఏషియన్ పెయింట్స్ 1.81%, టాటా మోటార్స్ 1.48%, అదానీ పోర్ట్స్ 1.42%, టాటా స్టీల్ 1.28%, మారుతీ 1.28%, భారతీ ఎయిర్‌టెల్ 1.05% రాణించాయి. యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, టైటన్, ఐటీసీ, అల్ట్రాటెక్ 0.73% వరకు పడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. స్థిరాస్తి 1.64%, టెలికాం 1.50%, ఇంధన 1.22%, పరిశ్రమలు 1.20%, ఆరోగ్య సంరక్షణ 1.15%, కమొడిటీస్ 1.05%, వాహన 0.92% పెరిగాయి. బీఎస్ఈలో 2482 షేర్లు లాభపడగా, 1521 స్క్రిప్‌లు నష్టపోయాయి. 154 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ గతంలో జరిగిన మోసాలు ఇకపై ఎటువంటి ఆర్థిక ప్రభావం చూపవని హామీ ఇవ్వడంతో ఇండస్ఇండ్ బ్యాంక్ షేరు 1.48% పెరిగి రూ.814 దగ్గర స్థిరపడింది.

✦ మెరుగైన ధరలు, ముప్పు నిర్వహణే లక్ష్యంగా **యాలకుల ఫ్యూచర్స్**ను మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్) తీసుకొచ్చింది. తొలుత 2025 ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరుతో ముగిసే కాంట్రాక్టులను అందిస్తోంది.

సెన్సెక్స్ ▲ 447	నిఫ్టీ ▲ 140
81338	24821

ఐపీఓ సమాచారం..

✦ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద లెన్స్‌కార్ట్ విక్రయశాలలను నిర్వహించే **లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ లిమిటెడ్** ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ.2150 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 13.22 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, పెట్టుబడిదార్లు విక్రయించనున్నారు.

✦ **ఆదిత్య ఇన్ఫోటెక్** ఐపీఓకు తొలి రోజు 2.04 రెట్ల స్పందన లభించింది. ఇష్యూ ప్రారంభమైన గంటల్లోనే పూర్తిస్థాయిలో బిడ్లు దాఖలయ్యాయి. ఇష్యూలో భాగంగా 1,12,23,759 షేర్లను ఆఫర్ చేయగా, 2,29,51,676 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 6.51 రెట్ల స్పందన కనిపించింది.

✦ **శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్** ఐపీఓ ముగిసేసరికి 80.80 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,26,67,200 షేర్లను ఆఫర్ చేయగా, 1,02,35,46,675 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఎన్ఐఐ విభాగంలో 151.18 రెట్లు, క్యూఐబీల నుంచి 117.33 రెట్లు, రిటైల్ విభాగంలో 29.77 రెట్ల స్పందన నమోదైంది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)


కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
ఏషియన్ పెయింట్స్	1,117.05	1,186.79	8,924.49	8,943.24
జీ మీడియా కార్పొరేషన్	(8.81)	(10.38)	182.36	175.96
అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలర్స్	55.83	11.19	1,776.37	1,766.94
దీపక్ ఫెర్టిలైజర్స్	243.86	199.65	2,658.75	2,281.33
కేఈసీ ఇంటర్నేషనల్	124.60	87.58	5,028.27	4,555.02
జాగరణ్ ప్రకాశన్	66.76	41.03	460.05	444.11
హైడల్‌బర్గ్ సిమెంట్	48.23	39.9	597.54	532.19
పిరమాల్ ఫార్మా	(82)	(89)	1,934	1,951
వి-గార్డ్ ఇండస్ట్రీస్	73.85	98.97	1,466.08	1,477.10
అరవింద్	54.7	43.73	2,006.32	1,830.60
వెల్‌స్పన్ కార్ప్	349.16	247.03	3,586.52	3,179.67
ఎన్ఎస్ఈ	2,924	2,567	4,798	4,950
స్ట్రైడ్స్ ఫార్మా	114	63	1,120	1,054
జుబిలెంట్ ఫార్మోవా	103	69	482	396
హ్యాపియెస్ట్ మైండ్స్	57.1	51	549.9	463.8
ఎన్‌టీపీసీ	6108.46	5506.07	47065.36	48528.88
స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్	263.00	319.00	4116.00	3692.00
బ్యాంక్ ఆఫ్ ఇండియా	2252.00	1703.00	20518.00	18240.00
పారాదీప్ ఫాస్ఫేట్స్	255.85	5.38	3754.06	2377.43

ఐడియాతోనే యాప్ సిద్ధం

కోడింగ్‌తో పనిలేదు. బుర్రలో ఐడియా, దాన్ని ప్రాంప్ట్‌గా అందించే నేర్పు ఉంటే చాలు. చిటికెలో కోరుకున్న యాప్ ముందుంటుంది. ఇదేమీ ఇంద్రజాలం కాదు. మైక్రోసాఫ్ట్ ఆధ్వర్యంలోని గిట్‌హబ్ కంపెనీ మహత్తు. డెవలపర్ల కోసం ఇప్పటికే ఏఐ ఆధారిత ఫీచర్లను అందిస్తున్న ఇది తాజాగా గిట్‌హబ్ స్పార్క్ సదుపాయంతో మరో ముందడుగు వేసింది. సహజ భాషలో ప్రాంప్ట్స్ అందించగానే యాప్‌ను సృష్టించటం దీని ప్రత్యేకత. ఇది ప్రస్తుతానికి గిట్‌హబ్ నెక్స్ట్ ల్యాబ్స్ కింద ప్రయోగ రూపంలో అందుబాటులో ఉంది. ఇందులో ఓపెన్‌ఏఐ జీపీటీ మోడల్ లేదా క్లాడ్ సానెట్ మోడల్‌ను ఉపయోగించుకొని, పనులు చేసుకోవచ్చు.

స్పార్క్ సాయంతో యూజర్లు చిటికెలో చిన్న వెబ్ యాప్ (మైక్రో యాప్) రూపొందించుకోవచ్చు. ఇది కోడ్‌ను జనరేట్ చేయటంతో పాటు దాన్ని రన్ చేస్తుంది కూడా. ఇంటరాక్టివ్ ప్రివ్యూలో దీన్ని చూసుకొని, మరిన్ని ప్రాంప్ట్‌లను అందిస్తూ మెరుగులు దిద్దుకోవచ్చు. దీనిలోని రివిజన్ రకాల ఆప్షన్‌తో మేధోమథనం చేసి, ఐడియాలూ సృష్టించుకోవచ్చు. ఉదాహరణకు- తమ మైక్రోయాప్ ఎలా ఉండాలో అసలే నిర్ణయించుకోలేని స్థితిలో ఉన్నారనుకోండి. దానికి సంబంధించి 3-6 రకాలను సృష్టించి పెట్టమని ఏఐని అడగొచ్చు. అనంతరం వాటిని అవసరాలకు అనుగుణంగా మార్చుకోవచ్చు. యాప్ నిర్మాణ ప్రక్రియను మెరుగు పరచుకోవటానికి వన్-క్లిక్ డిప్లాయ్‌మెంట్, కోపైలట్ ఏజెంట్ కొలాబరేషన్, మోడల్ సెలెక్టర్ వంటి ఆప్షన్లనూ స్పార్క్ కల్పిస్తుంది. ఇది ప్రస్తుతం కోపైలట్ ప్రొ యూజర్లకే అందుబాటులో ఉంది. కోపైలట్ ప్రొ చందా కోసం నెలకు 39 డాలర్లు లేదా ఏడాదికి 390 డాలర్లు కట్టాల్సి ఉంటుంది.

వాట్సప్‌లో బుక్‌మార్క్!



ముఖ్యమైన వెబ్ పేజీలను బుక్‌మార్క్ చేసుకోవటం తెలిసిందే. ఇలాగే వాట్సప్‌లోనూ మెసేజ్‌లనూ 'బుక్‌మార్క్' చేసుకోవచ్చని తెలుసా? మెసేజ్ మీద వేలితో కాసేపు అదిమి పట్టాలి. తర్వాత **స్టార్ గుర్తు** మీద ట్యాప్ చేయాలి. అంతే అది స్టార్డ్ మెసేజ్‌లలో చేరుతుంది. ఎప్పుడైనా దాన్ని చూడాలనుకుంటే వాట్సప్‌ను ఓపెన్ చేసి, పైన కుడిమూలన నిలువు మూడు చుక్కల ద్వారా **స్టార్డ్** విభాగంలోకి వెళ్తే సరి.

విండోస్ పరుగో పరుగు



ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ వేగం నెమ్మదించిందా? అయితే అనవసర స్టార్టప్ యాప్స్‌ను డిసేబుల్ చేసుకోండి. ముందుగా **సెటింగ్స్** ద్వారా **యాప్స్‌**లోకి వెళ్లాలి. ఇందులో **స్టార్టప్** ఆప్షన్ కనిపిస్తుంది. ఈ జాబితాలో మైక్రోసాఫ్ట్ ఎడ్జ్ లేదా మీరు వాడని వాటిని ఆఫ్ చేసుకోవాలి. అప్పుడవి పరికరం ఆన్ అయినప్పుడు వాటంతటవే స్టార్ట్ కావటం ఆగుతుంది. ఒకవేళ ఏదో ఒకసారి పరికరం వేగం నెమ్మదిస్తే రీస్టార్ట్ చేసుకుంటే సరి. తాత్కాలిక మెమరీ ఖాళీ అవుతుంది.

స్మార్ట్ గూఢచారి!

ఏదో మెసేజ్ వస్తుంది. స్మార్ట్‌ఫోన్ తెర వెలుగుతుంది. అదేంటో చూస్తే ఏవేవో అంకెలు, గజిబిజి అక్షరాలు. ఏంటో తెలియక తికమక పడతాం. పెద్దగా పట్టించుకోకుండా పక్కన పెట్టేస్తాం. కానీ అప్పటివరకూ నిండుగా ఉన్న బ్యాటరీ ఛార్జింగ్ కాసేపటికే బాగా పడిపోతుంది. వాడకపోయినా ఫోన్ వేడెక్కుతుంది. ఇదేదో టెక్నికల్ సమస్య అయ్యిండొచ్చని భావిస్తుంటాం గానీ నిఘా సాఫ్ట్‌వేర్, స్పైవేర్ పనీ కావొచ్చని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు.



అనుక్షణమూ అంతర్జాల అనుసంధానంతో అలరారే నేటి డిజిటల్ ప్రపంచంలో స్మార్ట్‌ఫోన్లు అతి ప్రధానమైన పరికరాలుగా మారిపోయాయి. వ్యక్తిగత చాట్స్, ఆర్థిక సమాచారం దగ్గరి నుంచి ఈమెయిల్స్, లొకేషన్ హిస్టరీ వరకూ అన్నీ ఫోన్‌లోనే ఉంటున్నాయి. మరి దానిలోకి ఎవరైనా అజ్ఞాతంగా తొంగిచూస్తే? రహస్యాలు బట్టబయలైనట్టే. స్పైవేర్స్ ఇలాంటి ప్రమాదాన్నే తెచ్చిపెడతాయి. మన ఫోన్‌ను రహస్యంగా పర్యవేక్షించటం, దుర్వినియోగం చేయటం కోసం వీటిని రూపొందిస్తుంటారు. ఇవి కీస్ట్రోక్స్‌ను రహస్యంగా నమోదు చేయటం, లొకేషన్‌ను పసిగట్టటం, కాల్స్ రికార్డు చేయటం వంటి పనులు చేస్తుంటాయి. మనకు తెలియకుండా కెమెరా, మైక్రోఫోన్లనూ యాక్టివేట్ చేస్తుంటాయి కూడా. కొన్ని స్పైవేర్స్‌ను అనుభవం గల నిపుణులు తయారుచేసి, డార్క్‌వెబ్‌లో అమ్ముతుంటారు. పేరెంటల్ కంట్రోల్, ఉద్యోగుల మానిటరింగ్ టూల్స్ రూపంలో చట్టబద్ధంగానూ అమ్మొచ్చు. కొందరు మన ఫోన్‌ను తీసుకొని స్పైవేర్లనూ జొప్పించొచ్చు.

ఎలా పట్టుకోవాలి?

ఫోన్‌లో అనూహ్యమైన, అసాధారణ లక్షణాలను గుర్తిస్తే కారణమేంటో తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. ఇది అన్ని ఫోన్లలో ఒకేలా ఉండకపోవచ్చు.

- ఆండ్రాయిడ్ వాడేవారు బేసిక్స్ నుంచి ఆరంభించాలి. సెటింగ్స్ ద్వారా యాప్స్‌లోకి వెళ్లి తెలియని యాప్స్ ఉన్నాయేమో చూడాలి. డివైస్ అడ్మిన్ యాప్స్‌ను తనిఖీ చేసి వేటికైనా ఎలివేటెడ్ పర్మిషన్స్ ఇచ్చారేమో గమనించాలి. మాల్వేర్‌బైట్, అవాస్ట్ వంటి విశ్వసనీయ యాంటీ-స్పైవేర్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. డౌన్‌లోడ్ ఫోల్డర్‌లోనూ విపరీత ఫైళ్లున్నాయేమో పరిశీలించాలి. అలాగే గూగుల్ ప్లే ప్రొటెక్ట్‌ను ఎనేబుల్ చేసుకోవాలి.
- ఐఫోన్లలో యాపిల్‌కు చెందిన రక్షణ వ్యవస్థ మూలంగా పరికరాల్లోకి స్పైవేర్స్ తొంగి చూడటం కష్టమే. అలాగని అసాధ్యమేమీ కాదు. ముఖ్యంగా 'జైల్‌బ్రేకింగ్' పరికరాల్లో నిఘా వేర్స్‌ను జొప్పించే అవకాశముంది. తయారీసంస్థ విధించిన సాఫ్ట్‌వేర్ ఆంక్షలను తొలగించి, ఆపరేటింగ్ సిస్టమ్ మీద పూర్తి ఆధిపత్యం దక్కించుకోవటాన్ని జైల్‌బ్రేకింగ్ అంటారు. దీంతో అధికార యాప్ స్టోర్ నుంచి కాకుండా ఇతర వనరుల నుంచి యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేయటం సాధ్యమవుతుంది. ఐఫోన్ వాడేవారు సెటింగ్స్ ద్వారా ప్రైవసీ అండ్ సెక్యూరిటీలోకి వెళ్లి యాప్ పర్మిషన్లను సమీక్షించుకోవాలి. వీపీఎన్ అండ్ డివైస్ మేనేజ్‌మెంట్ కింద తెలియని ప్రొఫైళ్లు ఉన్నాయేమో గమనించాలి. బ్యాటరీ, డేటా వేగంగా, ఎక్కువగా ఖర్చవుతుందేమో చూడాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ఐఓఎస్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి. స్పైవేర్ టూల్స్ పాత ఐఓఎస్‌లో లోపాలను అనుకూలంగా మలచుకునే అవకాశముంది.

హెచ్చరిక లక్షణాలు ఇవీ..

- యాప్స్ ఉన్నట్టుండి ఫ్రీజ్ కావటం, అనూహ్యంగా ఫోన్ వేగం నెమ్మదించటం.
- బ్యాటరీ త్వరగా నిండుకోవటం. స్పైవేర్స్ నిరంతరం పనిచేస్తుండటమే దీనికి కారణం.
- స్పైవేర్స్ మన డేటాను మరొకరికి ప్రసారం చేస్తుండటం వల్ల మొబైల్ డేటా బిల్లు హఠాత్తుగా పెరగొచ్చు.
- అతిగా వేడెక్కటం. ఫోన్‌తో ఎలాంటి పని చేయకపోయినా వేడెక్కుతుందంటే బ్యాక్‌గ్రౌండ్‌లో ఏదో జరుగుతోందనే అర్థం.
- చిత్రమైన అక్షరాలతో కూడిన మెసేజ్‌లు, లింకులు అందటం. ఇవి స్పైవేర్‌కు అందే ఆదేశాలు కావొచ్చు.
- కెమెరా లైట్ మిణుకుమిణుకుమని వెలగటం, కాల్స్ చేస్తున్నప్పుడు అసాధారణ ధ్వనులు వినిపించమూ నిఘా వేర్స్ పని కావొచ్చు.

నివారణే ఉత్తమం

స్పైవేర్లను గుర్తించటం చాలా కష్టం. అందువల్ల వీటి బారినపడకుండా చూసుకోవటమే మంచిది.

- అధికారిక యాప్ స్టోర్స్ నుంచే యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- ఎస్ఎంఎస్, వాట్సప్, ఈమెయిళ్లలోని అనుమానాస్పద లింకుల మీద క్లిక్ చేయొద్దు.
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్‌ను జైల్‌బ్రేక్ లేదా రూట్ చేయొద్దు.
- కఠినమైన పాస్‌వర్డ్‌ను నిర్ణయించుకోవాలి.
- టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఎనేబుల్ చేసుకోవాలి.
- పబ్లిక్ వై-ఫై మీద వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని షేర్ చేసుకోవద్దు.
- ఫోన్ మీద నిఘా పెట్టారని అనుమానిస్తే, స్పైవేర్‌ను తొలగించుకోవటానికి ప్రయత్నించినా ఎలాంటి ఫలితం కనిపించకపోతే ఫ్యాక్టరీ రీసెట్ చేసుకోవటం మంచిది. దీంతో ఫోన్‌లో ఉన్నవన్నీ తొలగిపోయి, ఆపరేటింగ్ సిస్టమ్ తిరిగి ఇన్‌స్టాల్ అవుతుంది. అధునాతన స్పైవేర్‌ను వదిలించుకోవటానికిది బాగా తోడ్పడుతుంది. కాకపోతే పరికరంలో ఉన్న ఫొటోలు, ఫైళ్ల వంటివన్నీ పోతాయనే విషయాన్ని మరవరాదు.

లావా నుంచి బ్లేజ్ డ్రాగన్



దేశీయ మొబైల్ సంస్థ లావా చవక ధరలో మరో స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. పేరు బ్లేజ్ డ్రాగన్ 5జీ. ఇది స్నాప్‌డ్రాగన్ జెన్ 2 ఎస్ఓసీ ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 15తో పనిచేస్తుంది. 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 450 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.7 అంగుళాల హెచ్‌డీ+ డిస్‌ప్లే.. 18డబ్ల్యూ వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్టుతో 5,000ఎంఏహెచ్ బ్యాటరీ.. వెనకాల 50ఎంపీ ప్రైమరీ కెమెరా, ముందు 8ఎంపీ సెల్ఫీ కెమెరా.. 4జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీ వంటి ఫీచర్లతో అలరిస్తోంది. బ్లోట్‌వేర్స్, యాడ్స్ వంటివేవీ ఉండవు. ఏడాది వరకూ ఓఎస్ అప్‌డేట్స్, రెండేళ్ల పాటు సెక్యూరిటీ ప్యాచెస్ అందుతాయి. గోల్డెన్ మిస్ట్, మిడ్‌నైట్ మిస్ట్ రంగుల్లో కనువిందు చేస్తున్న దీని ధర రూ. 9,999. ఆగస్టు 1 నుంచి ఆన్‌లైన్ అంగడిలో అమ్మకాలు మొదలవుతాయి.

ఇన్‌ఫినిక్స్ చవక ఫోన్



బడ్జెట్ ధర మొబైల్ కోసం చూసేవారిని దృష్టిలో పెట్టుకొని ఇన్‌ఫినిక్స్ స్మార్ట్ 10 ఫోన్‌ను తీసుకొచ్చింది. యూనిసాక్ టీ7250 ఎస్ఓసీ ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఎక్స్ఓఎస్ 15.1తో పనిచేసే దీని ఫీచర్లు..

- 120హెచ్‌జడ్ వరకూ రిఫ్రెష్ వేగం, 700 నిట్స్ వరకూ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.67 అంగుళాల హెచ్‌డీ+ ఐపీఎస్ ఎల్‌సీడీ డిస్‌ప్లే.
- వెనకాల రెండు 8ఎంపీ కెమెరాలు, ముందు 8ఎంపీ సెల్ఫీ షూటర్.
- 4జీబీ ర్యామ్, 64జీబీ స్టోరేజీ. మైక్రోఎస్‌డీ కార్డు ద్వారా 2టీబీ వరకూ స్టోరేజీ పెంచుకునే వీలు.
- 15డబ్ల్యూ ఛార్జింగ్ సపోర్టు గల 5,000ఎంఏహెచ్ బ్యాటరీ.
- నాలుగేళ్ల పాటు ల్యాగ్-ఫ్రీ అనుభూతి కోసం టీయూవీ ఎస్‌యూడీ సర్టిఫికెట్.
- దుమ్ము, నీటి తుంపర్లను తట్టుకోవటంలో ఐపీ64 రేటింగ్.
- ఫోలాక్స్ ఏఐ వాయిస్ అసిస్టెంట్, డాక్యుమెంట్ అసిస్టెంట్, రైటింగ్ అసిస్టెంట్ వంటి ఏఐ టూల్స్.
- సెల్యులర్ నెట్‌వర్క్ లేకపోయినా ఇతర ఇన్‌ఫినిక్స్ ఫోన్లతో కాల్స్ చేసుకోవటానికి తోడ్పడే అల్ట్రాలింక్.
- ఐరిస్ బ్లూ, స్లీక్ బ్లాక్, టైటానియం సిల్వర్, ట్విలైట్ గోల్డ్ రంగుల్లో లభించే దీని ధర రూ. 6,799.
- ఆగస్టు 2 నుంచి అమ్మకాలు ఆరంభం.

విశ్వానికీ గడువు తేదీ!



విశ్వం ఇలా అనంతంగా విస్తరిస్తూనే ఉంటుందనేది శాస్త్రవేత్తల భావన. ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతంలోని కాస్మోలాజికల్ కాన్‌స్టాంట్ విలువ ఆధారంగా డార్క్ ఎనర్జీ స్థిరంగా, ఎప్పుడూ ఒకేలా ఉంటుందని చాలాకాలంగా అనుకుంటున్నారు. కానీ తాజా విశ్లేషణ దీనికి సవాల్ విసురుతోంది. విశ్వం విస్తరణ ఆగిపోవచ్చని, తిరిగి కుంచించుకోవటం మొదలు కావొచ్చని డార్క్ ఎనర్జీ సర్వే, డార్క్ ఎనర్జీ స్పెక్ట్రోస్కోపిక్ ఇన్‌స్ట్రుమెంట్ సర్వేలు సూచిస్తున్నాయి. విశ్వం విస్తరించటాన్ని ప్రోత్సహిస్తున్న అజ్ఞాత డార్క్ ఎనర్జీ మారిపోతున్నట్టు తేలటమే దీనికి కారణం. ఒకవేళ అదే నిజమైతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి. విశ్వం విస్తరించటానికి బదులు ఏదో ఒకనాడు కుంచించటం ఆరంభమవుతుంది (బిగ్ క్రంచ్). ఈ ప్రక్రియ వెయ్యి కోట్ల సంవత్సరాలోపు మొదలు కావొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. తాజా అధ్యయన నమూనాలో డార్క్ ఎనర్జీ, యాగ్జియాన్స్ అనే ఊహాత్మక అల్ట్రాలైట్ రేణువులను సమ్మిళితం చేసి పరిశీలించారు. విశ్వం విస్తరణ కొనసాగటంలో ఎక్కువ పనిని నిర్వహించేవి యాగ్జియాన్ రేణువులే. కానీ ఇవి క్రమంగా తమ ప్రభావాన్ని కోల్పోయే అవకాశముంది. ఒకసారి ఇవి కళ తప్పితే రుణాత్మక కాస్మోలాజికల్ కాన్‌స్టాంట్ ఆధిపత్యం వహిస్తుంది. అప్పుడు విస్తరణ ఆగిపోవటమే కాదు, తిరిగి వెనక్కి మళ్లటమూ ఆరంభమవుతుంది.

చినుకు తాకితే ఫోన్ గజగజ

చిటపట చినుకులు పడుతుంటే ఆనందంగానే ఉంటుంది. చల్లటి వాతావరణం మనసుకు హాయి గొలుపుతుంది. అయితే ఇది ఎలక్ట్రానిక్ పరికరాలను దెబ్బతీసే అవకాశం లేకపోలేదు. మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ట్యాబ్లెట్ల వంటివి నీరు, తేమను తట్టుకోలేవు. కాబట్టి వానాకాలంలో చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఎక్కువకాలం గ్యాడ్జెట్స్ బాగుండేలా చూసుకోవచ్చు. సామర్థ్యం తగ్గకుండా కాపాడుకోవచ్చు.



పొడి పొడిగా

ఫోన్, ట్యాబ్లెట్, ల్యాప్‌టాప్‌లకు వాన చినుకులు, చెమ్మ తగలకుండా చూసుకోవాలి. బయటకు వెళ్తున్నప్పుడు వీటిని వాటర్‌ప్రూఫ్ బ్యాగ్ లేదా బ్యాక్‌ప్యాక్‌లో పెట్టుకోవాలి. జిప్‌లాక్ బ్యాగ్‌లైతే ఇంకా మంచిది. వీటికి పెద్దగా ఖర్చేమీ కాదు. తేలికగా వెంట తీసుకెళ్లొచ్చు. పరికరాలు తడిసి దెబ్బతినకుండా చూసుకోవచ్చు.

▼ ఇంట్లో ఉన్నప్పుడు కిటికీల దగ్గర, తేమ ఉండే చోట్ల పరికరాలను పెట్టొద్దు. వాన జల్లు వీటి మీద పడితే స్క్రీన్, లోపలి భాగాలు దెబ్బతినే ప్రమాదముంది. వంట గది, బాత్రూమ్ వంటి చోట్లకూ పరికరాలను దూరంగా ఉంచాలి.

తడిస్తే ఏం చేయాలి?

డిజిటల్ పరికరాలు తడిస్తే ఆందోళన చెందాల్సిన పనిలేదు. కానీ సత్వరం జాగ్రత్త పడాలి. పరికరాన్ని వెంటనే ఆఫ్ చేయాలి. ఇది షార్ట్ సర్క్యూట్ తలెత్తకుండా కాపాడుతుంది. లేకపోతే లోపలి భాగాలు దెబ్బతినే అవకాశముంది. కొందరు పరికరం పనిచేస్తుందో లేదోనని తెలుసుకోవటానికి బటన్లు నొక్కుతుంటారు. ఇలాంటి పని అసలే చేయొద్దు.

▼ తర్వాత కేస్, సిమ్ కార్డు, మెమరీ కార్డు వంటివి బయటకు తీయాలి. మెత్తటి, పొడి బట్టతో బయటి భాగాన్ని తుడవాలి. పోర్ట్స్‌లోకి నీటి తడిని తోయొద్దని గుర్తుంచుకోవాలి. హెయిర్ డ్రయ్యర్‌తో వేడి గాలి కొట్టటం, నేరుగా ఎండలో పెట్టటం వంటి పనులేవీ చేయొద్దు. ఇవి పరికరం మరింత దెబ్బతినేలా చేస్తాయి.

▼ పరికరాన్ని సిలికా జెల్ ప్యాకెట్లతో కూడిన సీల్డ్ బ్యాగ్ లేదా డబ్బాలో పెట్టాలి. సిలికా ప్యాకెట్లు తేమను గ్రహిస్తాయి. సిలికా జెల్ లేకపోతే ప్రత్యామ్నాయంగా బియ్యంతోనైనా పరికరాన్ని కప్పేయొచ్చు. ఒకట్రెండు రోజుల వరకూ పరికరాన్ని అలాగే ఉంచాలి. పరికరం పూర్తిగా ఎండిపోయిందని తెలుసుకున్నాకే ఆన్ చేయాలి. అప్పటికీ పరికరం పనిచేయకపోతే సర్వీస్ సెంటర్‌కు తీసుకెళ్లాలి.

▼ పరికరాలు తడిసినప్పుడు చాలా జాగ్రత్త, ఓపిక అవసరమని తెలుసుకోవాలి. త్వరగా స్పందించి, తగు జాగ్రత్తలు తీసుకుంటే పరికరాన్ని కాపాడుకోవచ్చు.

ఛార్జ్ చేయొద్దు

పరికరాలు తడిసినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ఛార్జ్ చేయొద్దు. అలా ఛార్జ్ చేస్తే షార్ట్ సర్క్యూట్ తలెత్తి, శాశ్వతంగా దెబ్బతింటుంది. ఫోన్ తడిగా ఉందని లేదా ఛార్జింగ్ పోర్టు నుంచి నీరు లోపలికి వెళ్లిందని అనిపించినప్పుడు పూర్తిగా ఎండేంత వరకూ వేచి చూడాలి. ఆ తర్వాతే ఛార్జింగ్ పెట్టాలి.

▼ వానాకాలంలో విద్యుత్ అంతరాయాలు, వోల్టేజీ హెచ్చుతగ్గులు తరచూ చూస్తుంటాం. అందువల్ల పరికరాలను ఛార్జ్ చేస్తున్నప్పుడు సర్జ్ ప్రొటెక్టర్ లేదా యూపీఎస్ వాడుకోవటం మంచిది.

శుభ్రంగా, భద్రంగా

వానాకాలంలో పరికరాలను తరచూ తనిఖీ చేస్తుండాలి. దుమ్ము, తేమను తొలగించటానికి మెత్తటి, పొడి బట్టతో తుడుచుకోవాలి. ఛార్జింగ్ పోర్ట్స్, హెడ్‌ఫోన్ జాక్స్, బటన్ల మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పోర్టుల్లోకి సూదులు, పిన్నీసుల వంటి పదునైన వస్తువులను గుచ్చొద్దు.

▼ పరికరాలను ఎక్కువకాలం వాడనప్పుడు చల్లటి, పొడి ప్రాంతాల్లో భద్రంగా పెట్టాలి. ప్లాస్టిక్ బ్యాగులు తేమను పట్టి ఉంచుతాయి కాబట్టి వీటిల్లో పరికరాలను ఎక్కువసేపు ఉంచొద్దు. గాలి వచ్చిపోయే డ్రాయర్ లేదా కేబినెట్‌లో పెట్టుకోవాలి.

పాపప్స్ ఆగేలా..

క్రోమ్‌లో పాపప్స్‌తో విసిగిపోతున్నారా? మిమ్మల్ని అడగకుండానే పేజీలు రీడైరెక్ట్ అవుతున్నాయా? దీన్ని నిలువరించటం పెద్ద కష్టమేమీ కాదు. బ్రౌజర్‌ను ఓపెన్ చేసి సెటింగ్స్ ద్వారా ప్రైవసీ **అండ్** సెక్యూరిటీలోకి వెళ్లాలి.



ఇందులోని సైట్ సెటింగ్స్ విభాగంలో **పాప్-అప్స్ అండ్ రీడైరెక్ట్స్** ఆప్షన్ కనిపిస్తుంది. ఇందులో **డోన్ట్ అలో సైట్స్ టు సెండ్ పాప్-అప్స్ ఆర్ యూజ్ రీడైరెక్ట్స్** ఆప్షన్ ఎంచుకోవాలి. ఇది యాడ్ బ్లాకర్ కాదు. కానీ అల్లరి సైట్లకిది కళ్లెం వేస్తుంది.

ఐప్యాడ్ హోంస్క్రీన్ మీద వెబ్‌సైట్

ఐప్యాడ్‌లో ఏదైనా వెబ్‌సైట్‌ను మాటిమాటికీ చూడాల్సిన అవసరముంటే మంచి చిట్కా ఉంది. సఫారీని ఓపెన్ చేసి, పైన కుడివైపున **షేర్ బటన్** మీద తాకాలి. **యాడ్ టు హోం స్క్రీన్** ఆప్షన్‌ను ఎంచుకోవాలి. దానికి ఇష్టమైన పేరు పెట్టుకొని **డన్** మీద ట్యాప్ చేయాలి. అప్పుడది హోం స్క్రీన్ మీద ఐకన్‌గా కనిపిస్తుంది. యాప్ మాదిరిగా దీన్ని ఎక్కడైనా జరపొచ్చు. ఇష్టమైన వెబ్‌సైట్లను బుక్‌మార్క్ ద్వారా చూసుకోవటం కన్నా ఇది చాలా సులువు.



జేబులో సైంటిస్ట్!

జేబులో ఆండ్రాయిడ్ ఫోనుందా? అయితే భూకంపాల గురించి ముందే హెచ్చరించే శాస్త్రవేత్త వెంట ఉన్నట్టే. అవును.. గూగుల్ సంస్థ చడీచప్పుడు లేకుండా తమ ఆపరేటింగ్ సిస్టమ్ సాయంతో కోట్లాది ఫోన్లను భారీ భూకంప గుర్తింపు నెట్‌వర్క్‌గా మార్చేసింది. భూకంపాలు రావటానికి కొద్ది క్షణాల ముందే వాటి గురించి హెచ్చరించటం దీని ప్రత్యేకత.



గూగుల్ 2020లోనే తమ ఫోన్లలో ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ (ఏఈఏ) సిస్టమ్‌ను ప్రవేశపెట్టింది. మొదట్లో అమెరికాలో .. 2021లో న్యూజిలాండ్, గ్రీస్‌లో.. అనంతరం ప్రపంచమంతా విస్తరించింది. తాజాగా సైన్స్ పత్రికలో దీని పనితీరు, ఆల్గోరిథమ్ పద్ధతుల మీద ఓ పరిశోధన పత్రం ప్రచురితమైంది. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బెర్కెలేకి చెందిన సీస్మాలజీ ల్యాబొరేటరీ, గూగుల్ సంయుక్తంగా రూపొందించిన ఇందులో ఆసక్తికరమైన విషయాలెన్నో వెల్లడయ్యాయి. దీని ప్రకారం ఆండ్రాయిడ్ ఆధారిత భూకంప గుర్తింపు నెట్‌వర్క్ 2021-2024 మధ్యలో 11వేలకు పైగా నిజమైన భూకంపాలను పసిగట్టింది. మొత్తం 98 దేశాల్లో నెలకు సుమారు 1.8 కోట్ల అలర్టులను పంపించింది. కొన్నిసార్లు అలర్ట్ అందిన నిమిషం తర్వాత భూకంపం రావటం గమనార్హం. అంటే ఆ సమయంలో ప్రాణాలు కాపాడుకోవటానికి అవసరమైన సమయం లభించిందన్నమాట. లక్షన్నర మంది యూజర్లలో 79% మంది తమకిది ఉపయోగపడిందని తెలపటం విశేషం. కొన్నిసార్లు ఏఈఏ వ్యవస్థ తప్పుడు అలర్ట్‌నూ ఇవ్వచ్చు. అయితే వీటి సంఖ్య చాలా తక్కువే. నిర్ధారణ అయిన 1300 భూకంపాల్లో కేవలం మూడు మాత్రమే ఇలాంటి తప్పుడు అలర్ట్స్ ఉండటం గమనించదగ్గ విషయం.

ఆల్గోరిథమ్ సాయం

భూకంపం ఉపరితలం మీదికి చేరుకోవటానికి ముందు చాలా రకాల కంపనాలు పుట్టుకొస్తాయి. ఎలాంటి కంపనాలు ఉపరితలానికి చేరుకుంటాయనే దాన్ని బట్టి ఎంతవరకు అనర్థం జరుగుతుందనేది ఆధారపడి ఉంటుంది. ఏఈఏ వ్యవస్థ రెండు రకాలుగా భూకంప కేంద్రాన్ని అంచనా వేస్తుంది. ఒకటి- ఎస్, పి తరంగాల వేగాన్ని గుణించి, వాటి మధ్య తేడాను గుర్తించటం. రెండు- ఇతర పద్ధతుల సాయంతో మ్యాంటిల్ గుండా సాగే కంపనాలను గుర్తించటం. ఇది లోతైన భూకంప కేంద్రాలను గుర్తించటానికి ఉపయోగపడుతుంది. తేలికైన భూకంపాల విషయంలో 'బీఅవేర్' అని అప్రమత్తం చేస్తుంది. అదే బలమైన కంపాలైతే 'టేక్ యాక్షన్' అని హెచ్చరిస్తుంది. బలమైన భూకంపాల విషయంలో డూ నాట్ డిస్టర్బ్ సెటింగ్స్‌ను అధిగమించి మరీ ఆడియో రూపంలో అప్రమత్తం చేస్తుంది. ఈ అలర్ట్స్‌ను మాన్యువల్‌గా ఎనేబుల్, డిసేబుల్ చేసుకోవచ్చు.

ఎలా పనిచేస్తుంది?

మీరు రోజుకు ఎన్ని అడుగులు వేశారో ఫోన్‌లో చూసుకుంటుంటారు కదా. వీటిని తెలిపేది యాక్సెలోమీటర్. ఇది పరికరం మీద పడే వేగ బలాలను గుర్తిస్తుంది. ప్రధానంగా అడుగుల సంఖ్య, తెర తిరగటం వంటి వాటికి ఈ సెన్సర్ ఉపయోగ పడుతుంది. భూకంపాలను గుర్తించటానికీ ఇదే దోహదం చేస్తుండటం విశేషం. సాధారణంగా భూకంపాలు ముందుగా 'పి' తరంగాలతో మొదలవుతాయి. వేగంగా కదిలే ఇవి సూక్ష్మంగా ఉంటాయి. తర్వాత 'ఎస్' తరంగాలు పుట్టుకొస్తాయి. ఇవి చాలా బలమైనవి. కేవలం ఘనాల నుంచే సాగే ఇవి నెమ్మదిగా కదులుతాయి. పైకీ కిందికీ కదులుతుంటాయి కూడా. స్వల్పంగానే అయినా పి తరంగాలకు, ఎస్ తరంగాలకు మధ్య కొంత వ్యవధి ఉంటుంది. ఈ మధ్యలో భూకంపం వస్తుందని తెలిస్తే సురక్షిత చోటుకు చేరుకోవచ్చు కదా. ఏఈఏ చేసే పని ఇదే. మనలో చాలామంది పి తరంగాలను గుర్తించలేరు గానీ ఫోన్‌లోని యాక్సెలోమీటర్ పసిగట్టగలదు. అది వీటిని గుర్తించినప్పుడు వెంటనే గూగుల్‌కు చెందిన భూకంప గుర్తింపు సర్వర్‌కు సంకేతాలను పంపిస్తుంది. ఒకే ప్రాంతంలో ఎక్కువమంది ఆండ్రాయిడ్ ఫోన్ల నుంచి అవే సంకేతాలు అందినప్పుడు ఏఈఏ వ్యవస్థ ప్రేరేపితమవుతుంది. బలమైన, నెమ్మదిగా కదిలే 'ఎస్' తరంగాలు ఢీకొట్టకముందే ప్రజలను అప్రమత్తం చేస్తుంది. అలర్ట్‌ల రూపంలో హెచ్చరిస్తుంది. అయితే భూకంపాల్లో తలెత్తే మూడో రకమైన సర్ఫేస్ తరంగాలను ఏఈఏ పర్యవేక్షించదు. ఇవి చాలా నెమ్మదిగా కదులుతాయి. భూమి పైపొర గుండానే సాగుతాయి. భూమి పైన జరిగే అనర్థానికి సాధారణంగా ఇవే కారణమవుతాయి.

స్మార్ట్ వాచ్‌లోనూ

వియర్‌ఓఎస్ స్మార్ట్‌ఫోన్ ధరించారా? అయితే భూకంప అలర్ట్ మణికట్టు వద్దా రింగ్ అవుతుంది. ఫోన్ వేరే గదిలో ఉన్నా కూడా.

ఇలా సెట్ చేసుకోవాలి

ఏఈఏ ఫీచర్ ఆండ్రాయిడ్ ఫోన్లలో ఉచితంగానే అందుబాటులో ఉంటుంది. దీన్నుంచి అలర్ట్స్ అందాలంటే లొకేషన్ ఆన్‌లో ఉంచుకోవాలి.

- సెటింగ్స్ ఓపెన్ చేసి, **సేఫ్టీ అండ్ ఎమర్జెన్సీ** మీద తాకాలి.
- అక్కడ **ఎర్త్‌క్వేక్ అలర్ట్స్** ఫీచర్ ఆన్ చేసుకోవాలి.
- కొన్ని ఫోన్లలో సెటింగ్స్‌లో లొకేషన్ విభాగంలోకి వెళ్తే ఎర్త్‌క్వేక్ అలర్ట్స్ ఫీచర్ కనిపిస్తుంది.
- టెస్ట్ అలర్ట్ మీద తాకితే ఎలాంటి సౌండ్ వస్తుందో ప్రివ్యూ కనిపిస్తుంది.

ఐఫోన్ల సంగతేంటి?

యాపిల్ ఇంకా క్వేక్ యూనివర్సిటీలో నమోదు చేసుకోలేదు. నిజానికి ఐఫోన్లలోనూ యాక్సెలోమీటర్లు ఉంటాయి. కాకపోతే యాపిల్ వీటిని భూకంపాలను గుర్తించటానికి ఉపయోగించటం లేదు. ఒకవేళ మీరు **టీమ్ ఐఫోన్** మీద ఉన్నట్టయితే **మైషేక్ యాప్‌**ను వాడుకోవచ్చు. ఇది అధికారిక సీస్మిక్ నెట్‌వర్క్ నుంచి అలర్ట్స్‌ను అందిస్తుంది.



ఇస్లామిక్ స్టడీస్ ఎక్కడ?

బి.ఎ. ఇస్లామిక్ స్టడీస్ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ ఉంది? దీంతో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? స్కాలర్‌షిప్ ఇస్తారా? - అబ్దుల్ అలీ



■ బి.ఎ. ఇస్లామిక్ స్టడీస్ ప్రోగ్రాం తెలంగాణ రాష్ట్రంలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్‌లో అందుబాటులో ఉంది. దీన్ని రెగ్యులర్, డిస్టెన్స్ విధానంలో అందిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని కొన్ని డిగ్రీ కళాశాలల్లో బి.ఎ.లో ఇస్లామిక్ స్టడీస్ ఒక ఐచ్ఛిక సబ్జెక్టుగా అందిస్తున్నారు. ఈ కోర్సు తర్వాత ఎంఎ ఇస్లామిక్ స్టడీస్ చదువుకోవచ్చు. ఎంబీఏ ఇస్లామిక్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కూడా చదవొచ్చు. ఇవే కాకుండా బి.ఎ. డిగ్రీ అర్హతతో చదివే పీజీ కోర్సులన్నిటికీ మీరు అర్హులవుతారు. బీఏ తర్వాత బీఈడీ చేసి ఉపాధ్యాయులుగా, ఎంఎ డిగ్రీతో కళాశాలలో అధ్యాపకులుగా, పీహెచ్‌డీ చేసి యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా స్థిరపడవచ్చు. డిగ్రీ తరువాత జర్నలిజం చేసి జర్నలిస్టులుగా చేరవచ్చు. బి.ఎ. డిగ్రీ అర్హత ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలన్నింటికీ మీరు దరఖాస్తు చేసుకోవచ్చు. అరబిక్, ఉర్దూ, ఇంగ్లిష్‌ల మధ్య అనువాద సేవల ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేయవచ్చు. హజ్ కమిటీలు, మతపరమైన పత్రికలు, సంస్థల్లో రైటర్‌గానూ అవకాశాలుంటాయి.

స్కాలర్‌షిప్పుల విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వ మైనారిటీస్ అఫైర్స్ మంత్రిత్వశాఖ 'మోమా' స్కాలర్‌షిప్, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పులు, వివిధ యూనివర్సిటీలు అందించే మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఐసీఎంఆర్-ఎన్ఐఐహెచ్‌లో ఖాళీలు

ముంబయిలోని ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునోహెమటాలజీ (ఐసీఎంఆర్-ఎన్ఐఐహెచ్) 11 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● అసిస్టెంట్: 01 ● యూడీసీ: 01 ● ఎల్‌డీసీ: 01
● పర్సనల్ అసిస్టెంట్: 01 ● టెక్నికల్ అసిస్టెంట్: 02
● టెక్నీషియన్-1: 04 ● ల్యాబ్ అటెండెంట్-1: 01

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిగ్రీతో పాటు పని అనుభవం. **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు మించకూడదు. **వేతన శ్రేణి:** నెలకు అసిస్టెంట్‌కు రూ.35,400 - రూ.1,12,400, యూడీసీకి రూ.25,500 - రూ.81,100, ఎల్‌డీసీ, టెక్నీషియన్-1కి రూ.19,900 - రూ.63,200, ల్యాబ్ అటెండెంట్‌కు రూ.18,000 - రూ.56,900.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 14.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్‌కు రూ.2000. మహిళలకు రూ.1600.
ఎంపిక: రాత పరీక్షతో. **వెబ్‌సైట్:** https://www.icmr.gov.in/employment-opportunities

మేనేజ్ హైదరాబాద్‌లో..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్), హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన 7 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ఇన్నోవేషన్: 02 ● బిజినెస్ ఎగ్జిక్యూటివ్: 02 ● కంటెంట్ డెవలపర్: 01 ● డిజైనర్: 01 ● ప్రాజెక్ట్ అసిస్టెంట్: 01

అర్హత: పోస్టును అనుసరించి ఎమ్మెస్సీ/పీహెచ్‌డీ, ఎంబీఏ, ఎంసీజే, డిగ్రీతో పాటు పని అనుభవం.
వయసు: 35 ఏళ్లు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు ఇన్నోవేషన్ పోస్టుకు రూ.1,00,000, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.25,000, మిగతా పోస్టులకు రూ.50,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.08.2025
వెబ్‌సైట్: https://www.manage.gov.in/vacancies/vacancies.asp

ఎస్ఐబీ (బయో డిజైన్) ఫెలోలు

ఫరిదాబాద్‌లోని బీఆర్ఐసీ- ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ- బీఆర్ఐసీ) 6 ఎస్ఐబీ (బయో డిజైన్) ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి ఎమ్మెస్సీ/ పీహెచ్‌డీ లేదా బీటెక్, ఎంటెక్, లేదా ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీవీఎస్సీ లేదా ఎంబీఏతో పాటు పని అనుభవం. **వయసు:** 35 ఏళ్లు.
వేతనం: నెలకు రూ.60,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.590. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, పీడబ్ల్యూబీడీలకు రూ.118.
ఎంపిక: ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://thsti.res.in/en/Jobs

ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

ఇదే సంస్థ 5 ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ప్రాజెక్ట్ అసోసియేట్-1: 01 ● సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 01 ● రిసెర్చ్ అసోసియేట్-3: 01
● రిసెర్చ్ అసోసియేట్-1: 01 ● ప్రాజెక్ట్ అసోసియేట్-2: 01

అర్హత: పోస్టును అనుసరించి ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, బీటెక్, పీజీతో పాటు పని అనుభవం. **వయసు:** 35 నుంచి 40 ఏళ్లు.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్-1కు రూ.31,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000, రిసెర్చ్ అసోసియేట్‌కు రూ.54,000, ప్రాజెక్ట్ అసోసియేట్-2కు రూ.35,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 14.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్‌కు రూ.236. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/మహిళలకు రూ.118.
ఎంపిక: రాత పరీక్ష/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://thsti.res.in/en/Jobs

ఐఐటీ రూపార్‌లో ఫ్యాకల్టీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), రూపార్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1, 2 అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1 ● అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2
● అసోసియేట్ ప్రొఫెసర్ ● ప్రొఫెసర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
వేతన శ్రేణి: నెలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1కు రూ.1,01,500 - రూ.167,400, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2కు రూ.57,700 - రూ.98,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,39,600 - రూ.2,11,300, ప్రొఫెసర్‌కు రూ.1,59,100 - రూ.2,20,200.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16.08.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.iitrpr.ac.in/jobs/faculty-positions

సుప్రీం కోర్టులో షార్ట్‌హ్యాండ్ పోస్టులు

సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా రిజిస్ట్రీలోని 30 కోర్ట్ మాస్టర్ (షార్ట్ హ్యాండ్) గెజిటెడ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. (యూఆర్-16; ఎస్సీ-04; ఎస్టీ-02; ఓబీసీ-08)
అర్హత: డిగ్రీ. ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్‌లో నిమిషానికి 120 పదాల వేగం, కంప్యూటర్ ఆపరేషన్స్ పరిజ్ఞానం, నిమిషానికి 40 పదాల టైపింగ్ వేగం, ప్రభుత్వ/పబ్లిక్ సెక్టార్/స్టాట్యుటరీ బాడీలలో కనీసం 5 ఏళ్ల సీనియర్ పీఏ/సీనియర్ స్టెనోగ్రాఫర్ అనుభవం.
వయసు: 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతనం: రూ.67,700+ ఇతర అలవెన్సులు.
ఎంపిక: షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ టెస్టులు, ఆబ్జెక్టివ్ రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో (లా డిగ్రీ ఉన్నవారికి 3 మార్కుల అదనపు వెయిటేజీ). **దరఖాస్తు ఫీజు:** జనరల్‌కు రూ.1500. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/ఎక్స్‌సర్వీస్‌మెన్/దివ్యాంగులకు రూ.750.
దరఖాస్తు గడువు: ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రారంభం, ముగింపు తేదీలు త్వరలో ప్రకటిస్తారు.
పరీక్ష కేంద్రాలు: షార్ట్ హ్యాండ్ & ఆబ్జెక్టివ్ పరీక్షలు: దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై; టైపింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ: దిల్లీ మాత్రమే. **వెబ్‌సైట్:** www.sci.gov.in

ఉపాధి పథం నైపుణ్య సాధనం



ధగధగల కెరియర్‌కు దారులెన్నో!

నిశ్చింతగా పురోగమిస్తున్న స్వర్ణాభరణాల పరిశ్రమలో సేవలందించాలనుకునే యువతకు చాలా మార్గాలున్నాయి. భారీ బ్రాండ్లు మార్కెట్లోకి ప్రవేశిస్తున్నందున పరిశ్రమ అవసరాలకు తగిన కోర్సులు చేసిన ప్రొఫెషనల్స్‌కు ఈ రంగంలో మేటి అవకాశాలున్నాయి.

తిరుగులేని కెరియర్ నిర్మించుకోవాలన్న ఆసక్తి ఉన్నవారికి బంగారు పరిశ్రమలో జ్యూలరీ డిజైన్ నిపుణులుగా మారేందుకు తగిన కోర్సులు స్వాగతిస్తున్నాయి. డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు కొన్ని ప్రత్యేక కోర్సులు పరిశ్రమలో ప్రవేశించేందుకు దారి చూపుతున్నాయి. బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ డిజైనింగ్, బీఎస్సీ జ్యూలరీ డిజైనింగ్, డిప్లొమా ఇన్ డిజైనింగ్‌లతో పాటు ప్రత్యేక నైపుణ్యాలను కల్పించే క్యాడ్ (సీఏడీ), జ్యూలరీ మేకింగ్, జెమాలజీ లాంటి కోర్సులు చేస్తే ఈ రంగంలో వృత్తి నైపుణ్యాలను సాధించవచ్చు.

వివిధ కోర్సులు

డిప్లొమా కోర్సులు: ఒకటి- రెండేళ్లలో చేయదగ్గ స్వల్పకాల వ్యవధి కోర్సులున్నాయి. ఆభరణాల తయారీలో అవగాహన, నైపుణ్యం కల్పించే డిప్లొమా కోర్సుల ద్వారా పేరున్న బ్రాండ్ల కంపెనీల్లో చోటు సంపాదించుకోవచ్చు. ఈ కోర్సు బంగారు ఆభరణాల డిజైన్, తయారీలో ప్రాథమిక నైపుణ్యాన్ని కల్పిస్తుంది.

యూజీ కోర్సులు: డిజైన్ మేకింగ్‌లో బ్యాచిలర్స్ ఇన్ డిజైనింగ్, బీఎస్సీ ఇన్ జ్యూలరీ డిజైనింగ్‌ల ద్వారా స్వర్ణాభరణాల డిజైనింగ్ సిద్ధాంతాలు, సాంకేతిక నైపుణ్యాలు, వాటిలో ఇమిడున్న వ్యాపార పరిమాణాలను విద్యార్థులు తెలుసుకుంటారు.

పీజీ కోర్సులు: మాస్టర్స్ డిగ్రీ ఇన్ డిజైనింగ్, ఎమ్మెస్సీ ఇన్ జ్యూలరీ డిజైనింగ్ కోర్సులు, పుత్తడి ఆభరణాల్లో అత్యాధునిక డిజైనింగ్‌పై లోతైన అవగాహన, తయారీ విధానాన్ని నేర్పిస్తాయి. ప్రస్తుతం డిమాండులో ఉన్న డిజైన్ల అధ్యయనం ద్వారా నూతన రకాలను సృష్టించే నైపుణ్యం, భవిష్యత్తులో మార్కెట్టును ఏలబోయే డిజైన్లపై అవగాహన ఏర్పరుస్తాయి.

స్పెషలైజ్డ్ కోర్సులు: వజ్రాల, రత్నాల ఎంపిక, గ్రేడింగ్, రకాలు, మార్కెట్ విలువలు, వాటిని అందంగా స్వర్ణాకృతుల్లో పొదగడం లాంటి ప్రత్యేక నైపుణ్యాలు నేర్పించే ప్రత్యేక కోర్సులు పరిశ్రమలో సులభంగా ప్రవేశించడానికి దోహదపడతాయి.

యూజీ కోర్సుల కాలవ్యవధి మూడు నాలుగేళ్లు ఉంటే పీజీ కోర్సులు రెండేళ్లు చదవాలి. ఏడాదిలో చేయగలిగే సర్టిఫికెట్ కోర్సులూ అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులన్నింటిలోనూ వాటి వ్యవధిని బట్టి సబ్జెక్టు పరిధి ఆధారపడి ఉంటుంది. జ్యూలరీ డిజైనింగ్ చరిత్ర, వర్తమాన మార్కెట్ ధోరణి, ట్రెండ్ల వరకు పరిణామాలు, డిజైనింగ్ ప్రాథమిక సూత్రాలు, ప్రధాన నమూనాలు, క్యాడ్ సాఫ్ట్‌వేర్‌లు. వీటితో పాటు బంగారం ఓ లోహం కాబట్టి మెటల్ వర్కింగ్ మెలకువలూ విద్యార్థులు నేర్చుకుంటారు.

ఇతర కోర్సుల మాదిరిగానే యూజీ కోర్సులకు ఇంటర్మీడియట్ (ప్లస్ టూ), పీజీ కోర్సులకు బ్యాచిలర్ డిగ్రీలను కనీస విద్యార్హతలుగా నిర్దేశించారు. డిప్లొమా/ సర్టిఫికెట్ కోర్సులకు టెన్త్/ ఇంటర్ ఉత్తీర్ణత గ్రేడ్లను పరిశీలిస్తారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న నిఫ్ట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ)లో జ్యూలరీ డిజైనింగ్ కోర్సులున్నాయి. తక్షణ ఉద్యోగం కల్పించే ఈ కోర్సులను అమెటీ యూనివర్శిటీ, జేడీ ఇన్‌స్టిట్యూట్, జెమ్ అండ్ జ్యూలరీ అకాడమీ లాంటి ప్రైవేటు సంస్థలు అందించడంతో పాటు ప్లేస్‌మెంట్ అవకాశమూ కల్పిస్తున్నాయి.

మెరుగైన మార్గమిదే

బంగారు నగల దుకాణంలో గుమాస్తాగా ప్రవేశించి దశాబ్దాల తరబడి అలాగే ఉండిపోవడం పాత పద్ధతి. ఈ బిజినెస్‌లో కళకళలాడే కెరియర్‌ను ఆశించే యువత వీలును బట్టి డిప్లొమా/ బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తి చేసి పేరున్న నేషనల్ బ్రాండ్ కంపెనీ డిజైనింగ్ విభాగంలో ట్రెయినీగా ప్రవేశించినా చాలు. ఆపై ట్రెయినీగా ఉండే ఏడాది కాలాన్ని సమర్థంగా వినియోగించుకోవాలి.

✦ నగల రూపకల్పన పూర్వాపరాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలి. కొత్త డిజైన్లు ఉప్పెనలా వస్తున్నాయి. ఇప్పుడిక నూతన డిజైన్లు ఎంతగా సృష్టిస్తుంటే అంతగా ఆ బ్రాండ్ విలువ పెరుగుతోంది. డిజైన్ల రకాలు, మార్కెట్లో కొనుగోళ్ల ధోరణులపై పట్టు తెచ్చుకోవాలి.

✦ ఆభరణాల తయారీ ప్రాథమిక నైపుణ్యాలు నేర్చుకోవడంతో పాటు స్వయంగా కొత్త డిజైన్ల సృజనకు పూనుకోవాలి. తొలుత సాధారణ డిజైన్లతో మొదలుపెట్టి ఆపై క్లిష్టమైన నమూనాలపై దృష్టి పెట్టాలి. ఇందుకోసం కంప్యూటర్ ఎయిడెడ్ డిజైనింగ్ సాఫ్ట్‌వేర్‌పై పట్టు సాధించాలి.

✦ డిజైన్లు చేసుకుంటూ నాలుగు గోడల మధ్యనే రోజంతా గడపడానికి పరిమితం కాకుండా షోరూమ్స్ అమ్మకాల ధోరణులు, వినియోగదారుల అభిరుచి, వారి ఆకాంక్షలను గుర్తించేందుకు ప్రయత్నించాలి. పని గంటలకు అదనంగా షోరూమ్స్ కస్టమర్లతో కొంత సమయం గడపడం ద్వారా వారి అభిరుచిలో వస్తున్న మార్పులను ముందే పసిగట్టవచ్చు.

✦ ప్రస్తుతం డిమాండున్న డిజైన్లను సృష్టించడం ఒక ఎత్తయితే, రాబోయే రోజుల్లో మార్కెట్‌ను ఊపేయగల నూతన డిజైన్లను రూపొందించడం ద్వారా పరిశ్రమలో త్వరగా గుర్తింపు తెచ్చుకోవచ్చు.



కెరియర్ పరంగా గోల్డెన్ చాన్సులు పొందగలిగే అవకాశాలెన్నో ఉన్న ఈ రంగంలో ప్రవేశించి, బంగారు భవిష్యత్తును స్వయంగా నిర్మించుకోవచ్చు.

- యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్ లీడ్ జనరేషన్

సంస్థ: ద డిజైనర్ అమ్మ
నైపుణ్యాలు: క్లయింట్ ఇంటరాక్షన్, కస్టమర్ అక్విజిషన్, ఇంగ్లిష్, మార్కెటింగ్ స్ట్రాటజీ
స్టైపెండ్: రూ. 5,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 15
☛ https://shorturl.at/lx3YD

కాలింగ్ అండ్ సోషల్ మీడియా మేనేజర్

సంస్థ: పైసోవాలా
నైపుణ్యాలు: మార్కెటింగ్, సేల్స్, స్టాక్ ట్రేడింగ్ స్టైపెండ్: రూ.10,000- 15,000
☛ https://shorturl.at/jrrFP

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: జీఆర్ఎన్ సాఫ్ట్‌వేర్స్ అండ్ ఇన్ఫో సొల్యూషన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఈ-మెయిల్, సోషల్‌మీడియా, ఇన్‌స్టా మార్కెటింగ్, సెర్చ్ఇంజిన్ మార్కెటింగ్, ఆప్టిమైజేషన్, స్టైపెండ్: రూ.5,000- 7,000
☛ https://shorturl.at/QZ285

కంటెంట్ అండ్ సోషల్‌మీడియా మార్కెటింగ్

సంస్థ: బ్రూనో వర్క్స్ .
నైపుణ్యాలు: కంటెంట్ మార్కెటింగ్, క్రిటికల్ థింకింగ్, మార్కెట్ అనాలిసిస్, మార్కెటింగ్ స్ట్రాటజీస్, పోస్టర్ డిజైన్, సోషల్‌మీడియా మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/4EfJ9

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్

సంస్థ: గ్రోయింగ్ అప్
నైపుణ్యాలు: బూట్‌స్ట్రాప్, సీఎస్ఎస్, జాంగో, ఫాస్ట్ఏపీఐ, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, పైతాన్, రియాక్ట్, రెస్ట్
స్టైపెండ్: రూ.1,000-3,000
☛ https://shorturl.at/n2NEV

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 22

భారత్ డైనమిక్స్‌లో ట్రెయినీ ఇంజినీర్లు

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), హైదరాబాద్... ఒప్పంద ప్రాతిపదికన 212 ట్రెయినీ ఇంజినీర్, ఆఫీసర్, డిప్లొమా అసిస్టెంట్ పోస్టులను భర్తీచేయనుంది. ఏడాది కాలానికి నియమించినప్పటికీ మరో మూడేళ్లు పొడిగించే అవకాశం ఉంటుంది.

ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, హెచ్ఆర్, ఫైనాన్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగాల్లో.. ట్రెయినీ ఇంజినీర్-100, ట్రెయినీ ఆఫీసర్-12, డిప్లొమా అసిస్టెంట్-90, అసిస్టెంట్-10 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు

◆ **ట్రెయినీ ఇంజినీర్:** ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ ఎలక్ట్రికల్/ కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్.
◆ **ట్రెయినీ ఆఫీసర్:** సీఎంఏ/ సీఏ/ ఎంబీఏ/ పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ (ఫైనాన్స్)/ హెచ్ఆర్/ పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఇండస్ట్రియల్ రిలేషన్స్ బ్రాంచ్‌తో ఎంబీఏ/ పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ (హెచ్ఆర్)/ ఎంబీఏ/ పీజీ డిప్లొమా/ పీజీ (మార్కెటింగ్/ సేల్స్ అండ్ మార్కెటింగ్). డిగ్రీని జనరల్ అభ్యర్థులు 55 శాతం, ప్రత్యేక కేటగిరీలకు చెందినవారు 50 శాతంతో పూర్తిచేయాలి.



◆ **ట్రెయినీ డిప్లొమా అసిస్టెంట్:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్/ మెకానికల్/ ప్రొడక్షన్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్లాంట్ మెయింటెనెన్స్ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిప్లొమా లేదా బీసీఏ/ బీఎస్సీ (కంప్యూటర్స్).
◆ **ట్రెయినీ అసిస్టెంట్:** కామర్స్/ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఫైనాన్స్), ఆఫీస్ అప్లికేషన్స్‌లో ఆరునెలల కంప్యూటర్ కోర్సు. లేదా ఇంటర్మీడియట్, సీఏ ఇంటర్/ ఐసీడబ్ల్యూఏ ఇంటర్/ సీఎస్ ఇంటర్/ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, సోషల్ వెల్ఫేర్, పర్సనల్ మేనేజ్‌మెంట్, హెచ్ఆర్‌తో డిగ్రీ. ఆఫీస్ అప్లికేషన్స్‌లో ఆరు నెలల కంప్యూటర్ కోర్సు.

వయసు: 28 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: అన్‌రిజర్వ్‌డ్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ (ఎన్‌సీఎల్)కు రూ.300. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

వేతనం

◆ ట్రెయినీ ఇంజినీర్/ ట్రెయినీ ఆఫీసర్‌కు.. మొదటి ఏడాది నెలకు రూ.29,500. రెండో ఏడాది రూ.32,500. మూడో ఏడాది రూ.35,500. నాలుగో ఏడాది రూ.38,500.
◆ ట్రెయినీ డిప్లొమా అసిస్టెంట్/ ట్రెయినీ అసిస్టెంట్‌లకు.. మొదటి ఏడాది నెలకు రూ.24,500. రెండో ఏడాది రూ.26,000. మూడో ఏడాది రూ.27,500. నాలుగో ఏడాది రూ.29,000.

ఎంపిక: రాత పరీక్ష (కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్ - సీబీఓటీ), ఇంటర్వ్యూతో ఎంపిక చేస్తారు.
◆ సీబీఓటీకి 120 మార్కులు. వ్యవధి 120 నిమిషాలు.
◆ సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 100, జనరల్ ఆప్టిట్యూడ్ (క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్) 20 ప్రశ్నలు ఇస్తారు.
◆ రాత పరీక్షకు 85 శాతం, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఉంటుంది.
◆ జనరల్ అభ్యర్థులు 50 శాతం, ఓబీసీ (ఎన్‌సీఎల్)/ ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 40 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. 1:7 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపికచేస్తారు.
◆ 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను దరఖాస్తు సమయంలో సమర్పించాలి.
◆ తుది ఫలితాలను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.
◆ ఎంపికైనవారిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర యూనిట్లలోనూ నియమించవచ్చు.
◆ నాలుగు సంవత్సరాల ఒప్పందం పూర్తయిన తర్వాత.. ఉద్యోగి పనితీరు, సంస్థ అవసరాలను బట్టి కాలపరిమితిని మరో నాలుగేళ్లు పొడిగించే అవకాశం కూడా ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.08.2025
వెబ్‌సైట్: https://bdl-india.in/

నిమ్స్‌లో టెక్నీషియన్లు

హైదరాబాద్‌లోని నిమ్స్.. ఒప్పంద ప్రాతిపదికన 41 టెక్నీషియన్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● అనస్తీషియాలజీ- 07 ● బయోకెమిస్ట్రీ- 05
● మైక్రోబయాలజీ- 04 ● కార్డియాలజీ- 06
● నెఫ్రాలజీ- 04 ● పల్మనాలజీ- 05
● పాథాలజీ- 02 ● ఈఎండీ- 01
● వాస్కులర్ సర్జరీ- 01 ● బీఎంఈ- 01
● న్యూక్లియర్ మెడిసిన్- 03
● న్యూరోసర్జరీ(ఐఓఎన్ఎం)- 01
● మెడికల్ జెనెటిక్స్- 01

అర్హత: పోస్టును అనుసరించి టెక్నాలజీ కోర్సుల్లో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
వయసు: 35 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రూ.32,500.
ఎంపిక: రాత పరీక్ష/ ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు ఫీజు: రూ.1,000.
దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 09.08.2025.
చిరునామా: ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్, నిమ్స్, పంజాగుట్ట, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://nims.edu.in/NIMSWP/index

ఐసీఎంఆర్-ఎన్ఐఈలో కొలువులు

చెన్నైలోని ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ (ఎన్ఐఈ) 10 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● అసిస్టెంట్: 01 ● యూడీసీ: 02
● ఎల్‌డీసీ: 07

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, ఇంటర్‌తో పాటు పని అనుభవం.
వయసు: అసిస్టెంట్‌కు 30 ఏళ్లు, యూడీసీ, ఎల్‌డీసీలకు 27 ఏళ్లు మించకూడదు.
వేతన శ్రేణి: నెలకు అసిస్టెంట్‌కు రూ.35,400 - రూ.1,12,400, యూడీసీకి రూ.19,900 - రూ.81,100, ఎల్‌డీసీకి రూ.19,900 - రూ.63,200.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 14.08.2025
వెబ్‌సైట్: https://nie.gov.in/pages/careers

ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో..

ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వివిధ విభాగాల్లో 32 సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఎలక్ట్రానిక్స్, అకౌంట్స్, అఫిషియల్ లాంగ్వేజ్.
అర్హత: పోస్టును అనుసరించి డిప్లొమా, డిగ్రీ, పీజీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, పని అనుభవం. **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు.
వేతన శ్రేణి: నెలకు రూ.36,000 - రూ.1,10,000.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: 05.08.2025
దరఖాస్తుకు చివరి తేదీ: 26.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.1000. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎంకు ఫీజు లేదు.
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్షతో
వెబ్‌సైట్: https://www.aai.aero/en/

వాక్-ఇన్స్

కొంకణ్ రైల్వేలో 28 కీ మ్యాన్ పోస్టులు

కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్, నవీ ముంబయి ఒప్పంద ప్రాతిపదికన 28 కీ మ్యాన్ (టీఎస్ఎం) పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది.
అర్హత: పదో తరగతి.
వయసు: 01.07.2025 నాటికి 28 ఏళ్లు ఉండాలి.
వేతనం: నెలకు రూ.37,500. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 11.08.2025
వేదిక: యూఎస్‌బీఆర్ఎల్ ప్రాజెక్ట్ ఆఫీస్, కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్, జ్యోతిపురం రోడ్, త్రినాద్, పోస్ట్ గ్రామోర్ రాసి, జమ్మూ అండ్ కశ్మీర్(యూటీ)-182311.
వెబ్‌సైట్: https://konkanrailway.com/en/current_notification

సీఈసీఆర్ఐలో ప్రాజెక్ట్ సిబ్బంది

తమిళనాడు రాష్ట్రం కరైకుడిలోని సీఎస్ఐఆర్- సెంట్రల్ ఎలక్ట్రో కెమికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.. తాత్కాలిక ప్రాతిపదికన 14 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.

● ప్రాజెక్ట్ అసోసియేట్-II: 01
● ప్రాజెక్ట్ అసిస్టెంట్-II: 01
● ప్రాజెక్ట్ అసోసియేట్-I: 12

అర్హత: పోస్టును అనుసరించి బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ, ఎమ్మెస్సీతో పాటు ఉద్యోగానుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్-IIకు రూ.28,000; ప్రాజెక్ట్ అసోసియేట్-Iకు రూ.25,000- రూ.31,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.20,000.
వయసు: 35 ఏళ్లు మించకూడదు. **ఇంటర్వ్యూ తేదీ:** 11.08.2025.
వేదిక: సీఈసీఆర్ఐ- సీఈసీఆర్ఐ, కరైకుడి.
పని ప్రదేశం: సీఎస్ఐఆర్- సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, కరైకుడి.
వెబ్‌సైట్: https://www.cecri.res.in/


చదువు

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ - 501 512
edc@eenadu.in


చిత్రాల్లోని ప్రశ్నార్థకం.. ఛేదిస్తేనే సమాధానం!



పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగం నుంచి సారూప్యత అనే అంశం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. దీనిలో అక్షర, సంఖ్యా, చిత్ర సారూప్యత అనే రకాలు ఉంటాయి. ఇందులో ప్రశ్నా విభాగంలో కొన్ని, సమాధాన విభాగంలో కొన్ని చిత్రాలను ఇస్తారు. ప్రశ్నార్థకం స్థానంలో వచ్చే చిత్రాన్ని సమాధాన చిత్రాల్లో నుంచి ఎంచుకోవాల్సి ఉంటుంది. విద్యార్థుల ఆలోచనా శక్తిని అంచనా వేయడానికి ఈ రకమైన ప్రశ్నలు సంధిస్తుంటారు. ఎంత ఎక్కువగా సాధన చేస్తే అంత సులువుగా జవాబులు కనిపెట్టొచ్చు.


చిత్ర సారూప్యత

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

1.



సాధన: చిత్రం II ని ఏర్పరచడానికి చిత్రం I పార్శ్వంగా విలోమమై, బాణం శీర్షం ఒక చాపంలా మారుతుంది. ఇదే ప్రక్రియ చిత్రం III, IV లోనూ జరుగుతుంది.

సమాధానం: 1

2.



సాధన: చిత్రం I లోని ప్రతి బాణం 180° తిరిగి, ప్రతి బాణపు శీర్షం ఒక చాపంలా మారినప్పుడు చిత్రం II ఏర్పడుతుంది. కాబట్టి సమాధాన చిత్రంలోని 3 సరైంది.

సమాధానం: 3

3.



సాధన: చిత్రం I అనేది నిలువు సౌష్ఠవ రేఖ వెంట రెండు సమాన భాగాలుగా విభజన చెంది RHS భాగం అదృశ్యమవుతుంది. మిగిలిన భాగం చిత్రం II ని ఏర్పరుస్తుంది.

సమాధానం: 3

4.



సాధన: చిత్రం II, IV ని ఏర్పరచడానికి చిత్రం I, III 90°ల అపసవ్య దిశలో తిరుగుతాయి. కాబట్టి సమాధాన చిత్రంలోని 5 సరైంది.

సమాధానం: 5

5.


సాధన: చిత్రం I పరిమాణం తగ్గి, నిలువుగా విలోమమై చిత్రం IIని ఏర్పరుస్తుంది. ఇదే విధంగా చిత్రం III, IV లోనూ జరుగుతుంది. దీనికి సంబంధించిన చిత్రరూపాలు 1లో ఉన్నాయి.

సమాధానం: 1


6.


సాధన: I, III లో బాహ్యంగా ఉన్న చిత్రం నిలువుగా విలోమం చెందుతుంది. అంతర చిత్రంలో ఎలాంటి మార్పు ఉండటం లేదు. ఈ రకమైన చిత్రం 2లో ఉంది.

సమాధానం: 2




రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

7.



సాధన: చిత్రం I అనేది నిలువు సౌష్ఠవ రేఖ వెంట రెండు భాగాలుగా విభజితమై, RHS భాగం పరిమాణం తగ్గుతుంది అంతేకాకుండా పార్శ్వంగా విలోమం చెందుతుంది. దీంతో చిత్రం II ఏర్పడుతుంది. ఇదేవిధంగా III, IV లో జరుగుతుంది. దీనికి సరైన చిత్రం 3లో ఉంది.

సమాధానం: 3

8.


సాధన: చిత్రం I క్షితిజ సమాంతర సౌష్ఠవ రేఖ వెంట రెండు భాగాలుగా విభజితమవుతుంది. రెండు భాగాల్లో ప్రతి ఒక్కటి నిలువుగా విలోమం చెంది చిత్రం IIని ఏర్పరుస్తుంది. ఈ ప్రక్రియే III, IV లో జరుగుతుంది. దీనికి సంబంధించిన చిత్రం 2లో ఉంది.

సమాధానం: 2

9.


సాధన: చిత్రం Iలోని నాలుగు సగం షేడెడ్ చతురస్రాల్లో ప్రతి ఒక్కటి చిత్రం IIను ఏర్పరిచేందుకు 90° అపసవ్య దిశలో తిరుగుతాయి. ఈ ప్రక్రియే చిత్రం III, IVలో జరుగుతుంది.

సమాధానం: 3

726 Word of the Day

Gamut

Telugu meaning: పరిధి, స్థాయి

English meaning: The word gamut (గ్యామట్) is a noun that describes the complete range or scope of something.

Synonyms: Range, Spectrum

Antonyms: Limitation, Restriction

Usage: **1.** The movie ran the gamut of emotions, from laughter to tears.

2. Her performance covered the entire gamut of musical styles, from classical to jazz.

కరెంట్ అఫైర్స్



ఫిడే ప్రపంచ మహిళల చెస్ ప్రపంచకప్ విజేతగా మహారాష్ట్రకు చెందిన దివ్య దేశ్‌ముఖ్ నిలిచారు. జులై 28న జరిగిన టైబ్రేకర్‌లో ఈమె కోనేరు హంపిపై 1.5-0.5తో పైచేయి సాధించారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలు కూడా దివ్యనే కావడం విశేషం. జులై 26, 27న జరిగిన రెండు క్లాసికల్ గేమ్స్ డ్రాగా ముగియడంతో ఆట టైబ్రేక్‌కు వెళ్లింది. తొలి ర్యాపిడ్ టైబ్రేకర్ డ్రాగా ముగియగా, రెండో టైబ్రేకర్‌లో ఆధిపత్యం ప్రదర్శించి విజేతగా నిలిచారు. ఈ విజయంతోనే గ్రాండ్‌మాస్టర్ హోదాను సైతం సొంతం చేసుకున్నారు.



అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ సంస్థ నిర్వహించిన గ్లోబల్ లీడర్ సర్వేలో అత్యంత విశ్వసనీయత ఉన్న నేతగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిలిచారు. జులై 4-10 మధ్య నిర్వహించిన ఈ సర్వేలో మోదీకి 75% మంది మద్దతు లభించింది. 59%తో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్, 57%తో అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలి, 56%తో కెనడా ప్రధాని మార్క్ కార్నీ వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు.

కేంద్రం తీసుకున్న అప్పుల కారణంగా దేశ ప్రజల మీద ఈ ఏడాది మార్చి 31 నాటికి తలసరి రూ. 1,32,059 మేర రుణభారం ఉన్నట్లు తేలిందని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి జులై 28న పేర్కొన్నారు. వడ్డీల కింద 2022-23లో 9.29 లక్షల కోట్లు, 2023-24లో 10.64 లక్షల కోట్లు, 2024-25లో 11.18 లక్షల కోట్లు చెల్లించినట్లు లోక్‌సభలో తెలిపారు.

ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లో భారత స్టీపుల్‌ఛేజర్ అంకిత దయాని రజతం గెలిచింది. జులై 27న మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌ను ఆమె తన అత్యుత్తమ టైమింగ్ 9 నిమిషాల 31.99 సెకన్లలో ఛేదించి రెండో స్థానంలో నిలిచి పతకం సాధించారు. మహిళల 20 కి.మీ. టీమ్ రేస్‌వాక్‌లో మునిత ప్రజాపతి, మాన్సి నేగి, సెజల్ సింగ్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతకం గెలిచింది.

అంతరిక్ష రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థ స్టార్‌డోర్ హైడ్రోజన్ - ఆక్సిజన్ ప్రొపల్షన్ ఇంజిన్ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. బెంగళూరులోని ఐఐఎస్‌సీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్) కేంద్రంగా ఈ పరీక్ష చేపట్టారు.


మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

జులై 30

చరిత్రలో ఈనాడు

ఆర్థిక ప్రయోజనాల కోసం మనుషులను అంగడి సరకుగా మార్చి క్రయవిక్రయాలు జరపడాన్ని మానవ అక్రమ రవాణా (Human Trafficking) అంటారు. ఇది అత్యంత దుర్మార్గమైన మానవ హక్కుల ఉల్లంఘన. ప్రధానంగా లైంగిక దోపిడీ, వెట్టి చాకిరీ, బానిసత్వం రూపాల్లో ఉంటుంది. ఇది మానవత్వంపై జరిగే క్రూరమైన దాడి. ఉపాధి అవకాశాలు లేకపోవడం, పేదరికం, అవినీతి, ప్రాంతాల మధ్య ఆర్థిక అసమతౌల్యాలు లాంటివి అక్రమ రవాణాకు ప్రధాన కారణాలు. దీనికి వ్యతిరేకంగా ఏటా జులై 30న 'ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం'గా (World Day Against Trafficking In Persons) నిర్వహిస్తారు. మానవ అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించడంతోపాటు దానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆవశ్యకత గురించి ప్రజలను చైతన్యపరచడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.



◆ ఐరాస ప్రకారం, ప్రపంచంలోని అక్రమ వ్యాపారాల్లో హ్యూమన్ ట్రాఫికింగ్ మూడో స్థానంలో ఉంది. యూఎన్‌ఓడీసీ నివేదిక గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ట్రాఫికింగ్ ఇన్ పర్సన్స్ 2024 ప్రకారం, 2020-23లో ప్రపంచంలో 2 లక్షల మందికిపైగా దీని బారినపడ్డారు. ◆ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ప్రకారం, 2022లో దేశవ్యాప్తంగా 2250 అక్రమ రవాణా కేసులు నమోదవగా, 391 కేసులతో తెలంగాణ దేశంలో తొలిస్థానంలో నిలిచింది. మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 మానవ అక్రమ రవాణాను నిషేధించింది. అనైతిక వ్యాపార నిరోధక చట్టం, 1956 భారత్‌లో అక్రమ రవాణాను నిరోధిస్తుంది.

చారిత్రక నేపథ్యం


అంతర్జాతీయంగా మానవ అక్రమ రవాణాను అడ్డుకునే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2010, జులై 30న 'యాన్ యాక్షన్ ప్లాన్'ను రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి, స్థిరమైన చర్యల ద్వారా దీన్ని నివారించాలని ప్రణాళికలో పేర్కొంది. ఈ యాక్షన్ ప్లాన్ ఆమోదానికి గుర్తుగా ఏటా జులై 30న 'ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం'గా జరుపుకోవాలని 2013లో యూఎన్‌ఓ తీర్మానించింది.

☛ 2025 నినాదం: "Human trafficking is Organized Crime - End the Exploitation".

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

భారతీయ సామాజిక నిర్మితి

సాధారణ పరిభాషలో సమాజాన్ని అధ్యయనం చేయడాన్ని సమాజశాస్త్రంగా పరిగణిస్తారు. ఇది అనేకమంది శాస్త్రవేత్తల కృషి వల్ల వృద్ధి చెంది, వివిధ సామాజిక ప్రక్రియలను, మార్పులను అధ్యయనం చేసేందుకు దోహదపడింది. సమాజశాస్త్రాన్ని ఒకప్పుడు సామాజిక తత్వశాస్త్రంగా నిర్వచించారు. తర్వాత దీన్నే చరిత్ర తత్త్వశాస్త్రంగా, సామాజిక భౌతికశాస్త్రంగా పిలుస్తున్నారు.



పరిచయం

19వ శతాబ్దం నుంచి సమాజశాస్త్రం ఒక స్వయం ప్రతిపత్తి గల శాస్త్రంగా ఆవిర్భవించింది.

■ జాన్ స్టువర్ట్ మిల్ సోషియాలజీకి బదులుగా Ethnology అనే పదాన్ని ఉపయోగించారు. చాలామంది శాస్త్రవేత్తలు దీన్ని Sociologyగా వాడటంతో ఈ పదమే స్థిరపడిపోయింది.

■ 1838లో Sociology అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించారు.

■ Society అనే ఆంగ్ల పదం Socious అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. దీని అర్థం సామాజిక సహచరత్వం లేదా friendship.

సమాజాల వర్గీకరణ

❖ ఆయా సమాజాల లక్షణాల ఆధారంగా మానవ సమాజాన్ని శాస్త్రవేత్తలు వివిధ రకాలుగా వివరించారు.

❖ జర్మనీకి చెందిన ఫెర్డినాండ్ టోనీస్ అనే శాస్త్రవేత్త సమాజాన్ని, అందులో ఉండే మనుషుల మధ్య సంబంధాల ఆధారంగా రెండు రకాలుగా వర్గీకరించారు.

1. జెమిన్ షాఫ్ట్ 2. జెషల్ షాఫ్ట్

సమాజం నిర్మితి, ప్రకార్యాలు, సమాజం - స్వభావం, నిర్వచనాలు; వివిధ సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయాలు; ముఖ్య లక్షణాలు; శాస్త్రవేత్తలు సమాజాన్ని వర్గీకరించిన తీరుతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Jobs in Border Security Force

Border Security Force (BSF) is inviting applications for the Constable/Tradesman posts in various sectors. No.of posts is 3588. Physical standards are required. Application fee is Rs. 150. Last date for receipt of online application is 23rd August 2025.

Manager Posts in HURL

Hindustan Urvarak Rasayan Limited (HURL) is inviting applications for the vacant posts of Manager in various departments. No.of posts is 40. Last date for online application is 12th August 2025.

Posts in the Intelligence Bureau

The Intelligence Bureau (IB), Ministry of Home Affairs, Government of India, is inviting applications for the recruitment of Assistant Central Intelligence Officer Grade-II/Executive (ACIO-II/Exe) posts on direct recruitment basis. No. of Posts is 3717. Application Fee is Rs.100. Last Date for Fee Payment is 12th August 2025.

Did You Apply..?

Today (July 30) is the last date for the following jobs/ Apprentice posts

☛ 41 Manager Vacancies at Shyam Prasad Mukherjee Port. ***Eligibility:*** B.Tech, Degree.

☛ 16 MTS posts in BECIL. ***Eligibility:*** Tenth, Inter, Degree.

☛ 31 Manpower Vacancies in BECIL. ***Eligibility:*** 10th, Inter, Degree, B.Tech/BE.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Synonyms

Directions (Qs. 1 - 10): *In each of the questions given below, a sentence is given with one word printed in bold letters, along with five options to choose from. Choose the appropriate synonym from those options that suits the word given in bold letters.*

1. The manager's **mettle** was truly tested during the financial crisis when quick, decisive actions were required.
A) Courage B) Weakness
C) Laziness D) Panic
E) Knowledge

2. Her **contemptuous** attitude towards the safety protocols alarmed her coworkers and supervisors.
A) Respectful B) Curious
C) Confused D) Nervous
E) Dismissive

3. The CEO's **pragmatic** approach to expansion helped the company grow steadily without unnecessary risks.
A) Idealistic B) Impractical
C) Random D) Realistic
E) Hasty

4. She remained **unscathed** even after being surrounded by controversies for weeks.
A) Injured B) Exhausted
C) Detached D) Depressed
E) Unharmed

5. The report provided a **comprehensive** analysis of the bank's digital security infrastructure.
A) Shallow B) Partial
C) Incomplete D) Exhaustive
E) Vague

6. His **docile** nature made him a favourite among the senior staff, who found him easy to train and work with.
A) Obedient B) Aggressive
C) Unruly D) Demanding
E) Proud

7. The team's **meticulous** planning ensured there were no delays in the product launch.
A) Careless B) Disorganized
C) Detailed D) Informal
E) Abrupt

8. He gave a rather **succinct** summary of the quarterly results, highlighting only the key figures.
A) Wordy B) Precise
C) Lengthy D) Vague
E) Repetitive

9. Her **tenacity** in completing the certification course despite multiple rejections is admirable.
A) Laziness B) Persistence
C) Hesitation D) Doubt
E) Indifference

10. The bank's policies are designed to prevent **fraudulent** transactions by employing advanced AI systems.
A) Honest B) Legal
C) Deceptive D) Transparent
E) Secure

Directions (Qs. 11 - 20): *In each of the questions given below, a word is given in bold letters and five options are presented. Choose the appropriate synonym from those options that suits the word given in bold letters.*

11. Rebuke
A) Praise B) Encourage
C) Advise D) Ignore E) Scold

12. Sagacious
A) Foolish B) Friendly
C) Arrogant D) Quick E) Wise

13. Ubiquitous
A) Rare B) Outdated
C) Expensive D) Everywhere
E) Invisible

14. Obstinate
A) Flexible B) Friendly
C) Open-minded D) Stubborn
E) Curious

15. Reticent
A) Talkative B) Reserved
C) Arrogant D) Noisy
E) Bold

16. Enigmatic
A) Clear B) Mysterious
C) Boring D) Honest
E) Simple

17. Voracious
A) Hungry B) Sleepy
C) Lazy D) Tired
E) Forgetful

18. Benevolent
A) Kind B) Cruel
C) Rude D) Lazy
E) Selfish

19. Callous
A) Caring B) Sensitive
C) Unfeeling D) Warm
E) Kind

20. Fluctuate
A) Stabilize B) Decrease
C) Vary D) Stop
E) Multiply

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert



దరఖాస్తు చేశారా?

☛ ఐఏఎఫ్ అగ్నివీర్ వాయు ఉద్యోగాలు (చివరి తేదీ: 31.07.2025)

☛ రామన్ కాంత్ ముంజాల్ స్కాలర్‌షిప్ (చివరి తేదీ: 31.07.2025)

కరెంట్ అఫైర్స్



■ న్యూదిల్లీలోని భారత్ మండపంలో నీతి ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశాన్ని ఇటీవల ఏ థీమ్‌తో నిర్వహించారు?
జ: వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్@2047

■ దేశంలోనే తొలిసారిగా ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం విస్టాడోమ్ కోచ్‌తో కూడిన భారతదేశపు మొట్టమొదటి జంగిల్ సఫారీ రైలును ప్రారంభించింది? (దుద్వా టైగర్ రిజర్వ్, కతర్నియాఘాట్ వన్యప్రాణుల అభయారణ్యాలను కలుపుతూ ఈ రైలు ప్రయాణం సాగుతుంది.)
జ: ఉత్తర్‌ప్రదేశ్

మాదిరి ప్రశ్నలు


■ ఏ రాష్ట్రంలోని నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చ్ (ఎన్‌సీపీఓఆర్) లో ఇటీవల సాగర్ భవన్, పోలార్ భవన్ అనే రెండు ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలను ప్రారంభించారు? (ధ్రువాలు, సముద్రాల అధ్యయనాలకు ఇవి ఉపకరిస్తాయి.)
జ: గోవా

మరింత సమాచారం

■ కాలా-అజార్ (విసెరల్ లీష్మానియాసిస్) వ్యాధిని నిర్మూలించడానికి ఇటీవల ఏ ఆరు తూర్పు ఆఫ్రికా దేశాలు ఓ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి?
జ: చాద్, జిబౌటి, ఇథియోపియా, సోమాలియా, దక్షిణ సూడాన్, సూడాన్

లెక్కలకు మౌలిక ఆధారాలు!

స్నేహితులు పదిమంది వస్తారనుకొని వంటకు ఏర్పాట్లు చేశారు. కానీ ఇరవైమంది వచ్చారు. మరో సందర్భంలో అయిదుగురే వచ్చారు. అప్పుడు పదార్థాలను రెట్టింపు లేదా సగం చేయాలి. సంఖ్యలపై అవగాహన ఉంటే ఆ పని తేలికగా జరిగిపోతుంది. అంకగణితంలోని 'సంఖ్యలు-కారణాంకాలు' అందుకు సాయపడతాయి. గణితంలో మౌలికమైన, ఇతర భావనలకు పునాదుల వంటి వీటి గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకుంటే సంఖ్యల స్వభావం, వాటిని విభజించడం, నిర్మించడం చేసే ప్రాథమిక భాగాలపై అవగాహన పెరుగుతుంది. ఇందుకోసం సంఖ్యల్లో రకాలు, భాజనీయతా సూత్రాలు, కారణాంకాల సంఖ్యను కనుక్కోవడం, ప్రధాన కారణాంకాలుగా విడగొట్టడం మొదలైన వాటిని అధ్యయనం చేయాలి.



జనరల్ స్టడీస్
అరిథ్‌మెటిక్

సంఖ్యలు - కారణాంకాలు



కారణాంకం (Factors): ఒక సంఖ్య 'N' ను నిశ్శేషంగా భాగించే సంఖ్యలను కారణాంకాలు అంటారు.
ఉదా: 28 కి కారణాంకాలు అంటే 28 ని నిశ్శేషంగా భాగించే సంఖ్యలని అర్థం.



28 కి కారణాంకాలు – 1, 2, 4, 7, 14, 28

★ N అనే సంఖ్యకు కారణాంకాల సంఖ్య కనుక్కోవాలంటే N ని ప్రధాన కారణాంకాల లబ్ధంగా రాయాలి.
ఉదా: $N = 2^a \times 3^b \times 5^c \times 7^d$ .....

వివిధ కారణాంకాల సంఖ్య, కారణాంకాల మొత్తం కనుక్కోవడానికి గమనించాల్సిన అంశాలు-

★ $N = 2^a \times 3^b \times 5^c \times 7^d$ .....

★ కారణాంకాల సంఖ్య (Number of factors) = (a + 1) (b + 1) (c + 1) (d + 1) ....

★ బేసి కారణాంకాల సంఖ్య (Number of odd factors) = (b + 1) (c + 1) (d + 1)

★ సరి కారణాంకాల సంఖ్య (Number of even factors) = a (b + 1) (c + 1) (d + 1)



★ ప్రధాన కారణాంకాల సంఖ్య (Prime factors) = a + b + c + d

★ విభిన్న ప్రధాన కారణాంకాలు (Distinct prime factors) = బేస్‌లో ఉండే సంఖ్యలు 2, 3, 5, 7, ...

నోట్: మొత్తం కారణాంకాల సంఖ్య = 1 + విభిన్న ప్రధాన కారణాంకాల సంఖ్య + సంయుక్త కారణాంకాల సంఖ్య

★ కారణాంకాల మొత్తం = $\frac{2^{a+1}-1}{1} \times \frac{3^{b+1}-1}{2} \times \frac{5^{c+1}-1}{4} \times .....$ (లేదా)

$= (2^0 + 2^1 + ... 2^a) \times (3^0 + 3^1 + 3^2 .... + 3^b) \times (5^0 + 5^1 + 5^2 + ... + 5^c)$

★ బేసి కారణాంకాల మొత్తం = $(3^0 + 3^1 + ... + 3^b) \times (5^0 + 5^1 + 5^2 + ... + 5^c)$

★ సరి కారణాంకాల మొత్తం = $(2^1 + 2^2 + 2^3 + ... + 2^a) \times (3^0 + 3^1 + 3^2 + ... + 3^b) \times (5^0 + 5^1 + 5^2 + ... + 5^c)$....

మాదిరి ప్రశ్నలు

1. 10500 యొక్క
ఎ) మొత్తం కారణాంకాల సంఖ్య
బి) బేసి కారణాంకాల సంఖ్య
సి) సరి కారణాంకాల సంఖ్యలను కనుక్కోండి.
1) ఎ-48, బి-32, సి-16
2) ఎ-48, బి-30, సి-18
3) ఎ-48, బి-16, సి-32
4) ఎ-40, బి-32, సి-20

వివరణ: $10500 = 2^2 \times 3^1 \times 5^3 \times 7^1$

అయితే

2	10500
2	5250
5	2625
5	525
5	105
3	21
	7



ఎ) కారణాంకాల సంఖ్య = (a + 1) (b + 1) (c + 1) (d + 1)
= (2 + 1) (1 + 1) (3 + 1) (1 + 1)
= 3 × 2 × 4 × 2 = 48
బి) బేసి కారణాంకాలు = (b + 1)(c + 1)(d + 1)
= 2 × 4 × 2 = 16
సి) సరి కారణాంకాలు = a(b + 1)(c + 1)(d + 1)
= 2 × 2 × 4 × 2 = 32
జ: 3

2. 7200 యొక్క ప్రధాన కారణాంకాల సంఖ్య ఎంత?
1) 9 2) 12 3) 16 4) 18

వివరణ: $7200 = 2^5 \times 3^2 \times 5^2$
ప్రధాన కారణాంకాల సంఖ్య = a + b + c + d + ...
= 5 + 2 + 2 = 9
జ: 1

3. 120 యొక్క సంయుక్త కారణాంకాల సంఖ్య?
1) 10 2) 11 3) 12 4) 13

వివరణ: $120 = 2^3 \times 3^1 \times 5^1$
సంయుక్త కారణాంకాలు = మొత్తం కారణాంకాల సంఖ్య – 1 – విభిన్న ప్రధాన కారణాంకాల సంఖ్య
= (4 × 2 × 2) – 1 – 3
= 16 – 4 = 12
జ: 3

4. $N = 4^{11} + 4^{12} + 4^{13} + 4^{14}$ అనే సంఖ్యకు మొత్తం కారణాంకాల సంఖ్య?
1) 80 2) 85 3) 90 4) 92

వివరణ: $N = 4^{11} + 4^{12} + 4^{13} + 4^{14}$
$= 4^{11}(1 + 4 + 4^2 + 4^3)$
$= 2^{22} \times 85 = 2^{22} \times 5^1 \times 17^1$
∴ మొత్తం కారణాంకాల సంఖ్య = (a + 1) (b + 1) (c + 1)
= 23 × 2 × 2 = 92
జ: 4

5. 2160 యొక్క కారణాంకాల మొత్తం?
1) 7480 2) 7440 3) 6480 4) 6440

వివరణ: $2160 = 2^4 \times 3^3 \times 5^1$



2^4	3^3	5^1
↓	↓	↓
16	27	5
8	9	1
4	3	
2	1	
1		
31	× 40	× 6 = 7440

(లేదా)

కారణాంకాల మొత్తం
$= \frac{2^{a+1}-1}{1} \times \frac{3^{b+1}-1}{2} \times \frac{5^{c+1}-1}{4}$
$= \frac{2^5-1}{1} \times \frac{3^4-1}{2} \times \frac{5^2-1}{4}$
$= 31 \times 40 \times 6 = 7440$
జ: 2

నోట్: i) N యొక్క కారణాంకాల విలోమాల మొత్తం = $\frac{\text{N యొక్క కారణాంకాల మొత్తం}}{N}$

ii) N యొక్క కారణాంకాల లబ్ధం = $N^{n/2}$
[∵ n = N యొక్క కారణాంకాల సంఖ్య]

6. 360 యొక్క కారణాంకాల విలోమాల మొత్తం ఎంత?
1) 2.65 2) 3.48 3) 3.25 4) 4.48

వివరణ: $360 = 2^3 \times 3^2 \times 5^1$
కారణాంకాల మొత్తం
$= \frac{2^4-1}{1} \times \frac{3^3-1}{2} \times \frac{5^2-1}{4}$
$= 15 \times 13 \times 6 = 1170$
N కి కారణాంకాల విలోమాల మొత్తం
$= \frac{\text{N యొక్క కారణాంకాల మొత్తం}}{N}$
$= \frac{1170}{360} = \frac{13}{4} = 3.25$
జ: 3

7. 576 యొక్క కారణాంకాల లబ్ధం ఎంత?
1) 24^{21} 2) 24^{20} 3) 24^{19} 4) 24^{18}

వివరణ: $576 = 2^6 \times 3^2$
కారణాంకాల సంఖ్య n = (a + 1) (b + 1)
= 7 × 3 = 21
N యొక్క కారణాంకాల లబ్ధం = $N^{n/2}$
$= (576)^{\frac{21}{2}} = (24)^{2 \times \frac{21}{2}} = 24^{21}$
జ: 1

8. $2^9 \times 3^7 \times 5^4 \times 7^3$ యొక్క ఘన కారణాంకాల సంఖ్య?
1) 24 2) 36 3) 40 4) 48

వివరణ: $N = 2^9 \times 3^7 \times 5^4 \times 7^3$
ఘన కారణాంకాలు
$= \left(\frac{a}{3}+1\right)\left(\frac{b}{3}+1\right)\left(\frac{c}{3}+1\right)....$
$= \left(\frac{9}{3}+1\right)\left(\frac{7}{3}+1\right)\left(\frac{4}{3}+1\right)\left(\frac{3}{3}+1\right)$
= 4 × 3 × 2 × 2
(∵ ఇంటీజర్ పార్ట్ మాత్రమే తీసుకోవాలి)
= 48
జ: 4



ప్రాక్టీస్ బిట్లు

1. 4200 యొక్క మొత్తం కారణాంకాల సంఖ్య?
1) 36 2) 40 3) 48 4) 56

2. $N = 12^6 \times 3^8 \times 5^3$ అనే సంఖ్యకు సంబంధించి కిందివాటిలో సత్య వాక్యం?
ఎ) N కు ఉన్న బేసి కారణాంకాల సంఖ్య = 60
బి) N కు ఉన్న సరి కారణాంకాల సంఖ్య = 720
1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు

3. $2^8 \times 3^5 \times 10^4$ యొక్క కారణాంకాల్లో ఎన్ని 1 కంటే ఎక్కువగా ఉన్న పరిపూర్ణ వర్గాలున్నాయి?
1) 44 2) 42 3) 40 4) 38

4. మూడు కారణాంకాలు మాత్రమే ఉన్న 3 అంకెల సంఖ్యలు ఎన్ని?
1) 5 2) 6 3) 7 4) 8

5. $N = 73^3 - 40^3 - 33^3$ అనే సంఖ్యకు ఉన్న మొత్తం కారణాంకాల సంఖ్య?
1) 80 2) 85
3) 96 4) 106

జవాబులు: 1-3, 2-3, 3-1, 4-3, 5-3.



రచయిత: పిరాది నరేష్

ద్రవ్యం కొనుగోలు శక్తిని కోల్పోతే..!

వస్తువులు, సేవల ధరలు నిరంతరం పెరగడమే ద్రవ్యోల్బణం. ఇది ఒక స్థాయికి మించి ఎక్కువైతే డబ్బు తన విలువను కోల్పోతుంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. అన్నిరకాల ఆర్థిక కార్యకలాపాలను ప్రభావితం చేసి మొత్తం ఆర్థిక వ్యవస్థనే అస్థిర పరుస్తుంది. ఆ పరిస్థితిని బ్యాంకింగ్ కార్యకలాపాల ద్వారా నియంత్రించవచ్చు. ఎకానమీలో అతి ముఖ్యమైన ఈ ద్రవ్యోల్బణానికి కారణాలు, కొలిచే ప్రమాణాలు, దాని పర్యవసానాల గురించి పోటీ పరీక్షార్థులు స్థూలంగా తెలుసుకోవాలి. దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు రిజర్వ్ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం, ఇతర వ్యవస్థలు చేపట్టే చర్యలపై అవగాహన కలిగి ఉండాలి.



జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

ద్రవ్యోల్బణం - బ్యాంకింగ్

1. దేశంలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) కింది ఏ ప్రమాణాన్ని తీసుకుంటుంది?
1) క్రెడిట్ రేషనింగ్
2) ప్రగతిశీల పన్నుల వ్యవస్థ
3) ప్రభుత్వ లాభాలను మెరుగుపరచడం
4) ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించడం

2. 2016లో భారత ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఆర్‌బీఐ నిర్ణయించిన ద్రవ్యోల్బణ రేటు?
1) 3 శాతం 2) 4 శాతం
3) 5 శాతం 4) 6 శాతం

3. ద్రవ్యోల్బణాన్ని కొలిచే టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ)లో గరిష్ఠ వెయిటేజీ ఏ వస్తువులకు ఉంటుంది?
1) ఇంధనం - శక్తి 2) ఆహారధాన్యాలు
3) తయారీ వస్తువులు 4) సాంకేతిక వస్తువులు

4. ద్రవ్యవిధానం అంటే...
1) పార్లమెంట్ ద్రవ్య సరఫరాను నియంత్రించే ప్రక్రియ.
2) కేంద్ర బ్యాంకు ద్రవ్య సరఫరాను నియంత్రించే ప్రక్రియ.
3) ఐఎంఎఫ్ ద్రవ్య సరఫరాను నియంత్రించే ప్రక్రియ.
4) ప్రపంచ బ్యాంకు ద్రవ్య సరఫరాను నియంత్రించే ప్రక్రియ.

5. 2025, మే లో పీరియాడిక్‌లో లేబర్ బ్యూరో నిర్వహించిన వార్షిక ఉపాధి నిరుద్యోగ సర్వే ప్రకారం భారతదేశంలో నిరుద్యోగిత రేటు?
1) 5.1 శాతం 2) 5.9 శాతం
3) 6.1 శాతం 4) 7.1 శాతం

6. కేంద్ర ప్రభుత్వం దేశీయ కరెన్సీ విలువను విదేశీ పరంగా తగ్గించినపుడు ఈ దృగ్విషయాన్ని ఎలా పిలుస్తారు?
1) ప్రశంస 2) తరుగుదల
3) విలువ తగ్గింపు 4) విలువ పెంపు

7. కిందివారిలో ద్రవ్య విధాన ముసాయిదాను ఎవరు రూపొందిస్తారు?
1) కేంద్ర ఆర్థికశాఖ 2) ఆర్‌బీఐ
3) ఎన్ఎస్ఓ 4) ఎన్ఎస్ఎస్ఓ

8. 'ద్రవ్యం తన కొనుగోలు శక్తిని కోల్పోవడమే ద్రవ్యోల్బణం' అని పేర్కొన్న ఆర్థికవేత్త ఎవరు?
1) డాల్టన్ 2) క్రౌథర్
3) హాట్రీ 4) ఎసిపిగూ

9. దేశం మొత్తం జనాభాలో శ్రామిక శక్తి జనాభా అని ఏ వయో వర్గాన్ని పేర్కొంటారు?
1) 10 -69 2) 15-59
3) 18-65 4) 21-55


10. భారతదేశంలో పెట్టుబడుల ఉపసంహరణ కమిషన్‌ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
1) 1992 2) 1996 3) 2000 4) 1986

11. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో సరైంది గుర్తించండి.
1) ప్రభుత్వ వ్యయం పెంపు
2) అధిక కరెన్సీ ముద్రణ
3) ప్రభుత్వ వ్యయంలో కోత
4) రెపో రేటు పెంచడం

12. దేశంలో ద్రవ్యోల్బణాన్ని కొలిచే పద్ధతి అయిన టోకు ధరల సూచీని ప్రతి నెలా లెక్కించే విభాగం?
1) ఆఫీస్ ఆఫ్ ఎకనామిక్ అడ్వయిజర్ మినిస్ట్రీ ఆఫ్ కామర్స్
2) నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్
3) ఎన్ఎస్ఎస్ఓ
4) పీఎంఓ కార్యాలయం

13. రిజర్వ్ బ్యాంకు ఇతర బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు చెల్లించే రేటును ఏమని పిలుస్తారు?
1) బ్యాంకు రేటు 2) మార్పిడి రేటు
3) రెపో రేటు 4) రివర్స్ రెపో రేటు

14. ద్రవ్యోల్బణ రేటు – నిరుద్యోగితా రేటుకు మధ్య ఉన్న సంబంధాన్ని వివరించినవారు?
1) జె.ఎం.కీన్స్
2) ఎసిపిగూ
3) క్రౌథర్
4) ఎ.డబ్ల్యూ.ఫిలిప్స్



ఎ.డబ్ల్యూ.ఫిలిప్స్


15. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్రవ్య నియంత్రణ సాధనమైన రెపో రేటును ఎవరి సిఫార్సుల ఆధారంగా రూపొందించారు?
1) అరుణ్ పాండే 2) రఘురాం రాజన్
3) వాఘల్ వర్కింగ్ గ్రూప్
4) దువ్వూరి సుబ్బారావు

16. 2025, ఏప్రిల్‌లో పూనమ్ గుప్తా ఏ పదవిలో నియమితులయ్యారు?
1) సెబీ డైరెక్టర్
2) ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్
3) ఐడీబీఐ ఛైర్మన్ 4) ఎల్ఐసీ ఛైర్మన్

17. ఆర్‌బీఐ ద్రవ్యవిధాన కమిటీ ఛైర్మన్‌గా ఎవరు వ్యవహరిస్తారు?
1) ఆర్థిక కార్యదర్శి 2) ఆర్‌బీఐ గవర్నర్
3) ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్
4) ఎస్‌బీఐ ఛైర్మన్

18. కిందివాటిలో ఏ రకమైన ద్రవ్యోల్బణ సమయంలో దేశీయ కరెన్సీని రద్దు చేసి ప్రత్యామ్నాయ కరెన్సీని ఉపయోగిస్తారు?
1) పరుగెత్తే ద్రవ్యోల్బణం
2) నడుస్తున్న ద్రవ్యోల్బణం
3) డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం
4) ఉద్ధృత ద్రవ్యోల్బణం

19. భారతదేశంలో ఆర్థిక సంస్కరణలో భాగంగా బ్యాంకింగ్ రంగ సంస్కరణలకు ఎవరి అధ్యక్షతన కమిటీని నియమించారు?
1) వాఘల్ కమిటీ
2) ఎం.నరసింహం కమిటీ
3) ఉర్జిత్ పటేల్ కమిటీ
4) విజయ్ ఎన్.కేల్కర్ కమిటీ



ఎం.నరసింహం

20. ఆర్‌బీఐకి చెందిన ద్రవ్యవిధాన కమిటీ సంవత్సరానికి ఎన్నిసార్లు సమావేశమవుతుంది?
1) 2 2) ఒకసారి 3) 4 4) 6

21. అతి తక్కువ వస్తువులను ఎక్కువ ద్రవ్యం వెంటాడుతున్నపుడు వచ్చే ద్రవ్యోల్బణాన్ని ఎలా పిలుస్తారు?
1) స్టాగ్‌ఫ్లేషన్
2) వ్యయ పుష్ ద్రవ్యోల్బణం
3) డిమాండ్-పుల్ ద్రవ్యోల్బణం
4) బహిరంగ ద్రవ్యోల్బణం

22. బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వం జారీ చేసిన బాండ్లు కొనుగోలు చేయడాన్ని, విక్రయించడాన్ని ఆర్‌బీఐ చేపట్టే ఏ రకమైన ద్రవ్య సాధనంగా పేర్కొంటారు?
1) లిక్విడిటీ సర్దుబాటు సౌకర్యం
2) నైతిక ఉద్బోధ
3) మార్జినల్ స్టాండింగ్
4) బహిరంగ మార్కెట్ కార్యకలాపాలు

23. భారతదేశంలో నిరుద్యోగానికి కింది ఎంపికలో సరైంది గుర్తించండి.
1) పర్యావరణ పరిస్థితులు 2) జనాభా
3) ఉన్నత విద్యావ్యవస్థలు లేకపోవడం
4) కార్మిక శక్తి

24. ఆర్‌బీఐ ద్రవ్య సరఫరా కొలమానాల్లో విశాల ద్రవ్య కొలమానంగా పిలిచేది?
1) M_1 ద్రవ్యం 2) M_3 ద్రవ్యం
3) M_2 ద్రవ్యం 4) ఏదీకాదు

25. ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు ఎక్కువగా ప్రభావితమయ్యే వర్గాన్ని గుర్తించండి.
1) రోజువారీ కూలీలు 2) నెలసరి ఉద్యోగులు
3) వర్తకులు
4) పింఛనుపై ఆధారపడినవారు

26. ద్రవ్యోల్బణాన్ని లెక్కించే ప్రమాణమైన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ)ను ప్రతి నెలా ఎవరు లెక్కిస్తారు?
1) నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ 2) ఎన్ఎస్ఎస్ఓ
3) ప్రధాని కార్యాలయం
4) ఎకనామిక్ అడ్వయిజర్ ఆఫ్ కామర్స్

27. ద్రవ్యోల్బణ కాలంలో లాభం పొందేవారికి సంబంధించి సరికానిది గుర్తించండి.
1) రుణగ్రహీతలు 2) ఉత్పత్తిదారులు
3) స్థిర ఆదాయవర్గాల వారు
4) బ్లాక్ మార్కెటింగ్ వ్యాపారులు

28. ద్రవ్యోల్బణాన్ని దొంగలతో పోల్చిన ఆర్థికవేత్త ఎవరు?
1) ప్రొఫెసర్ జగదీశ్ భగవతి
2) డాక్టర్ అమర్త్యసేన్
3) ప్రొఫెసర్ బ్రహ్మానంద, వకీల్
4) ప్రొఫెసర్ ధర్మనారాయణ్



ప్రొఫెసర్ బ్రహ్మానంద

29. రిజర్వ్ బ్యాంకు 15వ గవర్నర్‌గా పనిచేసిన ప్రముఖ ఆర్థికవేత్త?
1) మాంటెక్ సింగ్ అహ్లువాలియా
2) డాక్టర్ మన్మోహన్ సింగ్
3) సి.డి.దేశ్‌ముఖ్ 4) శక్తికాంత దాస్

30. ద్రవ్యోల్బణానికి సంబంధించిన కారణాల్లో సరైంది?
1) వేతనాల పెరుగుదల
2) ద్రవ్యసరఫరా పెరుగుదల
3) ఉత్పత్తి తగ్గుదల 4) పైవన్నీ

31. ఆర్థిక వ్యవస్థలో అధిక ద్రవ్యోల్బణ స్థాయి ఏ ద్రవ్య సరఫరాకు దారితీస్తుంది?
1) తగ్గించు 2) పెంచు
3) మార్పు లేదు 4) ఏదీకాదు

32. స్తబ్దత, ద్రవ్యోల్బణం – వీటి కలయికను ఎలా పిలుస్తారు?
1) వ్యయ పుష్ ద్రవ్యోల్బణం
2) డిమాండ్ పుల్ ద్రవ్యోల్బణం
3) బహిరంగ ద్రవ్యోల్బణం 4) స్టాగ్‌ఫ్లేషన్

33. ద్రవ్యోల్బణాన్ని లెక్కించే టోకు ధరల సూచీని ఏ ఆధార సంవత్సరం ద్వారా లెక్కిస్తున్నారు?
1) 2004-05 2) 2010-11
3) 2011-12 4) 2015-16

34. ద్రవ్యోల్బణ తీవ్రత ఆధారంగా ద్రవ్యోల్బణ రకాలకు సంబంధించి సరైంది గుర్తించండి.
1) పాకుతున్న ద్రవ్యోల్బణం - ధరల పెరుగుదల 3 శాతం కంటే తక్కువ
2) నడుస్తున్న ద్రవ్యోల్బణం - ధరల పెరుగుదల 3-5 శాతం
3) పరుగెత్తుతున్న ద్రవ్యోల్బణం - ధరల పెరుగుదల 10 శాతం కంటే ఎక్కువ
4) పైవన్నీ

35. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి కేంద్ర బ్యాంకు (ఆర్‌బీఐ) అవలంబించే ద్రవ్య విధానాలకు సంబంధించి సరికానిది గుర్తించండి.
1) ద్రవ్యోల్బణ కాలంలో బ్యాంకు రేటును పెంచుతుంది.
2) ధరలు పెరుగుదలను నియంత్రించేందుకు నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని పెంచుతుంది.
3) ప్రభుత్వ సెక్యూరిటీలను మార్కెట్‌లో అమ్ముతుంది.
4) డౌన్ పేమెంట్‌ను తగ్గిస్తుంది.

36. ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ బాండ్లు ఎవరు ప్రవేశపెట్టారు?
1) కేంద్ర ఆర్థిక శాఖ
2) కేంద్ర వాణిజ్య శాఖ
3) రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా
4) స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా

37. ఆధునిక బ్యాంకుల ముఖ్య విధి?
1) పరపతి సృష్టి
2) డిపాజిట్ల సేకరణ
3) క్రెడిట్ కార్డుల జారీ
4) సేవింగ్ అకౌంట్లు తెరవడం

సమాధానాలు

1-1; 2-2; 3-3; 4-2; 5-1; 6-3; 7-2; 8-2; 9-2; 10-2; 11-3; 12-1; 13-4; 14-4; 15-3; 16-2; 17-2; 18-4; 19-2; 20-3; 21-3; 22-4; 23-2; 24-2; 25-4; 26-1; 27-3; 28-3; 29-2; 30-4; 31-2; 32-4; 33-3; 34-4; 35-4; 36-3; 37-1.

చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రానికి పరిశ్రమలు

● సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వంలో పెట్టుబడుల గురించి మాట్లాడమంటే కోడిగుడ్డు కథలు చెప్పిన వాళ్లు కూడా ఇప్పుడు విమర్శించడం సిగ్గుచేటని మంగళవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. 'చంద్రబాబు అపోలో టైర్స్ కంపెనీని రాష్ట్రానికి తెచ్చారు. గత ఐదేళ్లలో జగన్ కనీసం సైకిల్ ట్యూబ్ కంపెనీ అయినా తెచ్చారా? గతంలో పెట్టుబడులు తీసుకొచ్చేందుకంటూ వైకాపా నేతలు విదేశాల్లో విహారయాత్రలు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేశారు. ఇప్పుడు చంద్రబాబు రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తున్నారు' అని వెల్లడించారు.

పాఠశాలల్లో లక్ష్యాల సాధనకు ప్రత్యేక కమిటీలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడం కోసం విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీని కోసం క్షేత్రస్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. పాఠశాలలను సందర్శించడానికి ఉపాధ్యాయ విద్య శిక్షణ పొందుతున్న అభ్యర్థులను సైతం మ్యాపింగ్ చేసింది. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ, ఇతర కార్యకలాపాల పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఇన్‌ఛార్జులను నియమించడంతోపాటు డైట్ లెక్చరర్లు, డైట్ విద్యార్థులకు మండలాలను దత్తత ఇస్తూ జాబితాలను విడుదల చేసింది. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి నుంచి జిల్లా ఇన్‌ఛార్జులు, డైట్‌ల నుంచి మండల ఇన్‌ఛార్జులను నియమించింది. జిల్లాలు, మండలాల వారీగా బాధ్యత వహించాల్సిన అధికారుల వివరాలను వెల్లడించింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు నిర్దేశించిన లక్ష్యాలను వీరు పర్యవేక్షిస్తారు.

ఎన్ఎస్‌టీఆర్‌లో పులుల సంఖ్యలో పెరుగుదల

● పీసీసీఎఫ్ ఏకే నాయక్

ఈనాడు-అమరావతి: ఏపీ పరిధిలోని నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ప్రాంతంలో (ఎన్ఎస్‌టీఆర్) పులుల సంఖ్య ఏటా పెరుగుతుందని పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్ తెలిపారు. 2017-18 నాటికి 48 పులులు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 87కు చేరిందని వివరించారు. దీనికితోడు నల్లమల శేషాచలం కారిడార్ ఏరియా, పాపికొండలు నేషనల్ పార్కుల్లోను పులులకు ఆవాసాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అటవీ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. పులుల సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో వన్యప్రాణి సంరక్షణ విభాగం పీసీసీఎఫ్ ఎస్.ఎస్.శ్రీధర్, అదనపు పీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెట్రో టెండర్ల ప్రక్రియకు అనుమతి

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైల్ ప్రాజెక్టు మొదటి దశ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్‌కు అనుమతినిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సవరించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో సంయుక్త భాగస్వామ్య (జాయింట్ వెంచర్) విధానంలో రెండు చోట్లా కలిపి మొత్తం రూ.21,616 కోట్లతో మెట్రో రైల్ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి దశలో ఒక్కో నగరంలో 40% పనులకు రాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు కార్పొరేషన్‌కు అనుమతినిస్తూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ పేరుతో మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

'అంబులెన్సు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

ఈనాడు, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో 108 వాహన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని 108 ఫీడర్ అంబులెన్సు కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు కోరారు. వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కమిషనర్ వీరపాండియన్‌లను సంఘం గౌరవ అధ్యక్షుడు ఏపీ నాగేశ్వరరావు, అధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి సునీల్ తదితరులు మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుత ఏజెన్సీ గడువు ఆగస్టులో ముగుస్తున్నందున ఉద్యోగులను కొత్త ఏజెన్సీలోకి కొనసాగించాలన్నారు. వేతనాలు పెంచాలని, యజమాని వాటా పీఎఫ్, ఈఎస్ఐలను ఏజెన్సీలే చెల్లించేలా టెండర్లలో పొందుపరచాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా జగన్ కుట్ర

● సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి మండిపాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు రాకుండా వైకాపా అధినేత జగన్ కుట్రలు చేస్తున్నారని సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి లోకేశ్ సింగపూర్‌లో మౌలిక సదుపాయాల గురించి వివరించి సింగపూర్ నుంచి కంపెనీలను ఆకర్షిస్తుంటే.. తక్కువ ధరకే భూములిస్తున్నారని జగన్ విమర్శించడాన్ని దీపక్‌రెడ్డి తప్పుపట్టారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ నడిపిన వైకాపాను ఎలా బతికించుకోవాలనే ఆలోచనలో ఉండి ఆ పార్టీ నాయకులు కొత్త నాటకాలకు తెర తీశారని దీపక్‌రెడ్డి దుయ్యబట్టారు.

ఇంటర్మీడియట్ డైరెక్టర్ ఆగస్టు 4 నుంచి సెలవు

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ విద్యా శాఖ డైరెక్టర్ కృతికా శుక్లా ఆగస్టు 4 నుంచి 13 వరకు సెలవు పెట్టనున్నారు. ఈ మేరకు ఈఎల్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

అప్రోచ్ ఛానల్‌కు డ్రెడ్జింగే పరిష్కారం!

● నిత్యం నీటితో నిండి ఉండటమే సమస్య
● భారీ ఎక్స్‌కవేటర్లు కావాలి
● విదేశీ నిపుణుల సిఫారసులు



ఈనాడు, అమరావతి: 'పోలవరం ప్రాజెక్టులో అప్రోచ్ ఛానల్ తవ్వకం సవాల్‌గా మారింది. సంప్రదాయ పద్ధతులతో దీన్ని ఎదుర్కోలేం. ఛానల్ మధ్యలో, కుడి వైపున కొంత భాగం డ్రెడ్జింగ్(తవ్వడం) చేపట్టాలి. సాధారణ యంత్రాలతో ఇది సాధ్యం కాదు. లాంగ్ రీచ్ ఎక్స్‌కవేటర్లు, సూపర్ లాంగ్ రీచ్ ఎక్స్‌కవేటర్లు వినియోగించాలి. గోదావరి నది ప్రవాహాలను గత చరిత్ర ఆధారంగా అంచనా వేసి, అందుకు తగ్గ ప్రణాళికతో ముందుకెళ్లాలి' అని విదేశీ నిపుణుల బృందం సిఫారసు చేసింది. అప్రోచ్ ఛానల్ నిత్యం నీటితో నిండి ఉండటంతో తవ్వకం సమస్యగా మారింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల పోలవరం అధికారులు విదేశీ నిపుణుల బృందాన్ని మెయిల్‌లో సంప్రదించారు. సమస్యకు సంబంధించిన సమాచారం పరిశీలించిన నిపుణులు తాజా సిఫారసులు చేశారు. "మేఘా సంస్థ సంప్రదాయ విధానంలోనే అప్రోచ్ ఛానల్ తవ్వుతోంది. కుడి ఒడ్డు నుంచి రాళ్లతో నింపిన కాజ్‌వేలు నిర్మించి తవ్వకాలు చేపట్టింది. వర్షాకాలం మధ్యలో నిర్మాణ సీజన్ సరిపోకపోవడం వల్ల నీటి లోతు ఎక్కువగా ఉండి తవ్వకాలు పూర్తి చేయడం కష్టమవుతోంది' అని విదేశీ నిపుణుల బృందం ప్రస్తావించింది.

ఎందుకు సమస్య?

● ఈ ఛానల్‌ను 3 రీచ్‌లుగా విభజించి, ఇప్పటికే కొంత తవ్వారు. పూర్తి చేయాలంటే 154.55 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 116 లక్షల క్యూ.మీ. తవ్వారు.

● ఇక్కడ స్పిల్‌వేపై ప్రవాహ ఒత్తిడి ఉందని, ఎడమ వైపున సెకనుకు 13.70 మీటర్ల ప్రవాహ వేగం ఉందని, అది స్పిల్‌వేపై పడుతోందని 3డి నమూనా అధ్యయనాల్లో గుర్తించారు. దీనికి పరిష్కారంగానే ఎడమ వైపున గైడ్‌బండ్ నిర్మించారు.

● అప్రోచ్ ఛానల్ తవ్వకం ఎడమ వైపు ప్రారంభించిన సమయంలోనే గైడ్‌బండ్ కుంగిపోయింది. మరోవైపు నది సహజ మార్గాన్ని మూసివేసి స్పిల్‌వే వైపు నీళ్లు మళ్లించేందుకు అప్రోచ్ ఛానల్ తవ్వినంత మేర నీటి ప్రవాహాన్ని వదిలేశారు. దీంతో ఆ ఛానల్ మొత్తం ఏడాది పొడవునా నీటితో నిండి ఉంటోంది. ఫలితంగా తవ్వకాలు సమస్యగా మారాయి.

అసలు ఏమిటీ ఛానల్?

గోదావరిపై పోలవరం వద్ద ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. ఇక్కడి భూ భౌతిక పరిస్థితులు స్పిల్‌వే నిర్మాణానికి అనువుగా లేవు. అందువల్ల నదిని పక్కనే ఉన్న కొండల వైపు మళ్లించి, అక్కడ స్పిల్ వే నిర్మించాలని ఇంజినీర్లు ప్రతిపాదించారు. ఆ మేరకు కొండలను తవ్వి స్పిల్ వే నిర్మించారు. నది సహజ ప్రవాహాన్ని ఈ స్పిల్‌వే వైపు మళ్లించేందుకు తవ్వేదే అప్రోచ్ ఛానల్.

అప్రోచ్ ఛానల్ పొడవు: 2,310 మీటర్లు


వెడల్పు: 600 మీటర్ల నుంచి 1,000 మీటర్ల వరకు

గర్భం వద్ద మట్టం: +17 మీటర్లు

పూర్తి స్థాయి నీటి నిల్వ: +45.72 మీటర్లు

గుత్తేదారులను వెనకేసుకొస్తున్నారా!

● ఇద్దరు ఈఈలకు ఛార్జి మెమోలు
● మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలు



ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులైన హంద్రీ-నీవా సుజల స్రవంతి లైనింగ్, వెలిగొండ ప్రాజెక్టుల్లో పనుల ఆలస్యంపై రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల (ఈఈ)కు ఛార్జి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఆయా ప్రాజెక్టుల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పుంగనూరు బ్రాంచి కాలువ సున్నా నుంచి 22వ కి.మీ, 26 నుంచి 75వ కి.మీ మధ్య పనులు ఎలా జరుగుతున్నాయని మంత్రి అక్కడి ఈఈ మురళిని ప్రశ్నించారు. ఆయన పనులు బాగా జరుగుతున్నాయని సమాధానమిచ్చారు. 'ఒక వైపు పనులు లక్ష్యం ప్రకారం చేయడం లేదు. గుత్తేదారులను ఎందుకు వెనకేసుకొస్తున్నారు? ఇలా సమర్థించుకుంటూ పోతే పనులు ఎప్పుడవుతాయి' అంటూ ఆగ్రహించారు. ఆ ఈఈకి మెమో ఇవ్వాలన్నారు. కుప్పం బ్రాంచి కాలువ ఈఈ.. ఆ పోస్టులో చేరకపోవడం, పనులు పర్యవేక్షించకపోవడంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ఆయనకు కూడా మెమో జారీ చేయాలన్నారు.

మేఘా ప్రతినిధులపైనా..

వెలిగొండ ప్రాజెక్టులో పనుల ఆలస్యంపై మేఘా సంస్థ ప్రతినిధులను మంత్రి నిలదీశారు. 2025 జూన్‌కు పూర్తి చేస్తామని తొలుత, ఆ తర్వాత 2026 మార్చి అని, ఇప్పుడు 2026 జూన్ అని లక్ష్యం మార్చుకుంటూ వెళ్తే ఎలా అని ప్రశ్నించారు. టన్నెల్‌లో 1,025 మీటర్ల మేర బెంచింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని అవి పూర్తి చేస్తే లైనింగ్ పనులు చేసేయొచ్చని గుత్తేదారు సంస్థ ప్రతినిధులు చెప్పారు. సమావేశంలో జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్‌సీ నరసింహమూర్తి, సలహాదారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సహాయ గణాంక అధికారి పోస్టుల్ని భర్తీ చేయాలి: అపెస్సా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 300 సహాయ గణాంక అధికారి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్స్ అసోసియేషన్ (అపెస్సా) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రజనీష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పలు సమస్యలపై చర్చించినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. '9 రూరల్, 9 అర్బన్ మండలాల్లో సహాయ గణాంక అధికారి పోస్టులు, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక ఉప గణాంక అధికారి, గణాంక అధికారి పోస్టులను మంజూరు చేయాలి. సహాయ గణాంక అధికారి పేరును మండల ప్రణాళిక, గణాంక అధికారిగా మార్చాలి' అని కోరుతూ గణాంక శాఖ డైరెక్టర్ గోపాల్‌కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.చెంచురెడ్డి, ఉపాధ్యక్షుడు ఏపీఎస్ నాయుడు, సంయుక్త కార్యదర్శి మాధవి, కోశాధికారి సీహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతుని కుటుంబానికి.. రూ.1.29 కోట్ల పరిహారం

● జిల్లా కోర్టులో 50 శాతం డిపాజిట్ చేసేందుకు ప్రభుత్వ మంజూరు

ఈనాడు, అమరావతి: ప్రమాదంలో చనిపోయిన ఉపాధ్యాయుని కుటుంబానికి రూ.1.29 కోట్ల పరిహారం చెల్లింపులో భాగంగా 50 శాతాన్ని కోర్టులో డిపాజిట్ చేసేందుకు నిధులిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. నెల్లూరు జిల్లాలో 2016లో రాజుపాలెం-ఇసుకపల్లి రోడ్డు పనులను పైడాల తిరుపతిరెడ్డి అండ్ బ్రదర్స్ అనే గుత్తేదారు చేపట్టారు. దాసరి కామరాజ్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు(పీఈటీ) ఆ రోడ్డులో ప్రమాదానికి గురై మరణించారు. మృతుని భార్య పద్మజ, ఆమె పిల్లలు.. నెల్లూరు మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టులో కేసు వేశారు. రూ.81.25 లక్షల్ని పరిహారం కింద చెల్లించాలని, వడ్డీ సహా రూ.1.29 కోట్లు ఇవ్వాలని 2024 మార్చిలో కోర్టు తీర్పుచెప్పింది. దీనిపై ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ఈ ఏడాది జనవరి 29న హైకోర్టు ఇంటీరియం స్టే విధించింది. జిల్లా కోర్టు తీర్పులో పేర్కొన్న మొత్తంలో 50 శాతాన్ని కోర్టులో 8 వారాల్లో డిపాజిట్ చేయాలంది. ప్రమాదానికి గుత్తేదారే బాధ్యుడని, పనులు అప్పగించాక.. రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు ఏం జరిగినా ఆయనే బాధ్యత వహించాల్సి ఉంటుందని, కోర్టు ఆదేశించిన మొత్తాన్ని ఆయన నుంచే వసూలు చేయాలని ప్రభుత్వానికి ఇంజినీర్లు సూచించారు. దీనిపై గుత్తేదారు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల్ని అమలు చేయనందున.. నెల్లూరు కలెక్టరేట్‌లోని చరాస్తుల్ని జప్తుచేయాలంటూ... ఇంతలో ఆదేశాలు రావడంతో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్ చేయాలని అధికారులు నిర్ణయించారు.

సమస్యలు తలెత్తకుండా... ఉచిత బస్సు ప్రయాణం

● రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి
● త్వరలో విధివిధానాలు ప్రకటిస్తాం
● ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులో ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా చూస్తాం. ఇందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాం. ప్రమాదానికి ఆస్కారం లేకుండా, డ్రైవర్ల కొరత తలెత్తకుండా, బస్సుల నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు చేపడుతున్నాం' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఆగస్టు 15 నుంచి అమలు కానున్న ఉచిత బస్సు ప్రయాణ పథకంపై... తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉమ్మడి కడప(రాయలసీమ) జోనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ 'డిపో స్థాయిలో కార్మికుల నుంచి ఉన్నతాధికారుల వరకు చర్చించి చర్యలు తీసుకుంటున్నాం. బస్టాండ్లలో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నాం. 14 నెలల్లో కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఆర్టీసీ ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాదిలోపు అన్ని డిపోలకూ 1,100 కొత్త విద్యుత్తు బస్సుల్ని తీసుకొస్తాం. త్వరలోనే తిరుపతి ఇంట్రామోడల్ బస్ స్టేషన్ నిర్మాణాన్ని ప్రారంభిస్తాం' అని చెప్పారు. ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ 'ఉచిత ప్రయాణం ఉమ్మడి జిల్లా పరిధిలోనా, కొత్త జిల్లా పరిధిలోనా, ఏ బస్సుల్లో అనుమతి ఉంటుంది? తిరుమల ఘాట్ రోడ్డు సర్వీసుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందా? లేదా? అనే విధివిధానాలను త్వరలో ప్రకటిస్తాం' అని చెప్పారు. కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, ఈడీలు అప్పలరాజు, చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి. చిత్రంలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, కడప జోనల్ ఛైర్మన్ నాగరాజు


భూముల రీసర్వేలో మార్పులు

● గ్రామాల సరిహద్దులు, ప్రభుత్వ భూముల గుర్తింపు

ఈనాడు-అమరావతి: కూటమి ప్రభుత్వం నాలా చట్టం రద్దు నిర్ణయానికి అనుగుణంగా భూముల రీసర్వేలో మార్పులు చేసింది. రీసర్వే చేయాల్సిన గ్రామాల్లో తొలుత సరిహద్దులు, ప్రభుత్వ భూములను సర్వేయర్లు గుర్తిస్తున్నారు. తర్వాత ప్రభుత్వం నిర్దేశించిన మేరకు సదరు గ్రామాల్లోని ప్రైవేట్ భూములకు కొలతలు వేస్తారు. భూ వినియోగ మార్పిడి (నాలా) అనుమతుల జారీ ప్రక్రియ ప్రస్తుతం రెవెన్యూ శాఖ ద్వారా జరుగుతోంది. ఆ చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ చట్టాన్ని ఉపసంహరించుకున్న అనంతరం భూ వినియోగ మార్పిడికి అనుమతుల జారీ బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగిస్తారు. అయితే.. స్థానిక సంస్థల వద్ద భూములకు సంబంధించిన సమాచారం ఉండదు. నాలా అనుమతుల జారీలో దరఖాస్తులో పేర్కొన్న భూమి ప్రభుత్వానిదో కాదో ముందుగా పరిశీలిస్తారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వ భూముల సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువస్తే స్థానిక సంస్థల అధికారుల పని సులువుగా ఉంటుంది. అందుకే రీసర్వేలో మార్పులు చేశారు. సర్వేయర్లు ఆగస్టు 5లోగా గ్రామాల సరిహద్దులను, ఆగస్టు చివరి నాటికి ప్రభుత్వ భూములను గుర్తిస్తారు. ఈ డేటాను సర్వే శాఖ స్థానిక సంస్థలకు అందుబాటులో ఉంచుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 6,000కు పైగా గ్రామాల్లో రీ-సర్వే పూర్తవగా, కొన్ని గ్రామాల్లో ఇది వివిధ దశల్లో ఉంది. సర్వే ప్రారంభం కాని గ్రామాలు 5,500కు పైగా ఉన్నాయి.

సమాజ హృదయ స్పందన.. కవిత్వం

● తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
● నీలిమ్‌కుమార్‌కు సినారె జాతీయ సాహిత్య పురస్కారం ప్రదానం



నీలిమ్‌కుమార్‌కు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రఘురామకృష్ణరాజు, చిత్రంలో మనస్విని, వరేణ్య, జుర్రు చెన్నయ్య, ఆంజనేయరెడ్డి, లయచరణ్‌రెడ్డి

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: 'కవిత్వం కేవలం రచనే కాదు.. కళాత్మక ప్రక్రియ. అది సమాజ హృదయ స్పందన' అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు-హైదరాబాద్ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ్ పురస్కారగ్రహీత, పద్మభూషణ్ డా.సి.నారాయణరెడ్డి 94వ జయంతి వేడుక జరిగింది. సుప్రసిద్ధ అస్సామీ కవి నీలిమ్‌కుమార్‌కు విశ్వంభర... డా.సి.నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. డా.సి.నారాయణరెడ్డి అముద్రిత రచన 'భలే శిష్యులు' పుస్తకాన్ని ముఖ్యఅతిథి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆవిష్కరించారు. ఆయన ప్రసంగిస్తూ.. 'సినారె కవిత్వం భారతీయ సంస్కృతి, భౌతిక, ఆధ్యాత్మిక పరిపూర్ణతను ప్రబోధిస్తుంది. ఆయన ప్రజాకవి. ఆయన సాహిత్య వారసత్వాన్ని కొనసాగించడానికి ట్రస్టు ద్వారా ఏటా జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయడం సంతోషదాయకం. మా ప్రాంతానికి చెందిన కవికి పురస్కారాన్ని ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది' అని గవర్నర్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు అధ్యక్షోపన్యాసం చేస్తూ.. 'సినారెతో మూడు దశాబ్దాల అనుబంధం ఉంది. ఆయన క్రమశిక్షణకు మారుపేరు. ఈ తరానికి స్ఫూర్తి' అన్నారు. తెలుగు భాషను ఎంత సుందరంగా పలకవచ్చో మనందరికీ చెప్పిన మహోన్నత వ్యక్తి నారాయణరెడ్డి అని విశ్రాంత ఐపీఎస్ అధికారి చెన్నూరి ఆంజనేయరెడ్డి కొనియాడారు. పురస్కార గ్రహీత నీలిమ్‌కుమార్ స్పందిస్తూ.. 'సినారె స్మారక పురస్కారాన్ని అందుకోవడం గర్వంగా ఉంది. నేను అస్సామీ కవిని. సామాజిక జీవనమే కథావస్తువుగా కవితలు రాయడాన్ని బాధ్యతగా భావిస్తుంటా' అని అన్నారు. సాహితీవేత్త డా.పత్తిపాక మోహన్ సభను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షురాలు సి.గంగ, ప్రధాన కార్యదర్శి డా.జుర్రు చెన్నయ్య, సినారె కుటుంబ సభ్యులు మనస్విని, వరేణ్య, లయచరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2030 నాటికి వంద శాతం జీఈఆర్ సాధిస్తాం: ఎస్పీడీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2030 నాటికి వంద శాతం స్థూల ప్రవేశాల నిష్పత్తి (జీఈఆర్) సాధించేందుకు సెకండరీ విద్యను పునర్నిర్మిస్తున్నామని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. దిల్లీలో జరిగిన జాతీయ విద్యా విధానం-2020 ఐదో వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 'లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఏపీ ద్వారా పాఠశాలల్లో విద్య స్వరూపాన్ని మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద 'తల్లిదండ్రులు- టీచర్ల సమావేశం' నిర్వహించి గిన్నిస్ రికార్డు సాధించాం. మెగా పీటీఎంలో 53.4 లక్షల మంది పాల్గొన్నారు' అని తెలిపారు. విద్యార్థి మిత్ర కిట్లు, తల్లికి వందనం, బాలికా రక్ష, వృత్తి విద్య, కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ల ఏర్పాటు, రవాణా భత్యం, విద్యార్థుల విజయగాథలను ఎస్పీడీ ఈ సమావేశంలో వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న పీఎంశ్రీ పాఠశాలలను జాతికి అంకితం చేస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శిలాఫలకాలు ఆవిష్కరించారు. రాష్ట్రంలో మొత్తం 935 పీఎంశ్రీ పాఠశాలలు ఉండగా, వాటిలో 26 పాఠశాలలను ఉత్తమ పీఎంశ్రీ పాఠశాలలుగా గుర్తించారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో విలీనం చేసే ప్రతిపాదన లేదు

● కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ వెల్లడి

ఈనాడు, దిల్లీ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేసే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆదిత్య యాదవ్ మంగళవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను యథాతథంగా నిర్వహించడానికే కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ఆర్థిక సాయం చేసినట్లు చెప్పారు.

ఏపీలో 13,321 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

ఆంధ్రప్రదేశ్‌లో స్వామిత్వ స్కీం కింద 13,321 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తిచేసినా ఇంతవరకూ ఒక్క ప్రాపర్టీ కార్డు కూడా తయారుకాలేదని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ సహాయమంత్రి ఎస్పీ సింగ్ భగేల్ తెలిపారు. లోక్‌సభలో తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు ఈ సమాధానమిచ్చారు. రాష్ట్రంలో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 1,352 గ్రామాల్లో డ్రోన్ సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఆ తర్వాత స్థానాల్లో తిరుపతి (1,045 గ్రామాలు), విజయనగరం (950 గ్రామాలు) ఉన్నట్లు చెప్పారు. అతితక్కువగా విశాఖపట్నం జిల్లాలో (85 గ్రామాల్లో) సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో 349 గ్రామాల్లో సర్వే జరిగిందన్నారు

ఆర్‌జీఎస్‌ఏ కింద రూ.316 కోట్ల ప్రణాళికకు ఆమోదం

పంచాయతీరాజ్ సంస్థల సామర్థ్యం పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) పథకం కింద కేంద్ర, రాష్ట్ర వాటా కలిపి ఆంధ్రప్రదేశ్‌కు రూ.316.22 కోట్ల వార్షిక ప్రణాళికకు ఆమోదం తెలిపినట్లు మంత్రి భగేల్ తెలిపారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఇప్పటికే అందుబాటులో ఉన్న రూ.15.33 కోట్లను ఖర్చు చేయకపోవడం వల్ల ఈ పథకం కింద కొత్త నిధులేమీ విడుదల చేయలేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.4.85 కోట్లు ఖర్చుచేసిందని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 9 ప్రాజెక్టులు పంపినట్లు వెల్లడించారు.

714 రైతు ఉత్పత్తి సంఘాలు

ఆంధ్రప్రదేశ్‌లో 714 రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీఓ) నమోదైనట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. లోక్‌సభలో తెదేపా సభ్యులు కేశినేని శివనాథ్, కలిశెట్టి అప్పలనాయుడులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ సంఘాలు ధాన్యం, పప్పు దినుసులు, కొబ్బరి, పసుపు, టమోటా, మామిడి, మిరప, జీడిపప్పు ఉత్పత్తుల వ్యవహారాలు చూస్తున్నట్లు చెప్పారు. అత్యధికంగా ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో 39, అనంతపురం, వైఎస్సార్ కడపల్లో 38 చొప్పున ఎఫ్‌పీఓలు రిజిస్టర్ అయ్యాయన్నారు. విశాఖపట్నం జిల్లాలో అతితక్కువగా 4 ఉన్నట్లు చెప్పారు. రాష్ట్రంలో నమోదైన సంఘాల్లో 1,70,647 మంది సభ్యులు ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఈక్విటీ గ్రాంట్‌ను ఇప్పటివరకూ 227 సంఘాలు అందుకున్నట్లు వెల్లడించారు. ఇందులో వైఎస్సార్ కడప జిల్లాకు చెందినవి 23, ఏలూరు జిల్లాకు చెందిన 20 సంఘాలు ఉన్నట్లు తెలిపారు.

ఉపాధి పథకం కింద ఏపీకి రూ.1,660 కోట్ల వేతన బకాయిలు

ఉపాధి హామీ పథకం కింద ఏపీకి రూ.1,660.9 కోట్ల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి కమలేష్ పాస్వాన్ తెలిపారు. అలాగే ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన-3 కింద ఏపీకి 3,203.94 కిలోమీటర్ల పొడవైన 412 రహదారులు, 77 వంతెనలు మంజూరు చేసినట్లు లోక్‌సభలో వెల్లడించారు.

మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ ఆగస్టు 1కి వాయిదా

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ ఆగస్టు ఒకటో తేదీకి వాయిదా పడింది. మంగళవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేసేందుకు న్యాయాధికారి విచారణను వాయిదా వేశారు.

● రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో మిథున్‌రెడ్డికి కల్పించిన వసతులపై జైలు అధికారులు దాఖలుచేసిన రివ్యూ పిటిషన్ మంగళవారం ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. న్యాయాధికారి గత విచారణలో నిందితుడి తరపు న్యాయవాదులను అభ్యంతరాలు అడిగారు. దీనిపై తమకు సమయం కావాలని కోరడంతో తదుపరి విచారణను ఆగస్టు 1కి వాయిదా వేశారు.

● నాటి ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ, ఓఎస్డీ సత్యప్రసాద్‌లు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లపై విజయవాడ ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌కి ఏసీబీ ఆదేశించింది. విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.

● నిందితులు బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పల బెయిల్ పిటిషన్లపై మంగళవారం విచారణకు రాగా.. వచ్చేనెల 1వ తేదీకి వాయిదా పడింది.

● స్విమ్స్‌లో చికిత్సకు అనుమతి ఇవ్వాలని మద్యం కేసులో నిందితుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి దాఖలుచేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం ఆగస్టు ఒకటో తేదీకి వాయిదా వేసింది.

ఎమ్మెల్సీలు రఘురాం, అప్పిరెడ్డిపై తదుపరి చర్యల నిలుపుదల

ఈనాడు, అమరావతి: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి గుంటూరు మిర్చియార్డు సందర్శనకు వెళ్లిన కేసులో వైకాపా ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. నల్లపాడు పోలీసులు వారిపై నమోదుచేసిన కేసులో తదుపరి చర్యలను నిలుపుదల చేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. తదుపరి విచారణను నెల రోజులకు వాయిదా వేశారు. మాజీ సీఎం జగన్ మిర్చియార్డుకు వెళ్లినప్పుడు చోటుచేసుకున్న ఉల్లంఘనలపై నల్లపాడు పోలీసులు కేసు పెట్టారు. తమపై కేసు కొట్టేయాలని ఎమ్మెల్సీలు దాఖలుచేసిన వ్యాజ్యంపై న్యాయమూర్తి మంగళవారం విచారణ జరిపారు.

అనుచిత వ్యాఖ్యల కేసులో కొడాలి నానికి ఊరట

ఈనాడు, అమరావతి: వైకాపా నేత, మాజీ మంత్రి కొడాలి నానికి హైకోర్టులో ఊరట లభించింది. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మచిలీపట్నం పట్టణ పోలీసుస్టేషన్లో ఆయనపై నమోదు చేసిన కేసులో నెల రోజులపాటు తదుపరి చర్యలను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. విచారణను నెల రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు సింగిల్ జడ్జి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

తోపుదుర్తిపై తొందరపాటు చర్యలొద్దు: హైకోర్టు

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం జగన్ శ్రీసత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా పోలీసు విధులకు ఆటంకం కలిగించారని వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై నమోదుచేసిన కేసులో రెండు వారాలు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని రామగిరి పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యంపై విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు సింగిల్ జడ్జి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు జరిగిన విచారణలో పిటిషనర్ తరపు న్యాయవాది సాయిశరణ్ వాదనలు వినిపిస్తూ పోలీసులు అరెస్టు చేస్తారనే ఆందోళన ఉందన్నారు. తొందరపాటు చర్యలు తీసుకోకుండా నిలువరించాలని కోరారు. పోలీసుల తరఫున సహాయ పీపీ నీలోత్పల్ వాదనలు వినిపిస్తూ పిటిషనర్‌పై నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు జైలుశిక్షకు వీలున్నవేనన్నారు. ఈ నేపథ్యంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ కోరామన్నారు.